# ప్రభాత్


***ఈ సంచికలో...***

- సీపీఐ ( మావోయిస్టు) ఏర్పాటుపై పత్రికా ప్రకటన... 3
- 'రెడ్ సన్' సంపాదకునితో ఇంటర్వ్యూ... 5
- బడ్జెట్ 2004-05 విశ్లేషణ... 7
- జూలై 28 - అమరుల వారం రిపోర్టులు... 10
- మండుతున్న మణిపూర్... 15
- ఆంధ్ర ప్రభుత్వంతో 'శాంతి' చర్చలు... 19
- కొనసాగుతున్న ఇరాకీ ప్రజల వీరోచిత ప్రతిఘటన... 23
- అబూ ఘ్రేబ్ జైళ్లో అమెరికా అత్యాచారాలు... 28
- విలియం హింటన్‌కు శ్రద్ధాంజలి... 30
- ఉత్తర బస్తర్‌లో ఆంబుష్... 39



**భారత కమ్యూనిస్టు పార్టీ ( మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార త్రైమాసిక పత్రిక**

**సంపుటి - 17** | **సంచిక - 3** | **జూలై - సెప్టెంబర్ 2004** | **వెల - 10 రూపాయలు**


## సిపిఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్], ఎంసిసిఐ పార్టీల విలీనం

# దేశ ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) పిలుపు

***సాయుధ వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధాన్ని దేశం నలుమూలలకు విస్తరింపజేయండి !***

***లిబరలైజేషన్, ప్రైవేటీకరణ, గ్లోబలైజేషన్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడండి !!***

ప్రియమైన ప్రజలారా !

భారతదేశంలోని రెండు మావోయిస్టు పార్టీలైన సి.పి.ఐ. (ఎం.ఎల్.) [పీపుల్స్‌వార్], మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియాలు ఒకే పార్టీగా విలీనమై సమైక్య విప్లవకర కమ్యూనిస్టు పార్టీ – **భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)** 21 సెప్టెంబర్ 2004న అవతరించింది. దీర్ఘకాలంగా గుండెల నుగ్గబట్టి ఎదురుచూస్తున్న దేశ విదేశాల్లోని విప్లవకర శక్తులన్నింటికే కాక భారతదేశంలోని కార్మికులకు, రైతాంగానికి, విద్యార్థి యువజనులకు, మధ్యతరగతి ప్రజానీకంతో పాటుగా పీడిత ప్రజలందరికీ ఇదొక గొప్ప సంతోషకరమైన వార్త.

80 ఏళ్ల భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో భారత కార్మికవర్గం, పీడిత ప్రజానీకం సాధించిన మహత్తర విజయం ఇది. ఈ విజయం భారతదేశంలోనే కాక, దక్షిణాసియాలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ రానున్న భవిష్యత్‌లో సుదీర్ఘకాలం నిలిచే ప్రభావాన్ని కలిగిస్తుంది.

1981 నుండి రెండు పార్టీల మధ్య కొనసాగుతూ వచ్చిన సౌహార్ద పూర్వకమైన, సోదర పూర్వక సంబంధాల క్రమం ఎన్నో ఎగుడు-దిగుళ్ల గుండా కొనసాగుతూ వచ్చింది. మధ్యలో, కొద్దికాలం పాటు, ఈ సంబంధాల్లో ఉద్రిక్తతలు చోటు చేసుకొని ఘర్షణలు కూడా జరిగాయి. ఈ కాలాన్ని రెండు పార్టీలు 'చీకటి అధ్యాయం'గా గుర్తించాయి. 'చీకటి అధ్యాయానికి' కారణమైన తమ తమ బలహీనతల గురించి ఇరు పార్టీలు లోతైన బహిరంగ ఆత్మవిమర్శ చేసుకొని, ఆ తప్పుల్ని సరిదిద్దుకోవడానికి శపథం చేశాయి. గత సంవత్సరంన్నర కాలంగా కొనసాగిన నాలుగు ద్వైపాక్షిక సమావేశాల్లో ఇరు పార్టీలు తమ మధ్య నున్న రాజకీయ విభేదాల్ని పరిష్కరించుకున్నాయి. మౌలికంగా సరైనవయిన తమ తమ పార్టీల సాధారణ పంథాపై ఆధారపడి దీర్ఘకాలంగా ప్రజాయుద్ధాన్ని కొనసాగిస్తూ, అభివృద్ధి చేస్తున్న క్రమంలో సంపాదించిన అనుభవాల్ని మార్క్సిజం-లెనినిజం-మావోయిజం వెలుగులో సంశ్లేషించి, రూపొందించుకున్న ఐదు మౌలిక డాక్యుమెంట్లపై ఆధారపడి ఈ పార్టీ భారత విప్లవానికి మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. ఈ రకంగా, ఈ ఐక్యత సూత్రబద్ధమైనది. 1970వ దశకం నుండి భారత విప్లవ గొప్ప నాయకులిద్దరూ – నక్సల్‌బరీ నిర్మాత కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్నయ్ చటర్జీలతో పాటు ఇతర అనేక మంది నాయకులు రివిజనిజంతోనూ, పార్లమెంటరీ పంథాతోనూ స్పష్టంగా తెగతెంపులు చేసుకున్నారు. భారతదేశంలో వ్యవసాయ విప్లవం దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాలో కొనసాగి సామ్రాజ్యవాదాన్ని, భూస్వామ్యాన్ని, దళారీ నిరంకుశ బూర్జువా వర్గాన్ని సమూలంగా తుడిచిపెట్టి, విప్లవాన్ని విజయవంతంగా నడపడానికి మొదటి గ్యారంటీ నివ్వగలిగే ఐక్య పార్టీ

### గమనిక

ఈ సంచికను పూర్తి చేసి విడుదల చేసే సమయానికి, సెప్టెంబర్ 21న సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్], ఎంసీసీఐల విలీనం పూర్తయి సమైక్య పార్టీ – **భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)** ఏర్పాటు జరిగిందన్న సమాచారం మాకు చేరింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని సమైక్య సీసీ విడుదల చేసిన కరపత్రాన్నీ, పత్రికా ప్రకటననూ యథాతథంగా ప్రచురిస్తున్నాం. ఇక నుండి 'ప్రభాత్' **భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార** పత్రికగా కొనసాగుతుందని పాఠకులు గమనించగోరుతున్నాం.

*– సంపాదక వర్గం*

నూతన పార్టీ – **భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)** ఏర్పాటును పురస్కరించుకొని నవంబర్ 7 నుండి 13 వరకు పెద్ద ఎత్తున ప్రచార క్యాంపెయిన్ నిర్వహిద్దాం !

ఏర్పడాలని ఆ ఇద్దరు నాయకులతో పాటు, ఎందరో అమరవీరులూ, అశేష భారత పీడిత ప్రజానీకం కన్న కలల్ని నేడు వాళ్లందరి వారసులు నిజం చేశారు.

1967 నాటి చారిత్రాత్మకమైన మహత్తర నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటు వెల్లువ కాలంలో అఖిల భారత (విప్లవ) పార్టీ ఏర్పడే చాలా మెరుగైన పరిస్థితులు ముందుకొచ్చాయి. కానీ పార్టీ ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియ, పద్ధతులపై ఆరోజు తలెత్తిన విభేదాలు పరిష్కృతం కాని ఫలితంగా 1969లో ఏర్పడిన సి.పి.ఐ.(ఎం.ఎల్.) పార్టీలో కొంతమంది కమ్యూనిస్టు విప్లవకారులు ఐక్యం కాలేకపోయారు. ఈ క్రమంలో 20 అక్టోబర్ 1969న మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఏర్పడింది. ఆనాటి నుండి కమ్యూనిస్టు ఉద్యమంలో ఈ రెండు ప్రవాహాలు సాయుధ వ్యవసాయిక విప్లవం, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా మార్గంలో ఎన్నో ఎగుడు దిగుళ్ల గుండా ప్రయాణిస్తూ విడివిడిగానే నిలిచి పెరుగుతూ - విస్తరిస్తూ వచ్చాయి. ఈనాడు, ఈ రెండు ప్రవాహాలు ఏకమై మహా ప్రవాహంగా మారడం భారత కమ్యూనిస్టు ఉద్యమంలో స్వర్ణాక్షరాలతో లిఖించదగ్గ గొప్ప విజయం.

ఇంతేకాదు, ఈ రెండు పార్టీల నాయకత్వంలో శత్రువు గుండెల్లో గుబులు పుట్టించే సంఘటిత గెరిల్లా సైన్యం కూడా ఉంది. ఒరిస్సాలోని కోరాపుట్, ఝార్ఖండ్‌లోని సరండ లాంటి గెరిల్లా యుద్ధ చర్యలు సృష్టించిన ఎర్ర బీభత్సం ఇప్పటికీ శత్రువును గజగజలాడిస్తూనే ఉన్నాయి. ఈ రెండు సాహసిక సైన్యాలు – పి.జి.ఎ., పి.ఎల్.జి.ఎ.లు ఏకమై ఒకే కమాండ్ కింద ఏకీకృత, నూతన పి.ఎల్.జి.ఎ.గా సంఘటితమయ్యాయి.

వీటితో పాటు ఈ రెండు పార్టీల నాయకత్వం కింద ఆంధ్ర, ఝార్ఖండ్, బీహార్, దండకారణ్యం, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల్లో విస్తరించి ఉన్న గెరిల్లాజోన్లు ఏకీకృతమై లక్షలాది కిలోమీటర్ల వైశాల్యంలో విస్తరించాయి. ఈ గెరిల్లాజోన్లలో కోట్లాది ప్రజలు పోరాడుతున్నారు. ప్రాంతాల వారీగా అధికారాన్ని హస్తగతం చేసుకునే మార్గంలో ఈ ప్రాంత ప్రజానీకం పురోగమిస్తూ తమ స్వంత అధికారాన్ని, రాజ్య వ్యవస్థను ఖాయం చేసే 'క్రాంతికారీ కిసాన్ కమిటీ' (KKC), విప్లవ ప్రజా కమిటీ (RPC)లను నిర్మించుకుంటున్నారు. సామ్రాజ్యవాదం, దాని పెంపుడు కుక్కలయిన దళారీ వర్గాల ప్రతీఘాతుక రాజ్యానికి వ్యతిరేకంగా ఈ ప్రాంతాల్లో నూతన ప్రజాస్వామిక భారతపు విప్లవ ప్రజారాజ్యాధికారం బీజరూపంలో ఆవిర్భవిస్తూ, విస్తరిస్తూంది. ఈ రెండు పార్టీల నాయకత్వం కింద ఉన్న లక్షలాది ప్రజానీకం ఇప్పుడు ఏకమై సామ్రాజ్యవాదానికి, భూస్వామ్యానికి, దళారీ నిరంకుశ బూర్జువా వర్గానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ప్రజా పోరాటాల వెల్లువను సృష్టించడానికి నడుం బిగిస్తున్నారు. నేడు భారత విప్లవోద్యమపు దీర్ఘ చరిత్రలో మన స్వీయాత్మక శక్తుల సన్నద్ధత సాపేక్షికంగా మెరుగైంది. అయినప్పటికీ పార్టీ ముందు సవాళ్లు కూడా కఠినతరంగానే ఉన్నాయి.

మొదటి విషయం ఏమంటే కొన్ని నిజమైన కమ్యూనిస్టు గ్రూపులు, వ్యక్తులు ఇప్పటికీ ఈ నూతన పార్టీకి బయటనే ఉండిపోయారు. వారితో అత్యంత సానుకూల వైఖరితో ఐక్యతా చర్చలు నిర్వహిస్తూ ఐక్యమవ్వడానికి పట్టుదలగా ప్రయత్నం చేయాల్సి ఉంది.

ఈరోజు దేశ, ప్రపంచ పరిస్థితుల్ని వీక్షిస్తే, మనముందు గొప్ప సవాళ్లు ఉన్నాయి. సామ్రాజ్యవాదం, దాని మొనగాడైన అమెరికా, ఆఫ్ఘనిస్తాన్ పైనా, ఇరాక్ పైనా నగ్నమైన దాడిచేసి వాటిని తమ వలసలుగా మార్చుకుంది. యూరప్, అమెరికాల్లో అమెరికా దాడులకు వ్యతిరేకంగా ప్రజలు ఛాతీ విరిచి నిలిచారు, నిలబడుతున్నారు. పెరుగుతున్న అమెరికా సామ్రాజ్యవాద దోపిడి-పీడనలకూ, దాడులకూ, యుద్ధానికీ వ్యతిరేకంగా లక్షలాది ప్రజానీకం ముఖ్యంగా కార్మికవర్గం, విద్యార్థి యువజనులు బ్రహ్మాండమైన ప్రతిఘటనా పోరాటాల్లో దూకారు. సామ్రాజ్యవాదానికి, దాని తొత్తులకు వ్యతిరేకంగా ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలో కూడా పీడిత ప్రజానీకం చేస్తున్న పోరాటాలు రోజురోజుకు తీవ్రతరమవుతున్నాయి. సామ్రాజ్యవాదానికి ప్రపంచ పీడిత జాతులకు, ప్రజలకు మధ్య వైరుధ్యం కూడా రోజురోజుకు పదునెక్కుతోంది. సామ్రాజ్యవాదానికి దాని తొత్తులకు వ్యతిరేకంగా చెలరేగే విప్లవ పోరాటాల తుఫానుకు ఆసియా కేంద్రంగా మారింది. ఇందులో అగ్ర భాగాన నిలిచి నేపాల్, ఫిలిప్పైన్స్, భారతదేశాల్లో కొనసాగుతున్న ప్రజాయుద్ధాలు ప్రపంచానికి విముక్తి వెలుగురేఖల నందిస్తున్నాయి. మనదేశంలోనూ, ప్రపంచంలోనూ మావోయిస్టు శక్తులు సంఘటితమవుతున్నాయి.

మనదేశంలో ఒకవైపు విశాల గ్రామీణ ప్రాంతంలో అర్ధభూస్వామ్య సంబంధాల వల్లనూ సామ్రాజ్యవాద - భూస్వామ్య దోపిడీ పీడనల వల్లనూ అశేష ప్రజానీకం నిరంతరం ఆకలి చావులకు గురవుతున్నారు. భారతదేశపు విశాల గ్రామీణ ప్రాంతం వరుసగా సంభవించే వరదలకూ, కరువుకాటకాకూ నిలయమయ్యింది. మరోవైపు, గ్లోబలైజేషన్ ఫలితంగా భారతదేశ ప్రజానీకపు కష్టాలు, కన్నీళ్లు తీవ్రతరమయ్యాయి. లక్షలాది ఫ్యాక్టరీలు మూతపడుతున్నాయి. అధిక మొత్తంలో మదుపులు పెట్టాల్సి రావడం, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటుధరలు లేకపోవడం ఫలితంగా వ్యవసాయం దెబ్బతింటూ వస్తోంది. సామ్రాజ్యవాదపు విధ్వంసకర దోపిడీ నిరంతరం కొనసాగడం వల్ల వ్యాపార పంటలు కూడా నాశనమవుతున్నాయి. నిరుద్యోగం, ధరల పెరుగుదలకు హద్దు లేకుండా పోతోంది. ఈ రకంగా సామ్రాజ్యవాద-భూస్వామ్య దోపిడీపీడనలు కోట్లాది ప్రజానీకపు బ్రతుకుల్ని బుగ్గిపాలు చేశాయి. ఫలితంగా పీడిత ప్రజానీకం తమ న్యాయమైన హక్కుల కోసం ఆందోళనల్లో, పోరాటాల్లో దూకుతుంటే దోపిడీ ప్రభుత్వాలు వారిపై క్రూర, భయంకర నిర్బంధకాండను కొనసాగిస్తున్నాయి. ప్రజాహంతక విధానాల్ని, పాలసీలను అమలుచేసే విషయంలో గత ఎన్.డి.ఎ. ప్రభుత్వపు పద్ధతుల్లో గానీ, నేటి యు.పి.ఎ. ప్రభుత్వపు విధానాల్లో గానీ మాటల్లో కొద్దిపాటి తేడాలు తప్ప గమనించదగిన మార్పేమీ లేదు.

పెరుగుతున్న దోపిడీ, పీడనల వల్ల కష్టాల పాలవుతున్న ప్రజల్లోని అన్ని వర్గాలు, సెక్షన్లు నిర్బంధాన్ని ఎదుర్కొంటూ పోరాట మార్గంలో పెద్దయెత్తున కదులుతున్నారు. కార్మికవర్గం, రైతాంగం, విద్యార్థి - యువజనులు, ఇతర శ్రామిక ప్రజానీకం, మహిళలు, దళితులు, మత మైనారిటీలు, మైనారిటీ జాతులు ఓట్ల ద్వారా ఒరిగేదేమీ లేదని ఆయుధాలెత్తి పోరాడకుంటే కనీస హక్కులను సైతం సాధించలేమనీ, న్యాయం చేకూరదనీ ఇప్పటివరకు కొనసాగుతున్న పోరాటాల అనుభవాల నుండి నేర్చుకుంటున్నారు. వీటితో పాటుగా పీడిత జాతులు తమ న్యాయమైన అధికారాన్ని సాధించుకోవడం కోసం క్రూర ప్రభుత్వ నిర్బంధాన్ని ధిక్కరిస్తూ పోరు మార్గంలో పురోగమిస్తున్నారు.

ఈ పోరాటాలతో బెంబేలెత్తిన భారత దళారీ పాలకవర్గాలు సామ్రాజ్యవాదం వరుసగా పలు రకాల కుట్రలకూ, కుహకాలకూ పాల్పడుతున్నాయి. ప్రజల పోరాట చేవను మొద్దుబార్చడానికి ఒక్కోసారి ప్రభుత్వేతర సంస్థలను (ఎన్.జి.ఓ.లను) ఉపయోగించి రకరకాల సంస్కరణల్ని ముందుకు తెస్తున్నారు. వీటితో పాటు ఇతరత్రా సర్కారీ సంస్కరణలను కూడా ముందుకు తెస్తున్నారు. వీటితోపాటు ప్రజల ఐకమత్యాన్ని దెబ్బతీయడానికి హిందూ ఫాసిస్టు శక్తుల్ని నిలబెడుతున్నాయి. కుల, మత, ప్రాంతీయ భేదాల్ని రెచ్చగొడుతున్నాయి.

రివిజనిజమే ఈ యుగపు ప్రధాన ప్రమాదకారి. విప్లవ పోరాటాల్ని పక్కదార్లు పట్టించేందుకు మన దేశంలో సి.పి.ఐ., సి.పి.ఎం., సి.పి.ఐ. (ఎం.ఎల్) (లిబరేషన్) తదితర రివిజనిస్టు శక్తులు ప్రయత్నిస్తున్నాయి. వీరి ప్రయత్నాలను ఎండగట్టాలి, ఎదుర్కోవాలి, ఓడించాలి.

ఇలాంటి పరిస్థితుల్లో ఒకవైపు మొత్తం పాలకవర్గాల పార్లమెంటరీ పార్టీల ప్రజా వ్యతిరేక విధానాల్ని, రివిజనిస్టుల మోసకారి జిత్తుల్ని బహిర్గతపరుస్తూ కోట్లాది ప్రజల్ని మన పార్టీ నేతృత్వంలో సంఘటితం చేస్తూ దేశవ్యాప్త ప్రజా పోరాటాల వెల్లువను సృష్టించాలి. మరోవైపు, మొత్తం మన శక్తి నుపయోగించి, దేశవ్యాప్తంగా వ్యవసాయ విప్లవాన్ని, విప్లవ గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధిపరుస్తూ ప్రజాసైన్యాన్ని శక్తివంతం చేయాలి. గెరిల్లా జోన్లను విముక్తి ప్రాంతాలుగా మలచాలి. బడాభూస్వామ్య, బడా బూర్జువా వర్గాల ప్రతీఘాతుక రాజ్య వ్యవస్థను ధ్వంసం చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా రాజ్యాధికారాన్ని సంఘటితం చేస్తూ, విస్తృతపరచాలి. అలాగే లక్షలాది సంఘటిత ప్రజల పోరాటాల్ని గెరిల్లా యుద్ధ దిశగా మళ్లించాలి. తద్వారా భారత దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని విజయం దిశగా పురోగమింపజేయగలం.

మన ఐక్య పార్టీ నాయకత్వం కింద కోట్లాదిగా ప్రజలు సంఘటితం కావాలని కార్మికవర్గానికి, రైతాంగానికి, విద్యార్థి-యువజనులకు, మధ్యతరగతి ప్రజానీకానికి, చిన్న దుకాణదారులకు, చిన్న వ్యాపారస్తులకు, చిన్న పరిశ్రమాధిపతులకు, టీచర్లకు, డాక్టర్లకు, వకీళ్లకు, ఇంజనీర్లకు ప్రగతిశీల, ప్రజాస్వామిక, దేశభక్త శక్తులకు, న్యాయాన్ని ప్రేమించే సమస్త జనాభాకు విజ్ఞప్తి చేస్తున్నాం. భారతదేశంలో కొనసాగుతున్న వ్యవసాయ విప్లవ యుద్ధంలో పాల్గొని, ఈ యుద్ధాన్ని దేశ నలుమూలలా విస్తరింపజేయాలని, ఈ వ్యవసాయ విప్లవ యుద్ధాన్ని అభివృద్ధి చేస్తూ సంఘటితం చేసే కృషిలో మీరంతా మద్దతు నివ్వాలని, పార్లమెంటరీ పంథాను, పార్లమెంటరీ పార్టీలను తన్నివేసి దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసి, ఒక స్వేచ్ఛాయుతమైన, ప్రజాస్వామికమైన, ఎలాంటి దోపిడీ-పీడనలు లేని సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం సాగే మహాయజ్ఞాన్ని విజయవంతం చేయడానికి ముందుకు రమ్మని విజ్ఞప్తి చేస్తున్నాం.

*విప్లవాభినందనలతో*

***20 అక్టోబర్ 2004*** కేంద్ర కమిటీ (ప్రొవిజనల్)

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

పత్రికా ప్రకటన

# సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్], ఎంసీసీఐ పార్టీల విలీనం భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పాటు

***అక్టోబర్ 14, 2004***

సెప్టెంబర్ 21, 2004న భారతదేశంలోని ఒక గెరిల్లాజోన్‌లో నిర్వహించిన బహిరంగ సభలో భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పడినట్టుగా ప్రకటన చేశాం. ఆ సభలో ప్రజా గెరిల్లా యోధులూ, పార్టీ కార్యకర్తలూ, ప్రజా సంఘ కార్యకర్తలూ పాల్గొన్నారు. ఇప్పుడు మన దేశంలోనీ, ప్రపంచంలోనీ ప్రజలందరి కోసం ఈ ప్రకటన చేస్తున్నాం. మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) [పీపుల్స్‌వార్] పార్టీలు రెండూ సీపీఐ(మావోయిస్టు) అనే కొత్త సమైక్య పార్టీగా విలీనమయ్యాయి. విప్లవకర మార్పు ద్వారా నూతన ప్రజాస్వామిక సమాజాన్నీ, ఆ తర్వాత సోషలిజాన్నీ, కమ్యూనిజాన్నీ నిర్మించడంలో తమకు నాయకత్వం వహించగల ఒక అసలైన కార్మికవర్గ పార్టీ కావాలని కోరుకున్న దేశ కార్మిక-కర్షక, తదితర పీడిత ప్రజలందరి ఆకాంక్ష ఈ ఐక్య పార్టీ ఏర్పాటుతో పరిపూర్తయ్యింది.

మొదట ఇరు పార్టీల ఉన్నత స్థాయి ప్రతినిధి వర్గాల మధ్య సాగిన లోతైన చర్చలు, ఆ తర్వాత ఇరు పార్టీల ఉమ్మడి కేంద్ర కమిటీ సమావేశంలో సాగిన తుది చర్చల దరిమిలా ఈ సమైక్య పార్టీ ఏర్పాటు జరిగింది. సమాన హోదాలో జరిగిన లోతైన, నిర్మాణాత్మకమైన చర్చల ఫలితంగా ఐదు డాక్యుమెంట్లను రూపొందించి వాటికి తుది రూపాన్నివ్వగలిగాం. ఆ ఐదు డాక్యుమెంట్లు – మార్క్సిజం-లెనినిజం-మావోయిజపు ఉజ్వల అరుణ బావుటాను సమున్నతంగా ఎత్తిపడదాం, పార్టీ కార్యక్రమం, భారత విప్లవపు వ్యూహం-ఎత్తుగడలు, అంతర్జాతీయ, దేశీయ పరిస్థితిపై రాజకీయ తీర్మానం, పార్టీ నిబంధనావళి. ఈ డాక్యుమెంట్లతో పాటు, ఇరు పార్టీల ప్రియతమ నాయకులూ, గురువులూ అమరులు కామ్రేడ్ చారు మజుందార్, కామ్రేడ్ కన్హయ్య చటర్జీలను ఈ సమైక్య పార్టీ సంస్థాపక నాయకులుగా గుర్తించాలనీ, ఎత్తిపట్టాలనీ కూడా సమావేశం నిర్ణయించింది. '60వ దశకపు కల్లోల సమయంలోనే, ప్రత్యేకించి నక్సల్బరీ తిరుగుబాటులోంచి పుట్టిన ఈ రెండు పార్టీలు భారత కమ్యూనిస్టు ఉద్యమపు సుదీర్ఘ చరిత్రలోని విప్లవాంశకంతటికీ వారసులుగా ఉన్నాయని కూడా సమావేశం నిర్ణయించింది. భారత విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతోనే పని చేస్తున్న ఈ రెండు పార్టీలు కూడా గత 35 ఏళ్లుగా వేర్వేరు ప్రవంతులుగా కొనసాగుతూ రావడమనేది ఒక విచిత్ర పరిస్థితి. పంథాకు సంబంధించిన దాదాపు మొత్తం సిద్ధాంత, రాజకీయ సమస్యలపై సమైక్య అవగాహన ఏర్పర్చుకోవడానికి గాను అవసరమైన పద్ధతుల్ని అవలంబించాం. ఈ పంథాయే ఇరు పార్టీలు ఐక్యం కావడానికి సూత్రబద్ధమైన ప్రాతిపదికగా నిల్చింది. ఈ ఐక్యతపై ఆధారపడి ఈ రెండు పార్టీలూ ఒక సమైక్య పార్టీగా విలీనం కావాలని ఉమ్మడి కేంద్రకమిటీ సమావేశం తీర్మానించింది. ఈ ఐక్య పార్టీ ఇక నుండి భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)గా వ్యవహరించబడుతుంది. ఈ కొత్త పార్టీకి ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ గణపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

సమైక్య భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఏర్పాటు భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక కొత్త మైలురాయిగా తప్పక నిల్చిపోతుంది. దేశంలోని విప్లవ సానుభూతిపరులూ, పీడిత ప్రజలతో పాటు మా మొత్తం శ్రేణులూ, దక్షిణాసియాలోనీ, ప్రపంచంలోనీ మావోయిస్టు శక్తులూ మార్క్సిజం-లెనినిజం-మావోయిజం పునాదిపై నిల్చిన ఒక సమైక్య

మావోయిస్టు పార్టీ కోసం ఎంతో కాలంగా, ఎంతో అభిమానంతో ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ రోజు ఈ చిరకాల ఆకాంక్షా, స్వప్నం వాస్తవ రూపం దాల్చాయి.

ఈ నూతన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) భారత కార్మికవర్గపు సంఘటిత రాజకీయ అగ్రగామి దళంగా కొనసాగుతుంది. మార్క్సిజం-లెనినిజం-మావోయిజం దీనికి సిద్ధాంత పునాదిగా ఉంటుంది. ఇదే ఈ పార్టీ చింతనకూ, కార్యకలాపాలన్నిటికీ మార్గదర్శిగా ఉంటుంది. మిత, అతివాదాలకు వ్యతిరేకంగా, ప్రత్యేకించి కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రధాన ప్రమాదంగా ఉన్న రివిజనిజానికి వ్యతిరేకంగా ఈ పార్టీ తన పోరాటాన్ని కొనసాగిస్తుంది. ఈ సమైక్య పార్టీకి బైట ఉండిపోయిన అన్ని నిజమైన మావోయిస్టు గ్రూపులనూ, విడి వ్యక్తులనూ సమైక్యం చేయడానికి ఈ కొత్త పార్టీ కట్టుబడి ఉంటుంది. ఈ మావోయిస్టు పార్టీ తక్షణ లక్ష్యం, కార్యక్రమం ప్రపంచ కార్మికవర్గ విప్లవంలో భాగంగా మన దేశంలో కొనసాగుతున్న నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని ముందుకు తీసుకెళ్లడమే. పరోక్ష పాలన, దోపిడీ, నియంత్రణల వంటి నయా వలస రూపాలలో సాగుతున్న అర్ధ వలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థను కూల్చివేయడం ఈ విప్లవంలో భాగం. ఈ విప్లవం సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్య విధానానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా కొనసాగుతుంది. సాయుధ వ్యవసాయ విప్లవ యుద్ధం, అంటే దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా ఈ విప్లవం కొనసాగి పరిపూర్తి అవుతుంది. దీనిలో సాయుధ శక్తి ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవడమే కేంద్ర, ముఖ్య కర్తవ్యంగా ఉంటుంది. గ్రామసీమల మీదుగా పట్టణాలను చుట్టుముట్టి తుదకు వాటిని చేజిక్కించుకుంటాం. కాబట్టి గ్రామసీమలు, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం పార్టీ పనిలో ప్రధాన భాగంగా కొనసాగుతాయి. పట్టణ పని ఈ పనికి సహాయకారిగా ఉంటుంది. సాయుధ పోరాటమే ఉన్నతమైన, ప్రధానమైన పోరాట రూపంగా ఉంటుంది గనుకా, సైన్యమే ఈ విప్లవంలో ప్రధాన నిర్మాణ రూపం గనుకా సాయుధ పోరాటం ప్రధాన పాత్ర పోషిస్తూ ఉంటుంది. సాయుధ పోరాట క్రమంలో ఐక్య సంఘటనను ఏర్పాటు చేస్తాం. ప్రజా సంఘాలు, ప్రజా పోరాటాలు ఆవశ్యకమే కాదు, అనివార్యం కూడా. అయితే వాటి ఉద్దేశ్యం యుద్ధానికి సహాయపడాలి.

పీజీఏ, పీఎల్‌జీఏలు రెండూ సమైక్య పీఎల్‌జీఏ (ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం)గా విలీనమయ్యాయని కూడా మేం ప్రకటిస్తున్నాం. సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్]కు చెందిన పీజీఏ, ఎంసీసీఐకి చెందిన పీఎల్‌జీఏ రెండూ కూడా చావును లెక్క చేయని పోరాటాలూ, త్యాగాలూ చేసిన చరిత్రను కలిగి ఉన్నాయి. ఈ విలీనం ద్వారా వాటి పోరాట శక్తి గణనీయంగా పెరుగుతుంది. ఈ విలీనం తర్వాత, పార్టీ ముందున్న అత్యంత తక్షణ కర్తవ్యం సమైక్య పీఎల్‌జీఏను పూర్తి స్థాయి ప్రజా విముక్తి సైన్యం (పీఎల్ఏ)గా అభివృద్ధి చేయడం, ప్రస్తుతం ఉనికిలో ఉన్న గెరిల్లాజోన్లను విముక్తి ప్రాంతాలుగా మార్పు చెందించడం. ఆ విధంగా ఒకదాని వెంట మరొకటిగా అనేక వెల్లువల్ని సృష్టిస్తూ నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయాలి. డిసెంబర్ 2 పీఎల్‌జీఏ స్థాపనా దినంగా కొనసాగుతుంది. ముగ్గురు కేంద్ర కమిటీ సభ్యులు కామ్రేడ్స్ శ్యాం, మహేశ్, మురళిల మొదటి అమరత్వ దినమైన డిసెంబర్ 2, 2000లో మన దేశంలో మొట్టమొదటి సారిగా ప్రజా గెరిల్లా సైన్యం ఏర్పడింది.

దీనితో పాటు, వివిధ రాజకీయ సమస్యల పైనా, ప్రజా సమస్యల పైనా విప్లవ ప్రజా ఉద్యమాల నూతన వెల్లువను నిర్మించడం కోసం ఈ సమైక్య పార్టీ మరింత శ్రద్ధ పెడుతుంది. సామ్రాజ్యవాదులకూ, భూస్వామ్యానికీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన ఈ పోరాటాల్లో విశాల ప్రజా రాశులను భాగం చేయడానికి పార్టీ కృషి చేస్తుంది. మన దేశంలో సామ్రాజ్యవాదం సాగిస్తున్న క్రూరమైన దాడి ఫలితంగా ముందే పేదరికంలో కొట్టుమిట్టాడుతున్న ప్రజలు పెద్ద ఎత్తున నిరాశ్రయులవుతున్నారు. ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతంలో వేల సంఖ్యలో ప్రజలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దేశంపై పెరుగుతున్న సామ్రాజ్యవాద దాడికీ, రాజ్య నిర్బంధానికీ వ్యతిరేకంగా పార్టీ విశాల సెక్షన్ల ప్రజల్ని కూడగడుతుంది. సామ్రాజ్యవాదానికీ, భూస్వామ్యానికీ వ్యతిరేకంగా సాగే ఉద్యమాలన్నిటికీ మద్దతును కూడగడుతుంది. మహిళా లోకాన్ని విప్లవంలో బ్రహ్మాండమైన శక్తిగా కూడగట్టడంపైనా, ఆర్గనైజ్ చేయడం పైనా పార్టీ ప్రత్యేక శ్రద్ధ వహిస్తుంది. అన్ని రకాల సామాజిక పీడనలకు, ప్రత్యేకించి అస్పృశ్యతకూ, కులపిచ్చికీ వ్యతిరేకంగా పోరాడుతుంది. ఈ పార్టీ అతి ప్రమాదకరమైన హిందూ ఫాసిస్టు శక్తులను ఎండగట్టి, ఒంటరి చేసి, ఓడిస్తుంది. అట్లాగే మిగతా మత ఛాందసవాద శక్తులన్నిటినీ ఎండగడుతుంది. అదే సమయంలో ప్రజా పోరాటాలను ఢిల్లీలో కొత్తగా గద్దెకెక్కిన కాంగ్రెస్ పాలకులకూ, సీపీఐ/సీపీఎంలకూ, వాళ్ల సామ్రాజ్యవాద సర్దార్లకూ వ్యతిరేకంగా ఎక్కుపెడుతుంది.

మా కొత్త పార్టీ భారత పాలక వర్గాల విస్తరణవాద విధానాలనూ, వాటికి మద్దతునిస్తున్న సామ్రాజ్యవాద సర్దార్లనూ, ముఖ్యంగా అమెరికన్ సామ్రాజ్యవాదులనూ ఎండగడుతూ, ప్రతిఘటించే విధానాన్ని కొనసాగిస్తుంది. సీపీఎన్(మావోయిస్టు) నాయకత్వంలో పోరాడుతున్న నేపాలీ ప్రజల పక్షాన మా ఈ కొత్త పార్టీ మరింత చురుగ్గా నిలుస్తుంది. భారత విస్తరణవాదులూ, అమెరికన్ సామ్రాజ్యవాదులూ తమ మిలిటరీ బలాధిక్యతతో నేపాల్‌లో జోక్యం చేసుకోవడాన్ని దృఢంగా వ్యతిరేకిస్తుంది. పెరూ, ఫిలిప్పీన్స్, టర్కీ, తదితర దేశాలలో మావోయిస్టు పార్టీల నాయకత్వంలో సాగుతున్న ప్రజాయుద్ధాలను మా పార్టీ సమర్థిస్తూ ఉంటుంది. సామ్రాజ్యవాదానికీ, తిరోగమనవాదానికీ వ్యతిరేకంగా సాగే ప్రజా పోరాటాలన్నిటికీ ఈ కొత్త పార్టీ మద్దతు కొనసాగుతుంది. అమెరికా సామ్రాజ్యవాదుల నాయకత్వంలో జరిగిన దాడికీ, ఆక్రమణకూ వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతున్న ఇరాకీ, ఆఫ్ఘన్ ప్రజల ప్రతిఘటనా పోరాటానికి కొత్త పార్టీ తన పూర్తి మద్దతును కొనసాగిస్తుంది.

ఈ సమైక్య పార్టీ కార్మికవర్గ అంతర్జాతీయతత్వపు పతాకాన్ని ఉన్నతంగా ఎత్తిపడుతూ, అంతర్జాతీయ స్థాయిలో అసలైన మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు శక్తులను సమైక్యం చేసే కృషిలో మరింత చురుకైన భాగస్వామి అవుతుంది. అంతే కాకుండా, ప్రపంచం మొత్తంలోని పీడిత ప్రజలతోనూ, జాతులతోనూ ఈ పార్టీ ఐక్యమై, సామ్రాజ్యవాదానికీ, దాని బంట్లకూ వ్యతిరేకంగా ప్రపంచ కార్మికవర్గ విప్లవాన్ని పురోగమింపజేయడానికి వాళ్లతో భుజం భుజం కలిపి పోరాడుతుంది. ఆ విధంగా ఇది ప్రపంచ వ్యాప్తంగా సోషలిజాన్నీ, ఆ తర్వాత కమ్యూనిజాన్నీ సాధించడానికి బాటలు వేస్తుంది.

ఈ మహత్తర లక్ష్యాల్ని సాధించడం కోసం వందలాది మంది మా ప్రియతమ సహచరులు తమ అమూల్యమైన ప్రాణాలిచ్చారు. ఆ అమరులందరూ ప్రకాశవంతం చేసిన బాటలో తుద వరకూ కొనసాగుతూ ఉంటామనీ, వాళ్ల స్వప్నాల్ని వాస్తవంగా మల్చడం కోసం మా సర్వశక్తుల్నీ కేంద్రీకరిస్తామనీ కేంద్ర కమిటీ (ప్రావిజనల్) శపథం చేస్తోంది.

*విప్లవాభినందనలతో,*

గణపతి

కేంద్ర కమిటీ (ప్రావిజనల్) తరపున

భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

# ‘రెడ్ సన్’ ఎడిటోరియల్ బోర్డ్ సభ్యునితో ఇంటర్వ్యూ

*[యూరోప్‌లోని పెరూ ప్రజా ఉద్యమం (ఎంపీపీ) అధికార పత్రిక ‘రెడ్ సన్’. అది పెరూలో మావోయిస్టు పార్టీ (పీసీపీ) రిపోర్టుల్ని ప్రచురిస్తుంది. గత జనవరిలో ‘పీపుల్స్ మార్చ్’ పత్రిక ఈ ఇంటర్వ్యూను నిర్వహించింది. – సంపాదకులు]*

ప్రశ్న – పెరూ విప్లవోద్యమం గురించి ప్రస్తుతం ఎక్కువగా వార్తలు వినరావడం లేదు. ఛైర్మన్ గొంజాలో అరెస్టు తర్వాత మార్గంలో మలుపు చోటు చేసుకుంది కదా! ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉంది?

**జవాబు** – ఇది ఏ విధంగా కూడా యాధృచ్ఛికమైంది కాదు. ఇది లో ఇంటెన్సిటీ కాన్‌ఫ్లిక్ట్ (తక్కువ తీవ్రత గల ఘర్షణ) వ్యూహంలో భాగం ఇది... మానసిక యుద్ధంలో భాగం. పెరూలో సాగుతున్న ప్రజాయుద్ధం గురించి సమాచారం తెలియడం చాలా కష్టం. ఇది స్పష్టంగా సామ్రాజ్యవాదులు, ప్రత్యేకించి యాంకీ (అమెరికన్) సామ్రాజ్యవాదులు, వాళ్ల కావలి కుక్కలైన పెరూ పాలకవర్గాలు జమిలిగా సాగిస్తున్న కుట్ర. కానీ వాళ్లు ఎల్లకాలం ప్రజాయుద్ధం గురించి ప్రజలకు ఏమీ తెలియనివ్వకుండా ఉంచలేరు. అయితే ప్రస్తుతం సామ్రాజ్యవాదం వార్తల్ని అణచిపెట్టడాన్ని ఒక క్యాంపెయిన్ లాగే అమలు చేస్తున్నది. పాలస్తీనాలో ఏదైనా సంఘటన జరిగితే అది మీడియాలో పెద్ద వార్త అవుతుంది. కానీ విప్లవకారులు ఏదైనా చర్యకు పాల్పడితే మీడియా ఏమీ ప్రచురించవు. దురదృష్టవశాత్తు, కొందరు కామ్రేడ్స్ ప్రజాయుద్ధం గురించి వార్తల్ని అందించగల అవకాశాలు కలిగి ఉండి కూడా తమ రాజకీయ ఉద్దేశ్యాల కారణంగా ఆ పని చేయలేదు. వాస్తవానికి, 1991 నుండి ప్రజాయుద్ధం వ్యూహాత్మక ప్రతిష్టంభన దశలో కొనసాగుతున్నది. సెప్టెంబర్ 1992లో మార్గంలో మలుపు చోటు చేసుకుంది. దీని ఫలితంగా పరిస్థితిలో కొన్ని మార్పులు వచ్చాయి. విప్లవానికి కీలక సాధనాలైన పార్టీ, సైన్యం, ఐక్య సంఘటన/నూతన అధికారాలు తాత్కాలికంగా వెనుకంజ వేశాయి.

ఇదే సమయంలో, 1993లో పెరూ తిరోగమనవాదులు, ప్రత్యేకించి యాంకీ సామ్రాజ్యవాద సాయుధ బలగాలు శాంతి ఉత్తరాల పర్వాన్ని ప్రారంభించాయి. జైల్లో ఉండి లొంగుబాటు పంథాను చేపట్టిన కొందరు ద్రోహుల, రివిజనిస్టుల/లొంగుబాటుదారుల గ్రూపుతో వాళ్లు కుమ్మక్కయ్యారు. ఈ రివిజనిస్టులు తమ పంథాను పార్టీ లోపల కాకుండా బహిరంగంగా ముందుకు తెచ్చారు.

వాళ్లీ పనికి పూనుకున్నప్పుడు జైల్లో ఉన్నారు. అయితే ఈ పంథానూ, వాళ్ల ఆశల్నీ పార్టీ చాలా సమర్థవంతంగా నిర్వహించిన రెండు పంథాల పోరాటం ద్వారా తుడిచిపెట్టింది. కాబట్టి క్షణకాలం పాటు కూడా ప్రజాయుద్ధం ఆగిపోలేదు. మరోవైపు, ఈ సంవత్సరాలలో శత్రువు నూతన అధికారంపై దాడి కొనసాగించాడు. ప్రత్యేకించి క్రూరమైన నిర్బంధాన్ని అమలు చేశాడు. పెద్ద ఎత్తున కొనసాగిన హత్యాకాండల నడుమనే నూతన అధికారం తట్టుకొని నిలబడగలిగింది. అయితే ప్రజాయుద్ధానికి కలిగిన లోటుపాట్ల మూలంగా కొన్ని విముక్తి ప్రాంతాలను నిలబెట్టుకోలేకపోయాం. ఇలాంటి పరిస్థితిలో మార్గంలో ఏర్పడిన మలుపును అధిగమించేందుకు చేపట్టే చర్యలు విప్లవం తాలూకు మూడు ఆయుధాలలోనూ ప్రతిఫలించాయి. ఉదాహరణకు, ప్రజాయుద్ధంలో చాలా ముఖ్యమైనదిగానూ, గొప్పదిగానూ చెప్పుకునే ఒక చర్య ఈ వేసవిలో ఆయాకుచోలో టెచింట్ అనే కంపెనీపై జరిగింది. ఇదొక సామ్రాజ్యవాద కంపెనీ. ఒక గ్యాస్ ప్రాజెక్టును చేపట్టిన ఈ కంపెనీ నిర్మాణాల రక్షణ కోసం సాయుధ పోలీసు బలగాల్ని మోహరించారు. పీఎల్‌ఏకు చెందిన ప్రధాన బలగాల విభాగమొకటి ఈ మొత్తం ప్రాంతంపై తన అదుపును సాధించింది. పీఎల్‌ఏ సైనికులు అక్కడున్న వాళ్లందరినీ బంధీలుగా పట్టుకొని 24 గంటల పాటు తమ అదుపులో ఉంచుకున్నారు. అక్కడి కార్మికుల కోసం ఒక మీటింగ్ కూడా ఏర్పాటు చేశారు. ఈలోగా బేసుల నుండి సందేశం రావడంతో 12 డంపుల డైనమైటు, కమ్యూనికేషన్ పరికరాలు, మందులు వగైరా స్వాధీనం చేసుకొని తమ బేసులకు తిరిగిపోయారు.

వాళ్లు రిట్రీటైన తర్వాత తిరోగమనవాదులు గడగడా వణికిపోయారు. ఆ ప్రాంతానికి హెలికాప్టర్లలో సుశిక్షితులైన కమాండోలను పంపించారు. కానీ వాళ్లు ఒక్క కామ్రేడ్‌ను కూడా పట్టుకోలేకపోయారు. పీఎల్‌ఏ ఈ సుశిక్షిత బలగాలన్నిటినీ చుట్టుముట్టి నిర్మూలించింది. వీరిలో ఒక ఉన్నతాధికారి కూడా ఉన్నాడు.

ప్రజాయుద్ధానికి గట్టి కోటల్లో ఒకటిగా భావించే హువానాకో ప్రాంతంలో పోయిన సంవత్సరం నూతన అధికారానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిర్మూలనా క్యాంపెయిన్‌ను నిర్వహించారు. ఇది అక్టోబర్ 2003లో ప్రారంభమైంది. సాయుధ బలగాలు ప్రారంభించిన ఈ ఆపరేషన్ పేరు ‘ఫియెరో (ఇనుము) 2003.’

మాదక ద్రవ్యాల వ్యతిరేక యుద్ధం పేరిట సాగించిన ఈ విప్లవ వ్యతిరేక క్యాంపెయిన్‌కు యాంకీ సామ్రాజ్యవాదం నాయకత్వం వహించింది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఒకటుంది. యాంకీ సామ్రాజ్యవాదం ఇప్పటికీ మాదకద్రవ్యాల వ్యతిరేక యుద్ధం అనే ముసుగునే వాడుకుంటున్నది. ఎందుకంటే మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు పార్టీల నాయకత్వంలో సాగే సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమమంటే అది బాగా భయపడుతోంది. అందుకే ప్రపంచ ప్రజలు పెరూలో సాగే ప్రజాయుద్ధపు ఉజ్వల కాంతి గురించి తెలుసుకోకుండా అది విశ్వ ప్రయత్నం చేస్తున్నది.

ఈ క్యాంపెయిన్‌లో వాళ్లు హెలికాప్టర్ గన్‌షిప్పులను ఉపయోగించారు. వాటి మద్దతుతో భూతలంపై బలగాల్ని ముందుకు నడిపారు. అయితే పార్టీ చురుకైన ఆత్మరక్షణను అనుసరిస్తూ క్రమంగా ఒక ప్రతి-క్యాంపెయిన్‌కు పథకరచన చేసింది. అనేక ఆంబుష్‌లు జరిపింది. శత్రువుకు భారీ నష్టాల్ని చవిచూపించింది. పార్టీ తన ప్రతి-క్యాంపెయిన్‌లో విజయం సాధించింది.

నగరాలకు సంబంధించి, మొదట్లో నగరాల్లో పని చేయడం చాలా సులువుగానే ఉండింది. కానీ మార్గంలో మలుపు తర్వాత అక్కడ తీవ్రమైన నిర్బంధం అమలవుతున్నది. ఉదాహరణకు, ఒక నినాదం రాసినందుకు కూడా నిన్ను జైల్లో పెట్టొచ్చు లేదా చిత్రహింసలకు గురి చేయొచ్చు. ఇప్పుడు చంపుతున్నారు కూడా. ప్రజా ఉద్యమాల నాయకులపై పలు దాడులు జరిగాయి. కాబట్టి ఈ నూతన పరిస్థితిలో పార్టీ మరింత రహస్య పద్ధతిలో ప్రజాపంథాను అన్వయిస్తున్నది. ఉదాహరణకు, ఇటీవల జరిగిన టీచర్ల సమ్మెకూ, అట్లాగే కార్మికులు, ఆరోగ్య సిబ్బంది, రైతులు తదితర సెక్షన్లు నిర్వహించే వివిధ పోరాటాలకు పార్టీ అనేక పద్ధతుల్లో నాయకత్వం వహించింది.

ప్రశ్న – పీసీపీకీ, రిమ్‌కూ మధ్య ఎలాంటి సంబంధాలున్నాయి?


**జవాబు** – పీసీపీకి రిమ్‌లో సభ్యత్వం ఉంది. అది సరైన సిద్ధాంత, రాజకీయ పంథాను అనుసరించినంత కాలం ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టుల్ని పునరేకీకరించే దిశగా ఒక ముందడుగని పీసీపీ భావిస్తుంది. రిమ్‌లో, ప్రత్యేకించి కొందరు కమిటీ సభ్యుల్లో మితవాద అవకాశ పంథాతో

కలిసే రివిజనిస్టు అభిప్రాయాల (positions) వ్యక్తీకరణలు కానవచ్చాయి. మేం ఈ అభిప్రాయాలకు వ్యతిరేకంగా రెండు పంథాల పోరాటాన్ని అభివృద్ధి చేస్తున్నాం. మేం రిమ్‌కు వ్యతిరేకమని కొందరు చేస్తున్న ప్రచారాన్ని మేం కచ్చితంగా వ్యతిరేకిస్తాం. అది తప్పు. అబద్ధం. మేం ఎంఎల్ఎం ప్రాతిపదికన, ప్రధానంగా మావోయిజం ప్రాతిపదికన ఐక్యతనూ, రివిజనిజానికి వ్యతిరేకంగా తప్పు లేని పోరాటాన్నీ కోరుకుంటున్నాం. ఆ విధంగా ప్రపంచ కార్మికవర్గ విప్లవంలో మేం పాలు పంచుకుంటున్నాం. మే 17, 1980న ప్రజాయుద్ధాన్ని ప్రారంభించిన నాటి నుండీ మా పార్టీ ప్రపంచ కార్మికవర్గ విప్లవంలో భాగంగానే మేం ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేస్తున్నామని నొక్కి చెబుతూ వచ్చింది. కాబట్టి మేం రెండు పంథాల పోరాటాన్ని అభివృద్ధి చేస్తాం. చైర్మన్ మావో చెప్పినట్టుగా, అది చెడ్డదేమీ కాదు, మంచిదే.

**ప్రశ్న** – జైల్లో ఉన్న చైర్మన్ గొంజాలోతో ఏదైనా వార్తాలాపం సాగుతున్నదా? ప్రస్తుతం ఆయన ఆరోగ్యం ఎలా ఉందో ఏమైనా చెబుతారా?

**జవాబు** – 1992 నుండీ చైర్మన్ గొంజాలోను పూర్తిగా ఒంటరిగా నిర్బంధించారు. కాపలా కాసే గార్డులు తప్ప ఆయనను మరెవ్వరూ కలవడం లేదు. ఇది అసలు వాస్తవం. ఎవరైనా చైర్మన్ గొంజాలోను చూశానని గానీ లేదా మాట్లాడానని గానీ అన్నారంటే వాళ్లు తిరోగమన ప్రభుత్వ సభ్యులైనా కావాలి లేదా దానికి వ్యతిరేకులమని చెప్పుకునే మోసగాళ్లైనా కావాలి. సెప్టెంబర్ 24, 1992న ఆయన చేసిన గొప్ప ప్రసంగం తర్వాత ఆయనతో ఎలాంటి వార్తాలాపం కూడా జరగలేదు. ఆనాటి ప్రసంగంలో పార్టీ కర్తవ్యాలనూ, పథకాలనూ పరిపూర్తి చేయాలనీ, ప్రజాయుద్ధాన్ని కొనసాగించాలనీ ఆయన మనల్ని కోరాడు. ఆయనతో సమావేశాలు జరిపినట్టుగా ఇంకా రకరకాలుగా చూపిస్తున్న నకిలీ వీడియోలన్నీ శాంతి ఒప్పందపు కపట నాటకంలో భాగమే. పార్టీ చాలా న్యాయంగా, సరిగ్గా ఒక డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. చైర్మన్ గొంజాలోను జాతీయ, అంతర్జాతీయ టెలివిజన్ మీడియా ఎదుట హాజరుపర్చి, ఆయనకు తన అభిప్రాయాల్ని స్వేచ్ఛగా మాట్లాడే అవకాశాన్నిచ్చి దాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయాలనేదే ఆ డిమాండ్. దీనితో ఆయన ఏకాంతవాస నిర్బంధం నుండి బైట పడగల్గుతాడు. కానీ శత్రువు దీన్ని ఒప్పుకోవడం లేదు. ఎందుకంటే అలా జరిగితే అది ప్రపంచ ప్రజలూ, ప్రపంచ విప్లవం సాధించిన విజయం అవుతుందని వాడికి తెలుసు. దీని ద్వారా ప్రజలు గొంజాలో ఆలోచనను స్వంతం చేసుకుంటారని వాడికి భయం. అందుకే ఆయనకు కనీసం ఐదు సెకండ్ల పాటు కూడా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదు. ఇప్పుడు వాళ్లు ఆయనపై ఒక కొత్త విచారణను ప్రారంభిస్తామని మాట్లాడుతున్నారు. ఇది మరో నాటకమే తప్ప ఇంకేమీ కాదు. గొంజాలో మాట్లాడడానికి నిరాకరిస్తున్నాడని కూడా వాళ్లు చెబుతున్నారు. ఆయన అలా ఎందుకు నిరాకరిస్తాడు? ఇదంతా కపట నాటకం. చైర్మన్ గొంజాలో నిర్దిష్ట పరిస్థితి ఏమిటంటే ఆయన ప్రాణాలకు మునుపటికన్నా పెద్ద ప్రమాదం పొంచి ఉంది. అరెస్టవడానికి ముందే ఆయనకు చాలా సంక్లిష్టమైన శారీరక రుగ్మతలు ఉండేవి. ఆయనను నిర్బంధించిన పరిస్థితుల్లో ఏ వ్యక్తీ కూడా ఎక్కువ కాలం పాటు బతకలేడని స్వయంగా ఫూజిమోరీయే 1993లో అన్నాడు. ఇది పదేళ్ల కిందటి మాట. అప్పటి నుండి ఆయననెవ్వరూ చూడలేదు. దీన్ని మనం ఇలా సాగనివ్వకూడదు. చైర్మన్ గొంజాలో ప్రాణాల్ని కాపాడుకునేందుకు ప్రపంచ ప్రజానీకం ముందుకు రావాలి. ఆయన ఒక గొప్ప విప్లవ నేత. ఈ భూమిపై జీవిస్తున్న అత్యుత్తమ మార్క్సిస్టు-లెనినిస్టు ఆయన. ఇక్కడ దృష్టిలో ఉంచుకోవాల్సిన ఒక ముఖ్యమైన అంశమేమిటంటే చైర్మన్ గొంజాలోను కాపాడుకునే ఉద్యమం అడపాదడపా సాగే ఉద్యమం కాదు, కమ్యూనిస్టు ఉద్యమపు వ్యూహాత్మక కర్తవ్యం అది. ✶

## చైర్మన్ గొంజాలోను ఏకాంత నిర్బంధానికి వ్యతిరేకంగా తీర్పునిచ్చిన న్యాయమూర్తి




చైర్మన్ గొంజాలో (అసలు పేరు అభిమేల్ గుజ్‌మన్)కు ఇతర ఖైదీల లాగే అన్ని హక్కులు ఇవ్వాలని లిమా (పెరూ రాజధాని) న్యాయమూర్తి తీర్పునిచ్చాడు. ఎలాంటి ఆంక్షలూ, ప్రత్యేక షరతులూ లేకుండా ఆయనను కలిసేందుకు అవకాశం ఇవ్వాలని ఆ తీర్పులో ఆయన పేర్కొన్నాడు. పెరూ కమ్యూనిస్టు పార్టీ (పీసీపీ) నాయకుడైన కామ్రేడ్ గొంజాలో తన లాయర్‌తో పాటు మరెవ్వరితోనూ తనను ప్రత్యక్షంగా కలవనివ్వకుండా నిరోధించే కొత్త నిబంధనకు వ్యతిరేకంగా 35 రోజుల పాటు నిరాహార దీక్ష చేశాడు. చైర్మన్ గొంజాలో వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను స్వీకరించిన న్యాయమూర్తి ఈ నిబంధన చట్టవిరుద్ధమైందని తీర్పునిచ్చాడు. పత్రికల్లో వచ్చిన వార్తల ప్రకారం, చైర్మన్ గొంజాలోను ఏకాంతవాస నిర్బంధంలో ఉంచడాన్ని కూడా న్యాయమూర్తి చట్టవిరుద్ధమైందిగా పేర్కొన్నాడు. ఆయనను ఇతర ఖైదీల వలె చూడకుండా, సాధారణ పౌర జైల్లో కాకుండా వాయుసైన్య స్థావరంలో ఒక ప్రత్యేక చీకటి నేలమాళిగలో నిర్బంధించడానికి చట్టపరమైన ప్రాతిపదికేదీ లేదని కూడా ఆయన తన తీర్పులో పేర్కొన్నాడు. దీనిపై అపీల్ చేసుకునే ఉద్దేశ్యంతో ఉన్న వాయుసైన్య అధికారులు ఇప్పటికీ న్యాయమూర్తి తీర్పును అమలు చేయడానికి తిరస్కరిస్తున్నారు. పీసీపీ నాయకుడికి ప్రస్తుతం వకీలుగా ఉన్న మాన్యుయేల్ ఫజార్డో ఈ తీర్పును వెంటనే అమలు చేయాలంటూ ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఇదే న్యాయమూర్తి ఎదుట మరో పిటిషన్ దాఖలు చేశాడు. 1992 నుండీ చైర్మన్ గొంజాలోను ఏకాంతవాస నిర్బంధంలో పెట్టారు. 1980లో ప్రారంభించిన ప్రజాయుద్ధానికి నాయకత్వం వహిస్తున్నందుకు గాను ఆయనను "దేశద్రోహం" కేసులో దోషిగా ప్రకటించారు. అయితే ఆ తర్వాత ఆ తీర్పు చట్టవిరుద్ధమైందని ప్రకటించారు. అప్పటి నుండి ఆయనా, తదితర పీసీపీ నాయకులూ, సభ్యులూ ఒక కొత్త విచారణ కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ✶

*[ఎ వరల్డ్ టు విన్ న్యూస్ సర్వీస్, (జూన్ 14, 2004) నుండి సేకరించినది]*

బడ్జెట్ 2004-05

# పేదలకు శుష్క వాగ్దానాలు – ధనికులకు కోటి వరాలు
# 'మానవీయ' ముసుగులో మరిన్ని 'ఆర్థిక సంస్కరణలు'

సీపీఐ/సీపీఎంల మద్దతుతో గద్దెనెక్కిన యూపీఏ (సమైక్య ప్రగతిశీల కూటమి) ప్రభుత్వం మానవీయ ముఖం కలిగిన ఆర్థిక సంస్కరణలను అమలు చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆర్థిక సంస్కరణలకు వ్యతిరేకంగా ఓట్లేసిన ప్రజలను మభ్యపెట్టడానికే ఈ 'మానవీయ ముఖాన్ని' ముందుకు తెచ్చారు. సీపీఐ/సీపీఎం పార్టీలను సంతృప్తి పర్చడానికి కూడా ఇది ప్రభుత్వానికి అవసరమైంది. పేదలకు అనుకూలంగా కనిపించే పదజాలం లేనట్టయితే రివిజనిస్టు నాయకత్వం తమ శ్రేణుల ముందు మరింత బట్టబయలవుతుంది.

అందుకే కొత్త ప్రభుత్వం 2004-05 బడ్జెట్‌ను ప్రవేశపెట్టగానే సీపీఎం అనుకూల పత్రికలు, సహజంగానే, ఇది పేదల బడ్జెట్ అనీ, రైతులకు అనుకూల బడ్జెట్ అనీ ఆకాశానికెత్తుతూ రాశాయి. అట్లాగే బడా పెట్టుబడిదారీ వర్గాలు కూడా ఈ బడ్జెట్ పట్ల సంతృప్తిని ప్రకటించాయి. అయితే కొందరు స్టాక్ బ్రోకర్లకు మాత్రం ఇది సంతృప్తినివ్వలేదు. ఎందుకంటే షేర్ల లావాదేవీలన్నిటిపై 0.15% పన్ను విధించడం వాళ్లకు నచ్చలేదు.

గతంలో బీజేపీ ప్రవేశపెట్టిన బడ్జెట్లకూ, ప్రస్తుత బడ్జెట్‌కూ ఒకే ఒక్క తేడా ఏమంటే బీజేపీ 'ఆర్థిక సంస్కరణల'ను మెరటుగా, ప్రత్యక్షంగా కొనసాగిస్తే కాంగ్రెస్/సీపీఎం కూటమి ఈ విషయంలో కుటిలత్వాన్నీ, జిత్తులమారితనాన్నీ ప్రదర్శిస్తున్నది. అన్ని బడ్జెట్ల సారాంశం మాత్రం ఒక్కటే – బడా పెట్టుబడిదార్లకు పెద్ద ఎత్తున రాయితీలివ్వడం, విదేశీ పెట్టుబడికి ఆర్థికవ్యవస్థ గేట్లను మరింత బార్లా తెరవడం, పేదలపై మరిన్ని పన్నులు విధించడం. దీని ఫలితంగా పేదల జీవితాలు మరింతగా దిగజారడం, మరోవైపు ధనికులు మరింతగా తెగ బలిసిపోవడం జరుగుతుంది.

## సామ్రాజ్యవాద దోపిడీకి మరింత వెసులుబాటు

ఆర్థికవ్యవస్థలోని టెలికాం, విమానాశ్రయాలు, భీమా వంటి రంగాలను కూడా సామ్రాజ్యవాద దోపిడీకి తెరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ కూడా చేయని సాహసానికి ఒడిగట్టింది. అధికారంలోకి రావడంతోనే అది విమానాశ్రయాల రంగంలో విదేశీ పెట్టుబడికి తలుపులు తెరచింది. ప్రస్తుత బడ్జెట్‌లో అది నమ్మశక్యం గాని రీతిలో దేశ ప్రజల ఆస్తులను విదేశీ బందిపోట్లు దోచుకునే అవకాశాలను మరింత సులభతరం చేసే నిర్ణయాలు తీసుకుంది. భీమా రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 26% నుండి 49%కి పెంచింది. గతంలో విదేశీ బ్యాంకర్ల వత్తిడితో బీజేపీ ప్రభుత్వం బీమా రంగంలోకి విదేశీ పెట్టుబడికి అనుమతినిస్తూ తీసుకున్న నిర్ణయం సందర్భంగా పెద్ద వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. సామ్రాజ్యవాద బందిపోట్లు తమ పెట్టుబడిని మరింతగా పెంచే అవకాశం కోసం చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు కాంగ్రెస్ తన మొట్టమొదటి బడ్జెట్‌లోనే వాళ్ల కోరికను ఈ విధంగా తీర్చింది.

ఇక్కడితోనే అయిపోలేదు, పౌర విమానయాన రంగంలో విదేశీ పెట్టుబడి పరిమితిని 40% నుండి 49%కీ, టెలికమ్యూనికేషన్ల రంగంలో 49% నుండి 74%కి పెంచింది. దీనికి తోడు విదేశీ చట్టా పెట్టుబడి (విదేశీ సంస్థాగత పెట్టుబడి – ఎఫ్ఐఐ)కి భారీ ఎత్తున రాయితీల్ని ప్రకటించింది. రుణ నిధులలో ఎఫ్ఐఐపై ఉన్న సీలింగ్‌ను 1 బిలియన్ డాలర్ల నుండి 1.75 బిలియన్ డాలర్లకు పెంచింది. గతంలో దేశంలోకి ఎఫ్ఐఐల ప్రవేశంపై ఉన్న ఆంక్షలలో చాలా భాగం ఎత్తివేసింది. ఇప్పుడు ఎలాంటి అనుమతి అవసరం లేకుండానే, ఎలాంటి ఇబ్బందులు లేకుండానే చట్టా పెట్టుబడి దేశంలోకి స్వేచ్ఛగా ప్రవేశించగల్గుతుంది. ఈ చట్టా పెట్టుబడి ప్రపంచంలోని చాలా దేశాల ఆర్థికవ్యవస్థల్ని ఘోర వినాశానికి గురి చేసిన సంగతి తెల్సిందే. 1997లో ఆగ్నేయాసియా దేశాలలో తలెత్తిన సంక్షోభం ఇందుకు మంచి ఉదాహరణ. అయినా కాంగ్రెస్ మాత్రం దీని చొరబాటుకు పూర్తి స్వేచ్ఛనిస్తోంది. గత సంవత్సరం ఈ చట్టా పెట్టుబడి దేశంలోకి పెద్ద ఎత్తున ప్రవేశించింది. ఇప్పుడిది ఇబ్బడిముబ్బడిగా పెరిగి దేశ ఆర్థికవ్యవస్థను మరింత పుచ్చుబట్టిస్తుంది.

సీపీఐ/సీపీఎంలు మాత్రం ఎప్పటిలాగే దీన్ని వ్యతిరేకిస్తూ అరిగిపోయిన రికార్డును వాయించారు. బడ్జెట్ ప్రతిపాదనల గురించి కాంగ్రెస్ రివిజనిస్టులకు ముందే పూర్తి సమాచారం ఇచ్చే ఉంటుందన్నది కాదనలేని వాస్తవం. మరి వీళ్ల 'గొప్ప' కనీస ఉమ్మడి కార్యక్రమం (సీఎంపీ) ఏమైనట్టు?

## బూటకపు గ్రామీణ అనుకూల బడ్జెట్

దేశం వెలిగిపోతోందన్న బీజేపీ నినాదాన్ని గ్రామీణ భారతం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. వాస్తవానికి ఇందిరా 'గరీబీ హటావో' లాగానే ఇది కూడా ఒక జోక్‌గా మారింది. అప్పటి నుండీ గ్రామీణ భారతంలో ఆత్మహత్యల వార్తలు నిరంతరాయంగా వినవస్తున్నాయి. ఇప్పుడైతే మేల్‌ఘాట్, మహారాష్ట్ర నుండి ఆకలి చావుల ఆర్తనాదాలు కూడా ఆగకుండా వినవస్తున్నాయి. ప్రత్యేకించి 'ప్రపంచీకరణ', ఆర్థిక సంస్కరణల యుగంలో హైటెక్, ఇన్ఫోటెక్, ఐసీఈ (ఇన్ఫోటెక్, కమ్యూనికేషన్స్, ఎంటర్టైన్‌మెంట్) రంగాలకు పెద్దపీట వేస్తుండగా గ్రామీణ ప్రాంతాల పరిస్థితి మరింతగా దిగజారిపోయింది.

కాబట్టి సహజంగానే, ప్రజలను పిచ్చివాళ్లను చేయడానికి గాను ఆర్థిక మంత్రి తన బడ్జెట్ ప్రసంగాన్ని సీఎంపీ, వ్యవసాయ రంగంలతో ప్రారంభించాడు. మీడియా కూడా ఈ బడ్జెట్‌లో గ్రామీణ అభివృద్ధి పైన్నే ప్రధానంగా కేంద్రీకరించినట్టుగా ప్రచారం చేశాయి.

ప్రస్తుత సంక్షోభం మూలంగా గ్రామీణ జనాభాలో అత్యధిక భాగం దెబ్బతిన్నప్పటికీ వ్యవసాయ కూలీల, పేద, మధ్య తరగతి రైతుల పరిస్థితి మాత్రం మరింత దుస్సహంగా తయారైంది. ఈ సెక్షన్ల ప్రజలకు ఈ బడ్జెట్ ఏమైనా మేలు తలపెట్టిందా?

పేద వర్గాలకు ఉపాధి కల్పించడమే తన ముఖ్య లక్ష్యంగా సీఎంపీ ప్రకటించింది. మరి ఈ బడ్జెట్ అందుకోసం ఏం చేసిందో చూద్దాం! భవిష్యత్తులో ఏదో ఒక రోజున జాతీయ ఉపాధి గ్యారంటీ బిల్లును

ప్రకటిస్తుందట! (దీని ప్రకారం ప్రభుత్వం ప్రతి కుటుంబంలో ఒక వ్యక్తికి 100 పని దినాలు గ్యారంటీ చేస్తుందట. ఇప్పుడు కుటుంబంలో కనీసం ఒక వ్యక్తి వంద రోజులైనా పని చేయనిదే ప్రజలెట్లా బతుకుతున్నారని ప్రభుత్వం అనుకుంటుందో ఎవరికీ తెలియదు!!) ఇక ఇప్పుడు మాత్రం గత సంవత్సరం 76.3 కోట్ల పనిదినాలు సృష్టించిన సంపూర్ణ గ్రామీణ రోజ్‌గార్ యోజన (ఎస్‌జీఆర్‌వై)లో భారీ కోత విధిస్తూ దీనికి నిధుల్ని 9,640 కోట్ల నుండి 4,590 కోట్ల రూపాయలకు తగ్గించింది. అంటే సగానికన్నా ఎక్కువ కోత! ఎస్‌జీఆర్‌వై వంటి వెన్నెముక లేని పథకంలో కూడా సగానికి పైగా కోత పెట్టిన ప్రభుత్వానికి గ్రామీణ ఉపాధి పట్ల ఏమైనా పట్టింపు ఉందా అసలు? ఎస్‌జీఆర్‌వైలో 4,000 కోట్ల రూపాయలకు పైగా కోత విధించడాన్ని బట్టి ఈ విషయంలో ప్రభుత్వానికున్న నిజాయితీని అర్థం చేసుకోవచ్చు.

అట్లాగే 150 అతి పేద జిల్లాలలో "పనికి ఆహారం" పథకాన్ని అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇందుకు అవసరమైన నిధుల కేటాయింపు మాత్రం చేయలేదు. ఎస్‌జీఆర్‌వై తదితర పథకాల నుండి దీని కోసం నిధుల్ని మళ్లిస్తామని చెప్పింది. అంటే ఇది అమలు కావడమంటే ఇతర సంక్షేమ పథకాల్లో మరింత భారీ కోత తప్పదన్న మాట!

ఈ బడ్జెట్‌లో అంత్యోదయ అన్న యోజనను (దీని కింద బియ్యాన్నీ, గోధుమల్నీ చౌక ధరలకు అమ్ముతారు) ఒకటిన్నర కోట్ల కుటుంబాల నుండి 2 కోట్లకు పెంచుతున్నట్టు కూడా ప్రకటించారు. కానీ ఇందు కోసం కూడా ప్రభుత్వం ఎలాంటి నిధుల్నీ కేటాయించకుండా ఆహార సబ్సిడీ నుండి ఖర్చు చేయనున్నట్టు చెప్పింది. అంటే ప్రస్తుత ఆహార సబ్సిడీలో అక్షరాలా 3,700 కోట్ల రూపాయల కోతను విధించి అంత్యోదయ పథకాన్ని విస్తరిస్తుందన్న మాట. దీనితో దారిద్ర్యరేఖకు దిగువనున్న ఇతర పేద వర్గాల ప్రజలకు లభిస్తున్న ఆహార సబ్సిడీ హరించుకుపోతుంది. మరో మాటలో దీనికి కేటాయింపు అంటే ప్రజా పంపిణీ వ్యవస్థలో మరింత భారీ తగ్గింపు అని అర్థం.

పెద్ద పెద్ద మాటలు చాలానే చెప్పినప్పటికీ వ్యవసాయానికి కేటాయింపుల్లో నిర్దిష్ట పెరుగుదల మాత్రం ఏమీ లేదు. ప్రధానంగా వాణిజ్యీకరణపైన్నే ప్రభుత్వం కేంద్రీకరించింది. ఇది ప్రజల కోసం కన్నా మన్సాంటో కంపెనీ కోసం రూపొందించిన బడ్జెట్ లాగా ఉందని చెప్పక తప్పదు. వ్యవసాయ మంత్రి శరద్ పవార్ మన్సాంటో కంపెనీకి దళారీగా పని చేస్తున్నందున ఇందులో ఆశ్చర్యం కూడా ఏమీ లేదు. (ఇప్పుడు మన్సాంటోకు అమ్ముడుబోయిన మహారాష్ట్రలో ఉన్న మహికో కంపెనీయే మన దేశంలో జన్యుపరంగా పరివర్తన చెందించిన విత్తనాల వ్యాప్తిలో ముందు నిల్చింది.) గ్రామీణ రంగంలో పెద్ద ఎత్తున నిధుల కేటాయింపును పెంచినది ఒక్క వ్యవసాయ పరిశోధనలోనే. ఇది పై వాస్తవాన్ని రుజువు చేస్తున్నది. 225 కోట్ల రూపాయల నుండి 1,000 కోట్ల రూపాయలకు, అంటే 300% శాతం నిధుల్ని ప్రస్తుత బడ్జెట్‌లో పెంచారు. ఇందులో గణనీయమైన భాగాన్ని జన్యుపరమైన పరివర్తన చేసిన పంటల పరిశోధనకే చేస్తారనడంలో సందేహం లేదు. ఎందుకంటే ఇటీవలి కాలంలో ప్రధానంగా పరిశోధనలు సాగుతున్నది ఇందులోనే.

నీటిపారుదలకు దాదాపు గత సంవత్సరం లాగానే నామమాత్రమైన కేటాయింపునే చేశారు. పరపతిపైనా, వ్యవసాయ వాణిజ్యంపైనా ప్రధానంగా కేంద్రీకరించారు. వాస్తవానికి బడ్జెట్ ప్రకటనకు ఒక రోజు ముందు వెలువరించిన ఆర్థిక సర్వేలో కనీస మద్దతు ధరల వ్యవస్థనే ఎత్తిపారేయాలని సూచించారు. దీని ద్వారా ఆఖరుకు గోధుమ, వరి ధాన్యాల ధరల్ని కూడా అరాచక మార్కెట్ శక్తుల దయాదాక్షిణ్యాలకు వదిలేయాలని చెప్పారు. నిజానికి డబ్ల్యూటీవో చాలా ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నది కూడా దీనినే. ఆహార ధాన్యాల ఉత్పత్తి నుండి వాణిజ్య పంటల వైపు మళ్లాలని డబ్ల్యూటీవో డిమాండ్ చేస్తూ వస్తున్నది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో ఏమైనా లోటు ఏర్పడితే అమెరికా భారీ నిల్వల నుండి దిగుమతి చేసుకోవాలనీ, వాణిజ్య పంటల్ని శుద్ధి చేసి తక్కువ ధరలకు సామ్రాజ్యవాదులకు ఎగుమతి చేయాలనీ దాని సారాంశం. వ్యవసాయ రంగానికి పరపతి సౌకర్యాన్ని సంఘటితం చేయడంపైనా, వ్యవసాయ సంబంధమైన కార్యకలాపాల్ని బహుముఖంగా విస్తరింపజేయడంపైనా ఈ బడ్జెట్‌లో వక్కాణింపునిచ్చారు. వ్యవసాయంపై ఖర్చును మాత్రం స్వల్పాతిస్వల్పంగా 1,081 కోట్ల నుండి 1,784 కోట్ల రూపాయలకు పెంచారు. వ్యవసాయ పరపతిని సంఘటితం చేయడమంటే అర్థం ధనిక రైతులకు సహాయపడడం, మిగిలిన వాళ్లందరినీ వడ్డీ వ్యాపారుల వద్దకు పంపించడమే. ఇప్పుడు గ్రామీణ పరపతిలో ప్రధాన భాగం వీళ్ల చేతిలోనే ఉంది. అప్పుల భారాన్ని మోయలేకనే వేలాది మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే దీనిపై ఈ బడ్జెట్‌లో ఒక్క మాటైనా కానరాలేదు. నాబార్డ్ వంటి బ్యాంకులు లాభాపేక్షతోనే అప్పులిస్తాయి. చెల్లించగలరన్న నమ్మకం ఉన్నవాళ్లకే అవి అప్పులిస్తాయి. వడ్డీ రేట్ల తగ్గింపు గురించి ఒక్క మాటైనా ఈ బడ్జెట్‌లో లేదు. (ఒక రైతుకిచ్చే అప్పుకంటే ఒక కారు కొనుక్కోవడానికి ఇచ్చే అప్పుకు వడ్డీ తక్కువ!) ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికీ, పశుధనానికీ భీమా ప్రతిపాదన ఉంది. ఈ పథకాన్ని కూడా పెద్ద రైతులే ఉపయోగించుకోగల్గుతారు. అదే సమయంలో వర్షాభావం వల్ల గానీ, గిట్టుబాటు ధరలు లేక గానీ పంటలు నష్టపోయిన పక్షంలో పంట భీమా సదుపాయం గురించి మాత్రం ఈ బడ్జెట్ ఏమీ చెప్పలేదు.

నిజానికి ఈ రోజు రైతాంగాన్ని పట్టి పీడిస్తున్న వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోవడం, వ్యవసాయ కారకాల ధరలు నిరంతరాయంగా పెరుగుతుండడం అనే ప్రధాన సమస్యల్ని తీర్చడానికి ప్రభుత్వం ఏ మాత్రం సిద్ధంగా లేదు. గత ఐదేళ్లుగా వ్యవసాయ ఆదాయాలు పెద్ద ఎత్తున పడిపోయినట్టుగా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఉదాహరణకు పశ్చిమ బెంగాల్‌లో వరి పండించే రైతుల ఆదాయాలు 1996/97 నుండి 2003/04 సంవత్సరాల మధ్య 28% పడిపోయాయి. చెరకు రైతుల ఆదాయాలు ఉత్తర ప్రదేశ్‌లో 32%, మహారాష్ట్రలో 40% పడిపోయాయి. ఉత్తర భారతదేశంలో రైతుల సగటు ఆదాయాలు 10% పడిపోగా, అదే సమయంలో వ్యవసాయ కారకాల ధరలు మాత్రం సంవత్సరానికి 7% చొప్పున, అంటే మొత్తం ఐదు సంవత్సరాల్లో 35% పెరిగాయి. రైతాంగం ఎదుర్కొంటున్న ఈ తీవ్రమైన సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఈ బడ్జెట్ సిద్ధంగా లేదు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఈ సంక్షోభాన్ని భారీ ప్రభుత్వ సబ్సిడీల సహాయంతో పరిష్కరిస్తున్నారు. కానీ ఇక్కడి ప్రభుత్వాలు డబ్ల్యూటీవో ముందు మోకరిల్లి, రైతాంగానికి అందుతున్న నామమాత్రమైన స్వల్ప సబ్సిడీలలో కూడా తీవ్రమైన కోత విధించే ప్రయత్నం చేస్తూ వాళ్లను ఘోర దారిద్ర్యం అంచులకు నెట్టివేస్తున్నాయి.

ఇప్పటికే రైతాంగం ఘోరమైన దారిద్ర్యంలో మునిగితేలుతున్నారనడానికి ప్రబల సాక్ష్యం ఒకవైపు ధాన్యపు రాశులు పోగుపడి ఉంటే మరోవైపు ఒక్క పూట తిండి కోసమైనా వాటిని కొనడానికి రైతుల దగ్గర డబ్బు లేకపోవడమే. ప్రజా పంపిణీ వ్యవస్థను దాదాపు రద్దు చేసి దాని రేట్లను మార్కెట్ రేట్లతో సమానం చేయడంతో ఈ పరిస్థితి దాపురించింది. ఆకలిచావులకు కారణమవుతున్న ఈ తీవ్ర సమస్యను ప్రస్తుత బడ్జెట్ పట్టించుకోనే లేదు. 2001/02 నుండి 2003/04 సంవత్సరాల మధ్య ఆహారధాన్యాల వినియోగం 1,58,621 కోట్ల నుండి 1,24,560 కోట్ల

రూపాయలకు, అంటే 34,000 కోట్ల రూపాయల మేర తగ్గిపోయింది. అట్లాగే మన దేశంలో కూరగాయల ఉత్పత్తులు రోజుకు తలసరి 780 గ్రాములు అందుబాటులో ఉన్నాయి. నిజానికి ప్రతి వ్యక్తికి రోజుకు 90 గ్రాములు సరిపోతాయి. కానీ భారతీయులు రోజుకు తలసరి 40 గ్రాముల కూరగాయల్ని కూడా కొనలేకపోతున్నారు. ఈ వాస్తవాలను బట్టి ఈ సమస్య ఎంత భయంకరంగా తయారైందో అర్థం చేసుకోవచ్చు.

"విభిన్న కార్యక్రమాలకు తుది రూపం ఇచ్చిన తర్వాత నిధులు కేటాయించడం కోసం" ప్లానింగ్ కమిషన్‌కు 10,000 కోట్ల రూపాయల్ని కేటాయించినట్టుగా ఈ బడ్జెట్‌లో చెప్పడం మరో మోసం. నిజంగానే వివిధ కార్యక్రమాల కోసం ఖర్చు పెట్టాలనే నిజాయితీ ప్రభుత్వానికి ఉంటే ఆ పథకాలను బడ్జెట్‌లోనే ప్రకటించవచ్చు. ప్రజలను మోసం చేయడానికి ఇది మరో పన్నాగమే తప్ప వేరే ఏమీ కాదు. ప్రపంచ బ్యాంకు తొత్తు (మోంటెక్ సింహ్ అహ్లువాలియా) చేతిలో ఉన్న ప్లానింగ్ కమిషన్‌కు గుడ్డిగా కేటాయించిన 10,000 కోట్ల రూపాయలు పేద ప్రజల అవసరాల్ని మాత్రం తీర్చవని అంచనా వేయడం కష్టమేమీ కాదు!

నిజానికి ఈ బడ్జెట్ మాటల్లోనే వ్యవసాయానికి అనుకూలమైనది తప్ప నిర్దిష్టంగా నిధుల కేటాయింపును బట్టి మాత్రం కాదు. ఇక ఈ రంగంలో కేటాయించిన నిధులు ప్రధానంగా 5 శాతంగా ఉన్న గ్రామీణ సంపన్నులకు ఉద్దేశించినవే. దీని ద్వారా వ్యవసాయాన్ని మరింత వ్యాపారీకరించి సామ్రాజ్యవాదుల, బడా పెట్టుబడిదార్ల మార్కెట్ ప్రయోజనాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ఉద్దేశ్యం. ఒక్క అంత్యోదయ పథకాన్ని విస్తరించే ప్రతిపాదనను పక్కన బెడితే (అంత్యోదయ కుటుంబాలను గుర్తించడానికి ఎలాంటి యంత్రాంగం లేకుండా ఈ పథకాన్ని ఎలా అమలు చేస్తారన్న విషయం ఇప్పటికీ స్పష్టం కాలేదు), ప్రజా పంపిణీ వ్యవస్థలో ఖర్చును తగ్గించడం, వ్యవసాయంపైనా నీటిపారుదల పైనా తక్కువ ఖర్చు చేయడం, వడ్డీ వ్యాపారుల పాత్రను ఉపేక్షించడం, ఎస్‌జీఆర్‌వైలో భారీ కోతను విధించడం, వ్యవసాయోత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గించడం, పరపతిపై వడ్డీ రేట్లను తగ్గించకపోవడం వంటి చర్యల ద్వారా ఈ బడ్జెట్ పథకాలన్నీ 80% గ్రామీణ పేదల్ని మరింతగా దారిద్ర్యంలోకి నెట్టివేస్తాయి.

## పన్నుల తగ్గింపూ, బూటకపు సాంఘిక సంక్షేమం

ఈ బడ్జెట్‌లో పన్ను చెల్లింపు పరిమితిని 50,000 రూపాయల నుండి 1 లక్ష రూపాయలకు పెంచడం గురించి బాగా ప్రచారం జరిగింది. ఇది మధ్య తరగతిని ఆకట్టుకునే ఎత్తుగడే తప్ప మరేమీ కాదు. నిజానికి దీనితో మధ్య తరగతికి ప్రత్యేకంగా ఒరిగేదేమీ లేకపోగా, ఒక లక్షకన్నా స్వల్పంగా అధికంగా సంపాదించేవాళ్లు గతంకన్నా ఎక్కువ పన్ను చెల్లించాల్సి వస్తుంది.

అట్లాగే సాంఘిక సంక్షేమంపై ఖర్చును పెంచడం గురించి కూడా బాగా డబ్బా వాయించుకుంటున్నారు. ఆరోగ్యం విషయంలో ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రవేశపెట్టిన 'యూజర్ చార్జీ'లను తగ్గించే ప్రయత్నం గానీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పెంచడం గురించి గానీ, పేదలకు పెను భారంగా మారిన మందుల ధరల్ని తగ్గించే ప్రయత్నం గానీ ఈ బడ్జెట్‌లో ఏమీ కానరాదు. బీజేపీ ప్రవేశపెట్టిన ఆరోగ్య భీమా పథకాన్ని పెంచడం గురించి మాత్రమే దీనిలో మాట్లాడారు. నిజానికి ఈ పథకంతో బాగు పడేది అతి తక్కువ మందే. కేవలం 11 వేల మందే ఇందులో చేరారు. ప్రస్తుతం కార్మికుల కోసం అమలులో ఉన్న ఈఎస్ఐఎస్ వంటి భీమా పథకం ఎలా అమలవుతుందో అందరికీ తెల్సిందే కాబట్టి ఇలాంటి పథకాలలో చేరడానికి ఎవరూ పెద్దగా ఉత్సాహం చూపరు. ఈఎస్ఐఎస్ పథకం ఎంతగా భ్రష్టు పట్టిందంటే చాలా మంది కార్మికులు భీమా డబ్బు చెల్లించినప్పటికీ ప్రైవేటు వైద్యం చేయించుకోవల్సి వస్తుంది. ఇంతే కాకుండా, జనవరి 1, 2005 నుండి ప్రభుత్వం నూతన పేటెంట్ చట్టాన్ని అమలు చేయడానికి రంగం సిద్ధం చేసుకుంది. దీనితో ఇప్పటికే మండిపోతున్న మందుల ధరలు చుక్కలనంటడం ఖాయం. ఆరోగ్యంపై పెంచిన ఖర్చులో ప్రధాన భాగం పోలియో క్యాంపెయిన్ కోసం కేటాయిస్తామని బడ్జెట్‌లో స్పష్టంగానే పేర్కొన్నారు.

ఇక విద్యా రంగం విషయానికొస్తే సర్వత్రా ప్రైవేటైజేషన్ మినహా మరొకటి కనిపించడం లేదు. విద్య కోసం 4,000 కోట్ల అదనపు నిధులు రాబట్టడం కోసం 2% సెస్ (ప్రత్యేక పన్ను)ను విధిస్తున్నట్టు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం మామూలుగా నిధుల్ని కేటాయించి ఖర్చు చేయకుండా ఇలా ప్రజల నుండి ఎందుకు వసూలు చేయాలనుకుంటున్నది? పోలీసులపై ఖర్చును భారీగా 1,609 కోట్ల రూపాయలు (పోయినేడు 8,331 కోట్ల రూపాయలు కాగా ఈసారి 9,940 కోట్ల రూపాయలకు పెంచారు) పెంచగలిగే ప్రభుత్వం విద్య కొరకు మరిన్ని నిధుల్ని ఎందుకు కేటాయించలేదు? నిజానికి గతంలో మధ్యాహ్న భోజనపథకానికి ఉన్న కేటాయింపుల్ని కూడా ఇప్పుడు కొత్తగా విధిస్తున్న సెస్ నుండే రాబడతారు. ఇక 500 కొత్త ఐటీఐల ఏర్పాటు ప్రతిపాదన బడా పెట్టుబడిదార్ల కోసం, సామ్రాజ్యవాదుల కోసం అవసరమైన శ్రామికులను తయారు చేయడానికే.

చిన్న తరహా పరిశ్రమల రంగం కూడా ఈ బడ్జెట్ దాడి నుండి తప్పించుకోలేకపోయింది. చిన్న తరహా పరిశ్రమల పరిధిలోంచి 85 రకాల పరిశ్రమలను తగ్గిస్తూ ప్రస్తుతం ఉన్న 570 సంఖ్యను 485కు తగ్గించారు. ఆర్థిక సర్వేలో మరింతగా బరితెగిస్తూ చిన్న తరహా పరిశ్రమల రంగానికి రిజర్వేషన్ కల్పించే పద్ధతినే ఎత్తిపారేయాలని కోరారు.

## ఆయుధ డీలర్లకు అమిత లాభాలు

రక్షణ బడ్జెట్‌ను ఈసారి పెంచినంతగా గతంలో ఏనాడూ ఒకేసారిగా పెంచింది లేదు. పోయినేడు 60,300 కోట్ల రూపాయలుగా ఉన్న రక్షణ బడ్జెట్‌ను ఈసారి 28% పెంచుతూ మొత్తం 77,000 కోట్ల రూపాయలు కేటాయించారు. ఇది భారత విస్తరణవాదపు సైన్య వ్యూహాన్ని తెలియజేస్తున్నది. ఒకవైపు పాకిస్తాన్‌తో శాంతి ప్రక్రియ కొనసాగుతుండగా నిజానికి సైన్య ఖర్చు తగ్గాల్సి ఉండింది. ఇంత పెద్ద ఎత్తున పెరగాల్సింది కాదు. దీని ద్వారా భారతదేశం తన పొరుగు దేశాల పట్ల విస్తరణవాద విధానాలను మరింత పెద్ద ఎత్తున అమలు చేయబోతున్నదనీ, అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామిగా కొనసాగగలదనీ అర్థం చేసుకోవచ్చు. మలక్కా జలసంధిలోనూ, హిందూ మహాసముద్ర ప్రాంతంలోనూ అమెరికా తరపున పోలీసు విధుల్ని నిర్వహించడానికి భారత సైన్యాన్ని మరింతగా ఉపయోగించనున్నారనేది కూడా స్పష్టమే. అట్లాగే క్రూరమైన తిరుగుబాటు వ్యతిరేక కార్యకలాపాలలో కూడా భారత సైన్యాన్ని మరింత పెద్ద ఎత్తున ఉపయోగించే ముందుచూపుతోనే ఈ బడ్జెట్‌ను ఇంతగా పెంచినట్టుగా అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రజా వ్యతిరేక, దేశ వ్యతిరేక చర్యలన్నిటి కోసం సైన్య ఖర్చు నిరంతరాయంగా పెరుగుతూ ఉన్నది.

ఈ మొత్తంలో భారీగా 33,484 కోట్ల రూపాయలను పెట్టుబడి ఖర్చు కోసం కేటాయించారు. ఇది గత ఏడాది 20,953 కోట్లుగా ఉండింది. ఈ పెంపుదల ఆయుధ డీలర్లకూ, రాజకీయ-సైన్య ఉన్నతాధికారులకూ తమ బొక్కసాల్ని నింపుకునే మంచి అవకాశం!

*(తరువాయి 18వ పేజీలో........)*

జూలై 28

# దండకారణ్యం ఎల్లెడలా విప్లవ స్ఫూర్తితో జరిగిన అమరుల వారం

భారత విప్లవ చరిత్రలో జూలై 28 అమరులను సంస్మరించుకొని విప్లవాశయానికి పునరంకితమయ్యే మరపురాని రోజుగా నిల్చింది. మన పార్టీ సంస్థాపక నేత కామ్రేడ్ చారు మజుందార్ 1972లో ఇదే రోజున పోలీసు ముష్కరుల తీవ్ర చిత్రహింసలకు బలై మన పార్టీ త్యాగ సాంప్రదాయాలను ఉన్నత శిఖరాలకు ఎదిగించాడు. ఆ త్యాగాల బాటలో నడుస్తూ విప్లవ లక్ష్య సాధనలో భాగంగా ఎందరెందరో వీర యోధులు తమ ప్రాణాల్ని తృణప్రాయంగా అర్పించారు. ఇందులో పార్టీ అత్యున్నత స్థాయి నాయకులైన శ్యాం, మహేష్, మురళి, ఐవీ మాస్టర్, పులి అంజన్న తదితర కామ్రేడ్ల నుండి సాధారణ పార్టీ సభ్యులు, విప్లవాన్ని ప్రేమించే సాధారణ ప్రజలు ఎందరెందరో ఉన్నారు. పోరాటాలలోనూ, త్యాగాలలోనూ మేమూ సగమంటూ వీర యోధలైన అనేక మంది మహిళలు కూడా శత్రువుతో పోరాడుతూ అసువులు బాసారు. మన పార్టీ సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్], మన సోదర పార్టీ ఎంసీసీఐల నాయకత్వంలో దేశంలోని పలు ప్రాంతాలలో దాదాపు గత మూడున్నర దశాబ్దాలుగా జరుగుతున్న ప్రజాయుద్ధంలో వేలాది మంది మన ప్రియతమ కామ్రేడ్స్ అమరులై ఆకాశంలో అరుణతారలుగా నిలిచారు. అట్లాగే ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా నేపాల్, పెరూ, ఫిలిప్పీన్స్, టర్కీ తదితర దేశాలలో సాగుతున్న ప్రజాయుద్ధాలలో కూడా వేలాది మంది వీర యోధులు అమరులైనారు. ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదానికి, ప్రత్యేకించి అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతూ అనేక మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ముఖ్యంగా గత సంవత్సర కాలంగా ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్‌లలో అమెరికన్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతూ అనేక మంది పోరాటకారులూ, సాధారణ ప్రజలూ విలువైన త్యాగాలు చేశారు. వాళ్లందరి సిద్ధాంతాలతోనూ, దృక్పథాలతోనూ మనకు ఏకీభావం లేనప్పటికీ ప్రపంచ ప్రజల ఉమ్మడి శత్రువైన అమెరికాకు వ్యతిరేకంగా వాళ్లు చేస్తున్న త్యాగాలు చారిత్రాత్మకమైనవే... ప్రశంసనీయమైనవే.

గత సంవత్సర కాలంలో ప్రజాయుద్ధ పురోగమన క్రమంలో అనేక మంది వీరులు... పార్టీ నాయకులు, పీజీఏ యోధులు, సాహసిక కమాండర్లు, దళ సభ్యులు, పార్టీ సానుభూతిపరులు, ప్రజా సంఘాల కార్యకర్తలు, సాధారణ ప్రజలు అనేక మంది మన ఉద్యమానికి వ్యతిరేకంగా శత్రువు తలపెట్టిన ఫాసిస్టు హత్యాకాండలో అసువులు బాశారు. మన దండకారణ్యంలో గత సంవత్సర కాలంలో కా. రాజు (ఐతు కుంజాం), కా. రాందాస్ (సాయిబి మొడియం), కా. స్వరూప (పెంటి) మొదలైన కామ్రేడ్లు పీజీఏలో వివిధ బాధ్యతల్ని నిర్వహిస్తూ శత్రువుతో సాహసంగా పోరాడుతూ నేలకొరిగారు. మరోవైపు దండకారణ్యంలో శత్రువు ప్రారంభించిన పాశవిక హత్యాకాండలో కొందరు సాధారణ ప్రజలు, సానుభూతిపరులు కూడా తమ ప్రాణాల్ని కోల్పోయారు. ఇందులో బుధ్రి, చైతు, బుధ్‌రాం, సుఖ్‌రాం మొదలైన కామ్రేడ్స్ ఉన్నారు. అట్లాగే క్రూరమైన శత్రు బలగాలపై పీజీఏ జరిపిన ఒక దాడి సందర్భంగా జరిగిన క్రాస్‌ఫైర్‌లో మాడ్ డివిజన్ మెస్పూర్ గ్రామానికి చెందిన ఒక రైతు కామ్రేడ్ చనిపోయాడు. వీరందరినీ ప్రత్యేకంగా గుర్తు చేసుకుంటూ, మొత్తం భారత విప్లవోద్యమంలో నేటి దాకా అమరులైన వీరయోధులందరినీ స్మరించుకుంటూ వాళ్ల ఆశయ సాధనకు పునరంకితమవుతామని శపథం పూనుతూ దండకారణ్యంలోని వందలాది గ్రామాలలో ప్రజలు వేల సంఖ్యలో అమరుల వారాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అమర వీరులందరికీ ఘనంగా నివాళులర్పించారు.

ప్రతి ఏటి లాగానే ఈ ఏడు కూడా అమరుల వారాన్ని విఫలం చేయడానికి శత్రు బలగాలు చేయని ప్రయత్నమంటూ లేదు. జూలై 28కి ముందు నుండే గస్తీని ముమ్మరం చేశారు. అనేక గ్రామాల్లో అమరుల స్మారక స్తూపాల్ని కూల్చి వేసి, ప్రజల్ని అరెస్టు చేసి, చిత్రహింసలకు గురి చేసి భయోత్పాతాన్ని సృష్టించారు. ముఖ్యంగా బస్తర్‌లో మోహరించిన సీఆర్‌పీ బలగాలు, గడ్చిరోలి జిల్లాలో హింసకూ, ఉన్మాదానికీ మారుపేరుగా పేరు మోసిన కమాండో బలగాలు ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి అమరుల వారాన్ని భగ్నం చేయడానికి విఫల ప్రయత్నం చేశారు. అదే సమయంలో గెరిల్లా దళాలపై దాడులు జరిపి హతమార్చడానికి కూడా అనేక చోట్ల దాడులకు పాల్పడ్డారు. కానీ దండకారణ్య ప్రజలకు నిర్బంధం కొత్తది కాదు. ఈ నిర్బంధ క్యాంపెయిన్‌ను కూడా ఓ వైపు సంఘటితంగా ఎదిరిస్తూనే మరోవైపు అమరుల వారాన్ని విజయవంతంగా జరుపుకున్నారు. పార్టీ, ప్రజా సంఘాలు నిర్వహించిన అనేక కార్యక్రమాలలో వందల, వేల సంఖ్యలో స్త్రీపురుషులు పాల్గొని శత్రు నిర్బంధాన్ని అపహాస్యం చేశారు. ఈ సందర్భంగా ఒక్కో డివిజన్లో జరిగిన కార్యక్రమాల గురించిన సంక్షిప్త రిపోర్టులను డివిజన్ల వారీగా పరిశీలిద్దాం –

## దక్షిణ బస్తర్ డివిజన్

దక్షిణ బస్తర్ డివిజన్లో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా ప్రజలు అమరుల వారాన్ని విప్లవ సాంప్రదాయాలతో జరుపుకున్నారు. గ్రామగ్రామాన అమరుల ఆశయాన్ని కొనసాగిస్తామని శపథం పూనుతూ వేలాది మంది ప్రజలు అమరులకు ఘనంగా నివాళులర్పించారు. భారీ వర్షాల మధ్యనే తమ తమ గ్రామాలలో అమరవీరుల స్తూపాల వద్ద జోహార్లర్పించిన తర్వాత తమ ప్రాంతంలో పార్టీ, ప్రజా సంఘాలు నిర్వహించిన పెద్ద సభలకు హాజరయ్యారు. ప్రత్యేకించి తమ ప్రాంతంలో పుట్టి పీజీఏలో నాయకత్వ స్థానాలకు ఎదిగి శత్రువుతో పోరాడుతూ ప్రాణాలర్పించిన కామ్రేడ్ రాజు, కామ్రేడ్ జోగాల్‌లను ప్రజలు ఈ సందర్భంగా తలచుకున్నారు. కొన్ని గ్రామాలలో కొత్తగా స్తూపాల నిర్మాణం చేశారు. అమరులు కామ్రేడ్స్ శ్యాం, మహేశ్, మురళి, సుఖ్‌దేవ్‌ల స్మృతిలో వివిధ గ్రామాలలో నిర్మించిన స్తూపాలకు ఎర్ర రంగు వేసి వాటిని అలంకరించారు. ప్రజా మిలిషియా, ప్రత్యేక గెరిల్లా దళాలు, ప్లాటూన్లు మొదలైన పీజీఏ యూనిట్లు ఈ కార్యక్రమాలు నిర్విఘ్నంగా సాగేందుకు వీలుగా అవసరమైన రక్షణ ఏర్పాట్లన్నీ పకడ్బందీగా చేశారు. శత్రువు వచ్చే అవకాశాలున్న రోడ్లపై మాటు గాయడం, గస్తీని ముమ్మరంగా నిర్వహించడం వంటి చర్యలు చేపట్టి శత్రువును జొరబడకుండా చేశారు.

మొత్తంగా డివిజన్‌లో 12 చోట్ల పెద్ద సభలు జరిగాయి. వీటి నిర్వహణ కోసం ప్రతి చోటా నిర్వహణ కమిటీ, వలంటీర్ల బృందాలను ఏర్పాటు చేశారు. ఊరేగింపు తర్వాత అమరుల స్తూపావిష్కరణలతో సభలు ప్రారంభమైనాయి. అమరుల కుటుంబ సభ్యులతో స్తూపాలను



పాలోడ్ గ్రామంలో అమరుడు కా. రాజుకు శ్రద్ధాంజలి (ఇన్‌సెట్‌లో కా. రాజు స్తూపం)

ఆవిష్కరింపజేశారు. ఆ తర్వాత వక్తలు ఉపన్యసించారు.

కుంట ఏరియాలో ఒక చోట కామ్రేడ్ ప్రకాశ్ స్తూపం వద్ద జరిగిన సభలో 2,500 మంది ప్రజలు పాల్గొన్నారు. దోర్నపాల్ ఎల్‌జీఎస్ పరిధిలో జరిగిన సభకు 2,900 మంది ప్రజలు వచ్చారు.

కిష్టారం ఏరియాలో ప్రజలు కా. రాజు (కుంజాం ఐతు) స్మృతిలో స్తూపాన్ని నిర్మించారు. ఇక్కడ జరిగిన సభలో 3 వేల మంది ప్రజలు పాల్గొన్నారు. కా. రాజు సోదరుడు కా. జోగాల్ స్తూపావిష్కరణ చేశాడు. గెరిల్లా దళ కమాండర్ కా. రాజేష్, కేఏఎంఎస్ కమిటీ అధ్యక్షురాలు గంగక్క, చుక్కిలు కూడా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఎల్మం ఎల్‌జిఎస్ ప్రాంతంలో తాళ్లగూడెం అమరుల స్తూపం దగ్గర జరిగిన సభకు 2,500 మంది ప్రజలు హాజరయ్యారు.

పామేడ్ ఏరియాలో ఐదు చోట్ల అమరవీరుల స్మారకసభలు జరిగాయి. చిలుకపల్లిలో మూడు వేల మంది, గుండంలో 15 వేల మంది, ఎర్రంలో 13 వేల మంది, కంచల్‌లో 20 వేల మంది, పావూర్‌లో 1,500 మంది ప్రజలు పాల్గొన్నారు. జెగురుగొండ ఏరియాలో బుడిగిన్ వద్ద జరిగిన సభలో 1,100 మంది ప్రజలు పాల్గొని అమరులకు జోహార్లర్పించారు. కా. సుఖ్‌దేవ్ స్తూపం వద్ద జరిగిన సభలో 3 వేల మంది ప్రజలు హాజరయ్యారు. లింగగిరిలో కా. భీమన్న స్మారకస్తూపం వద్ద జరిగిన సభలో 1,400 మంది, కా. మల్లేష్ స్మారకస్తూపం వద్ద జరిగిన సభలో 1,500 మంది పాల్గొన్నారు.

పై సభలన్నిటిలోనూ డివిజన్, ఏరియా, గ్రామ స్థాయి సీఎన్‌ఎం (చేతనా నాట్య మంచ్) కళా బృందాలు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చాయి. అమరుల ఆశయాలనూ, త్యాగాలనూ ఎత్తిపడుతూ పాటలు పాడి, నాట్యరూపకాలు ప్రదర్శించాయి. ఇవి ప్రజలకు ఉత్సాహాన్ని కలిగించాయి.

జూలై 28కి ఒక నెల ముందు నుండే డివిజన్‌లో విస్తృతంగా ప్రచార కార్యక్రమం చేపట్టారు. డివిజన్ వ్యాప్తంగా దాదాపు 4 వేల కరపత్రాలు ప్రజల్లో పంచారు. అట్లాగే 1600 పోస్టర్లు అంటించారు. ఈ ప్రచారంతో డివిజన్లోని పట్టణాలకు వచ్చే బస్సులు వారం రోజుల పాటు పూర్తిగా బంద్ అయ్యాయి. అట్లాగే సంతలు/దుకాణాలు కూడా బంద్ పెట్టారు. వాస్తవానికి పార్టీ గానీ, విప్లవ ప్రజా సంఘాలు గానీ ఈ సందర్భంగా బంద్‌కు పిలుపివ్వలేదు. అయితే శత్రువు కావాలనే సృష్టించిన భయ వాతావరణం మూలంగా ఈ విధంగా జరిగింది. శత్రువు కుట్రలను స్థానిక పార్టీ ప్రజల్లో ఎండగట్టింది.

## గడ్చిరోలి డివిజన్

గడ్చిరోలిలో తీవ్ర శత్రు నిర్బంధం నడుమనే ప్రజలు అమరవీరులకు ఘనంగా నివాళులర్పించి వారి ఆశయ సాధనకు పునరంకితమయ్యారు. క్రూరత్వానికి పర్యాయపదంగా మారిన గడ్చిరోలి పోలీసులు విప్లవోద్యమంపై సాగిస్తున్న బహుముఖ దాడిలో భాగంగా అహిరి ఏరియాలోని మర్రిగూడెం, గుండెర గ్రామాల ప్రజలను జూలై 28 నాడు విప్లవోద్యమానికి వ్యతిరేకంగా ఊరేగింపు తీయాలని బలవంతపెట్టారు. గుండెర నుండి రేపన్‌పల్లి పోలీసుస్టేషన్ దాకా రోడ్డుపై నుండి ఊరేగింపుగా రావాలని ఆదేశించారు. నిర్బంధ వత్తిడి మూలంగా దాదాపు 80 మంది ప్రజలు రోడ్డుపై జమైన సందర్భంలో అక్కడికి చేరుకున్న స్థానిక గెరిల్లా దళం అక్కడే వాళ్లతో అమరవీరుల స్మారకసభ జరిపింది. దాదాపు అరగంట సేపు మీటింగ్ జరిపి అదే రోడ్డుపై బ్యానర్లు కూడా కట్టారు. ప్రజలు అమరులకు జోహార్లర్పిస్తూ, పోలీసు నిర్బంధాన్ని ఖండిస్తూ నినాదాలు చేశారు. ఆ తర్వాత ప్రజలు పోలీసు ఆదేశాలను ధిక్కరించి తమ తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

అహిరి ఏరియాలో విడవకుండా కొనసాగుతున్న తీవ్ర నిర్బంధంలోనే ప్రజలు ఎక్కడికక్కడే సమావేశమై చిన్న చిన్న సభలు జరుపుకొని అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. 'ఎల్' అనే గ్రామంలో 25 మంది, 'వి' అనే గ్రామంలో ఏడుగురు ప్రజలు హాజరు కాగా స్తూపావిష్కరణ జరిపి జెండా ఎగురేసి అమరులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ఏరియాలో 15 బ్యానర్లు కట్టారు. 50 పోస్టర్లు వేశారు.

అహిరి ఏరియాలో చలవాడ గ్రామంలో జరిగిన అమరవీరుల స్మారకసభకు 90 మంది పురుషులు, ఐదుగురు మహిళలు హాజరయ్యారు. అట్లాగే గొల్లకర్జ గ్రామంలో 25 మంది, గుడ్డిగూడెం గ్రామంలో 62 మంది ప్రజలు సభలలో పాల్గొన్నారు. గుడ్డిగూడెం నాకా వద్ద స్తూప నిర్మాణం చేసి ఎర్రజెండాలు ఎత్తి బ్యానర్లు కట్టారు. అక్కడ జమైన 30 మంది ప్రజలతో దాదాపు గంట సేపు మీటింగ్ చేశారు. అన్ని చోట్లా ప్రజలు అమరుల త్యాగాలు వృధా పోవనీ, వాళ్ల ఆశయాల్ని సాధించి తీరుతామనీ ప్రతిన బూనారు.

ఏటపల్లి ఏరియాలో కూడా అమరుల వారాన్ని విఫలం చేయాలని శత్రువు చేసిన ప్రయత్నాలన్నిటినీ వమ్ము చేస్తూ ప్రజలు ప్రజాయుద్ధ క్రమంలో అసువులు బాసిన వీరులకు జోహార్లర్పించారు. ఈ ఏరియాలో ప్రచారంలో భాగంగా 400 పోస్టర్లు, 300 కరపత్రాలు, 12 బ్యానర్లు ఉపయోగించారు. సూర్జాగడ్ గుట్టపై రోడ్డుపై ఎర్రజెండాను నిలబెట్టారు. ఏరియా అంతటా అమరుల వారాన్ని గురించి విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. రెండు గ్రామాల్లో గతంలో అమరుల స్మారకస్తూపాల్ని నిర్మించిన చోట స్మారకసభలు నిర్వహించారు. ఇందులో ఒకచోట 60 మంది, మరో చోట 220 మంది స్త్రీపురుషులు హాజరయ్యారు. కసంసూర్ ఏరియాలో ప్రజలు 10 ఫీట్ల ఎత్తుతో సిమెంటుతో ఒక స్తూపాన్ని నిర్మించారు. ఇక్కడ జరిగిన సభలో 40 మంది పురుషులు, 60 మంది స్త్రీలు పాల్గొన్నారు. వెడమపల్లి రోడ్డుపై మూడు ఫీట్ల ఎత్తుతో ఒక స్తూపాన్ని నిర్మించారు. ఇక్కడ జరిగిన సభలో 40 మంది ప్రజలు పాల్గొన్నారు. మరో మూడు చోట్ల కర్రతో స్తూపాల్ని తయారు చేసి నిలబెట్టారు. ఈ గ్రామాలలో జరిగిన సభలలో మొత్తం 150 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభలలో పాల్గొనడానికి వచ్చిన ప్రజలు తమ చేతికి దొరికిన ఆయుధాన్ని వెంట తెచ్చారు. తీవ్ర శత్రు నిర్బంధం మధ్యన సాయుధంగా లేకుండా ఏ కార్యక్రమం కూడా నిర్వహించుకోలేమని ప్రజలు అనుభవపూర్వకంగా గ్రహిస్తున్నారు.



**కామ్రేడ్ అమర్‌సాయ్ హలామి**

*గడ్చిరోలి డివిజన్, టిప్రాగడ్ ఏరియా, చరవాహి గ్రామ నివాసి. ప్రజా సంఘ కార్యకర్తగా పని చేస్తూ పార్టీ సభ్యుడిగా ఎదిగాడు. పార్టీ రాజకీయాల పట్ల ఎనలేని విశ్వాసం గల ఈ కామ్రేడ్ ప్రజల హృదయాల్లో ప్రియమైన నాయకుడిగా స్థానం సంపాదించుకున్నాడు. గత ఏప్రిల్‌లో ఒక రోడ్డు ప్రమాదంలో ఈ కామ్రేడ్ అమరుడయ్యాడు. ఈ కామ్రేడ్ ఆశయాన్ని కొనసాగిద్దామని శపథం పూనుదాం.*

ఇదే ఏరియాలో మరో గ్రామంలో పీజీఏ సైనికులూ, ప్రజలూ కలిసి అమరవీరుల స్మారకసభ జరుపుకున్నారు. ఇందులో 30 మంది గెరిల్లాలు, 90 మంది ప్రజలు పాల్గొన్నారు. సభాస్థలంలో ఎర్ర గుడ్డతో అమరుల స్తూపాన్ని తయారు చేసి అమరులు కామ్రేడ్స్ శ్యాం, మహేశ్, మురళిల ఫోటోలను చెట్లపై కట్టారు. ప్రజలూ, గెరిల్లాలూ బార్లు తీరి నిలవగా పార్టీ ఏసీ కార్యదర్శి జెండానెగురవేశారు. ఆ తర్వాత మరో కామ్రేడ్ స్తూపావిష్కరణ చేశారు. ఇంటర్నేషనల్ గీతాన్ని పాడిన తర్వాత అమరుల స్మృతిలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అమరులకు జోహార్లు పలుకుతూ నినాదాలు చేసిన తర్వాత సభ ప్రారంభమైంది. ఆ తర్వాత సభలో ఏసీ సభ్యులు, మరో డీవీసీ కామ్రేడ్ ఉపన్యసించారు. జూలై 28 ప్రాముఖ్యతను గురించీ, ప్రస్తుతం దోపిడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గురించీ మాట్లాడారు. అమరవీరులు కలలు గన్న విధంగా పీడిత ప్రజల రాజ్యాన్ని నెలకొల్పడమే మనం వాళ్లకిచ్చే నిజమైన నివాళి అని వక్తలు ఉద్ఘాటించారు.

పెరిమిలి ఏరియాలో పోలీసు నిర్బంధాన్ని ధిక్కరిస్తూ ఏడు గ్రామాల ప్రజలు అమరుల స్మారకసభ జరుపుకున్నారు. గుర్నూర్, మాడవెల్లి, గెర్ర – ఈ మూడు గ్రామాల ప్రజలు 118 మంది పురుషులు 30 మంది స్త్రీలు ఒక చోట సమావేశమై అమరుల స్మారకసభ జరుపుకున్నారు. ప్రజలిక్కడ కర్రతో 12 ఫీట్ల స్తూపాన్ని తయారు చేసారు. సభకు ముందు ప్రజలు ఊరేగింపు నిర్వహించారు. ఇది దాదాపు అర గంట సేపు సాగింది. ఆ తర్వాత కా. కార్చ జెండా ఎగురవేయడంతో సభ మొదలైంది. ఆ తర్వాత ప్రజలూ, గెరిల్లాలూ కల్సి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు గడ్చిరోలి జిల్లాలో పోలీసులు అమలు చేస్తున్న నిర్బంధాన్ని గురించీ, బూటకపు సంస్కరణ కార్యకలాపాల గురించీ మాట్లాడారు. కా. రఘు మాట్లాడుతూ అమరుల త్యాగాల ఫలితంగానే నేడు మన పార్టీ దాదాపు 12 రాష్ట్రాలలోకి విస్తరించగలిగిందని అన్నాడు. అమరుల ఆశయ సాధనలో దృఢంగా పోరాడుతూ దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతం చేయాలన్న సందేశంతో సభ ముగిసింది.

29వ తేదీన ఎర్మనార్‌లో జరిగిన సభలో 77 మంది, 30వ తేదీన తాడిగూడలో జరిగిన స్మారకసభలో 73 మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ అన్ని చోట్లా స్థానిక గెరిల్లా దళం కూడా పాల్గొంది. అమరుల వారానికి ముందు ఏరియాలో 150 పోస్టర్లతో, 300 కరపత్రాలతో విస్తృత ప్రచారం నిర్వహించారు.

గట్ట ఏరియాలో మొత్తం 12 స్థలాల్లో జరిగిన అమరవీరుల స్మారక సభలలో 28 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. ఈ మొత్తం సభలలో దాదాపు 700 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. ఈ సభలన్నీ తీవ్ర నిర్బంధం నడుమనే జయప్రదమయ్యాయి.

ఒక చోట జరిగిన సభలో అమరుడు కా. ప్రభాకర్ సహచరి జెండా ఎగురవేసింది. మరో సభలో అమరుడు కామ్రేడ్ కోమటి వాచామి సహచరి జెండా ఎగురవేసింది. మరో చోట జరిగిన సభలో స్థానిక విప్లవ ప్రజా కమిటీ అధ్యక్షుడు జెండా ఎగురవేశాడు.

రెండు చోట్ల స్థానిక ప్రజా సంఘాల అధ్యక్షులు ప్రసంగించగా మరో రెండు చోట్ల జనతన సర్కార్ అధ్యక్షులు ప్రసంగించారు. ఈ సభలే కాకుండా ఏరియాలోని 60 గ్రామాల ప్రజలు తమ సంప్రదాయాల ప్రకారం అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు.

భామ్రాగఢ్ ఏరియాలో ఐదు గ్రామాల ప్రజలు 200 మంది ఒక చోట అమరుల స్మారక సభ జరుపుకున్నారు. ఈ సభలో ఏరియా పార్టీ కమిటీ కార్యదర్శి జెండా ఎగురవేశారు. ఏరియా కమిటీ సభ్యులు ప్రసంగించారు. అమరుల ఆశయాన్ని కొనసాగిస్తూ ప్రజాయుద్ధాన్ని తీవ్రతరం చేయాలనీ, పీజీఏలో పెద్ద సంఖ్యలో యువతీయువకులు భర్తీ కావాలనీ వక్తలు తమ సందేశాన్ని వినిపించారు. చివరి ఊపిరి ఉన్నంత వరకు అమరుల బాటలో నడవాలని ప్రజలను కోరారు. కామ్రేడ్ చారు మజుందార్ నుండి మొదలుకొని నేటి కా. రాజు, కా. రాందాస్, కా. స్వరూపల వరకూ ఎందరో వీరయోధులు ప్రజల విముక్తి కోసం తమ విలువైన ప్రాణాల్ని అర్పించి తమ బతుకు ధన్యం చేసుకున్నారని అమరులను కొనియాడారు.

## ఉత్తర బస్తర్ డివిజన్

ఉత్తర బస్తర్ డివిజన్‌లోని కోయిలిబేడ ఏరియాలో ప్రజలు గ్రామగ్రామాన అమరుల సంస్మరణ వారాన్ని జరుపుకున్నారు. అట్లాగే ఏరియాలో నాలుగు చోట్ల జరిగిన పెద్ద సభల్లో కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఒక్కో సభకు 10-20 గ్రామాల నుండి ప్రజలు హాజరయ్యారు.

జూలై 28కి వారం రోజుల ముందు నుండే ఏరియా వ్యాప్తంగా ప్రచారం నిర్వహించారు. ప్రజా సంఘాలు, సీఎన్ఎం దళాలు ఈ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నాయి. పోస్టర్స్ అంటించారు. బ్యానర్లు కట్టారు. మెయిన్ రోడ్డుపై ఉన్న బడ్‌గాం, దుర్గ్‌కొందుల్, కొద్దాపాక, సంగం, బెటియా గ్రామాలలోని ప్రధాన కూడళ్లలో అప్పటికప్పుడు తయారు చేసిన స్తూపాలను నిలబెట్టారు.

మేండ్రలో జరిగిన సభలో దాదాపు 20 గ్రామాల నుండి 1500 మంది స్త్రీపురుషులు హాజరయ్యారు. కడిమె ఎల్జీఎస్ కమాండర్ కా. నిర్మల జెండా ఎగురవేయడంతో సభా కార్యక్రమాలు ప్రారంభమైనాయి. ఆ తర్వాత స్తూపావిష్కరణ జరిగింది. ప్రజలంతా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరులను స్మరించుకున్నారు. స్థానిక డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ నాయకులు సభలో ప్రసంగించారు. స్థానిక సీఎన్ఎం కళాకారులు అమరులపై పాటలు పాడారు.

ఏన్‌హోర్‌లో జరిగిన సభకు 10 గ్రామాల నుండి ప్రజలు వచ్చారు. అమరులకు శ్రద్ధాంజలి ఘటించి వాళ్ల ఆశయ సాధనకు పునరంకితమవుతామని శపథం పూనారు. అట్లాగే ఆట్‌నార్‌లో 4 గ్రామాల ప్రజలు, రాంపూర్‌లో 3 గ్రామాల ప్రజలు, వర్కడ్‌లో 4 గ్రామాల

*ఉత్తర బస్తర్ డివిజన్‌లో మెయిన్ రోడ్డుపై ఉన్న గ్రామాలలో ప్రజలు పెట్టిన తాత్కాలిక స్తూపాలను పోలీసులు తొలగిస్తూ వస్తుండగా పీజీఏ గెరిల్లాలు తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నారు. జూలై **31**న కొండె అనే గ్రామంలో ఒక పోలీసు బ్యాచ్ స్తూపాన్ని తొలగించడానికి వచ్చింది. అయితే అందులో బాంబు ఉండవచ్చన్న భయంతో మిగిలిన పోలీసులంతా దాదాపు **300** గజాల దూరంలో ఉండిపోయి, ఒకే ఒక పోలీసు వాణ్ని స్తూపాన్ని తొలగించడానికి పంపించారు. అయితే అక్కడే సివిల్ బట్టల్లో పొంచి ఉన్న పీజీఏ సైనికులు క్లైమోర్ మైన్ పేల్చి పోలీసులను పరుగులు తీయించారు.*

నుండి వచ్చిన ప్రజలు అమరుల స్మారకసభల్లో పాల్గొన్నారు. ఈ విధంగా మొత్తం కోయిలిబేడ ఏరియాలో 50 గ్రామాలలో అమరుల స్మారకసభలు జరిగాయి.

## కామ్రేడ్ కల్పన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తుంది!

అమరుల వారాన్ని విజయవంతం చేసే కృషిలో పార్టీ, పీజీఏ, ప్రజా సంఘాలకు చెందిన అన్ని యూనిట్లూ నిమగ్నమై ఉన్న సమయంలో ఆగస్టు 1న కా. కల్పన అమరురాలైంది. పశ్చిమ బస్తర్ డివిజన్ మద్దేడ్ ఏరియాలో పని చేసే కోవెల ఎల్‌జీఎస్ సభ్యురాలైన కామ్రేడ్ కల్పన చింతవాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు వరదలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయింది. గెరిల్లాలు ఒక్క శత్రువుతోనే కాకుండా ప్రకృతితో కూడా సమయస్ఫూర్తితో మెలగనట్టయితే పెద్ద మూల్యాన్నే చెల్లించాల్సి వస్తుందన్న చేదు అనుభవం కామ్రేడ్ కల్పన మనకందించి వెళ్లింది. కా. కల్పన అసలు పేరు బుర్క పొజ్జె. అమరుల వారం సందర్భంగానే మరో అరుణతారగా వెలసిన కల్పనకు విప్లవ జోహార్లు తెలుపుదాం. ✱

*(కా. కల్పన జీవిత విశేషాలను వివరంగా వచ్చే సంచికలో అందించడానికి ప్రయత్నిస్తాం. – **సంపాదకులు**)*

## మాడ్ డివిజన్

మాడ్ డివిజన్‌లోని కుతుల్ ఏరియాలో ప్రజలు అమరుల సంస్మరణ వారాన్ని విప్లవ స్ఫూర్తితో జరుపుకున్నారు. జూలై 28కి ముందే గ్రామగ్రామాన పోస్టర్లతో, కరపత్రాలతో ప్రచారం చేశారు. జూలై 28న బట్‌నార్ గ్రామంలో ఒక సభ జరిగింది. ఈ సభలో చుట్టుపక్కల గల 9 గ్రామాల నుండి 500 మందికి పైగా ప్రజలు పాల్గొన్నారు. స్త్రీపురుషులతో పాటు పిల్లలు కూడా ఉత్సాహంతో ఈ సభలో పాల్గొనడం ఒక విశేషం. సభా స్థలానికి కొద్ది దూరం నుండి ఊరేగింపు నిర్వహించారు. అమరులకు పేరు పేరునా జోహార్లు తెలుపుతూ, అమరుల ఆశయాన్ని కొనసాగిస్తామంటూ ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆ తర్వాత డీఏకేఎంఎస్ అధ్యక్షుడు జెండానెగురేసి సభను ప్రారంభించాడు. ఆ తర్వాత ప్రజలు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తర్వాత ముగ్గురు డీఏకేఎంఎస్ సభ్యులు ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. వక్తలు ఈ దోపిడీ రాజ్యాన్ని కూల్చివేసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడమే మనం అమరులకు అర్పించే నిజమైన నివాళి అని మాట్లాడారు. గ్రామగ్రామాన ప్రజా ప్రభుత్వ అంగాలను ఏర్పాటు చేస్తూ, వాటిని విస్తరిస్తూ అమరులు కన్న కలల్ని నిజం చేయాలని కోరారు. ఆఖరున స్థానిక ఎల్‌జీఎస్ కామ్రేడ్లు ప్రజలనుద్దేశించి మాట్లాడారు.

కరేల్‌ఘాట్ ప్రాంతంలో జూలై 28 సందర్భంగా ఆరు ప్రచార దళాలు క్యాంపెయిన్‌ను నిర్వహించాయి. గ్రామగ్రామాన అమరవీరుల స్తూపాల్ని నిర్మించి జెండా ఎగురవేసి పీడిత ప్రజల విముక్తి కోసం అమరులైన వీరులకు జోహార్లు అర్పించాలని ప్రజలను కోరాయి. నారాయణ్‌పూర్ పోలీసు స్టేషన్‌కు 400 గజాల దూరంలో అమరులకు జోహార్లు చెబుతూ రెండు బ్యానర్లు కట్టారు. అట్లాగే ఒక కిలోమీటర్ దూరంలో ఉన్న వివేకానంద ఆశ్రమస్కూలు గోడలపై నినాదాలు రాశారు. బేరెవేడ స్కూలు గోడపై నినాదాలతో పాటు, అమరుడు కా. రాజు స్మృతిలో గోడపై స్తూపాన్ని పెయింట్ చేశారు. నారాయణపూర్ పట్టణంలో పెద్ద ఎత్తున పోస్టర్లూ, కరపత్రాలూ వేయడంతో పోలీసులు అవాక్కయ్యారు. నక్సలైట్లు స్టేషన్‌పై దాడి చేసే అవకాశం ఉందని భావించి గస్తీని నిలిపివేసి స్టేషన్లకే పరిమితమైపోయారు.

ఏరియాలో అనేక గ్రామాలలో ప్రజలు రాళ్లతో స్తూపాల్ని నిర్మించి జెండాలు ఎగురవేసి స్మారకసభలు జరుపుకున్నారు. మూడు చోట్ల పెద్ద సభలు జరిగాయి. కోడ్‌నార్‌లో జరిగిన సభలో 6 గ్రామాల నుండి 300 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. మొదట ఊరేగింపు జరిపి అమరులకు జోహార్లు చెప్పారు. మిలిషియా సభ్యులు సాయుధ ప్రదర్శన జరిపారు. ఆ తర్వాత సంఘ సభ్యుడు కామ్రేడ్ రమేష్ జెండానెగురవేయడంతో సభ మొదలైంది. డీఏకేఎంఎస్ సభ్యులు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. మాడ్ డివిజన్లో అమరుడైన కా. రాజుకూ ఇంకా ప్రజాయుద్ధంలో అమరులైన వీరులందరికీ జోహార్లు చెప్పారు.

నారాయణపూర్‌కు సమీపంలో గల హిత్తవేడ గ్రామంలో జరిగిన స్మారకసభలో 6 గ్రామాల నుండి 550 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. మూడు గంటల పాటు సాగిన ఈ సభకు ముందు ఊరేగింపు తీశారు. మిలిషియా సభ్యులు సాయుధ ప్రదర్శన నిర్వహిస్తూ మార్చింగ్ పాటలు పాడారు. ఆ తర్వాత వక్తలు మాట్లాడారు. స్థానిక సీఎన్‌ఎం కళాకారులు పాటలు పాడారు.

గోట జంబ్రి అనే గ్రామంలో మూడో సభ జరిగింది. ఇందులో కూడా ఆరు గ్రామాల నుండి 330 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. నారాయణపూర్ పట్టణానికి దగ్గరలో ఉన్న ఈ గ్రామాలలో జరిగిన సభలన్నీ ప్రజలను బాగా ప్రభావితం చేశాయి. అమరుల ఆశయ స్ఫూర్తితో విప్లవోద్యమంలో ముందుకు సాగుతామని ప్రజలు ప్రతిన బూనారు.

కోహ్కామెట్ట ఏరియాలో ఇర్కుబట్టి గ్రామంలో ప్రజలు జూలై 28న అమరవీరుల స్మారక సభ జరుపుకున్నారు. ఈ సభలో దాదాపు 500 మంది ప్రజలు పాల్గొన్నారు. సభకు ముందు ప్రజలు అమరవీరుల ఆశయాన్ని కొనసాగిస్తామంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ జరిపారు. ఆ తర్వాత కా. లచ్చు అమరుల స్మారక స్తూపాన్ని ఆవిష్కరించాడు. సీఎన్‌ఎం కళాకారులు అమరవీరుల స్మృతిలో పాటలు పాడారు. ఆ తర్వాత స్థానిక దళ కమాండర్ కా. కౌసల్య, డివిజన్ పార్టీ కార్యదర్శి కా. పాండులు ప్రసంగించారు. ఈ సభలో విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాన్నార్ గ్రామంలో కూడా అమరవీరుల సంస్మరణ సభ జరిగింది. ఈ గ్రామంలో అమరుడు కా. రాజు స్మృతిలో స్తూపాన్ని నిర్మించారు. ఇక్కడ కూడా స్థానిక పార్టీ, ప్రజా సంఘాల నాయకులు సభనుద్దేశించి ప్రసంగించారు. కచ్చాపాల్ గ్రామంలో జరిగిన అమరవీరుల స్మారకసభలో దాదాపు 100 మంది ప్రజలు పాల్గొన్నారు. కోహ్కామెట్ట గ్రామంలో జరిగిన సభలో 600 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముందుగా స్థానికంగా 6 ప్రచార దళాలు గ్రామగ్రామాన ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు, పోస్టర్లు, వాల్‌రైటింగ్‌లతో ఈ ప్రచారం జరిగింది. ఈ ఏరియాలోని కీహ్కాడ్, కుంద్ల, బాసింగ్, ముర్‌నార్, సోన్‌పూర్, ముహంది, ఝూరవాహి, నీర్‌మెట్ట తదితర గ్రామాలలో కూడా అమరవీరుల స్మారక సభలు జరిగాయి.

## పశ్చిమ బస్తర్ డివిజన్

పశ్చిమ బస్తర్ డివిజన్‌లోని భైరంగఢ్ ఏరియాలలో మూడు ఎల్‌జీఎస్ ప్రాంతాలలో డీఏకేఎంఎస్ సభ్యులతో 12 ప్రచార దళాలు, కేఏఎంఎస్ సభ్యులతో 11 ప్రచార దళాలు విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించాయి. మొత్తం ఏరియాలో 1,000 కరపత్రాలు, 62 బ్యానర్స్, 700 పోస్టర్లు

పంచారు. జాంగ్ల, మాట్వాడ, బైరంగఢ్, మిర్తుల్, పదేడ్, గంగలూర్, నైమేడ్, బీజాపూర్ వంటి పట్టణ ప్రాంతాలలో కూడా పోస్టర్లు అంటించారు. జగ్దల్‌పూర్-బీజాపూర్ మార్గంలో నడిచే బస్సులకూ, జీపులకూ కూడా బ్యానర్లు కట్టారు. పలు చోట్ల స్కూలు భవనాలపైనా, వంతెనలపైనా వాల్ రైటింగ్ చేశారు. మిర్తుల్ సమీపంలో రోడ్డుపై అప్పటికప్పుడు తయారు చేసిన స్తూపాన్ని నిలబెట్టారు.

అమరుల వారాన్ని సఫలం చేసేందుకు డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ రేంజ్ కమిటీలు విశేష కృషి చేశాయి. రేంజ్ కమిటీల సభ్యులు తమ తమ పరిధిలోని గ్రామాల్లో క్యాంపెయిన్ నిర్వహించారు. ప్రతి గ్రామంలో రాళ్లతో నిర్మించిన స్తూపాల ముందు జూలై 28 నాడు గ్రామ ప్రజలంతా సమావేశమై రెండు నిమిషాల పాటు మౌనం పాటించి అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. మొత్తం ఏరియాలో 10 చోట్ల పెద్ద సభలు జరిగాయి. వీటిలో మొత్తం 27 వేల మంది ప్రజలు పాల్గొన్నారు.

మిర్తుల్ ఏరియాలో జరిగిన ఒక సభలో 8 వేల మంది ప్రజలు పాల్గొన్నారు. ఈ సభలో డీఏకేఎంఎస్ రేంజ్ కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ కా. రాందాస్, కా. రాజు, కా. స్వరూపలు ప్రజల కోసం అమూల్యమైన ప్రాణాలను ఇచ్చి తమ రక్తంతో మన ఎర్రజెండాను ఎరుపెక్కించారని అన్నాడు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెలలో సీఆర్‌పీ బలగాలు కా. బుద్రి, కా. చైతులను చంపారని అంటూ రేపు మనపైన మరింత తీవ్ర స్థాయిలో నిర్బంధం అమలు కానుందనీ, దాన్ని ఎదిరించడానికి మనమంతా సిద్ధంగా ఉండాలనీ ప్రజలకు పిలుపునిచ్చాడు.

కా. పీసో మాట్లాడుతూ రానున్న కాలంలో పాలకవర్గాలు ప్రత్యేకించి మహిళలపై మరింత తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించనున్నాయనడానికి కా. బుద్రి హత్య ఒక సూచిక అని అంది. మహిళా సంఘం నాయకత్వంలో మహిళలంతా సంఘటితమై పోలీసు అత్యాచారాలను ఎదిరించడానికి సిద్ధం కావాలని ఆమె మహిళలకు పిలుపునిచ్చింది. సంఘటిత ప్రతిఘటన ద్వారా పాలకవర్గాల పాశవిక దాడిని ఓడించి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయడమే అమరులకు మనమిచ్చే నిజమైన నివాళి అని కా. పీసో మాట్లాడింది.

మిగతా చోట్ల జరిగిన సభల్లో కూడా ఇదే విధంగా డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ నాయకులు ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఈ సభలలో "అమరవీరులకు జోహార్లు", "అమరవీరుల ఆశయాలను కొనసాగిద్దాం" అనే నినాదాలు మారుమోగాయి. స్థానిక, ఏరియా సీఎన్ఎం దళాలు తమ ప్రదర్శనలతో ప్రజలను అలరించారు.

ఇదే సమయంలో గ్రామ, ఏరియా మిలిషియా యూనిట్లు సభలు జరిగే చోట్లకు వచ్చే అన్నీ దారులలోనూ మాటు గాచాయి. ఈ సభలను భగ్నం చేయడానికి శత్రువు చేసే ఎలాంటి ప్రయత్నాన్నైనా తిప్పికొట్టడానికి గాను అవి పూర్తి అప్రమత్తంగా పని చేశాయి. ఆ విధంగా ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో పీజీఏ పునాది బలగాలైన ప్రజా మిలిషియా యూనిట్లు సమర్థవంతంగా పని చేశాయి. ★

## పిలుపు

# ఎస్సార్ కంపనీని తరిమికొడదాం ! బస్తర్ సంపదలను కాపాడుకుందాం !!

*బైలాడిల్లా ఇనుప గనుల నుండి ఇనుప చూర్ణాన్ని పైపుల ద్వారా విశాఖపట్టణం వరకు పంపించే ప్రాజెక్టు ఎస్సార్ కంపనీ చేపట్టింది. 500 కిలోమీటర్ల పొడవైన ఈ పైపు మార్గం కోసం దాదాపు 12 మీటర్ల వెడల్పుతో అడవుల్ని నాశనం చేస్తున్నారు. అధికారికంగా 12 మీటర్లని చెబుతున్నప్పటికీ ఎస్సార్ కంపెనీ అటవీ శాఖ అధికార్లతో కుమ్మక్కై విచ్చలవిడిగా ఒక్కో చోట 50 మీటర్ల వెడల్పు అడవిని కూడా నాశనం చేస్తున్నది. కిరందుల్, కువకొండ, నకుల్‌నార్, దంతేవాడ, సుక్మ ప్రాంతాలలోని భాజపా, కాంగ్రెస్ పార్టీలకు చెందిన జనపద్ సభ్యులూ, సర్పంచ్‌లూ, ఎమ్మెల్యేలూ ఈ కంపెనీ నుండి లంచాలు మేసి పేద ఆదివాసుల భూముల్ని కంపెనీకి అప్పజెపుతున్నారు. నియమాలకు భిన్నంగా ఎక్కువ భూమినీ, అడవినీ నష్టపరుస్తున్నప్పటికీ వీళ్లు నోళ్లు మెదపడం లేదు. అటవీ శాఖ అధికార్లు ఈ పథకం కింద పెద్ద ఎత్తున అక్రమంగా నరికిన కలపను అమ్ముకొని లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. వీళ్లు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతూ రైతులను బెదిరించి వాళ్ల పంటపొలాల్లో కందకాలు తవ్వుతున్నారు. ఈ ప్రాజెక్టు కింద లక్షలాది విలువైన చెట్లు నశించిపోతున్నాయి. పేద ప్రజలు తమ బతుకుదెరువు కోసం ఒక చెట్టు కొట్టినా, పొలం చేసినా కేసులు పెట్టే అటవీ శాఖ ఇప్పుడు లక్షల చెట్లను అక్రమంగా నరుకుతున్నప్పటికీ నిమ్మకు నీరెత్తినట్టుగా ఉండిపోయింది.*

*నీటి వత్తిడి ద్వారా ఇనుప చూర్ణాన్ని పంపించే ఈ పథకం కోసం బైలాడిల్లా పక్కన ప్రవహించే శంఖిని, డంకిని నదుల నీటిని పెద్ద మొత్తంలో ఉపయోగిస్తారు. దీనితో ఇప్పటికే నీటి ఎద్దడి సమస్యతో సతమతమవుతున్న బస్తర్ ప్రజలు మరింత పెద్ద సంకటాన్ని ఎదుర్కోనున్నారు. బైలాడిల్లా గనుల నుండి వెలువడుతున్న కాలుష్యంతో ఇప్పటికే ఈ నదుల నీరు తాగడానికి పనికి రాకుండా పోయింది. ఇక ఇప్పుడు ఆ మాత్రం కూడా లేకుండా నదులు వట్టిపోయే ప్రమాదం ఉంది. బస్తర్ జల సంపదలనూ, వన సంపదలనూ, ఖనిజ సంపదలనూ నాశనం కాకుండా, బహుళజాతి కంపెనీల పరం కాకుండా కాపాడుకోవల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంత ప్రజలంతా సమైక్యమై ఈ ప్రాజెక్టును ప్రతిఘటించాల్సిన అవసరం ఉంది. విద్యార్థులూ, మేధావులూ, కార్మికులూ, పర్యావరణవాదులూ ఈ సమస్య తీవ్రతను గుర్తించి విశాల ప్రాతిపదికపై ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని నడపాల్సిన అవసరం ఉంది. సీపీఐ పార్టీ నాయకులు ఈ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ పత్రికా ప్రకటనలు జారీ చేశారు. కేవలం పత్రికా ప్రకటనల వరకే పరిమితం కాకుండా వాస్తవిక కార్యాచరణకు దిగి ఈ ప్రాజెక్టును అడ్డుకోవడానికి ముందుకు రావల్సిన అవసరం ఉంది. భిన్న రాజకీయ దృక్పథాలు కలవాళ్లైనప్పటికీ ఈ సమస్యపై కల్సిరావల్సిందిగా మేం అన్ని సెక్షన్ల ప్రజలనూ, అన్ని సంఘాల వాళ్లనూ, అన్ని పార్టీల వాళ్లనూ కోరుతున్నాం.*

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

మండుతున్న మణిపూర్

# సాయుధ బలగాలకు విచ్చలవిడి అధికారాలిచ్చే నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పెల్లుబికిన ప్రజా ఉద్యమం


గత జూలై 15 నుండి మణిపూర్ భగ్గున మండుతోంది. ప్రభుత్వ సాయుధ బలగాలకు విచ్చలవిడి అధికారాలిచ్చే నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మొదలైన ఉద్యమం ఇప్పటికి రెండు నెలలు గడచినప్పటికీ, రోజురోజుకూ మరింత ఉధృత రూపం దాలుస్తూ ఇంఫాల్ నగరంతో పాటు మణిపూర్ మూలమూలకూ వ్యాపిస్తోంది. వీధులూ, మెయిన్ రోడ్లూ, పాఠశాలలూ, కాలేజీలూ, యూనివర్సిటీలూ రణరంగాలుగా మారాయి. ప్రతి రోజూ నిరసన ప్రదర్శనలు, బంద్‌లు చోటు చేసుకుంటున్నాయి. వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. పోలీసు కాల్పుల్నీ, రబ్బర్ బులెట్లనూ, లాఠీచార్జీనీ, టియర్‌గ్యాస్ షెల్స్‌నూ, అరెస్టులనూ, నిర్బంధాలనూ లెక్క చేయకుండా మణిపూర్ ప్రజలు సంఘటితంగా, సమరశీలంగా ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ప్రస్తుత 'సమైక్య ప్రగతిశీల కూటమి' ఎంత అభివృద్ధినిరోధకమైందో, అది చెప్పుకుంటున్న ప్రజాస్వామ్యం ఎంత బూటకమైందో ఈ ఉద్యమం పట్ల అది అనుసరిస్తున్న వైఖరే స్పష్టం చేస్తున్నది. మణిపూర్ ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా భారతదేశంలో మణిపూర్‌ను విలీనం చేసుకున్న తర్వాత ప్రభుత్వం తమపై హత్యలకూ, అత్యాచారాలకూ పాల్పడం తప్ప వేరే మేలు చేసిందేమీ లేదని అక్కడి ప్రజలు బలంగా అభిప్రాయపడుతున్నారు. అందుకే సహజంగానే మణిపూర్ ప్రజలు భారత ప్రభుత్వాన్ని ఒక విదేశీ శక్తిగానే పరిగణిస్తున్నారు. అక్కడ పలు దశాబ్దాలుగా మిలిటెంట్ సంస్థలు సాగిస్తున్న ఉద్యమాలను అణచివేసే పేరిట కేంద్ర ప్రభుత్వం రుద్దిన నల్లచట్టాల మూలంగా లెక్కలేనంత మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఎందరో మహిళలు సామూహిక అత్యాచారాలకు గురయ్యారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం మారినప్పటికీ మణిపూర్‌లోనూ, తదితర ఈశాన్య ప్రాంత రాష్ట్రాలలోనూ ప్రజలపై అణచివేతలో మాత్రం మార్పు లేదు. ఒక వైపు తీవ్రవాద సంస్థలతో శాంతి చర్చలు జరిపి వాటిని ప్రధాన స్రవంతిలోకి తెస్తామని చెప్పుకుంటున్న ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై విచ్చలవిడి హింసకూ, అత్యాచారాలకూ పాల్పడుతున్న సాయుధ బలగాలను ఎందుకు శిక్షించడం లేదో, వాటికి లెక్కలేనన్ని అధికారాలిచ్చే క్రూర చట్టాలను రద్దు చేయాలన్న ప్రజల అత్యంత ప్రజాస్వామికమైన డిమాండును నెరవేర్చడంలో మొండి వైఖరి అనుసరించడానికి కారణాలేమిటో పరిశీలించాల్సి ఉంది.

## అగ్గి రాజుకున్న తీరు

జూలై 11న థాంగ్‌జం మనోరమాదేవి అనే 32 ఏళ్ల మణిపూరీ మహిళను అస్సాం రైఫిల్స్ జవాన్లు ఆమె ఇంటిపై దాడి చేసి అరెస్టు చేశారు. కొద్ది గంటల తర్వాత తూటాలతో జల్లెడగా మారిన ఆమె మృతదేహం నాలుగు కిలోమీటర్ల ఆవల ఒక కొండ ప్రాంతంలో లభించింది. ఆమెను విచారణ అనంతరం వ్యాన్‌లో తీసుకెళ్తుండగా కిందికి దూకి తప్పించుకోవడానికి ప్రయత్నించగా జరిపిన కాల్పుల్లో చనిపోయిందని అస్సాం రైఫిల్స్ ప్రకటించారు. అటు అస్సాం నుండి ఆంధ్రప్రదేశ్ దాకా, ఇటు కాశ్మీర్ నుండి దండకారణ్యం దాకా ఇలాంటి కట్టుకథలు ఎన్ని సార్లు పునరావృతమయ్యాయో! శవంపై ఉన్న గుర్తులను బట్టి ఆమెపై ముందుగా సామూహిక అత్యాచారం జరిపి, తీవ్ర హింసలకు గురి చేసి ఆ తర్వాత దారుణంగా హతమార్చారని స్పష్టమైంది. మనోరమపై ఈ దారుణానికి పాల్పడ్డ జవాన్లను శిక్షించే దాకా, సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని వెనక్కి తీసుకునే దాకా శవాన్ని తీసుకోమని మనోరమ తల్లిదండ్రులు ప్రకటించారు. దాంతో శవాన్ని ఒక ఆసుపత్రిలోని మార్చురీలోనే ఉంచారు. అయితే రెండో సారి పోస్ట్‌మార్టం జరిపిన తర్వాత ప్రభుత్వమే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ మనోరమ అంత్యక్రియలు జరిపించింది.

దీనికి నిరసనగా జూలై 15న మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో అస్సాం రైఫిల్స్ హెడ్‌క్వార్టర్స్ ఎదుట 12 మంది మహిళలు తమ బట్టలు విప్పి ప్రదర్శన జరిపారు. వాళ్లు "భారతీయ సైనికులారా! మమ్మల్ని బలాత్కరించండి, చంపండి!" అని రాసి ఉన్న బ్యానర్లనూ, పోస్టర్లను పట్టుకొన్నారు. దాదాపు 50-60 ఏళ్ల వయసున్న ఈ మహిళలు "మా కళ్ల ఎదుటే మా కూతుళ్లపై అత్యాచారాలు జరుపుతుంటే, ఇక మేం బట్టలు కట్టుకోవడం దేనికి? మమ్మల్ని కూడా బలాత్కరించమని కోరుతూ బట్టలు విప్పేశాం" అని అన్నారంటే వాళ్ల వేదననూ, ఆక్రోశాన్నీ అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రదర్శనకు నాయకత్వం వహించిన అఖిల మణిపూర్ మహిళా సంఘం కార్యదర్శి రమణీ దేవి మాట్లాడుతూ మణిపూర్‌లో ఇప్పటి దాకా జరిగిన చట్ట వ్యతిరేక హత్యలపైనా, మహిళలపై జరిగిన అత్యాచారాల పైనా మేం నిరసన తెలుపుతూ వస్తున్నప్పటికీ దాన్ని పట్టించుకునే నాథులే లేకుండా పోయారనీ, అందువల్లనే ఇలాంటి తీవ్ర చర్యకు పూనుకోవాల్సి వచ్చిందనీ అన్నది. ఈ ఘటనతో మణిపూర్ అంతటా ప్రజల కోపం కట్టలు తెంచుకుంది. నిరసన ప్రదర్శనలు అనేక ప్రాంతాలకు విస్తరించాయి. సాయుధ సైన్యాలకు విచ్చలవిడి అధికారాలిచ్చే సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాల) చట్టాన్ని [ఆర్మ్‌డ్ ఫోర్సెస్ (స్పెషల్ పవర్స్) యాక్ట్ – ఏఎఫ్ఎస్‌పీఏ] రద్దు చేయాలన్న డిమాండ్ బాగా ఊపందుకుంది.

32 సామాజిక సంస్థల భాగస్వామ్యంతో ఏర్పాటైన 'అపున్‌బా లుప్' అనే సంస్థ ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నది. ప్రదర్శనలతో, ఊరేగింపులతో మొదలైన ఉద్యమం శాసన ధిక్కార ఉద్యమంగా రూపుదాల్చింది. జూలై 29న 'అపున్‌బా లుప్' నిర్వహించిన విశాల ప్రజా ప్రదర్శనలో ముగ్గురు మాజీ ముఖ్యమంత్రులతో సహా విభిన్న పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఆగస్టు 15న 'స్వాతంత్ర్య' దినం నాడు పేబం చిత్తరంజన్ అనే విద్యార్థి నాయకుడు తన ఒంటికి నిప్పంటించుకొని ఆత్మత్యాగం చేయడంతో ఈ ఉద్యమం మరింత ఉగ్రరూపం దాల్చింది. పేబం చిత్తరంజన్ మణిపురీ విద్యార్థి సమాఖ్య బిషెన్‌పూర్ యూనిట్ సలహాదారు. అంతకు మునుపు ఐదుగురు యువకులు ముఖ్యమంత్రి నివాసం ఎదుట నిప్పంటించుకొని ఆత్మాహుతి చేసుకోవడానికి ప్రయత్నించారు. పోలీసు బలగాలు అతి కష్టంగా మంటల్ని ఆర్పేయడంతో వాళ్లు బతికారు. జూలై 26న దినేశ్ అనే 28 సంవత్సరాల యువకుడు ఇంఫాల్ నగరం నడిబొడ్డున కత్తితో తన్ను తాను పొడుచుకొని ఆత్మహత్యకు




"హత్యలను ఆపండి! జీవించే హక్కును గౌరవించండి!" అంటున్న మణిపూర్ వాసులు

ప్రయత్నించాడు. ఈ ఘటనతో రెచ్చిపోయిన మణిపూర్ విశ్వవిద్యాలయ విద్యార్థులు ఒక బస్సుతో సహా రాజభవన్‌లోకి చొరబడాలని ప్రయత్నించారు. ఈ సందర్భంగా భద్రతా బలగాలతో జరిగిన ఘర్షణలో 22 మంది విద్యార్థులు గాయపడ్డారు. ఈ సంఘటనలతో కలవరం చెందిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి ఓక్రం ఇబోబి సింగ్ రెండు సార్లు ఢిల్లీ వెళ్లాడు. ఈ సమస్యను సరిగా పరిష్కరించకపోయినట్టయితే ఉద్యమకారులు తమ దాడుల్ని ప్రభుత్వ భవనాల పైనా, మంత్రుల పైనా ఎక్కుపెడతారని అతడి భయం. పరిస్థితిని శాంతింపజేయడానికి 20 చదరపు కిలోమీటర్ల పరిధి కల్గిన ఇంఫాల్ మునిసిపల్ ప్రాంతాన్ని ఏఎఫ్ఎస్‌పీఏ నుండి మినహాయిస్తామని ప్రకటించాడు. ఇది మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ప్రాంతం. కానీ కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వ అభీష్టానికి విరుద్ధంగా తీసుకున్న ఈ నిర్ణయం కూడా ప్రజల్ని శాంతపర్చలేకపోయింది. అపున్‌బా లుప్ ఈ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. మణిపూర్ అంతటి నుండీ ఈ నల్ల చట్టాన్ని పూర్తిగా ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాన్ని తీవ్రతరం చేసింది. ప్రజలను శాంతింప జేయడం కోసం కేంద్ర హోంమంత్రి శివరాజ్ పాటిల్ అస్సాం రైఫిల్స్‌ను వెనక్కి తీసుకొని దాని స్థానంలో బీఎస్ఎఫ్‌ను పంపిస్తామని ప్రకటించాల్సి వచ్చింది. అయినా ప్రజలు తమ డిమాండ్ నుండి కొంచెం కూడా వెనక్కి తగ్గలేదు.

రాష్ట్ర ప్రభుత్వం జాతీయ భద్రతా చట్టం కింద ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న 30 మంది నాయకులను అరెస్టు చేసింది. వీరిలో అస్సాం రైఫిల్స్ తిష్ట వేసి ఉన్న కాంగ్లా కోట ఎదుట బట్టలు లేకుండా ప్రదర్శన జరిపిన ఐదుగురు మహిళలు కూడా ఉన్నారు. అయినా ఉద్యమం కొనసాగుతూనే ఉంది.

ఈలోగా మణిపూర్‌లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ నాయకత్వంలోని లౌకిక ప్రగతిశీల కూటమి ప్రభుత్వంలోని ఇద్దరు మంత్రులతో పాటు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తాము రాజీనామా చేస్తామని ముఖ్యమంత్రి ఇబోబి సింగ్‌ను హెచ్చరించారు. ప్రజా ఉద్యమ తీవ్రతను గమనించే, ముఖ్యంగా పాత చేదు అనుభవాలతోనే వీళ్లు ఈ సాహసం చేశారని అర్థం చేసుకోవచ్చు. అయితే ఒకవైపు ఈ చట్టాన్ని వెనక్కి తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం కచ్చితంగా నిరాకరిస్తుండడం, మరోవైపు తన స్వంత మంత్రివర్గంలో రాజీనామాల బెదిరింపులు వస్తుండడంతో దిక్కుతోచని ముఖ్యమంత్రి ఇబోబి సింగ్ ఆగస్టు 15 నాడు మాట్లాడుతూ రాష్ట్రంలో కిడ్నాప్‌లు, బెదిరించి డబ్బు వసూలు చేయడం వంటి అన్ని రకాల చర్యలు పూర్తిగా నిలిచిపోయి శాంతి నెలకొన్న తర్వాతనే ఈ చట్టాన్ని ఉపసంహరించుకుంటామని వాగ్దానం చేశాడు. కానీ ఈ ప్రకటనతో ప్రజలకు పుండుపై కారం జల్లినట్లైంది. ఆందోళనాకారులు ఒక బస్సుకు నిప్పంటించి రాజధానిలో చాలా చోట్ల రోడ్లపై అడ్డంకులు కల్పించి దీనికి నిరసన తెలిపారు.

## నల్ల చట్టాల పడగనీడలో


బ్రిటిష్ వలసవాదుల నుండి అధికార పగ్గాలు చేపట్టిన భారత దళారీ బూర్జువా, భూస్వామ్య పాలకవర్గాలు నల్ల చట్టాలనూ, 'విభజించు-పాలించు' అనే కుటిల నీతినీ వారసత్వంగా స్వీకరించాయి. 1958లో భారత పార్లమెంటు ఆమోదించిన ఈ సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాలు) చట్టానికి (ఏఎఫ్ఎస్‌పీఏ) తల్లి వేర్లు 1942లో బ్రిటిష్ వైస్‌రాయ్ లిన్‌లిథ్‌గో ప్రవేశపెట్టిన సాయుధ బలగాల (ప్రత్యేక అధికారాలు) బిల్లులో ఉన్నాయి. పదజాలంలో కొద్ది మార్పులు మినహా అప్పటి బ్రిటిష్ చట్టాన్నే భారత పాలకవర్గాలు కొనసాగిస్తున్నాయని చెప్పుకోవచ్చు. ఏఎఫ్ఎస్‌పీఏ, 1958 ప్రకారం నాన్-కమిషన్డ్ అధికారి కూడా ఎవరినైనా అనుమానంతో వారంటు లేకుండానే అరెస్టు చేయవచ్చు, ఎన్ని రోజులైనా నిర్బంధంలో ఉంచుకోవచ్చు, ఎలాంటి వారంటు లేకుండానే ఇండ్లలో జొరబడి సోదా చేయవచ్చు, వ్యక్తులను నిర్బంధంలోకి తీసుకోవచ్చు, ఏదైనా ఇంట్లో ఆయుధాలు లేదా మందుగుండు నిల్వలున్నాయన్న అనుమానంతో ఆ ఇంటిని ధ్వంసం చేయొచ్చు, ఆయుధాలు కలిగి ఉన్నారన్న సందేహంతో వ్యక్తులను కాల్చి చంపవచ్చు కూడా. ఇకపోతే, కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా సైన్య బలగాలకు చెందిన వ్యక్తులపై ఎవరూ కూడా కేసు మోపడం గానీ, విచారించడం గానీ, మరే ఇతర చట్టపరమైన చర్య తీసుకోవడం గానీ చేయలేరు. ఇదీ ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యమని చెప్పుకునే మన దేశంలో అమలవుతున్న చట్టం!

ఈ చట్టాన్ని 1980 నుండి మణిపూర్ అంతటా అమలయ్యేలా వర్తింపజేశారు. ఈ చట్టాన్ని ఎత్తివేయాలన్న డిమాండ్ కూడా ఇప్పటిదేమీ కాదు. అనేక సంవత్సరాలుగా ఈశాన్య ప్రాంత ప్రజలు ఈ అప్రజాస్వామికమైన క్రూర చట్టాన్ని ఎత్తివేయాలని కోరుతూ వస్తున్నారు. షర్మీలా అనే 33 ఏళ్ల మణిపూరీ మహిళ ఈ చట్టాన్ని ఎత్తేసే దాకా ఆహారం తీసుకోనంటూ నవంబర్ 4, 2000 నుండి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నది. అప్పట్లో భద్రతా బలగాలు ఒక ప్రతీకార చర్యలో 10 మంది ప్రజలను కాల్చి చంపిన దరిమిలా ఆమె తన నిరాహార దీక్షను ప్రారంభించింది. ఆమెను ఇంఫాల్‌లోని ఒక ప్రభుత్వాసుపత్రిలో నిర్బంధించి బలవంతంగా ముక్కులో పైపు పెట్టి ద్రవ పదార్థాలను ఎక్కిస్తున్నారు. ముఖ్యమంత్రి ఆమెను కలిసి, ఇంఫాల్ మునిసిపల్ ప్రాంతం నుండి ఈ చట్టాన్ని ఎత్తేసామని చెప్పి, దీక్షను విరమించాల్సిందిగా కోరగా ఆమె మొత్తం మణిపూర్ నుండి ఈ చట్టాన్ని పూర్తిగా ఎత్తేసే దాకా తన నిరాహార దీక్ష కొనసాగుతుందని దృఢంగా ప్రకటించింది. ఈ చట్టాన్ని ఎత్తేయాలనే డిమాండ్‌తో పాటు అస్సాం రైఫిల్స్ కాంగ్లా కోటను ఖాళీ చేయాలని కూడా మణిపూరీలు ఎప్పటి నుండో డిమాండ్ చేస్తున్నారు. ఇంఫాల్ నగరం మధ్యలో ఉన్న ఈ కోటను అక్కడి ప్రజలు తమ చారిత్రక వారసత్వ సంపదగా భావిస్తారు.

మనోరమ హత్య మణిపూర్ ప్రజలను ఎంతగా కదిలించిందో ఈ హత్య పట్ల సాయుధ బలగాలు, వాటి అధికార్లు అనుసరించిన వైఖరి వాళ్లను అంతగా రెచ్చిపోయేలా చేసింది. ఈ అత్యాచారం/హత్య ఉదంతంపై

ఇబోబి సింగ్ ప్రభుత్వం సీ. ఉపేంద్ర న్యాయవిచారణ కమిషన్‌ను నియమించింది. అయితే అస్సాం రైఫిల్స్ ఈ కమిషన్‌తో సహకరించడానికి నిరాకరించారు. తమ జవాన్లను న్యాయవిచారణకు కమిషన్ ముందు హాజరుకమ్మని ఇచ్చిన ఆదేశంపై గువాహటి హైకోర్టు నుండి తాత్కాలిక స్టే తెచ్చుకున్నారు. మనోరమపై అత్యాచారం జరిపి హత్య చేశారని ఆరోపణనెదుర్కొంటున్న కల్నల్ జగ్‌మోహన్, నాయక్ సూబేదార్ దిగంబర్ దత్తా, రైఫిల్‌మెన్ సురేష్‌కుమార్, అజిత్ సింహ్, టీ. లోథాలు భద్రతా కారణాల రీత్యా తాము కమిషన్ ఎదుట హాజరు కాలేమని తెలిపారు. అస్సాం రైఫిల్స్ విడిది చేసిన కాంగ్లా ఫోర్టుకు కూతవేటు దూరం కూడా లేని విచారణ కమిషన్ కార్యాలయానికి రావడానికి భద్రతా కారణాలతో సంకోచిస్తున్న జవాన్లు తీవ్రవాదులతో ఎలా ధైర్యంగా పోరాడగలరో, రాష్ట్ర ప్రజలకు ఎలా రక్షణ కల్పించగలరో నాకర్థం కావడం లేదని ఉపేంద్ర వాపోయాడు. ఈలోగా తమ పరిధిలోకి రాని వ్యక్తులను విచారించ బూనుకునే హక్కు కమిషన్‌కు లేదని హైకోర్టు రూలింగ్ ఇచ్చింది. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా సాయుధ బలగాలకు చెందిన వ్యక్తులపై ఎలాంటి విచారణ జరిపే హక్కు ఎవరికీ లేదని ఏఎఫ్ఎస్‌పీఏలో స్పష్టంగా పేర్కొన్నారు కనుక. కేంద్ర హోం శాఖ నుండీ, రక్షణ శాఖ నుండీ అనుమతి తీసుకొనే అస్సాం రైఫిల్స్ హైకోర్టుకు వెళ్లి ఉంటారన్నది తేలిగ్గానే అంచనా వేయవచ్చు. అస్సాం రైఫిల్స్ సహకరించకపోవడంతో ఈ కమిషన్ రద్దయింది.

మొదటి పోస్ట్‌మార్టం రిపోర్టును ఉటంకిస్తూ మనోరమపై అత్యాచారం జరిపి హింసించారన్న ఆరోపణను అస్సాం రైఫిల్స్ జవాన్లు తిరస్కరించారు. తలల్నే మార్చగా లేనిది పోస్ట్‌మార్టం రిపోర్టుల్ని తారుమారు చేయడం భద్రతా బలగాలకు ఓ లెక్కా? మనోరమ తల్లిదండ్రులు ఈ పోస్ట్‌మార్టం రిపోర్టుపై అనుమానాలు వ్యక్తం చేయడంతో ప్రభుత్వం రెండోసారి పోస్ట్‌మార్టం చేయాలని ఆదేశాలిచ్చింది. అయితే రెండో సారి పోస్ట్‌మార్టం జరిపిన డాక్టర్ థమంగ్లెం ఉపేంద్ర కమిషన్‌కు సమర్పించిన నివేదికలో మనోరమ జననావయంపై తీవ్రమైన తూటాల గాయాలు ఉన్నందున ఆమెపై అత్యాచారం జరిపారో లేదో నిర్ధారించడం కష్టమని పేర్కొన్నాడు. అస్సాం రైఫిల్స్ జవాన్లు కావాలనే ఆమెనిలా క్రూరాతిక్రూరంగా హతమార్చారన్నది స్పష్టం. సైన్య అధికార్లూ, ప్రభుత్వం చేస్తున్న మరో ఆరోపణ ఏమిటంటే మనోరమ నిషిద్ధ పీఎల్‌ఏ (ప్రజా విముక్తి సైన్యం) సభ్యురాలు అని. ఆమె పేలుడు పదార్థాల నిపుణురాలు అని కూడా అంటున్నారు. నిషిద్ధ సంస్థల సభ్యులకు పౌరహక్కులు వర్తించవా? వాళ్లను హత్య చేసినా, అత్యాచారానికి బలి చేసినా చెల్లుతుందా? మరి అలాంటప్పుడు 'చట్టం ముందు అందరూ సమానులే' అని చెబుతున్న పాలకులు తమ ముసుగును చించేసుకోవాల్సి ఉంటుంది. మనోరమ ఏ సంస్థ సభ్యురాలు అన్నది అసలు విషయమే కాదు. ఆమెపై ఇలాంటి ఘాతుక చర్యకు పూనుకునే హక్కు భద్రతా బలగాలకు ఎవరిచ్చారన్నదే అసలు ప్రశ్న.


నల్లచట్టాలను రద్దు చేసే దాకా మా పోరు ఆగదంటున్న "కాగడాధారి మహిళలు"

## తుపాకులతో మనుషుల్ని చంపగలరు కానీ మనసుల్ని గెల్చుకోలేరు!

భారత ప్రభుత్వం తుపాకీ సన్నీలతో అంతా అదుపు చేయగలనని భ్రమ పడుతున్నది. యూపీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక లౌకికవాదిగా, ప్రజాస్వామికవాదిగా పోజు కొడుతూ పోటా చట్టాన్ని రద్దు చేస్తానని హామీ ఇచ్చింది. ఒకవైపు పోటాను రద్దు చేస్తానంటూనే మరోవైపు అలాంటిదే మరో క్రూర చట్టాన్ని రద్దు చేయాలనే మణిపూర్ ప్రజల డిమాండును పెడచెవిన బెట్టడం దాని రెండు నాల్కల ధోరణికి నిదర్శనం. గతంలో పాలించిన బీజేపీకీ, ఇప్పటి కాంగ్రెస్‌కూ మాటల్లోనే తప్ప అణచివేత విధానాల్లో మౌలికమైన తేడా ఏమీ లేదన్న విషయం ఈ సందర్భంగా మరింత స్పష్టమైంది. ఒక స్వతంత్ర రాజ్యంగా దాదాపు రెండు వేల ఏళ్ల చరిత్రను కలిగి ఉన్న మణిపూర్‌ను ఈ దుస్థితికి తెచ్చినందుకు ప్రజల్లో భారత ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత గూడు కట్టుకొని ఉంది. 1891లో బ్రిటిష్ ప్రభుత్వం ఆక్రమించుకోవడంతో ఒక స్వతంత్ర రాజ్యంగా మణిపూర్ తన ఉనికిని కోల్పోయింది. అప్పటి నుండీ మణిపూర్ చరిత్ర అంతా పరాయి పాలకుల చేతిలో అవమానాలకూ, హింసకూ, అత్యాచారాలకూ, హత్యాకాండలకూ గురవుతూ వస్తున్న చరిత్రే. భారత దేశానికి బూటకపు స్వాతంత్ర్యం కూడా రాకముందే, 1947 మార్చ్ నాటికే లిఖిత రాజ్యాంగం ఉందన్న విషయాన్ని ఎవరు మర్చిపోయినా మణిపూరీయులు మాత్రం మర్చిపోలేరు. గొప్ప చరిత్రనూ, నాగరికతనూ, సంస్కృతినీ కల్గిన మణిపూర్‌ను భారత విస్తరణవాద పాలకులు సెప్టెంబర్ 1, 1949న భారత యూనియన్‌లో కలిపేసుకున్నారు. ఈ ప్రక్రియ ఎంత అప్రజాస్వామికంగా, ఏకపక్షంగా జరిగిందంటే అక్కడ ప్రజాభిప్రాయాన్ని సేకరించి వాళ్ల ఆమోదం పొందడం లాంటి పద్ధతి ఏదీ అనుసరించలేదు. దీనికి కాస్త ముందూ వెనకగా ఈశాన్య ప్రాంత రాజ్యాలన్నిటినీ భారత పాలకులు దాదాపు ఇదే పద్ధతిలో కలిపేసుకున్నారు. నేడు మణిపూర్‌లో గానీ, ఇతర ఈశాన్య రాష్ట్రాలలో గానీ జాతీయ విముక్తి ఉద్యమాలు ప్రజ్వరిల్లడానికి అసలు మూలాలు ఇక్కడే ఉన్నాయి. దీనినే ప్రభుత్వం వేర్పాటువాదమనీ, ఉగ్రవాదమనీ అభివర్ణిస్తూ తన మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నది. ఈ ప్రచార తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే చరిత్ర లోతుల్లోకి వెళ్లే చొరవ చేయని సాధారణ మధ్యతరగతి ప్రజలు, స్వాతంత్ర్యం కావాలని వివిధ జాతులు చేస్తున్న పోరాటాలన్నిటినీ వేర్పాటువాద ఉద్యమాలుగానే, భారత జాతీయ సమైక్యతకు విఘాతం కలిగించే ఉగ్రవాద ఉద్యమాలుగానే భావిస్తుంటారు.

ఈ ఉద్యమాలను అణచివేయడానికి పాలకవర్గాలు నల్ల చట్టాలను ఆశ్రయించి క్రూర నిర్బంధ విధానాలకు పూనుకున్నాయి. వేల సంఖ్యలో భద్రతా బలగాలను మోహరించి వాటికి విచ్చలవిడి అధికారాలిచ్చాయి. భద్రతా బలగాలు సాధారణ ప్రజలపైన తమ పశు బలాన్ని ప్రయోగిస్తూ విచ్చలవిడి హింసాత్మక చర్యలకు పాల్పడుతున్నాయి. ఈశాన్య ప్రాంతంలో సాగుతున్న ఉగ్రవాద ఉద్యమాలను అణచివేయడానికే ఏఎఫ్ఎస్‌పీఏ, కల్లోలిత ప్రాంత చట్టం లాంటి నల్ల చట్టాలను అమలు చేయాల్సి వచ్చిందని

ప్రభుత్వం ఎంత చెప్పినప్పటికీ, ఈ చట్టం అమలులో ఉన్నప్పటికీ గడచిన పాతికేళ్లలో పలు మిలిటెంట్ సంస్థలు బలపడ్డాయే తప్ప రూపుమాసి పోలేదన్నది కఠోర వాస్తవం. ఈ నల్ల చట్టాలు ప్రధానంగా ఇక్కడ సాగుతున్న ఉద్యమాల పట్ల సానుభూతిని కలిగి ఉన్న వాళ్లను అణచివేయడానికే ఉపయోగపడుతున్నాయి. అంతకంటే ముఖ్యంగా ఈ చట్టం మాటున భద్రతా బలగాలు మిలిటెంట్ సంస్థలతో ఎలాంటి సంబంధం లేని సాధారణ ప్రజలను హత్య చేయడం, అత్యాచారాలు జరపడం నిత్యకృత్యమయ్యింది.

## రాజీ లేని పోరు

నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న మణిపూరీ ప్రజలు దేశ ప్రజలందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. సమరశీలతకు పేరు గాంచిన మణిపూరీయులు గతంలో, జూన్ 2001లో కేంద్ర ప్రభుత్వానికీ, నాగా పోరాట సంస్థలతో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా కాల్పుల విరమణ అమలయ్యే ప్రాంతాన్ని మణిపూర్‌లోని కొన్ని ప్రాంతాలకు విస్తరించడానికి వ్యతిరేకంగా సాగించిన బ్రహ్మాండమైన ఉద్యమం కూడా చారిత్రాత్మకమైంది. ఆ ఉద్యమం సందర్భంగా అనేక మంది తమ ప్రాణాలర్పించారు. రాష్ట్ర అసెంబ్లీనీ, అనేక మంది మంత్రుల ఇళ్లనూ దగ్ధం చేసి మణిపూరీయులు సమరశీల పోరాటాలకు కొత్త నిర్వచనం చెప్పారు. ఈసారి కూడా దాదాపు అదే తీవ్రతతో ఉద్యమం కొనసాగుతున్నది. అందుకే పాలకులు హడలెత్తిపోతున్నారు. ఒకవైపు ఈ ఉద్యమాన్ని నీరు గార్చడానికి కుటిల ఎత్తుగడలకు పాల్పడుతూనే మరోవైపు కొన్ని రాయితీలు ప్రకటించి ఉద్యమాన్ని విరమింపజేయాలని ప్రయత్నిస్తున్నారు.

బ్రిటిష్ వాడి 'విభజించు-పాలించు' కుటిల నీతిని నిండా ఒంట బట్టించుకున్న అస్సాం రైఫిల్స్ అధికార్లు సేనాపతి జిల్లాలోని కొండ ప్రాంతాలలో నివసించే నాగా జాతి ప్రజలతో ఆగస్టు 21న బలవంతంగా ర్యాలీ తీయించారు. ఈ ర్యాలీలో ప్రజలు "అస్సాం రైఫిల్స్ కొండ ప్రాంత ప్రజల స్నేహితులు", "అస్సాం రైఫిల్స్ జవానులారా! మా ప్రాణాలనూ, ఆత్మలనూ కాపాడండి" వంటి నినాదాలు రాసిన ప్లాకార్డులు ప్రదర్శించారు. కానీ ఆ తర్వాత, తమపై భద్రతా బలగాలు వత్తిడి తెచ్చి బలవంతంగా ఇలా ర్యాలీ తీయించారని నాగా ప్రజలు ప్రకటన చేయడంతో ఈ పన్నాగం బెడిసికొట్టింది. కొండ ప్రాంత ప్రజలైన నాగాలకూ, ఇంఫాల్ లోయ ప్రాంత వాసులైన మైతేలకూ మధ్య కలహాలు సృష్టించి తద్వారా ఈ ఉద్యమాన్ని నీరు గార్చాలన్న పాలకుల దారుణమైన కుట్ర ఈ విధంగా విఫలమైంది. మణిపూర్‌లో అధిక సంఖ్యాకులైన మైతే (65%) జాతి ప్రజలతో పాటు నాగాలు, కుకీలు, జెలియంగ్రాంగ్ జాతులు/తెగల ప్రజలు ఏఎఫ్ఎస్‌పిఏను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సమైక్యంగా పోరాడుతున్నారు.

మణిపూర్ ప్రజల సమరశీల ఉద్యమంలో మహిళల పాత్ర చెప్పుకోదగ్గది. ప్రదర్శనలలో, ర్యాలీలలో, అన్ని రకాల పోరాటాలలో మహిళలు ముందు వరుసలో నిలబడ్డారు. పలు మహిళా సంఘాలు మహిళలకు నాయకత్వం వహిస్తున్నాయి. అందులో ఒకటి 'కాగడాధారి మహిళలు'. ఈ సంఘం నాయకత్వంలో మహిళలు కర్ఫ్యూను ధిక్కరిస్తూ రాత్రి వేళల్లో కాగడాలతో ప్రదర్శనలు జరుపుతున్నారు. అదే విధంగా విద్యార్థుల పాత్రను కూడా ప్రత్యేకంగానే చెప్పుకోవాలి. విద్యార్థులు స్కూళ్లనూ, విశ్వవిద్యాలయాలనూ వదిలేసి పోరాటంలో చేరారు. ఈ చట్టం అమలులో ఉండగా మాకూ, మా అక్కాచెల్లెళ్లకూ రక్షణ లేని పరిస్థితులలో ఈ చదువులెందుకని పుస్తకాల్ని కాలబెట్టారు. ఇంకా అనేక పోరాట రూపాలు ఈ ఉద్యమ క్రమంలో ముందుకొచ్చాయి.

సెప్టెంబర్‌లో కేంద్ర హోం మంత్రి శివరాజ్ పాటిల్ అపున్‌బా లుప్‌తో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. చర్చల పేరుతో తమ ఉద్యమాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తున్నారని ఉద్యమకారులు బాహాటంగానే చెబుతున్నారు. ఆగస్టు 20న అపున్‌బా లుప్ అధికార ప్రతినిధి జగత్ థౌండం కుండబద్దలు కొట్టినట్టుగా ఇలా అన్నాడు, "ఒకే ఒక్క డిమాండ్ మాది... చేంతాడంత లిస్టు మాకేమీ లేదు. ఈ చట్టాన్ని ఎత్తివేయాలి, అంతే. ఇంతకు మించిన మరో డిమాండ్ లేదు, ఇంతకు తక్కువ డిమాండ్ కూడా మాకు లేదు. దీనిపై ఇక చర్చలెందుకు?" మణిపూర్ ప్రజల ఈ న్యాయమైన పోరాటం జయప్రదం కావాలని ఆశిద్దాం. ★

---

*(......... 9వ పేజీ తరువాయి)*

## బీజేపీ విధానాల కొనసాగింపు

ఈ బడ్జెట్‌లో ఇంకా అనేక రూపాల్లో పేద, మధ్య తరగతి వర్గాలపై దాడి చేశారు. పొదుపు మొత్తాలపై, భవిష్య నిధిపై వడ్డీ రేటు అతి తక్కువగా 8% కొనసాగుతుంది. పెన్షన్ పొందుతున్న వాళ్లకు మాత్రం 9% వడ్డీ రేటుతో బాండ్లలో మదుపు చేసుకొనే అవకాశం ఇచ్చారు. ఇది కనీసం సాంవత్సరిక ద్రవ్యోల్బణం రేటు ఖర్చుతో కూడా సరితూగదు (ప్రభుత్వం తిమ్మిని బమ్మి చేస్తూ చూపే లెక్కలు కాకుండా వాస్తవిక లెక్కల ప్రకారం).

పెట్రోలియం సబ్సిడీని దాదాపు సగానికి తగ్గించారు – 6,573 కోట్ల నుండి 3,559 కోట్ల రూపాయలకు. దీని ఫలితంగా వంటగ్యాస్, కిరోసిన్ల ధరలు గత జూన్ 15న పెంచిన దాని కంటే మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. వంటనూనెలపై కస్టమ్స్ సుంకాల్ని పెంచడం వల్ల ఇప్పుడు వంటనూనెల ధరలు భగ్గున మండనున్నాయి.

ఎస్సీ/ఎస్టీల కోసం కేటాయింపుల్ని నిరుటితో సమానంగానే ఉంచారు. అంటే ద్రవ్యోల్బణ రేటును పరిగణనలోకి తీసుకున్న పక్షంలో దీన్ని తగ్గించినట్టు అర్థం. జాతీయ మైనారిటీల అభివృద్ధి, ఆర్థిక కార్పొరేషన్ కోసం చాలా స్వల్పంగా 50 కోట్ల రూపాయల్ని కేటాయించారు.

ఈ బడ్జెట్ గురించి కాకమ్మ కబుర్లు ఎన్ని చెబుతున్నప్పటికీ ఇది వాస్తవానికి పేదలకూ, గ్రామీణ ప్రజలకూ, మధ్య తరగతికీ వ్యతిరేకంగానూ, సంపన్న వర్గాలకు అనుకూలంగానూ సామ్రాజ్యవాదుల ఆదేశాలతో అమలవుతున్న 'ఆర్థిక సంస్కరణల' విధానాల కొనసాగింపే తప్ప మరొకటి కాదు. అందుకే ఈ బడ్జెట్‌ను బడా వ్యాపార వర్గాలు బాహాటంగా పొగడడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. మొదట్లోనే చెప్పినట్టుగా, గత బడ్జెట్లకూ దీనికీ ఒకే ఒక్క తేడా ఏమంటే ఇది మానవ ముఖాన్ని, లేదా మరింత సూటిగా చెప్పుకోవాలనుకుంటే మానవత్వమనే ముసుగును ధరించింది. కాబట్టి ఈ ముసుగును చించేసి చేదు సత్యాల్ని బైట పెట్టడం ఈనాటి కర్తవ్యం.

ఏ పార్లమెంటరీ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ ఆర్థిక సంస్కరణలను అమలు చేయడంలో అందరూ ఒక్కటే. ఏ ఒక్కరూ కూడా తమ సామ్రాజ్యవాద యజమానులకు ఇబ్బంది కలిగించే సాహసం చేయలేరు. విశాలమైన, సమరశీలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమమొక్కటే ఈ దేశద్రోహులు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాలను సమర్థవంతంగా ఎదిరించి ఓడించగలుగుతుంది. తద్వారా దేశపు నామమాత్రమైన సార్వభౌమత్వం నానాటికీ మరింతగా, నిరంతరాయంగా దిగజారిపోవడాన్ని నివారించగలుగుతుంది. ★

# ఆంధ్ర ప్రభుత్వంతో 'శాంతి' చర్చలు ప్రజా 'యుద్ధం'లో భాగమే !

ఆంధ్ర రాష్ట్రంలో గత ఏప్రిల్‌లో ఎన్నికలకు ముందు ప్రముఖంగా ముందుకు వచ్చిన శాంతి చర్చల అంశం ఇప్పుడొక కొలిక్కి వచ్చింది. దేశ ప్రజలు, ముఖ్యంగా ఆంధ్ర ప్రజలు ఈ చర్చల పట్ల ఉత్సుకతతో ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు నాయకత్వంలోని తెదేపా ఫాసిస్టు ప్రభుత్వం పరాజయం పాలైన తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో శాంతి చర్చల ప్రక్రియ మొదలైంది. అయితే చర్చల సమయంలో నక్సలైట్లు ఆయుధాలు ధరించి గ్రామాలలో తిరగకూడదంటూ ప్రభుత్వం ఏకపక్షంగా విధించిన షరతును మన పార్టీ అంగీకరించకపోవడంతో ఈ ప్రక్రియలో చాలా కాలం పాటు ప్రతిష్టంభన నెలకొని చివరకు ప్రభుత్వం వెనక్కి తగ్గడంతో పార్టీతో ప్రత్యక్ష చర్చలకు దారి సుగమమైంది. ఈ నేపథ్యంలో ఈ చర్చలకు దారితీసిన పరిస్థితులనూ, ఈ ప్రక్రియ కొనసాగుతున్న తీరునూ వివరంగా పరిశీలిద్దాం.

## శాంతి చర్చల పూర్వపరాలు

అక్టోబర్ 1, 2003న అలిపిరి వద్ద పీజీఏ జరిపిన దాడిలో బతికి బైటపడ్డ చంద్రబాబు ప్రజల సానుభూతితో తిరిగి అధికారంలోకి రావాలనే దురాశతో అసెంబ్లీని రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు తలపడ్డాడు. నక్సలిజాన్ని ప్రధానాంశంగా చేసి ఎన్నికల్లో గెల్చి విప్లవోద్యమ అణచివేతకు ప్రజల ఆమోదాన్ని పొందాలని విఫల ప్రయత్నం చేశాడు. అట్లాగే ఎన్నికలకు ముందు తెదేపా తన ప్రణాళికలో నక్సలైట్లు ఆయుధాలు వీడనాడి జనజీవన స్రవంతిలో చేరితేనే శాంతి చర్చలు జరుపుతామని ప్రకటించగా కాంగ్రెస్ తదితర ప్రతిపక్ష పార్టీలన్నీ నక్సలైట్లతో బేషరతుగా చర్చలు జరుపుతామని ప్రకటించాయి. ఇంతే కాకుండా బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేస్తామనీ, రైతులకు ఉచిత విద్యుత్తు ఇస్తామనీ, తెదేపా ప్రభుత్వం ప్రపంచ బ్యాంకుతో చేసుకున్న ఒప్పందాలన్నిటినీ సమీక్షిస్తామనీ కూడా కాంగ్రెస్ చెప్పింది. ప్రజలు చంద్రబాబు అనుసరించిన ప్రజా వ్యతిరేక, సామ్రాజ్యవాద అనుకూల విధానాలన్నిటినీ, ఫాసిస్టు నిర్బంధ విధానాలన్నిటినీ తిరస్కరిస్తూ నెగిటివ్ వోటు వేయడంతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత చర్చల అంశం ముందుకు వచ్చింది. గతంలో 2002లో చంద్రబాబు ప్రభుత్వం ప్రజల, ప్రజాస్వామిక వాదుల ఒత్తిడితో చర్చల ప్రతిపాదనలు తెచ్చినప్పటికీ ఆయుధాలను విడిచిపెట్టాలనే షరతును విధించి, కాల్పుల విరమణను ప్రకటించకుండా ఫాసిస్టు హత్యాకాండను కొనసాగించడంతో అవి ఫలప్రదం కాలేదు. నిజానికి చంద్రబాబు ప్రభుత్వానికి చర్చల పట్ల నిజాయితీయే లేదు. కేవలం ప్రజాస్వామికవాదులను మభ్యపెట్టడానికి మాత్రమే అది చర్చల నాటకం ఆడింది. అయితే మన పార్టీ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ ఏకపక్షంగా కాల్పుల విరమణను ప్రకటించి చిత్తశుద్ధితో సంయమనం పాటించినప్పటికీ చంద్రబాబు మొండిగా కొనసాగించిన ఫాసిస్టు దాడిలో తుపాకులగూడెం, నేరెళ్లవాగు సంఘటనల్లో మనం చాలా నష్టపోయాం.

ఆంధ్ర రాష్ట్రంలో దీర్ఘకాలంగా కొనసాగుతూ వస్తున్న పోలీసు నిర్బంధం చంద్రబాబు పాలనలో అపూర్వ స్థాయికి చేరుకుంది. శత్రు దాడి తీవ్రతను సకాలంలో గుర్తించి అందుకు తగిన ఎత్తుగడలను అనుసరించడంలో విఫలమైన కారణంగా మన ఉద్యమం, ముఖ్యంగా ఉత్తర తెలంగాణాలో తీవ్రమైన నష్టాలకు గురైంది. ఆంధ్ర రాష్ట్రమంతటా కూడా శత్రు నిర్బంధాన్ని తిప్పికొట్టి పై చేయి సాధించడంలో విఫలమైనాం. ఒక వైపు మనం తీవ్ర నష్టాలకు గురైనప్పటికీ శత్రువు తన దాడి తీవ్రతను ఏ మాత్రం సడలించకుండా విప్లవోద్యమాన్ని సమూలంగా నిర్మూలించాలనే లక్ష్యంతో క్రూరంగా కొనసాగించాడు. ఈ పరిస్థితిలో ప్రజలు శత్రు దాడులు నిలిచిపోవాలనీ, శాంతి నెలకొనాలనీ, ప్రజాస్వామిక హక్కులు పునరుద్ధరించబడాలనీ కోరుకున్నారు. తద్వారా తీవ్ర నిర్బంధ పరిస్థితుల్లో కనీసం ఊపిరి తీసుకోవడానికైనా అవకాశం దొరుకుతుందని ఆశించారు. అందుకే ఇరువైపులా సంయమనం పాటించాలనీ, చర్చలు జరిపి సమస్యను పరిష్కరించుకోవాలనే డిమాండ్ సర్వత్రా వినబడుతూ వచ్చింది.

ప్రజల ప్రయోజనాలు తప్ప విప్లవ పార్టీకి వేరే ప్రయోజనాలు వేరే ఏమీ ఉండవు. అందుకే ప్రజల అభీష్టం మేరకే నాడైనా, నేడైనా మన పార్టీ చర్చలకు ముందుకు వచ్చింది. ప్రజాయుద్ధంలో భాగంగా చర్చలను కూడా ఒక వేదికగా వాడుకొని ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ముఖ్యంగా ప్రజల జీవించే, ఉద్యమించే హక్కుల్ని పునరుద్ధరించడం కోసం మన పార్టీ చర్చలకు సంసిద్ధత ప్రకటించింది. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే దాడుల్ని నిలిపివేసి చర్చలకు అనువైన పరిస్థితుల్ని కల్పించాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ముఖ్యంగా పోలీసు దాడులను తక్షణమే నిలిపివేయాలనీ, కాల్పుల విరమణను ప్రకటించాలనీ, మన పార్టీపై నిషేధాన్ని ఎత్తేయాలనీ, విప్లవకారుల తలలకు వెలల్ని ఎత్తేయాలనీ డిమాండ్ చేసింది. ఈ డిమాండ్లకు ప్రజల మద్దతును కూడగట్టడంలో మన పార్టీ సఫలమైంది. మొదట కొంత వెనుకాముందాడినప్పటికీ చివరికి ప్రభుత్వం ఈ డిమాండ్లను ఒప్పుకోక తప్పలేదు. ఆ విధంగా, మన దేశ విప్లవోద్యమ చరిత్రలోనే తొలిసారిగా జూన్ 16న మన పార్టీకీ, ప్రభుత్వానికీ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చింది.

## కాంగ్రెస్ అనివార్యతలు

ప్రజా ఉద్యమాలను అణచడంలో, ప్రజాస్వామిక హక్కుల్ని హరించడంలో కాంగ్రెస్‌కున్న ఘోరమైన చరిత్రను ఎవరూ మర్చిపోలేరు. శ్రీకాకుళ ఉద్యమ అణచివేత, ఎమర్జెన్సీ విధింపు, 1984లో సిక్కుల ఊచకోత, కల్లోలిత ప్రాంత చట్టం-టాడా వంటి నల్ల చట్టాలు తేవడం, 1992లో మన పార్టీపై నిషేధాన్ని విధించడం, 1990-94 మధ్య కాలంలో 600 మంది విప్లవకారులను బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపడం లాంటి ఎన్నో ఉదాహరణలు దాని ప్రజా వ్యతిరేక ఫాసిస్టు విధానాలకు అద్దం పడతాయి. ఇకపోతే దేశాన్ని సామ్రాజ్యవాద ద్రవ్య సంస్థలకు తాకట్టు పెట్టి ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను ప్రారంభించి సామ్రాజ్యవాద దోపిడీకి గేట్లు పూర్తిగా తెరచివేసిన 'ఘనత' కూడా దానిదే! అయితే గత తొమ్మిదేళ్లుగా చంద్రబాబు అమలు చేసిన ప్రజా వ్యతిరేక దోపిడీ, అణచివేత విధానాలతో, పోలీసు రాజ్యంతో విసుగెత్తిన ప్రజలు వేసిన నెగిటివ్ వోటుతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌కు ఎన్నికల ముందు తాను చేసిన వాగ్దానాలలో కొన్నైనా అమలు చేయడం ఒక అనివార్యతగానే ముందుకు వచ్చింది. రాష్ట్రంలో సాపేక్షికంగా శాంతియుత వాతావరణం ఏర్పర్చి తన స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు గాను మన పార్టీతో చర్చలు జరపడం కొత్త ప్రభుత్వానికి తప్పనిసరైంది. అట్లాగే విపరీతమైన రుణభారంలో ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న తీవ్ర సంక్షోభం, కాంగ్రెస్ పార్టీలో ముఠాల వల్ల ఏర్పడిన అంతర్గత సంక్షోభంలో రాజశేఖర్ రెడ్డి పక్షం స్థిరపడడానికి కొంత వ్యవధి అవసరం కావడం, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతులు పెద్ద సంఖ్యలో

ఆత్మహత్యలకు పాల్పడుతుండడంతో దీనిని నివారించడానికి సానుకూల పరిస్థితి అవసరం కావడం, అన్నిటికన్నా ముఖ్యంగా ప్రజలు, ప్రజాస్వామికవాదులు రాష్ట్రంలో శాంతియుత వాతావరణం నెలకొనాలనీ, గత చరిత్ర పునరావృతం కాకుండా అణచివేత విధానాలకు స్వస్తి పలికి నక్సలైట్లతో ప్రభుత్వం వెంటనే చర్చలకు ఉపక్రమించాలని వత్తిడి చేయడం – ఇటువంటి అనేక కారణాల వలన కాంగ్రెస్‌కు మన పార్టీతో చర్చలు జరపడం మినహా గత్యంతరం లేకుండా పోయింది.

## ప్రభుత్వంతో చర్చలపై మన పార్టీ అవగాహన

సాయుధ పోరాటం ద్వారా దోపిడీ వ్యవస్థను కూలదోసే లక్ష్యంతో పని చేసే ఒక విప్లవ పార్టీకి దోపిడీ వర్గాల రాజ్యాంగయంత్రంలో భాగమైన ప్రభుత్వంతో చర్చలకు ప్రాతిపదిక ఎక్కడుంటుందనే ప్రశ్న సాధారణంగా వినవస్తుంది. అయితే దీర్ఘకాలిక ప్రజాయుద్ధంలో అనేక ఎగుడుదిగుళ్లు, మెలికలు, మలుపులు ఉంటాయి. ప్రతి మలుపులోనూ, అంటే రాజకీయ పరిస్థితిలోని మార్పులకనుగుణంగా విప్లవ పార్టీ సరైన ఎత్తుగడలను అవలంబించాలి. ప్రభుత్వంతో శాంతి చర్చలు కూడా ప్రజాయుద్ధంలో భాగమే. యుద్ధమూ, శాంతీ అనేవి ప్రజాయుద్ధ క్రమంలో విడదీయరాని అంశాలు. కానీ శాంతి చర్చలు ప్రజలపై రోజూ జరిగే దోపిడీ, హింసలను అంతం చేయలేవు. ఈ అర్థంలో శాంతి సాపేక్షికమే. ఈ దోపిడీ వ్యవస్థను ధ్వంసం చేసి వర్గరహిత సమాజాన్ని స్థాపించినప్పుడే నిజమైన శాంతిని సాధించగలం. దీర్ఘకాల సాయుధ పోరాటం ద్వారా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే మన లక్ష్యం విషయంలో ప్రభుత్వంతో ఎలాంటి చర్చలకూ, బేరసారాలకూ తావుండదనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. మన విప్లవ యుద్ధ లక్ష్యం దేశ పురోగమనానికి అడ్డంకిగా ఉన్న ప్రధాన శత్రువులైన భూస్వామ్య విధానం, సామ్రాజ్యవాదం, దళారీ నిరంకుశ పెట్టుబడులను కూలదోయడం, విప్లవ రాజ్యాధికారం సాధించి నూతన ప్రజాస్వామ్య సమాజాన్ని నెలకొల్పడం. ఈ వ్యూహాత్మక లక్ష్యంపై శత్రు వర్గాలతో ఎలాంటి చర్చలూ ఉండవు. ఇందులో దాపరికం కూడా ఏమీ లేదు.

ప్రజాయుద్ధ క్రమంలో ఏ కొంచెం వెసులుబాటు లభించినా ప్రజా పునాదిని బలోపేతం చేసుకోవడానికీ, పార్టీని, వివిధ నిర్మాణాలను పటిష్టం చేసుకోవడానికీ, బలహీనతలను సరిదిద్దుకొని మరింత ఉన్నత స్థాయిలో యుద్ధాన్ని నిర్వహించడానికీ, ఒక్క మాటలో చెప్పాలంటే ప్రజలను విస్తృతంగా ప్రజాయుద్ధంలోకి సమీకరించడానికి మనం ఉపయోగించుకుంటాం. అయితే శత్రు వర్గాలు కూడా ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని విప్లవోద్యమంపై మరో పెద్ద దాడికి సమాయత్తమవుతాయని కూడా మనం వివిధ దేశాల అనుభవాల నుండి గ్రహించవచ్చు. ఇప్పుడు కూడా ఒకవైపు చర్చలు జరుగుతుండగానే కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ ప్రభుత్వం మన ఉద్యమాన్ని సమూలంగా అణచివేయడం కోసం వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రుల, పోలీసు అధికార్ల సమావేశాల్ని నిర్వహించి తక్షణ, దీర్ఘకాల పథకాలను చురుగ్గా సిద్ధం చేస్తున్న వాస్తవం దీన్నే రుజువు చేస్తున్నది. కేంద్రం రాష్ట్రాలకు తగిన ఆర్థిక సహాయం అందిస్తూ పోలీసు బలగాలను అత్యాధునికం చేస్తూ మరో పెద్ద దాడికి సన్నాహాలు చేస్తున్నది. కాబట్టి ఈ చర్చల ప్రక్రియను దౌత్యరంగంలో మనం శత్రువుతో చేసే పోరాటంగానే గుర్తించి ప్రజలను వివిధ రాజకీయ సమస్యలపైనా, దైనందిన సమస్యలపైనా ఉద్యమించేలా కదిలించాలి. భూస్వామ్య, సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా, హిందూ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా ప్రజలను పెద్ద ఎత్తున పోరాటాల్లోకి సమీకరించాలి. ప్రజాయుద్ధమంటే ప్రజలందరూ దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా చేసే యుద్ధమన్న సత్యాన్ని విస్తృత ప్రజానీకం గ్రహించేలా, ఆమోదించేలా మనం కృషి చేయాలి.

## వెల్లువలా కదులుతున్న ప్రజలు

ప్రభుత్వం మనతో కాల్పుల విరమణ ఒప్పందానికి రావడం, మన పార్టీపైనా, తదితర ప్రజా సంఘాల పైనా నిషేధాన్ని ఎత్తేయడం ప్రజలు సాధించిన విజయమే. స్వల్ప విరామాలతో గత 12 ఏళ్లుగా కొనసాగుతూ వచ్చిన నిషేధాన్ని ఎత్తేయడంతో ప్రజలు పార్టీ పిలుపుకు ఉత్సాహంగా స్పందించి బహిరంగ సభలలో పెద్ద ఎత్తున కదులుతున్నారు. ఈ చర్చల ప్రక్రియలో మన పార్టీతో పాటుగా సీపీఐ (ఎం-ఎల్) (జనశక్తి) కూడా పాలు పంచుకుంటున్నది. రెండు పార్టీలు సంయుక్తంగానే పలు చోట్ల బహిరంగ సభలు నిర్వహించాయి. జూలై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల వారం సందర్భంగా ఈసారి ప్రజలు పెద్ద ఎత్తున సభలలో పాల్గొని ప్రభుత్వ ఫాసిస్టు హత్యాకాండలో అసువులు బాసిన అమరులకు ఘనంగా నివాళులర్పించారు. జూలై 28న వరంగల్ జిల్లా ఎనుమాముల వద్ద జరిగిన స్మారక సభలో 2 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారు. ప్రస్తుత చర్చల ప్రక్రియలో పార్టీ తరఫున ప్రతినిధులుగా వ్యవహరిస్తున్న కామ్రేడ్స్ వరవరరావు, గద్దర్, కళ్యాణరావులు ఈ సభలో ప్రసంగించారు. ఆ తర్వాత విశాఖ జిల్లా ధారకొండలోనూ, విశాఖ నగరంలోనూ, అనంతపురంలోనూ, ఇంకా కొన్ని చోట్ల జరిగిన బహిరంగ సభల్లో వేల సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. దీంతో పీపుల్స్‌వార్ పార్టీకి ఆయుధాల బలం తప్ప ప్రజాబలం లేదనీ, ప్రజాపునాది లేదనీ ఇంత కాలం అవాకులూ చవాకులూ పేలుతూ వచ్చిన అభివృద్ధినిరోధకులకూ, పోలీసు అధికార్లకూ పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డట్టయ్యింది. గత తొమ్మిదేళ్లుగా అమలైన తీవ్ర నిర్బంధం మూలంగా విప్లవోద్యమానికి చాలా నష్టం కలిగినప్పటికీ ప్రజలు ఇప్పటికీ పార్టీ వైపునే నిల్చి ఉన్నారనీ, ప్రజల పోరాట పటిమ నివురుగప్పిన నిప్పులా ఉందనీ, అవకాశం దొరికితే ప్రజలు ప్రభంజనంలా విరుచుకుపడతారనీ ఈ ప్రజా వెల్లువ ద్వారా స్పష్టంగా రుజువైంది.

## చర్చలంటూనే అడుగడుగునా అడ్డు పడుతున్న ప్రభుత్వం

రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నాడే పోలీసులు ఆదిలాబాద్ జిల్లాలో బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడ్డారు. దీనిపై విలేఖరులు వివరణ కోరగా పోలీసులు తమ బాధ్యతలు తాము నిర్వర్తిస్తారని రాజశేఖర్ రెడ్డి చెప్పాడు. అయితే దీనికి వ్యతిరేకంగా వత్తిడి పెరగడంతో ఈ ఘటనపై విచారణ జరిపిస్తాననీ, బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడకుండా పోలీసు అధికార్లకు ఆదేశాలిస్తాననీ అన్నాడు. డీజీపీ సుకుమార అఫెన్సివ్ చర్యలను నిలిపివేస్తామనీ, అయితే "సాధారణ గస్తీ" కొనసాగుతుందనీ ప్రకటించాడు. ఒకవైపు చర్చల ప్రక్రియ కొనసాగుతుండగానే వరంగల్ జిల్లాలో పోలీసులు పార్టీలోకి ప్రవేశపెట్టిన సాంబయ్య అనే కోవర్ట్ జూలై రెండో వారంలో కుట్రపూరితంగా జరిపిన దాడిలో జిల్లా కార్యదర్శి గాయపడగా ఇద్దరు దళ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుత చర్చల ప్రక్రియను పోలీసు అధికారుల్లో ఒక పెద్ద సెక్షన్ తొలి నుండీ వ్యతిరేకిస్తున్నది. వీళ్లు విప్లవోద్యమ అణచివేతలో భాగంగా చాలా కాలంగా అనుసరిస్తూ వస్తున్న కోవర్ట్ చర్యలను ఇప్పటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే వీళ్లకు ప్రభుత్వం నుండి కూడా పూర్తి మద్దతు ఉన్నట్టుగా అది అనుసరిస్తున్న వైఖరితో స్పష్టంగా అర్థమవుతున్నది. ఆ తర్వాత ఖమ్మం జిల్లాలో కూడా కోవర్ట్‌లను ముందే పట్టుకోవడంతో పెద్ద ప్రమాదం తప్పిపోయింది. ఈ ఘటనలను పార్టీ ప్రజల ముందుకు తెచ్చి ప్రభుత్వ స్వభావాన్ని ఎండగట్టడంతో

ప్రభుత్వం ఇరుకులో పడింది. ఇలాంటి హేయమైన చర్యలను ప్రజలు పెద్ద ఎత్తున నిరసించారు. ఆ తర్వాత, ఎనుమాముల సభలో ప్రసంగించిన వరవరరావు, గద్దర్, కళ్యాణరావులపై రాజద్రోహం కేసులు మోపడం కూడా ప్రభుత్వం కనుసన్నలలోనే పోలీసు అధికార్లు ఇలాంటి నీచమైన కుట్రలకు పాల్పడుతున్న విషయాన్ని రుజువు చేసింది. ప్రభుత్వం ఒక వైపు ప్రజాస్వామికవాదిగా పోజు కొడుతూనే మరోవైపు ఈ కామ్రేడ్స్‌పై కేసులు మోపడం అది భావప్రకటనా స్వేచ్ఛను కూడా సహించడం లేదనే వాస్తవాన్ని తెలుపుతున్నది. ఆ తర్వాత కా. గద్దర్‌కు బెదిరింపు ఫోన్లు చేసిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకురాగా ఎవరో ఒక అనామకుడిని అరెస్టు చేసి చేతులు దులుపుకుంది. నల్లదండు ముఠాలను అరెస్టు చేసి చట్టపరంగా చర్య తీసుకోవాలన్న పార్టీ డిమాండును ప్రభుత్వం పూర్తిగా పెడచెవిన పెట్టింది.

పార్టీ ప్రతినిధులతో చర్చలు జరుగుతున్న క్రమంలో ప్రభుత్వం ఆయుధాలతో గ్రామాల్లో సంచరించరాదనే షరతును ముందుకు తెచ్చింది.

## ఈ సందర్భంగా మన పార్టీ ముందుకు తెస్తున్న డిమాండ్లు

I. రాష్ట్రంలో ప్రజాస్వామిక వాతావరణాన్ని ఏర్పర్చాలి. ప్రజలు తమ ప్రజాస్వామిక డిమాండ్ల కోసం పోరాడే హక్కును ప్రభుత్వం గౌరవించాలి.

* ఆందోళననూ, శాంతియుత ప్రదర్శనలనూ, సభలనూ ప్రభుత్వం అడ్డుకోరాదు.
* భారత కమ్యూనిస్టు పార్టీ (మా-లె) [పీపుల్స్‌వార్] పైనా, తదితర సంఘాలపైనా నిషేధాన్ని ఎత్తివేయాలి.
* పీపుల్స్‌వార్, ప్రజా గెరిల్లా సైన్యం, తదితర ప్రజా సంఘాల కార్యకర్తల తలలకు వెలల్ని నిర్ణయించే పద్ధతిని రద్దు చేయాలి.
* గ్రేహౌండ్స్ బలగాలనూ, ప్రత్యేక భద్రతా బలగాలనూ (ఎస్ఎస్ఎఫ్), స్పెషల్ ఇంటలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ)నూ రద్దు చేయాలి. కేంద్ర అర్ధ సైనిక బలగాలను ఉపసంహరించుకోవాలి.
* రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయాలి.
* బూటకపు ఎన్‌కౌంటర్లలో నక్సలైట్లను హత్య చేసే పోలీసు అధికార్లకు గడువుకు ముందుగా ప్రమోషన్లు ఇవ్వడాన్నీ, అనధికార ప్రోత్సాహకాలివ్వడాన్నీ రద్దు చేయాలి.
* గ్రామాల్లో ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్‌ను రద్దు చేయాలి. పీపుల్స్‌వార్ కార్యకర్తలను తమ వైపు తిప్పుకొని వారిని కోవర్ట్ ఏజెంట్లుగా ఉపయోగించుకునే విధానానికి ప్రభుత్వం స్వస్తి చెప్పాలి.
* గ్రీన్ టైగర్స్, క్రాంతి సేన, పల్నాడు టైగర్స్, తిరుమల టైగర్స్, నయీం ముఠా వంటి లంపెన్ ముఠాలన్నిటినీ అదుపు చేయాలి.
* బూటకపు ఎన్‌కౌంటర్లన్నిటిపై న్యాయవిచారణ జరిపించి బాధ్యులైన పోలీసు అధికార్లను శిక్షించాలి.
* పార్టీ, ప్రజా సంఘాల కార్యకర్తలపైన నమోదు చేసిన కేసులన్నిటినీ ఎత్తేయాలి.

II. వ్యవసాయ రంగంలో సంస్కరణలను ప్రవేశపెట్టాలి.

* భూసంస్కరణలను అమలు చేయాలి. దేవుని మాన్యం భూముల్నీ, ప్రభుత్వ భూముల్నీ, అటవీ భూముల్నీ, భూస్వాముల భూముల్నీ గతంలో ఆక్రమించుకున్న ప్రజలకు అప్పగించాలి.
* భూమి సీలింగ్ చట్టాన్ని అమలు చేయాలి.
* పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులన్నిటినీ పూర్తి చేయాలి. రైతులకు నీటి పారుదల సౌకర్యాలను కల్పించాలి. తగినంత విద్యుత్తును సరఫరా చేయాలి.
* రైతుల ఆత్మహత్యలను నివారించడానికి గాను రైతాంగం తీసుకున్న ప్రైవేటు అప్పులన్నిటినీ రద్దు చేయాలి.
* కరువు సమస్యను పరిష్కరించడానికి గాను శాశ్వత, సమగ్ర పథకాన్ని తయారు చేయాలి.

III. ప్రస్తుతం అమలవుతున్న ఉదారీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ విధానాల స్థానంలో స్థానిక వనరులపై ఆధారపడిన పారిశ్రామికీకరణనూ, ఇతర పథకాలనూ అమలు చేయాలి.

* సామ్రాజ్యవాదుల కనుసన్నల్లో నడుస్తున్న ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టులనూ, పథకాలన్నిటినీ వెనక్కి తీసుకోవాలి.
* కార్మికులను పని లోంచి రిట్రెంచ్ చేయడాన్నీ, ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరించడాన్నీ నిలిపివేయాలి.
* చిన్న తరహా, మధ్య తరహా పరిశ్రమలను బహుళ జాతి కంపెనీల పోటీ నుండి రక్షించాలి. సహకార విధానాన్నీ, ఇతర ప్రభుత్వ రంగ పరిశ్రమలనూ పునరుద్ధరించాలి.
* తాగునీటిపైనా, విద్యపైనా, ఆరోగ్య సదుపాయాల పైనా యూజర్ చార్జీలను ఉపసంహరించుకోవాలి.
* ప్రపంచ బ్యాంకుతోనూ, బహుళ జాతి కంపెనీలతోనూ, ఇతర దేశాలతోనూ చేసుకున్న ఒప్పందాలన్నిటినీ రద్దు చేయాలి.

IV. అడవిపై ఆదివాసీ ప్రజల హక్కును గుర్తించాలి.

* ఆదివాసీ ప్రజలకు స్వయంపాలనను ప్రకటించాలి.
* షెడ్యూల్డు ప్రాంతాలలో ఆదివాసుల భూములు ఆదివాసీయేతరుల చేతిలోకి పోకుండా, పరాయిపరం కాకుండా నిరోధించే 1/70 చట్టాన్ని అమలు చేయాలి. ఆదివాసీ ప్రజలు నివసించే ప్రాంతాలలో ఆదివాసీయేతర ప్రజలను స్థిరపర్చడాన్ని ఆపాలి.
* ఆదివాసీ భాషలను అభివృద్ధి చేయడానికి తగిన చర్యలను ప్రారంభించాలి.

V. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలి.

VI. ఉత్తర కోస్తా, రాయలసీమలలోని వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడం కోసం ఒక సమగ్రమైన పథకాన్ని తయారు చేయాలి.

VII. దళితుల ఆత్మగౌరవాన్ని కించపర్చే వాళ్లను శిక్షించాలి. కారంచేడు, చుండూరు, నీరుకొండ, వేంపెంటలలో దళితులపై దాడులకు కారకులైన అగ్రకులాల వారిపైనా, పోలీసు అధికార్లపైనా చర్యలు తీసుకోవాలి.

* దళితులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించాలి.

VIII. మహిళలకు ఆస్తిపై సమాన హక్కుల్ని ఇవ్వాలి.

* ప్రైవేటు రంగంలో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి.
* మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలి.

IX. సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేయాలి.

X. అక్రమంగా ఆస్తుల్ని పోగు చేసుకున్న అధికారుల పైనా, రాజకీయ నాయకుల పైనా, పెట్టుబడిదార్ల పైనా విచారణ జరిపించాలి. అవినీతికి పాల్పడ్డ అధికార్ల పైనా, రాజకీయ నాయకుల పైనా విచారణ జరిపించాలి.

* పన్నులు ఎగవేసే సంపన్నుల నుండి డబ్బు వసూలు చేయాలి.

ఇది పార్టీని నిరాయుధం చేయాలని కోరడమే తప్ప వేరే ఏమీ కాదు. ఇదే విషయంపై చాలా ప్రతిష్టంభన కొనసాగగా చివరకు పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కా. రామకృష్ణ "చర్చల నుండి విరమించుకోనైనా విరమించుకుంటాం తప్ప ఆయుధాలు వదిలేది లేద"ని స్పష్టంగా ప్రకటిస్తూనే చర్చలకు ఈ అంశం అడ్డు కాకూడదని ఆలోచించి దీన్ని జరగబోయే చర్చలలో ఎజెండాలో చేర్చి చర్చించడానికి పార్టీ సిద్ధమేనని ప్రకటించాడు. సెప్టెంబర్ 21న నక్సలైటు ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం సందర్భంగా కేంద్ర హోంమంత్రి శివరాజ్ పాటిల్‌తో చర్చించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం ఈ షరతును పక్కన బెట్టడానికి సిద్ధపడి పార్టీ నాయకులు ప్రత్యక్షంగా చర్చలకు రావాలని ఆహ్వానం పంపింది. పార్టీ ఈ ఆహ్వానాన్ని అంగీకరిస్తూనే అక్టోబర్ 2న రావడానికి తన అసహాయతను తెల్పుతూ తేదీని పొడిగించాలని కోరింది. ఈ లోగా సెప్టెంబర్ 30న మన పార్టీ జనశక్తి పార్టీ రెండూ కలిసి హైదరాబాద్‌లో "దున్నేవారికే భూమి", "స్వావలంబన", "శాంతి" నినాదాలతో పెద్ద ఎత్తున బహిరంగ సభను నిర్వహించింది. ఇందులో లక్షలాది ప్రజలు పాల్గొని సభను విజయవంతం చేశారు. అయితే ఈ సభకు రాకుండా పోలీసులు వందలాది వాహనాల్ని అడ్డుకొని వెనక్కి పంపించి తమ అప్రజాస్వామిక స్వభావాన్ని చాటుకున్నారు.

## ఆయుధాలు విడనాడాలన్న హాస్యాస్పదమైన షరతు

గతంలో తెలుగుదేశం ప్రభుత్వం ఏ మొండి షరతుతోనైతే చర్చలు కొనసాగకుండా అడ్డుకుందో సరిగ్గా కాంగ్రెస్ కూడా అదే షరతుతో చర్చల ప్రక్రియను ముందుకు సాగనివ్వకుండా తాత్సారం చేస్తూ వచ్చింది. ఒకవైపు నక్సలైటు సమస్యను సామాజిక, ఆర్థిక, రాజకీయ సమస్య అని మాట్లాడుతూనే నక్సలైట్లు అడవులకు మాత్రమే పరిమితం కావాలనీ, ఆయుధాలు ధరించి గ్రామాల్లో తిరగరాదనీ షరతు విధించాలని ప్రయత్నించడమంటే దీన్ని శాంతిభద్రతల సమస్యగానే చూస్తున్నట్టు అర్థం చేసుకోవల్సి వస్తుంది. వాస్తవానికి ఒకవైపు గ్రామాలలో వివిధ రాజకీయ పార్టీల గూండాలు, ముఠాలు, నల్లదండు ముఠాలు ఆయుధాలతో తిరుగుతుండగా, రాజకీయ నాయకులు సాయుధ గార్డులతో తిరుగుతుండగా, అనేక లైసెన్స్‌డ్ ఆయుధాలు చలామణిలో ఉండగా మన పార్టీని ఆయుధాలతో తిరగొద్దని అనడమంటే ఇది పార్టీని నిరాయుధం చేసే దురుద్దేశ్యమే తప్ప మరేమీ కాదు. ఈ సాకుతో చర్చల ప్రక్రియను పట్టాలు తప్పించడానికి కూడా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టుగా స్పష్టమైంది. నక్సలైట్లు అడవుల్లోనే ఉండాలని మాట్లాడడం కూడా హాస్యాస్పదమైంది. నక్సలైటు ఉద్యమమంటే ప్రజా ఉద్యమమని ఎవరికీ తెలియనిది కాదు. ప్రజలకు నాయకత్వం లేకుండా చేయడం కోసమే గతంలో మన పార్టీని ప్రభుత్వం నిషేధించింది. ఇప్పుడు ఆయుధాలతో గ్రామాల్లో తిరగవద్దనీ, అడవుల్లోనే ఉండాలనీ కోరడం కూడా ప్రజలకు నాయకత్వం లేకుండా చేయడం కోసమే తప్ప మరేమీ కాదు. మన పార్టీ నిత్య నిర్బంధంలో సైతం, గాలింపులూ, రెయిడ్లూ, దాడులూ, బూటకపు ఎన్‌కౌంటర్లూ కొనసాగుతున్నప్పటికీ ప్రజల సహకారంతో ప్రజల మధ్యనే జీవిస్తున్నది. ప్రజలకు నాయకత్వం వహిస్తున్నది. తీవ్ర నిర్బంధంలో సైతం మన పార్టీ ప్రజల్లో వేళ్లూనుకుంటూ వస్తున్నదన్న విషయం చరిత్ర తెలిసిన ప్రతి వారికీ అర్థమవుతుంది. ఈ అర్థరహితమైన షరతుపై పౌరస్పందన వేదిక కన్వీనర్ ఎస్‌ఆర్ శంకరన్ కూడా సానుకూలంగా స్పందించడం విచారకరమైన విషయం. అయితే అత్యధిక ప్రజానీకం మన పార్టీ వైఖరిని బలపరుస్తున్నారనడానికి మన పార్టీ నిర్వహించిన సభల్లో లక్షల సంఖ్యలో పాల్గొంటూ ఉండడమే ప్రబల నిదర్శనం. ప్రజా స్పందనను గమనించిన ప్రభుత్వం తప్పనిసరై వెనక్కి తగ్గి ఈ అంశాన్ని చర్చల ఎజెండాలో చేర్చాలన్న మన పార్టీ ప్రతిపాదనను అంగీకరించడంతో, ఎట్టకేలకు అక్టోబర్ రెండో వారంలో చర్చలకు దారి సుగమమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణ నాయకత్వంలో, ఏఓబీ ఎస్‌జెడ్‌సీ కార్యదర్శి కామ్రేడ్ సుధాకర్, ఎన్‌టీ ఎస్‌జెడ్‌సీ సభ్యుడు కామ్రేడ్ గణేష్‌లతో కూడిన ముగ్గురు సభ్యుల ప్రతినిధివర్గం ప్రత్యక్ష చర్చలకు వస్తుందని కా. రామకృష్ణ అక్టోబర్ 2న ప్రకటన చేశాడు.

ఈ చర్చల సందర్భంగా మన పార్టీ సంయమనం పాటిస్తూ, ప్రజల సమస్యల్ని ముందుకు తీసుకొచ్చి వాటి పరిష్కారానికై డిమాండ్ చేయడం, బహిరంగ సభలు, 'పీపుల్స్ అసెంబ్లీ'ల వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల మద్దతును కూడగట్టడం – వీటన్నిటి ద్వారా ఆంధ్ర పీడిత ప్రజల నేతగా సాధికారతను పొందుతున్నదన్న విషయం తేటతెల్లం. ప్రజాయుద్ధ క్రమంలో ఈ మజిలీని సమర్థవంతంగా ఉపయోగించుకొని విప్లవోద్యమాన్ని మరో ఎత్తుకు తీసుకెళ్లడంలో, ప్రజాయుద్ధానికి అశేష పీడిత ప్రజల మద్దతును కూడగట్టి విస్తృత స్థాయిలో కొనసాగించడానికి అవసరమైన శక్తిసమర్థతలను పెంచుకొనే దిశగా ముందడుగు వేయడంలో ఆంధ్రప్రదేశ్‌లోని మన పార్టీ శాఖలు విజయం సాధించాలని ఆశిద్దాం.★

*(......... 27వ పేజీ తరువాయి)*

ప్రస్తుతం నేపాల్‌లో విజృంభిస్తున్న ప్రజాయుద్ధంలోనూ చరిత్ర పదే పదే రుజువు చేసిన వాస్తవం ఏమంటే న్యాయమైన లక్ష్యం కోసం ప్రజలపై ఆధారపడి పోరాడే ఒక గెరిల్లా బలగం పోరాట క్రమంలో ఒక సైన్యంగా ఎదిగి మొదట్లో తనకన్నా అనేక రెట్లు బలంగా ఉన్న శత్రువును ఓడించగలుగుతుంది.

అయితే ఇరాకీ గెరిల్లా బలగాలలో వ్యూహాత్మక లక్ష్యాలను సూత్రీకరించి ప్రజలను సమైక్యం చేసే సమర్థతలున్న నాయకత్వం, తగిన సైనిక వ్యూహం-ఎత్తుగడలు లోపించాయి. దీని అర్థం ఒక సరైన పంథాను చేపట్టగల నాయకత్వ సంస్థ, అంటే ఒక మార్క్సిస్టు-లెనినిస్టు-మావోయిస్టు అగ్రగామి దళం ఇరాక్‌లో లోపించింది. ఇది మాత్రమే ఆ దేశంలోని, మొత్తం మధ్య ప్రాచ్యంలోని, ప్రపంచంలోని ప్రజలందరి ప్రయోజనాలనూ వాస్తవికంగా వ్యక్తీకరించగల్గుతుంది. అంతిమంగా ఇదే బలాబలాల సమతుల్యాన్ని మార్చివేస్తుంది. అయితే ఇరాకీయుల గొప్ప ప్రతిఘటనా పోరాటం "కొత్త అమెరికన్ శతాబ్దం ప్రాజెక్టు"కు కచ్చితంగా తీవ్రమైన విఘాతాన్ని కలిగించిందన్నది వాస్తవం. మరోవైపు ఆఫ్గనిస్తాన్ కూడా తాను అమెరికా బిగించిన "విశాల మధ్య ప్రాచ్య" చట్రంలో దిగబడి పోలేదని రుజువు చేసుకుంటున్నది. ఆఫ్గన్‌లో అమెరికా బలగాలపై దాడులు ముమ్మరమవుతున్నాయి. మరోవైపు నేపాల్‌లోనూ, భారతదేశం, ఫిలిప్పీన్స్, పెరూ, టర్కీ తదితర దేశాల్లో మావోయిస్టుల నాయకత్వంలో ప్రజాయుద్ధాలు అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్రలను అధిగమిస్తూ పురోగమిస్తున్నాయి. సామ్రాజ్యవాదంతో పీడిత జాతులకూ, ప్రజలకూ ఉన్న వైరుధ్యం పదునెక్కుతున్నది. ప్రపంచ ప్రజల మొట్టమొదటి శత్రువైన అమెరికా ఏకకాలంలో అన్ని దిక్కులా తన బలాన్ని ప్రయోగించలేని దయనీయ పరిస్థితిని ఎదుర్కోవల్సి రావడం ఈ పోరాటాల ఫలితమే. ఇరాకీ ప్రజలు సాగిస్తున్న ప్రతిఘటనకు ఇందులో నిశ్చయంగా గొప్ప స్థానం ఉంది. వాళ్ల విజయాలు ప్రపంచ ప్రజలందరి విజయాలు. ★

# కొనసాగుతున్న ఇరాకీ ప్రజల వీరోచిత ప్రతిఘటన – ఉక్కిరిబిక్కిరవుతున్న అమెరికన్ సామ్రాజ్యవాదం

ఇరాకీయులకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తానంటూ అమెరికా నాయకత్వంలో సంకీర్ణ సేనలు ఇరాక్‌పై అన్యాయమైన యుద్ధాన్ని ప్రారంభించి సంవత్సరన్నర దాటింది. రెండు, మూడు వారాల్లో ఇరాక్‌ను చేజిక్కించుకుంటామని విర్రవీగిన బుష్ మే 1, 2003న యుద్ధం ముగిసిందని నాటకీయంగా ప్రకటన చేసిన తర్వాతే అసలు యుద్ధం, ఇరాకీ ప్రజల న్యాయమైన ప్రతిఘటనా యుద్ధం మొదలైంది. ఇరాకీ ప్రజల గొప్ప ప్రతిఘటనలో ఇప్పటికి వెయ్యి మందికి పైగా అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోగా, కనీసం 6,000 మంది సైనికులు గాయపడ్డారు. ఒక్క ఏప్రిల్ నెలలోనే 120 మంది కుక్కచావు చచ్చారు. అమెరికా సైనికులకు నష్టాలు లేకుండా ఒక్క రోజైనా గడవడం లేదు. అబూ ఘ్రేబ్ జైల్లో ఇరాకీ ఖైదీలపై అమానవీయమైన అత్యాచారాలకు పాల్పడి ఇరాకీయుల మనోబలాన్ని దెబ్బతీయగలమని అమెరికన్ సామ్రాజ్యవాదులు భ్రమపడ్డారు. కానీ ఇందుకు భిన్నంగా ఇరాకీయులు కసితో తమ దాడుల్ని ముమ్మరం చేస్తున్నారు. ముఖ్యంగా ఫలూజా, నజఫ్ పట్టణాలు అమెరికన్ సైన్యాలకు శ్మశానవాటికలే అయ్యాయని చెప్పొచ్చు. ఇరాకీ ప్రతిఘటనాకారులు ఈ పట్టణాలను దాదాపు తమ విముక్తి ప్రాంతాలుగా మల్చుకున్నారు. అమెరికన్ సైన్యం లెక్క లేనన్ని విచ్చలవిడి దాడులకు పాల్పడి వందలాది మందిని హతమారుస్తున్నప్పటికీ ఇరాకీయులు ప్రతి ఇంటినీ ఓ కోటగా మార్చి పోరాడుతున్నారు. మొదట ఇరాకీ పోరాటకారులు ఆయుధాలు పడేసి సరెండర్ కావాలని హూంకరించిన అమెరికన్లు ఇప్పుడు కాల్పుల విరమణ ఒప్పందాల కోసం దిగి వస్తున్నారు. ముఖ్యంగా షియాల మత నాయకుడు ముఖ్తదా అల్ సద్ర్‌ను పట్టుకోవడం కోసం ముప్పుతిప్పల పడుతున్నారు.




మార్చ్ 2004లో జరిపిన ఒక సర్వే ప్రకారం 52 శాతం అమెరికన్ సైనికుల నైతిక స్థైర్యం ఘోరంగా పతనమైంది. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ యుద్ధాలు మొదలైన నాటి నుండి ఇప్పటి వరకు అమెరికా 3,64,000 మంది రిజర్వు బలగాలనూ, నేషనల్ గార్డ్ సైనికులనూ సైన్య సేవలకు పిలవనంపాల్సి వచ్చింది. ఇప్పటికీ దాదాపు లక్షన్నర మంది అమెరికా సైనికులతో పాటు ఇతర దేశాలకు చెందిన వేల సైనికులు ఇరాక్‌లో తిష్ట వేసి ఉన్నప్పటికీ, ప్రపంచాన్ని మోసం చేసి ఐక్య రాజ్య సమితిలో తీర్మానం చేసి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటికీ అమెరికాకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు అమెరికాలో త్వరలో జరుగనున్న రాష్ట్రపతి ఎన్నికల్లో మళ్లీ గెలవాలన్న బుష్ ఆకాంక్షలు ఈ యుద్ధ ఫలితాల మూలంగా తలకిందులయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

## విస్తృత స్థాయి తిరుగుబాటు

ఏప్రిల్ ప్రారంభం నుండి ప్రతిఘటనా పోరాటం తీవ్రతరమైంది. ఉత్తరాన కిర్కుక్‌లో అమెరికన్ బలగాలు ఇరాకీ ప్రదర్శనకారులను కాల్చి చంపితే, తిరుగుబాటుదారులు పోలీసులను కాల్చి చంపారు. దక్షిణాన బస్రాలో తిరుగుబాటుదార్లు మునిసిపల్ కార్యాలయాలను ఆక్రమించుకొని చమురు పైప్‌లైన్లను పేల్చేశారు. ఇరాక్ ఎల్లెడలా తిరుగుబాటు ఉధృత రూపం దాల్చింది. ఏప్రిల్‌లో బాగ్దాద్‌కు సమీపంలో ఒక ఏహెచ్-64 అపాచే మిలిటరీ హెలికాప్టర్‌ను కూల్చి వేశారు. బస్రా చమురు కేంద్రానికి దగ్గర్లో సమన్వయంతో జరిపిన ఆత్మాహుతి దాడుల్లో ముగ్గురు అమెరికన్ నావికులు చచ్చారు.

కుత్, కుఫా అనే పట్టణాలు పూర్తిగానూ, నజఫ్ పాక్షికంగానూ అల్ సద్ర్ నాయకత్వంలోని మెహ్ది సైన్యం అదుపులోకి వచ్చాయి. ఈ షియాల ప్రతిఘటనా సైన్యం బాగ్దాద్‌కు ఈశాన్య దిశలో సుదూరంగా ఉన్న బఖూబాలో అమెరికన్ సైన్యాలతో పోరాటం జరిపింది. చాలా పట్టణాల్లో పోలీసు స్టేషన్లపై రెయిడ్లు జరిపి ఆయుధాల్ని స్వాధీనం చేసుకొని ప్రజలకు పంచింది.

మార్చ్ 2004 నుండి రోజుకు సగటున 28 దాడులు జరుగుతున్నాయనీ, తిరుగుబాటు నూతన ఎత్తులకు ఎదిగిందనీ అమెరికా సైన్య ఆపరేషన్ల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ కిమ్మిట్ అంగీకరించాడు. సాధారణంగా ఆశావాదిగా కనిపించే విదేశాంగ మంత్రి జాక్ స్ట్రా "ప్రెజర్ కుక్కర్ నుండి మూత బైటికి తన్నుకొచ్చింది" అని ఒప్పుకోక తప్పలేదు. ఈ తిరుగుబాటుకు ఇరాకీయులే నాయకత్వం వహిస్తున్నారనీ, "విదేశీ శక్తులు" కాదనీ కూడా స్ట్రా ఒప్పుకోవడం గమనార్హం. దురాక్రమణదారులకు ఒక "కఠిన వారం" గడిచిందని ఏప్రిల్ 11న బుష్ కూడా ఒప్పుకోవల్సి వచ్చింది.

మొత్తం ఇరాక్ అంతటా తిరుగుబాటు వెల్లువలా ఉప్పొంగుతోంది. తిరుగుబాటుదార్లు రాజధాని బాగ్దాద్ శివార్లలో ఒక అమెరికన్ చమురు కాన్వాయ్‌పై ఆంబుష్ చేసి తగులబెట్టారు. ఏప్రిల్ 10న బాగ్దాద్‌లో ఒక పోలీసు స్టేషన్‌పై దాడి జరిపారు. బఖూబాలో తిరుగుబాటుదార్లకూ, ఆక్రమణదారు సైన్యాలకూ మధ్య తీవ్రమైన పోరాటం జరిగింది. ఇరాక్ కేంద్ర ప్రాంతంలోని కుత్ పట్టణాన్ని షియా పోరాటకారులు రెండు రోజుల పోరాటం ద్వారా పట్టుకోగలిగారు. అక్కడ తిష్టవేసిన ఉక్రెయిన్ సైన్యాలను తరిమికొట్టి వారీ విజయం సాధించారు. దేశంలోని విశాల ప్రాంతాలు సంకీర్ణ సేనలకు రక్షణ లేని ప్రాంతాలుగా మారాయి. చిన్నవే అయినప్పటికీ వేల కొద్ది చర్యలు ఆగకుండా జరుగుతున్నాయి – గురి చూసి కాల్చి చంపడం (స్నైపింగ్), బాంబు దాడులు, రెయిడ్లు, ప్రభుత్వ ఆస్తుల్ని స్వాధీనం చేసుకోవడం లాంటివెన్నెన్నో. కర్బలాలో విడవకుండా సంఘర్షణలు జరుగుతున్నాయి. తిరుగుబాటులో పాల్గొంటున్న ప్రజల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నదని స్వయంగా దురాక్రమణ సైన్యాల నాయకులే ఒప్పుకుంటున్నారు.

## బంధీలుగా పట్టుకోవడం



ఇరాకీయుల ప్రతిఘటనతో బెంబేలెత్తిన అమెరికన్ మెరైన్లు

ఇటీవలి కాలంలో వివిధ దేశాల సైనిక, సైనికేతర వ్యక్తులను బంధీలుగా పట్టుకోవడమనే పోరాట రూపం ఇరాక్‌లో బాగా ముందుకొచ్చింది. ఏప్రిల్ 17న ముగ్గురు జపానీయులను బంధీలుగా పట్టుకొని జపాన్ బలగాలు ఇరాక్ నుండి వెనక్కి పోవాలని డిమాండ్ చేశారు. జపాన్ మొండి వైఖరితో ఈ డిమాండ్‌ను తిరస్కరించినప్పటికీ ఇరాకీయులు వాళ్లను క్షేమంగా విడుదల చేశారు. అయితే గమనించాల్సిన విషయం ఏమిటంటే విడుదలైన వాళ్లలో ఒకరైన మానవ హక్కుల కార్యకర్త నొబుటకా తను ఎదుర్కొన్న ప్రాణసంకటానికి కారణం ఇరాక్‌లో జపాన్ సైనికుల మోహరింపేనని కోర్టులో కేసు నమోదు చేశాడు. మరో తడవ ఇద్దరు జపానీయులను కిడ్నాప్ చేసి చంపేశారు. ఫిలిప్పీన్స్ దేశ పౌరులను బంధీలుగా పట్టుకుని ఫిలిప్పీన్స్ బలగాలను ఇరాక్ నుండి వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేయడంతో ఫిలిప్పీన్స్ ప్రభుత్వం ప్రజల వత్తిడి మూలంగా ఈ డిమాండ్‌ను ఒప్పుకోవల్సి వచ్చింది. సెప్టెంబర్ ఆఖరు వారంలో కొందరు అమెరికన్లనూ, బ్రిటిష్ వాళ్లనూ బంధీలుగా పట్టుకొని ఇరాకీ జైళ్లలో బంధీలుగా ఉన్న మహిళా ఖైదీలందరినీ విడిచి పెట్టాలనే న్యాయమైన డిమాండ్ చేయగా అమెరికా పెడచెవిన పెట్టి తమ దేశస్తుల చావుకు కారణమైంది. తిరుగుబాటుదార్లు బంధీలుగా పట్టుకొని వీడియోల ద్వారా తమ డిమాండ్లను బైటికి తెలియజేస్తున్నారు. టీవీ, ఇంటర్నెట్ వగైరా ఎలక్ట్రానిక్ మీడియాను బాగా ఉపయోగించుకొని సామ్రాజ్యవాదులు రూపొందించిన ఆయుధాల్ని వాళ్లపైకే గురి పెడుతున్నారు. అయితే వివిధ దేశాల పట్ల విచక్షణతో కూడిన వైఖరిని అవలంబిస్తూ చాలా మందిని విడిచిపెడుతుండగా కొంత మందిని మాత్రం హత్య చేస్తున్నారు. ముఖ్యంగా అమెరికన్ పౌరులను మాత్రం నిర్దాక్షిణ్యంగా చంపేస్తున్నారు. పొట్టకూటి కోసం అమెరికా సైనికులకు ఆహారాన్ని సరఫరా చేసే కాంట్రాక్టు కంపెనీలో పని చేయడానికి వెళ్లిన నేపాలీ కూలీలను హత్య చేయడం లాంటి అవాంఛిత ఘటనలు కొన్ని జరిగినప్పటికీ చాలా వరకు ఇరాకీయులు తమ ఎత్తుగడలను సమర్థవంతంగా అమలు చేస్తున్నారనే చెప్పొచ్చు. బంధీలను హత్య చేయడంపై నెత్తీ నోరూ బాదుకొని గగ్గోలు పెడుతున్న వాళ్లు అబూ గ్రేబ్ జైళ్లో ఖైదీలపై అమెరికా అమలు చేస్తున్న అమానుష హింస, తదితర అనేక దుశ్చర్యలకు ప్రతీకారంగానే ఇరాకీయులు న్యాయమైన హింసకు తలపడుతున్నారని గుర్తించడం లేదు. ఇరాక్‌లో అమెరికా, దాని మిత్ర దేశాలూ తీసుకుంటున్న ప్రతి నిర్ణయం, అమలు చేస్తున్న ప్రతి చర్యా అన్యాయమైనవీ, అమానుషమైనవీ, ఆటవికమైనవీ కాగా, అందుకు ప్రతీకారంగా ఇరాకీయులు చేపడుతున్న ప్రతి చర్యా – అపవాదుగా స్వల్ప ఘటనలను మినహాయిస్తే – న్యాయమైందీ, సమంజసమైందీ అని గ్రహించాలి. బంధీలను తలలు కోసి చంపడం, ఫలూజా శివార్లలో కొందరు అమెరికన్ కాంట్రాక్టర్లను ముక్కలు ముక్కలుగా నరికి వేలాడేయడం లాంటి ఘటనలు గత అనేక సంవత్సరాలుగా అమెరికా ఇరాక్‌పై జరుపుతున్న అమానుష దాడులకూ, పాల్పడుతున్న అత్యాచారాలకూ, హత్యాకాండలకూ ప్రతీకారమే.

## పతనమవుతున్న దురాక్రమణదారు సైన్యాల మనోస్థైర్యం

ఇరాక్‌పై దురాక్రమణ జరిపిన నాటి నుండీ అమెరికన్ సైన్యాల మనోస్థైర్యం బాగా పడిపోతున్నది. ఎక్కడ చావు పొంచి ఉందో తెలియని అభద్రతా వాతావరణంలో, ఎందుకోసం ఎవరి కోసం ఈ యుద్ధం చేస్తున్నారో తెలియని అనిశ్చిత పరిస్థితిలో ఏ కిరాయి సైన్యాల పరిస్థితైనా ఇందుకు భిన్నంగా ఉండదు కూడా. ఘోరంగా పతనమవుతున్న మనోస్థైర్యాన్ని నిలబెట్టడానికి దురాక్రమణదారు సైన్యాల ఉన్నతాధికార్లు తరచుగా తమ బలగాలను కలుస్తున్నప్పటికీ ఫలితం ఏమీ ఉండడం లేదు. 72% సైనిక యూనిట్ల మనోస్థైర్యం చాలా తక్కువగా ఉందని పెంటగాన్ స్వయంగా పేర్కొంది. ఇంకా ఘోరమైన విషయం ఏమిటంటే అమెరికన్ సైనికులకు తమ కమాండర్లపై విశ్వాసం పూర్తిగా సన్నగిల్లింది. ఆత్మహత్యల కేసులు బాగా పెరిగిపోయాయి. గతంలో ఆత్మహత్యల రేటు లక్ష మందికి 11.9 ఉండగా 2003లో అది 15.6కు చేరుకుంది. ఇప్పటికి దాదాపు 30 మందికి పైగా సైనికులు మానసిక వత్తిడి వల్ల ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఈస్టర్ పండుగ సందర్భంగా ఇటలీ దేశాధినేత సిల్వియో బెర్లుస్కోని పర్యటన కూడా సంకీర్ణ సేనలలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించలేకపోయింది. అబూ గ్రేబ్ అత్యాచారాలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో అమెరికా రక్షణ మంత్రి రహస్యంగా జరిపిన పర్యటనతో కూడా పరిస్థితిలో మార్పేమీ రాలేదు. ముఖ్యంగా ఏప్రిల్ నుండి ఉధృతమైన ప్రతిఘటన సంకీర్ణ బలగాలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. సంకీర్ణ సైన్య బలగాలనే కాకుండా, అమెరికా భర్తీ చేసుకుంటున్న ఇరాకీ భద్రతా బలగాలనూ, పోలీసులనూ, అమెరికాకు రహస్య ఏజెంట్లుగా పని చేస్తున్న దేశద్రోహులనూ ఎవ్వరినీ తిరుగుబాటుదార్లు మినహాయించడం లేదు. అమెరికాకు చికాకు కలిగిస్తున్న మరో ముఖ్యమైన సమస్య ఏమంటే కొత్తగా ఏర్పాటు చేసిన ఇరాకీ భద్రతా బలగాలు ఇరాకీ యోధులతో సంఘర్షణ ఎదురవుతున్నప్పుడు చేతులెత్తేసి ఎదుటి పక్షంలోకి చేరిపోతున్నాయి. చాలా చోట్ల తమ ఆయుధాలతో సహా తిరుగుబాటుదార్లతో కలిసిపోతున్నారు. అందుకే అమెరికా రిక్రూట్ చేసుకుంటున్న ఇరాకీయులకు భారీ ఆయుధాలివ్వకుండా తేలికపాటి ఆయుధాల్నిస్తున్నది. దీనితో వాళ్లు తిరుగుబాటుదార్ల చేతిలో తేలికగా దెబ్బ తింటున్నారు.

ఇరాకీ తిరుగుబాటును మొదట్లో కొంత మంది మాజీ బాథిస్టులూ, సద్దాం అనుచరులూ చేస్తున్న చిన్న తరహా చర్యలుగా కొట్టి పారేసిన అమెరికన్ సామ్రాజ్యవాదులు ఇప్పుడు ఇది దురాక్రమణకు వ్యతిరేకంగా ప్రజలు సమైక్యంగా సాగిస్తున్న పోరాటమని అంగీకరించక తప్పడం లేదు. వివిధ సంస్థల నాయకత్వంలో సాగుతున్న ఇరాకీయుల ప్రతిఘటనను అపఖ్యాతి చేయడానికి అమెరికా తరచుగా చేస్తున్న మరో దుష్ప్రచారం ఏమిటంటే విదేశీ ఉగ్రవాదులు ఇరాక్‌లో చొరబడి తమ బలగాలపై

## దొంగలు పడ్డ ఆరు నెలలకు...

*కుక్కలు మొరిగాయని ఒక సామెత. ఇరాక్‌పై అమెరికన్-బ్రిటిష్ బలగాలు అన్యాయంగా జరిపిన దురాక్రమణను ఖండించడానికి ఐక్య రాజ్య సమితి సెక్రెటరీ జెనరల్ కోఫీ అన్నాన్‌కు ఆరు నెలలు కూడా కాదు, సంవత్సరంన్నర కాలం పట్టింది. గత సెప్టెంబర్‌లో అమెరికాలో జరిగిన ఐక్య రాజ్య సమితి సాధారణ సభ సమావేశంలో మాట్లాడుతూ ఇరాక్‌పై దురాక్రమణను అన్యాయమైందిగా పేర్కొన్నాడు. అయితే ఇప్పటికే ఇరాక్‌లో వేలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోగా, మరెందరో శాశ్వతంగా అంగవికలురయ్యారు. ఎంతో మంది తమ ఆస్తిపాస్తుల్ని కోల్పోయి చెప్పనలవి కాని బాధలకు గురయ్యారు. ఇంత ఘోర విపత్తు జరిగాక ఇలాంటి ప్రకటన చేసి అన్నాన్ ఎవరిని సంతృప్తి పర్చాలనుకుంటున్నాడు? అమెరికా వత్తిడితో ఇరాక్‌పై ఆంక్షలు విధించడంలో ఎంతో చురుగ్గా పని చేసిన ఐక్య రాజ్య సమితి తన అనేక తీర్మానాలను ఖాతరు చేయని ఇజ్రాయిల్‌పై గానీ, ఎలాంటి తీర్మానం లేకుండానే ఇరాక్‌పై ఏకపక్ష దాడికి పూనుకున్న అమెరికాపై గానీ ఎలాంటి చర్యా తీసుకోలేదన్న విషయం తెలిసిందే. దీనితో అది అమెరికా సామ్రాజ్యవాదుల చేతిలో పనిముట్టేనన్న విషయం ప్రపంచ ప్రజలకు స్పష్టమైంది. ఇప్పుడు అన్నాన్ చేసిన ప్రకటన ప్రజల విశ్వాసం పూర్తిగా కోల్పోయిన ఐక్య రాజ్య సమితిపై కొందరిలోనైనా భ్రమలు కలిగించడానికే తప్ప నిజాయితీతో చేసింది కాదు. నిజాయితీ గానీ, అది చెప్పుకునే నిష్పక్షపాత వైఖరి గానీ దానికి నిజంగానే ఉంటే అమెరికాను దోషిగా బోనెక్కించగలదా? బుష్, బ్లెయిర్, అజ్నార్, హోవార్డ్, రమ్స్‌ఫెల్డ్, డిక్, స్ట్రా, షెరోన్ తదితరులను యుద్ధ నేరస్తులుగా విచారించి శిక్షించాలని డిమాండ్ చేయగలదా?* ★

దాడులు చేస్తున్నారనేది. కానీ వాస్తవానికి అమెరికాయే కిరాయి సెక్యూరిటీ బలగాలను కాంట్రాక్టు పద్ధతిన తెచ్చుకొని ముఖ్యంగా రక్షణ విధులకు ఉపయోగిస్తున్నది. ఇందులో లాటిన్ అమెరికా దేశాల నుండీ, భారతదేశం తదితర ఆసియా దేశాల నుండీ ప్రైవేటు సెక్యూరిటీ సంస్థలలో చేరి పని చేస్తున్న సైనికులు కూడా ఉన్నారు. ఈ విధంగా అమెరికా తన స్వంత సైన్య నష్టాలను నివారించుకోవడానికి యుద్ధాన్ని కూడా ప్రైవేటీకరణ చేస్తున్నది. పాలస్తీనా ప్రజల తిరుగుబాటును క్రూరంగా అణచడంలో అపార అనుభవం ఉన్న ఇజ్రాయిలీ సైనిక అధికార్లు అమెరికన్ బలగాలకు తిరుగుబాటు వ్యతిరేక ఎత్తుగడలలో శిక్షణనిస్తున్నారు. అంతే కాదు, ఇజ్రాయిలీలు ఇంటలిజెన్స్ అధికార్లు ఇరాకీ ప్రతిఘటనకు నాయకత్వం, మార్గదర్శకత్వం వహిస్తున్న నాయకత్వాన్ని అంతమొందించడానికి కుర్దిష్ కమాండోలకు రహస్యంగా ట్రెయినింగ్ ఇస్తున్నారు.

## తలవంచని ఫలూజా

తొలి నుండీ ఫలూజా పట్టణం ఇరాకీయుల తిరుగుబాటుకు ముఖ్య కేంద్రంగా ఉండింది. గత ఏప్రిల్‌లో అమెరికన్ బలగాలు ఈ పట్టణవాసులను ఊచకోత కోసాయి. దురాక్రమణకూ, విచ్చలవిడి అరెస్టులకూ, హత్యలకూ, చిత్రహింసలకూ వ్యతిరేకంగా పెల్లుబికిన క్రోధావేశాలు ప్రజల పోరాటాలలో ప్రతిఫలిస్తున్నాయి. బ్లాక్‌వాటర్ సెక్యూరిటీ కన్సల్టింగ్ అనే కంపెనీ తరఫున పని చేస్తున్న నలుగురు కాంట్రాక్టర్లను మార్చ్ 31న తిరుగుబాటుదార్లు ఒక ఆంబుష్‌లో చంపేశారు. పెంటగాన్ తరఫున పని చేసే ఈ కంపెనీ అమెరికా బలగాలకు ఆహారాన్ని సరఫరా చేసే కాన్వాయ్‌లకు రక్షణ కల్పిస్తుంది. వీళ్లు ఒక అమెరికన్ బేస్ నుండి కార్లో బయలుదేరి ఫలూజాలోకి రాగానే ఇరాకీ పోరాటకారులు గ్రెనేడ్లతో దాడి చేసి చంపేశారు. ఆ తర్వాత ప్రజలు ఈ కార్లపై విరుచుకుపడ్డారు. వీళ్ల శవాలను పట్టణంలోకి ఈడ్చుకెళ్లి స్తంభాలకు వేలాడేసి అమెరికా సామ్రాజ్యవాదం పట్ల తమ తీవ్ర వ్యతిరేకతను ప్రదర్శించారు. అదే రోజున ఫలూజాకు 15 కిలోమీటర్ల దూరంలోని హబ్బానియాలో రోడ్డు పక్కన అమర్చిన ఒక బాంబు పేలడంతో ఐదుగురు అమెరికన్ సైనికులు కుక్కచావు చచ్చారు.

ఈ చర్యలకు ప్రతీకారంగా ఏప్రిల్ 4న 1300 మంది అమెరికన్ మెరైన్లు మొదటి సారిగా ఈ ప్రాంతంలో దిగారు. తిరుగుబాటుకు కోటగా ఉన్న ఫలూజాపై అదుపు సాధించడం కోసం వచ్చిన మూడో అమెరికన్ బలగం ఇది. ఫలూజాను చుట్టుముట్టి కర్ఫ్యూ విధించి వరుసగా ఇళ్లపై దాడులు, అరెస్టులు చేయడం మొదలుపెట్టారు. అయినప్పటికీ రెండు రోజుల తర్వాత కూడా పావు వంతులో సగం పట్టణాన్నే అదుపులోకి తెచ్చుకోగలిగారు. మరో పక్షం రోజుల పాటు పోరాటం కొనసాగింది. మెరైన్లు హెలికాప్టర్లనూ, యుద్ధ విమానాలనూ ఉపయోగిస్తూ ఇండ్ల వరుసలపై విచక్షణారహితంగా దాడులు జరిపారు. ఎఫ్-16 విమానాలు ఒక మసీదుపై బాంబులతో దాడి చేయడంతో 40 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. పట్టణాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవడానికి మెరైన్లు వెర్రిగా ప్రయత్నించారు. గంటల కొద్ది సాగిన ముఖాముఖి పోరాటాల్లో 50 మంది అమెరికన్ మెరైన్లు చచ్చారు. అమెరికన్ మెరైన్లకు సహాయంగా పంపిన ఇరాకీ పోలీసు బలగాలు 'మాయమై' తిరుగుబాటుదార్ల పక్షం చేరిపోయాయి. ఏప్రిల్ 12న స్థానిక ఇరాకీయులతో ఏర్పాటు చేసిన కొత్త 12వ బెటాలియన్‌కు చెందిన 620 మంది సైనికుల్ని ఫలూజాకు పంపగా, షియాలు అధికంగా నివసించే ఒక బస్తీలో వాళ్లపై కాల్పులు చేయడంతో ఆ బెటాలియన్ ఉత్తర ఇరాక్‌లోని తాజిలో ఉన్న తమ బేస్‌కు వెనుదిరిగింది.


ఈ మొత్తం సంఘర్షణలో అమెరికా బలగాలు 600 మంది పౌరులను హత్య చేసి 1250 మందిని గాయపర్చాయి. వీరిలో ఎక్కువ మంది మహిళలూ, పిల్లలే. ఇరాక్‌పై దురాక్రమణ జరిగిన తర్వాత జరిగిన ఘోరమైన హత్యాకాండలలో ఇదొకటి. ఫలూజా దురాక్రమణదారు సైన్యాలకు వ్యతిరేకంగా మొక్కవోని ప్రజా ప్రతిఘటనకు సంకేతంగా మారింది. అమెరికా అనుసరించిన క్రూరమైన ఎత్తుగడల పట్ల సర్వత్రా తీవ్ర నిరసన వ్యక్తమైంది.

నలుగురు ప్రైవేటు సైనికులు కుక్కచావు చచ్చిన తర్వాత పాల్ బ్రెమర్ మా తడాఖా చూపిస్తామని విర్రవీగాడు. అంటే విచ్చలవిడి హత్యాకాండలకు పాల్పడతామనే అర్థం. కానీ సిగ్గులేకుండా కాల్పుల విరమణకు దిగివచ్చి అమెరికన్ మెరైన్లను గ్రామీణ ప్రాంతాలకు ఉపసంహరించుకొని ఫలూజాను ఖాళీ చేయాల్సి వచ్చింది. ఆ విధంగా ఫలూజాలో ప్రారంభించిన 'ఆపరేషన్ ఉక్కు సంకల్పం' ఆపరేషన్ అమెరికన్ మెరైన్ల గొప్ప తిరోగమనంగా ముగిసింది. ఫలూజా పోరాటం ఇరాక్‌ను చాలా గొప్పగా ప్రభావితం చేసింది. అది షియాలకూ, సున్నీలకూ మధ్య గతంలో ఎన్నడూ లేనంత గొప్ప ఐక్యతను ముందుకు తెచ్చింది. దురాక్రమణదారులు ఎంతగా రెచ్చగొట్టినప్పటికీ ఈ రెండు సముదాయాల మధ్య ఐక్యత పెంపొందడం చాలా ప్రాధాన్యత గల అంశం. బాగ్దాద్‌లో ముగ్గురు అమెరికన్లను హతమార్చిన పోరాటంలో షియాలూ, సున్నీలూ సమైక్యంగా పాల్గొన్నారు. దాదాపు వెయ్యి మంది శియాలు అనేక కార్లలో ఆహారాన్నీ, మందుల్నీ తీసుకొని ఫలూజాకు మార్చ్ చేశారు. "సున్నీలూ, షియాలనే తేడాలు మాకు లేవు... ఇస్లామిక్ సమైక్యత వర్ధిల్లాలి... మేం సున్నీ, షియా సోదరులం... మా దేశాన్ని ఎన్నటికీ అమ్ముకోం." అనేవి ప్రజల యుద్ధ నినాదాలే అయ్యాయి.

ఫలూజాలో నివసించే అబ్దుల్ రజ్జాక్ అల్ జౌర్బీ అనే ఒక విలేఖరి మాట్లాడుతూ, "ప్రతి చోటా వీధి పోరాటాలే. వీధుల్లో జనాలంతా రాకెట్ ప్రొఫెల్డ్ గ్రెనేడ్లనూ, కలాష్నికోవ్ రైఫిళ్లనూ, మెషిన్‌గన్లనూ పట్టుకొని కనిపించారు. ప్రతి వ్యక్తీ ఒక యోధుడిగా మారాడు." ఇరాకీయుల ప్రతిఘటనకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందీ పోరాటం.

## మధ్య, దక్షిణ ఇరాక్‌లోని షియా ప్రాంతాలలో రెండో యుద్ధ రంగం

మొత్తం సమస్యలో ఫలూజా సగానికన్నా తక్కువే అని చెప్పాలి. సరిగ్గా 'ఆపరేషన్ ఉక్కు సంకల్పం' మొదలవుతుండగానే మరో యుద్ధరంగానికి కూడా తెర లేచింది. ముప్పై ఏళ్ల యువ షియా మత గురువు ముఖ్తదా అల్ సద్ర్ ఇప్పుడు వీరోచిత ప్రతిఘటనకు ఆదర్శప్రాయుడైన నాయకుడిగా ముందుకొచ్చాడు. నాలుగేళ్ల క్రితం సద్దాం చేతిలో హత్యకు గురైన ప్రజాదరణ గల ఒక మత నాయకుడి కొడుకే అల్ సద్ర్. గత సంవత్సరం ఆయన అల్ మెహ్దీ సేన అనే ఒక సైన్యాన్ని నిర్మించాడు. అందులో వేలాది మంది యోధుల్ని చేర్చుకున్నాడు. ఇరాక్ పాలనా మండలి అధ్యక్షునిగా పని చేసిన పాల్ బ్రెమర్ అల్ సద్ర్ దగ్గరి అనుచరుడిని అరెస్టు చేసి ఆయన నిర్వహిస్తున్న నిప్పులు చెరిగే వార్తాపత్రికను మూసివేశాడు. అమెరికాకు అనుకూలంగా ఉండే ఒక ఉదారవాద షియా మతగురువును గత సంవత్సరం హత్య చేసిన కేసులో అల్ సద్ర్ నిందితుడని పేర్కొంటూ బ్రెమర్ ఆయన అరెస్టుకు ఆదేశించాడు. దానితో అల్ సద్ర్ తన అనుయాయులకు వీధుల్లోకి వచ్చి అమెరికాకు వ్యతిరేకంగా 'జెహాద్' ప్రారంభించాల్సిందిగా పిలుపునిచ్చాడు. బాగ్దాద్‌లోని సద్ర్ సిటీలో అమెరికన్ బలగాలతో పోరాటాలు మొదలయ్యాయి. దక్షిణ, మధ్య ఇరాక్‌లోని అనేక పట్టణాలను మెహ్దీ సైన్యం విముక్తి చేసి తమ అదుపులోకి తీసుకొంది. ఇప్పుడు ఆయన తన వందలాది యోధుల రక్షణలో నజఫ్‌లో ఉన్నాడు. నజఫ్‌లో అమెరికా ఆగస్టు రెండో వారం నుండి దాదాపు నెల రోజుల పాటు తీవ్రమైన దాడులు చేసింది. అల్ సద్ర్ మిలిషియా దాగి ఉన్న ఇమామ్ అలీ దర్గాను విముక్తి చేసే పేరిట అమెరికా జరిపిన క్రూరమైన దాడుల్లో వందలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. సద్ర్‌ను చంపాలనీ, లేదా లొంగదీసుకోవాలనీ, ఆయన సైన్యాన్ని నిరాయుధం చేయాలనీ, నజఫ్‌పై కబ్జా చేయాలనీ అమెరికా ఎంత తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ సఫలం కాలేదు. ఇరాక్ నుండి అమెరికా సైన్యాలు వెళ్లిపోవాలని ఆయన ధైర్యంగా డిమాండ్ చేస్తున్నాడు. ఆయనకు మధ్యంతర ప్రభుత్వంలో స్థానం కల్పిస్తామనే ఆశచూపి లొంగదీసుకోవాలని అమెరికా వేసిన ఎత్తులన్నీ ఇప్పటి వరకు బెడిసికొట్టాయి. "యుద్ధ విమానాల రొదకు భయపడకండి. ధైర్యంగా నిలబడండి" అంటూ ఆయన ఇస్తున్న సందేశాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. నజఫ్, కుఫా పట్టణాలలో అమెరికా హేయమైన దాడులకు పాల్పడింది. అయినప్పటికీ వీటిని అదుపులోకి తెచ్చుకోవడంలో అది ఘోరంగా విఫలమైంది. నజఫ్‌లో విమానాలతో బాంబులు కురిపించి వందలాది మంది యోధులను అమెరికా హతమార్చగా, కుఫాలో 67 మంది మిలిషియా సభ్యులను కాల్చి చంపింది. మరెంతో మంది అమాయక ప్రజల్ని కాల్చి చంపింది. అయితే ఇప్పటికీ నజఫ్‌పై అమెరికా పట్టు సంపాదించలేకపోయింది. అల్ సద్ర్ నాయకత్వంలోని మెహ్దీ సేనలు ముఖ్యంగా దక్షిణ ఇరాక్‌లో బ్రహ్మాండమైన తిరుగుబాటును నిర్వహించాయి. బల్గేరియా, పోలాండ్, స్పెయిన్, ఉక్రెయిన్, అమెరికా దేశాల కిరాయి బలగాలకు బుద్ధి చెప్పాయి.



నజఫ్‌లో మోర్టార్ పేలుస్తున్న మెహ్దీ సేన యోధులు

## అంతులేని సంక్షోభంలో అమెరికా

ఇరాక్‌పై దాడి జరిగి సంవత్సరం పూర్తయిన సందర్భంగా షియాలూ, సున్నీలూ సమైక్యంగా ప్రతిఘటనను ఉధృతం చేశారు. మరోవైపు అమెరికాపై వత్తిడి పెరగసాగింది. అది వేసుకున్న అంచనాలన్నీ తలకిందులై ఖర్చు ఇబ్బడి ముబ్బడిగా పెరిగింది. అమెరికా ఖర్చు 151.1 బిలియన్ డాలర్లకు పెరిగింది. అమెరికన్ ప్రజలపై విపరీతంగా పన్నులు వసూలు చేయడం ద్వారా, సామాజిక సంక్షేమం కోసం చేసే ఖర్చులో గణనీయమైన కోతలు విధించడం ద్వారా అమెరికన్ ప్రభుత్వం ఈ మొత్తాన్ని రాబడుతున్నది. దీనితో అమెరికా ప్రజల్లో నిరసన పెరుగుతున్నది. అమెరికా యుద్ధ లక్ష్యాల్లో ఒకటైన ఇరాక్ చమురును దోచుకొని లాభాలు రాబట్టుకోవాలన్న ఆశలు ప్రస్తుతానికైతే నెరవేరడం లేదు. అమెరికా విధించిన ఆంక్షలన్నీ తట్టుకొని సద్దాం వెలికి తీసినంత చమురు కూడా అమెరికా తీసుకోలేకపోతున్నది. పైప్‌లైన్లపై నిరంతరాయంగా సాగుతున్న దాడులు దాని ప్రయత్నాలను సాగనివ్వడం లేదు. ఇరాక్ వద్ద మానవ సంహారక ఆయుధాలున్నాయనీ, ఇరాక్‌కు అల్ కాయిదాతో సంబంధాలున్నాయనీ ప్రభుత్వం చెప్పిన సాకులన్నీ పచ్చి అబద్ధాలుగా తేలిపోయాయి. దాంతో ప్రపంచ ప్రజల్లో, ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ ప్రజలలో అసంతృప్తి తీవ్రంగా పెరిగిపోయింది. బుష్, బ్లెయిర్‌లు తమ స్వంత దేశాల్లోనూ, విదేశ పర్యటనల సందర్భంగానూ లక్షలాది ప్రజల నిరసన ప్రదర్శనలను ఎదుర్కోవల్సి వస్తున్నది. స్పెయిన్‌లో జరిగిన ఎన్నికల్లో అజ్నార్ నాయకత్వంలోని మితవాద పార్టీ ఓటమి పాలవడంతో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం ప్రజల వత్తిడి మేరకు తన ఎన్నికల వాగ్దానాన్ని అమలు చేస్తూ ఇరాక్ నుండి తమ సైన్యాలను ఉపసంహరించుకుంది. ఫిలిప్పీన్స్, మరి కొన్ని దేశాలు కూడా తమ దేశాల్లో తలెత్తే రాజకీయ సంక్షోభాన్ని నివారించడం కోసం తమ బలగాల్ని ఇరాక్ నుండి వెనక్కి తీసుకున్నాయి. అమెరికాలోనూ, బ్రిటన్‌లోనూ కొద్ది నెలల తేడాతో జరగాల్సిన ఎన్నికల్లో బుష్, బ్లెయిర్‌ల ఓటమి తప్పదని సర్వేలు వెల్లడిస్తున్నాయి. దాంతో ఈ సంక్షోభాన్ని ఎలాగైనా తప్పించుకొని తమ ఎన్నికల విజయావకాశాలను మెరుగుపర్చుకోవడానికి బుష్-బ్లెయిర్‌ల ద్వయం తీవ్రంగా

పాటుపడుతున్నది. ఇరాక్ యుద్ధంలో ఘోరంగా దిగబడ్డ అమెరికా తన సైన్య నష్టాల్నీ, ఖర్చునూ తప్పించుకోవడానికీ ఇతర దేశాల సైనికుల్ని రప్పించాలని చేసిన ప్రయత్నాలు పాక్షికంగానే ఫలప్రదమయ్యాయి. 20 వేల మంది సైనికుల్ని బదిలీ చేయాల్సి ఉండగా ఆ సంఖ్యను నింపడానికి దానికి తల ప్రాణం తోకకొచ్చింది. కొద్ది సంఖ్యలోనే అయినప్పటికీ అమెరికన్ సైనికులు పారిపోవడం మొదలైంది. పెంటగాన్‌పై బలగాల కోసం విపరీతంగా పెరుగుతున్న వత్తిడి మూలంగా అది గాయపడ్డ సైనికులు కాస్త కోలుకోగానే, డాక్టర్లు వద్దని చెబుతున్నప్పటికీ తిరిగి ఇరాక్‌కు పంపుతున్నది. మరోవైపు తమ పిల్లల్ని వెనక్కి రప్పించాలని సైనికుల కుటుంబాలు బాగా డిమాండ్ చేస్తున్నాయి. మొత్తం మీద అమెరికా ఇరాక్ పట్ల బుష్ అనుసరిస్తున్న విధానాల పట్ల తీవ్ర నిరసన వెలువడుతోంది. దాంతో ఆగస్టులో బుష్ యూరోప్, ఆసియాలలో ఉన్న 70 వేల మంది సైనికుల్ని వెనక్కి రప్పిస్తున్నట్టుగా ప్రకటించి ఓటర్లను సంతృప్తి పర్చే ప్రయత్నం చేశాడు. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత అమెరికా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఇదే మొదటిసారి.

అబూ గ్రేబ్ జైళ్లో జరిగిన అత్యాచారాలతో, ఇరాక్ వద్ద మానవ సంహారక ఆయుధాలున్నాయని ఆడిన అబద్ధాలతో ఇరాక్ పాలనా మండలి ఘోరంగా అపఖ్యాతి పాలైంది. దాంతో ఏదో ఒక విధంగా ఒక తొత్తు ప్రభుత్వాన్ని స్థాపించకుండా యుద్ధ భారాన్ని ఐక్య రాజ్య సమితి పైకి నెట్టేయడం వీలు కాదు కనుక అమెరికా తొత్తు ప్రభుత్వ స్థాపనకు వేగిరపడింది. అయితే తన నమ్మిన బంటైన అహ్మద్ చలాబీ "పూర్తి సార్వభౌమాధికారం" కావాలని మొండికేయడంతో అతన్ని కీలుబొమ్మ ప్రభుత్వానికి నాయకుడిగా పెట్టాలని ముందుగా చేసిన ప్రతిపాదనను విరమించుకోవల్సి వచ్చింది. నిన్నటి దాకా అమెరికాకు పూర్తి బంటుగా ఉన్న చలాబీ ఒక్క దెబ్బతో ఘోరమైన శత్రువుగా మారాడు. దాంతో సీఐఏ ఇన్‌ఫార్మరూ, అమెరికాకు మరో నమ్మకమైన తొత్తూ అయిన ఇయాద్ అలావీకి అది కీలుబొమ్మ ప్రభుత్వం పగ్గాల్ని అప్పజెప్పడానికి నిశ్చయించుకుంది. అయితే, ఐరాస తీర్మానం లేకుండానే ఇరాక్‌పై దురంహకారపూరితంగా దాడి జరిపిన అమెరికాకు కీలుబొమ్మ ప్రభుత్వ స్థాపనకు సంబంధించి ఐరాస తీర్మానం కావాల్సి వచ్చింది. కానీ అది తన తీర్మానాన్ని నెగ్గించుకోవడానికి నానా అగచాట్లు పడాల్సి వచ్చింది. ఐదు సార్లు ముసాయిదా తీర్మానాన్ని సవరించాల్సి వచ్చింది.

## ఆదరాబాదరాగా జరిగిన తొత్తు ప్రభుత్వ స్థాపన

అమెరికన్ సామ్రాజ్యవాదులు తమ తొత్తైన చలాబీతో వ్యవహారం బెడిసికొట్టిన తర్వాత ఇయాద్ అలావీ నాయకత్వంలో మధ్యంతర ప్రభుత్వం అనే పేరుతో ఒక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని స్థాపించాలని నిర్ణయించారు. సరిగ్గా ఆఫ్గనిస్తాన్‌లో కూడా ఇదే విధంగా హామిద్ కర్జయ్ నాయకత్వంలో ఒక కీలుబొమ్మ ప్రభుత్వాన్ని స్థాపించిన విషయం తెల్సిందే. అలావీ ఒక సీఐఏ ఇన్‌ఫార్మర్, కరడుగట్టిన హంతకుడూ అనే విషయం ఇరాక్‌లో చిన్న పిల్లలకు కూడా తెలుసు. వీడితో పాటు కీలుబొమ్మ ప్రభుత్వంలో అమెరికా నియమించిన అధికారులంతా అమెరికా తొత్తులుగా పేరుమోసిన వాళ్లే. మరోవైపు ఈ అధికార మార్పిడి ఉత్త బూటకమని ప్రకటిస్తూ ఇరాకీ తిరుగుబాటుదార్లు తమ ప్రతిఘటనను జూన్ చివరికల్లా ఉధృతం చేశారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యులైన ఫ్రాన్స్, జర్మనీ, రష్యా, చైనాలు చెప్పిన అభ్యంతరాల మూలంగా ఐదు సార్లు సవరించిన ముసాయిదా తీర్మానాన్ని అమెరికా, బ్రిటన్‌లు ప్రవేశపెట్టగా భద్రతా మండలి ఆమోదించింది. ఈ తీర్మానం ప్రకారం ఇరాక్‌కు అమెరికా కనుసన్నలలో పూర్తి "సార్వభౌమాధికారాన్ని" ఇస్తారని చెప్పారు. షియాల మిలిటెంట్ మత నాయకుడు ముఖ్తదా అల్ సద్ర్ దీన్ని వ్యతిరేకించాడు. సున్నీలు ప్రధానంగా ఉన్న "ఇస్లామిక్ ఫ్రంట్ ఫర్ ఇరాకీ రెసిస్టెన్స్" అనే పోరాట సంస్థ అలావీ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని "ముసుగు కప్పిన దురాక్రమణ" అని ప్రకటించింది.

జూన్ 30న ఇరాక్ పాలనా మండలి నుండి పాల్ బ్రెమర్ చేతుల మీదుగా ఇయాద్ అలావీకి అధికారం బదలాయించాల్సి ఉండె. ఘనంగా జరగాల్సిన ఉత్సవానికి "విముక్తి ప్రదాత" జార్జ్ బుష్‌ను కూడా ఆహ్వానించాల్సి ఉండె. కానీ ఇరాకీయుల ప్రతిఘటనకు జడిసి ఆ తేదీని ఎవరికీ తెలియకుండా మూడు రోజులు ముందుకు జరిపి అధికార మార్పిడి తతంగాన్ని గప్‌చుప్‌గా కానిచ్చారు. పాల్ బ్రెమర్ స్థానాన్ని అమెరికన్ రాయబారి హోదాలో జాన్ నీగ్రోపోంట్ ఆక్రమించాడు. "ఉగ్రవాద వ్యతిరేక చర్యలలో" నిపుణుడిగా ఇరాక్‌కు వచ్చిన పాల్ బ్రెమర్ చివరికి ఎవరికీ చెప్పా పెట్టకుండా ఇరాక్ నుండి పోవాల్సి వచ్చింది. స్పష్టంగా మొత్తం దేశమంతా అమెరికన్ దురాక్రమణకూ, తొత్తు ప్రభుత్వానికీ వ్యతిరేకంగా నిలిచిన తర్వాత అతనికి అంతకన్నా గత్యంతరం కూడా ఏమీ లేదు. ఇరాక్‌లో ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 3,000 మంది సిబ్బందితో అమెరికా రాయబార కార్యాలయాన్ని నిర్మించింది. ఇప్పుడు ఈ కార్యాలయమే తొత్తు ప్రభుత్వాన్ని నియంత్రిస్తుంది. దాదాపు లక్షన్నర సైన్యంతో తొత్తు ప్రభుత్వాన్ని ప్రజల క్రోధాగ్ని నుండి కాపాడడానికి ప్రయత్నిస్తుంది. ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం ప్రకారం ఏడు నెలల లోగా ఇరాక్‌లో ఎన్నికలు జరిపించాలి. కానీ ఇప్పటి వరకు వస్తున్న రిపోర్టులను బట్టి ఎన్నికల సందర్భంగా మరింత పెద్ద ఎత్తున ప్రజల ప్రతిఘటన కొనసాగొచ్చు, దేశంలోని విశాల ప్రాంతాలలో అసలు ఎన్నికలే జరుగకపోవచ్చు. అయితే బైటి ప్రపంచాన్ని మోసం చేయడానికి అమెరికా ఏదో విధంగా ఆ తతంగాన్ని పూర్తి చేయవచ్చు, మన దేశంలో కాశ్మీర్‌లో జరిపిస్తున్న విధంగా. ఇరాక్‌లో అమెరికా బలగాలున్నంత వరకు ఎవరు ప్రభుత్వంలో ఉన్నా అది స్వాతంత్ర్యం అనిపించుకోదు, దానికి సార్వభౌమాధికారం కూడా ఉండదు. ఈ విషయం పోరాటశీలురైన ఇరాకీయులకు స్పష్టంగా తెలుసు.

## ఆగకుండా సాగుతున్న ప్రతిఘటన

తన సైన్యాలకు ఇరాకీయులు విముక్తి దాతలుగా స్వాగతం పలుకుతారని అమెరికా నమ్మింది. బాథ్ ప్రభుత్వ అధికార్లనూ, సద్దాంనూ అరెస్టు చేయడంతో ఇరాక్ తమ నియంత్రణలోకి వస్తుందని అది నమ్మింది. ఇప్పుడు అమెరికా ఇచ్చామని చెబుతున్న సార్వభౌమత్వం ఒట్టి బూటకం. ఇరాక్‌లో అమెరికా బలగాలు ఎప్పటి దాకా ఉంటాయన్న ప్రశ్నకు ఇంకా స్పష్టమైన జవాబు చెప్పడం లేదు. ఇరాకీ ప్రజలు ఈ బూటకపు స్వాతంత్ర్యాన్ని ఏ మాత్రం అంగీకరించడం లేదు. తమ గడ్డపై నుండి విదేశీ సైన్యాలు వెనక్కి పోయే దాకా ప్రతిఘటన సాగుతుందని ప్రకటిస్తున్నారు. కీలుబొమ్మ ప్రభుత్వం అమెరికా సైన్యాల కనుసన్నల్లో జరుప తలపెడుతున్న ఎన్నికల్ని వాళ్లు ఒక నాటకమని గేలి చేస్తున్నారు. సాపేక్షికంగా బలహీనమైన శక్తి బలమైన శత్రువును కూడా ముప్పుతిప్పలు పెట్టగలదనే చారిత్రక సత్యాన్ని ఇరాకీ ప్రజల ప్రతిఘటన మరోసారి రుజువు చేసింది. పందొమ్మిదో శతాబ్దపు తొలి దినాల్లో హైతీలో విజయవంతమైన బానిసల విప్లవం నాటి నుండి మావో సేటుంగ్ నాయకత్వాన జరిగిన చైనా విప్లవం దాకా, ఓ మేరకు 1950, 1960 దశాబ్దాలలో జరిగిన వలస వ్యతిరేక యుద్ధాల్లో కూడా,

*(తరువాయి 22వ పేజీలో........)*

# అబూ ఘ్రేబ్ జైళ్లో ఇరాకీ ఖైదీలపై అమెరికన్ సైనికుల అమానవీయ అత్యాచారాలు

ఇరాక్‌కు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించే సాకుతో ఇరాక్‌పై దాడి జరిపిన అమెరికా అసహ్యకరమైన రూపం బైటికొచ్చింది. దాని అత్యంత అమానవీయమైన స్వభావం ప్రపంచ ప్రజల ముందు ఫోటోలతో సహా వెల్లడైంది. అబూ ఘ్రేబ్ జైళ్లో ఇరాకీ పౌరులపై అమెరికన్ సైనికులు జరుపుతున్న ఘోరమైన అత్యాచారాల దృశ్యాలను చూసి ప్రపంచ ప్రజానీకం నివ్వెరపోయింది. నిస్సహాయులైన ఖైదీలపై అమెరికా అమలు చేస్తున్న 'ప్రజాస్వామ్యం' ఇప్పుడు సాక్ష్యాధారాలతో సహా బట్టబయలైంది. వీటిని కొట్టి పారేయడం వీలు కాదు కనుక అమెరికా సైన్య, పాలనా అధికార్లు క్షమాపణ కోరుకుంటున్నారు. రాబందు లాంటి రమ్స్‌ఫెల్డ్ కందిపోయిన ముఖంతో సైనికులు జరిపిన ఈ చర్యలు పైశాచికమైనవనీ, క్రూరమైనవనీ, అమానవీయమైనవనీ ఒప్పుకోవల్సి వచ్చింది.


నగ్నంగా నిలబెట్టి కరెంటు షాక్ ఇస్తున్న దృశ్యం

అయితే వాస్తవం ఏంటంటే, జనవరి ఆఖరు నుండే ఈ ఫోటోల సంగతి అమెరికన్ రక్షణ శాఖకు స్పష్టంగా తెలుసు. అది అంతర్గత విచారణకు ఆదేశించినప్పటికీ సైన్య కార్యాలయపు నాలుగ్గోడల మధ్యన వాస్తవాల్ని సమాధి చేయాలనుకుంది. కానీ అమెరికాలోని కొన్ని టీవీ ఛానెళ్లూ, కొన్ని పత్రికలూ ఈ ఫోటోల్ని సంపాదించాయి. ఆ తర్వాత రమ్స్‌ఫెల్డ్, వాడి అనుచరగణం దీని ద్వారా ఇరాక్‌లో అమెరికా సైన్యాలకు ప్రమాదం కలుగుతుందని విజ్ఞప్తి చేస్తూ ఈ ఫోటోల ప్రసారాల్ని వాయిదా వేయించడానికి చేయగలిగినంతా చేశారు. సీబీఎస్ అనే టీవీ ఛానెల్ ముందుగా రమ్స్‌ఫెల్డ్ మాటల్ని ఒప్పుకుంది కానీ ఇవి మరొకరికి కూడా దొరికాయని తెలియడంతో ప్రసారం చేసింది.

సాయుధ బలగాలు జరిపే అత్యాచారాలకు సంబంధించి ప్రజలకు స్పష్టమైన, నిరాకరించ వీలులేని సాక్ష్యాలు లభించిన చాలా అరుదైన ఘటన ఇది. ప్రజాస్వామ్య సాంప్రదాయాల గురించి గొప్పలు చెప్పుకునే అమెరికా ప్రపంచవ్యాప్తంగా మానవహక్కుల రక్షకుడిగా పెద్ద పోజు కొడుతుంది. అమెరికా విదేశాంగ శాఖ తనకు అనుకూలంగా లేని దేశాలలో జరిగే మానవ హక్కుల ఉల్లంఘన గురించి ఏటేటా రిపోర్టులు వెలువరిస్తుంటుంది. ఈ ఫోటోలు బైటికి రావడంతో మేలో జరగాల్సిన వార్షిక ప్రపంచ మానవ హక్కుల రిపోర్టు ప్రచురణను "సాంకేతిక కారణాలతో" నిలిపివేసింది. ఈ ఫోటోలు బహిరంగం కాకపోయి ఉంటే అమెరికా ఈ రిపోర్టులో తన రికార్డు చాలా గొప్పగా ఉందని ప్రకటించుకునేదే.


వాస్తవాన్ని అణచివేయడం సాధ్యం కాదని రమ్స్‌ఫెల్డ్‌కు తెలుసు గనుకనే అమెరికన్ పార్లమెంట్ సభల ముందు మూజువాణీ సాక్ష్యం ఇస్తూ "ఇంతకంటే కూడా హృదయవిదారకమైన ఫోటోలున్నాయి" అని అన్నాడు. సెనేట్, ప్రతినిధుల సభకు చెందిన ఎంపిక చేసిన సభ్యులకు దాదాపు 1600 ఫోటోలు చూపించారు. ఈ అత్యంత క్రూరమైన దృశ్యాలను చూసి చాలా మంది అవాక్కయ్యారు. తమ ఉన్నత విలువలు గల నాగరికత ఈ ప్రపంచాన్ని నాగరికతా శత్రువుల నుండి రక్షించడానికి చేస్తున్న ప్రయత్నాలను చూసి నిశ్చేష్టులయ్యారు.

బ్రిటిష్, అమెరికన్ ప్రత్యేక బలగాలకు నేర్పించే పద్ధతులతో జైళ్లో అమలు చేసిన అవమానకరమైన లైంగిక దుశ్చర్యలు సరిపోలుతాయని గార్డియన్ పత్రిక రాసింది. నిజానికి అమెరికన్ సైన్యం ఖైదీల పట్ల అమర్యాదకరంగా ప్రవర్తించడం గురించీ, నియమాల ఉల్లంఘన గురించీ 16 నెలల క్రితమే రిపోర్టులు వెలువడ్డాయి. కాబుల్ శివార్లలో గల బగ్రాం వాయుసైన్య స్థావరంలోనూ, డిగో గార్షియాలోనూ అమెరికన్ ఇంటలిజెన్స్ ఏజెంట్లు అనుమానితులను చిత్రహింసలకు గురిచేస్తున్నారన్న విషయాన్ని రిపోర్టులో సాక్ష్యాధారాలతో సహా పేర్కొన్నారు. అంతర్జాతీయ మీడియా దీనికి అంతగా ప్రాముఖ్యత ఇవ్వలేదు. అమెరికన్ కాంగ్రెస్ దీన్ని పట్టించుకోలేదు. అమెరికన్ ప్రభుత్వం దీన్ని తోసిపుచ్చింది.

## నష్టాల నియంత్రణ

ఏదో ఒక రోజున ఈ అవమానకరమైన చర్యలు బట్టబయలవుతాయని అమెరికా రక్షణ శాఖకు ముందే తెలుసు కనుక అది నష్టాల నియంత్రణకు సిద్ధమైంది. అది ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అత్యాచారాలను ఒప్పుకుంది. ఆ తర్వాత మేజర్ జనరల్ ఆంటోనియో తగుబా సమర్పించిన రహస్య నివేదిక పత్రికలకు లీక్ అయ్యింది. అందుకే రమ్స్‌ఫెల్డ్ ఇంతకన్నా దుర్భరమైన ఫోటోలు కూడా ఉన్నాయని ఒప్పుకున్నాడు. బుష్, రమ్స్‌ఫెల్డ్, బ్లెయిర్‌లు తమకేమీ పాత్ర లేదంటూ నేరాన్ని కింది స్థాయి అధికార్లపైకీ, సైనికుల పైకీ నెట్టేసి "లోతైన క్షమాపణలు" చెప్పుకున్నారు. రమ్స్‌ఫెల్డ్ దీన్ని "అమెరికాకు వ్యతిరేకమైందిగా, మతిభ్రమించిన చర్య"గా పేర్కొన్నాడు.

ఈ "మతిభ్రమణ సిద్ధాంతాన్ని" విభేదిస్తూ మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. 37 మంది ఇరాకీ, ఆఫ్గన్ ఖైదీలు అమెరికన్ కస్టడీలో మరణించారని రక్షణ శాఖ అధికార్లు ఒప్పుకున్నారు. ఇవన్నీ


కుక్కల్ని ఉసిగొల్పుతున్న దృశ్యం



నగ్నంగా నిలబెట్టి హింసిస్తున్న దృశ్యం

డిసెంబర్ 2002 తర్వాత జరిగినవే. ఇలాంటి 35 కేసులపై విచారణ జరగగా వీటిలో 10 కేసులు బలాత్కారం, దాడి, గాయపర్చడం వంటివని తేలింది. గ్వాంటెనామో అఖాతంలో ఉన్న ఖైదీల సంగతైతే ఎవరికీ తెలియదు. జాతీయ భద్రత అనే ముసుగులో ఖైదీల గురించిన సమాచారాన్నంతా రహస్యంగా ఉంచారు. ఇక ఖైదీల పరిస్థితుల గురించి మాట్లాడనవసరమే లేదు. వాళ్లకు రక్షణనిచ్చే చట్టబద్ధమైన ప్రక్రియ ఏదీ లేదు. జెనీవా ఒప్పందం కూడా వాళ్లకు వర్తించదు.

ఇరాకీ ఖైదీలపై లైంగికపరమైన దుశ్చర్యలు మేజర్ జనరల్ ఏ. మార్క్స్ అభివర్ణించినట్టుగా "చెడ్డ పనులు చేసే కొందరు ధూర్త సైనికులు" కనిపెట్టినవేమీ కావు. సైన్య ఇంటరాగేటర్లకు శిక్షణనిచ్చే ఈ అధికారి తాము ఇలాంటి పద్ధతుల్ని ఎంత మాత్రం నేర్పించడం లేదని అన్నాడు. అయితే ఇందుకు పూర్తిగా వ్యతిరేకంగా, వాస్తవమేమంటే లైంగికపరమైన అవమానాలు ప్రత్యేక బలగాలు ఉపయోగించే పద్ధతుల్లో భాగం. ఇప్పుడు ఈ పద్ధతుల్ని సాధారణ బలగాలకూ, ప్రైవేటు ఇంటరాగేటర్లకూ కూడా వర్తింపజేస్తున్నారు. ఈ టెక్నిక్‌ను ఆర్2ఐ (రెసిస్టెంట్ టు ఇంటరాగేషన్) అని వ్యవహరిస్తున్నారు. ఇరాక్ నుండి వెనక్కి వచ్చిన ఒక మాజీ బ్రిటిష్ ప్రత్యేక బలగాల అధికారి ఈ పద్ధతిని అమెరికా, యూరోప్ అంతటా "పట్టుబడడంతో కలిగే దిగ్భ్రమను కొనసాగేలా చేయడం కోసం" నేర్పిస్తున్నారని అన్నాడు. "నాగరికతల" అత్యున్నత విలువలు నగ్నంగా బట్టబయలవుతున్నాయి!

ఈ ఉదంతం బైటికి పొక్కిన తర్వాత కొంత మంది ఖైదీలను విడుదల చేశారు కనుక ఫోటోలు చెబుతున్న వాస్తవాలకన్నా మించిన సాక్ష్యం వెలువడుతోంది.

## ఖైదీల సాక్ష్యాలు

మేజర్ జనరల్ తగుబా సేకరించిన ఈ సాక్ష్యాలు రక్షణ శాఖ నిర్వహించిన అంతర్గత విచారణలో భాగం. ఈ సాక్ష్యాలను జనవరి 2004లో సేకరించారు. ఈ విచారణా నివేదికను రహస్యంగా ఉంచినప్పటికీ ఆ తర్వాత అది లీక్ అయ్యింది.

ఇందులో పేర్కొన్న చిత్రహింసలు బైటికి వెలువడ్డ ఫోటోలలో ఉన్న దృశ్యాలకన్నా దారుణమైనవి. అమెరికన్ అధికార్లు ఖైదీలపై ఎక్కి కూర్చుని జంతువుల్లా స్వారీ చేస్తారనీ, మహిళా సైనికులు ఖైదీలను లైంగికపరమైన అవమానాలకు గురి చేస్తారనీ, మరుగుదొడ్లలో ఆహారాన్ని పడవేసి తీసుకొని తినేలా బలవంత పెడతారనీ, మర్మావయాలకు కరెంట్ షాక్‌లిస్తారనీ, పంది మాంసాన్నీ మద్యాన్నీ తీసుకునేలా బలవంత పెట్టి ఇస్లాంను వదిలిపెడుతున్నట్టుగా ఒప్పుకోమంటారనీ, విపరీతంగా కొడతారనీ ఇంకా ఎన్నెన్నో హృదయాల్ని కలచివేసే ఘోరమైన హింసల గురించి ఇరాకీ ఖైదీలు చెప్పారు. తండ్రీ కొడుకులిద్దరినీ బట్టలు విడిపించి నగ్నంగా కోళ్లను కుమ్మినట్టుగా ఒక డబ్బాలో రోజుల తరబడి ఉంచిన ఘటనను ఖైదీలు విలవిలలాడుతూ చెప్పారు. ఖైదీలందరినీ నగ్నంగా కుప్పగా కుదేసి వాళ్లు స్వలింగ సంపర్కం చేసుకునేలా బలవంత పెట్టడం, మర్మావయాల పైన రైఫిల్ బట్లతో కొట్టడం, వాళ్లపై మూత్ర విసర్జన చేయడం లాంటి ఎన్నో దారుణ సంఘటనలు బైటికి వచ్చాయి. 372వ మిలిటరీ పోలీసు కంపనీ సభ్యుడైన చార్లెస్ గార్నెర్ అనే వాడు, బ్రిగేడియర్ జనరల్ జేనిస్ కార్పిన్‌స్కీ అనే మహిళా అధికారి అబూ ఘ్రేబ్ జైల్లో పరమ క్రూరులుగా పేరు గాంచారు. తిరుగుబాటును అణచడానికి రూపొందించినవి ఇలాంటివే ఇరాక్‌లో మొత్తం 16 జైళ్లున్నాయి. ఈ ఉదంతం బైటికి వచ్చిన తర్వాత 240 మంది ఖైదీలను విడుదల చేసినప్పటికీ ఇంకా 7,000 మంది ఖైదీలు ఉన్నారు. ఇవి కాకుండా అనేక అనధికారిక సెల్స్ ఉన్నాయి. అమెరికా బేస్‌ల పక్కనే ఉండే వీటిలోకి ఎవరినీ అనుమతించరు.

## ప్రపంచ వ్యాప్త ఆక్రోశం

ఈ దారుణ అత్యాచారాలతో ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున కసీ, కోపం పెల్లుబుకాయి. సంకీర్ణ సేనలు వెనుదిరిగి పోవాలనే వత్తిడి పెరిగింది. మే 5న అబూ ఘ్రేబ్ జైల్లోని ఖైదీలు కుటుంబ సభ్యులు దాదాపు 10,000 మంది కదిలి తమ బంధువులను విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. ముస్లిం దేశాలలో, అరబ్ ప్రపంచంలో పెద్ద ఎత్తున నిరసన పెల్లుబికింది.

గతంలో ఖైదీగా ఉన్న 19 ఏళ్ల అబ్దుల్ రజ్జాక్ అనే యువకుడు "ఇలాంటి అత్యాచారాలకు గురైన తర్వాత అమెరికాను అసహ్యించుకోకుండా ఎలా ఉండగలం?" అని ప్రశ్నించాడు. షియాల తిరుగుబాటు నాయకుడు ముక్తదా అల్ సద్ర్ "ఇరాకీ ఖైదీలను హింసించి ఆనందం పొందే శాడిస్టుల నుండి ఎలాంటి ప్రజాస్వామ్యాన్నీ, స్వాతంత్ర్యాన్నీ ఆశించగలం?" అని ఆక్రోశాన్ని వెలిబుచ్చాడు.

ప్రస్తుతం కింది స్థాయి అధికార్లపైనా, సాధారణ సైనికుల పైనా కోర్ట్ మార్షళ్లు జరుగుతున్నాయి. వీళ్లను చిన్నపాటి శిక్షలతో వదిలేస్తారన్నది స్పష్టమే. అయితే ఉన్నత స్థాయి సైనికాధికార్లను మాత్రం ముట్టుకోరు. అందుకే పారదర్శికతను పాటిస్తానని డబ్బా కొట్టుకొనే రమ్స్‌ఫెల్డ్ తన సాక్ష్యంలో ఇరాకీ ఖైదీలను ప్రశ్నిస్తూ హింసిస్తున్నప్పుడు ఉన్నత స్థాయి కమాండర్లుగా ఉన్నదెవరు అని అడిగిన ప్రశ్నకు జవాబు దాటవేశాడు. వాస్తవానికి ఇరాక్‌లో "కఠినమైన" ఇంటరాగేషన్ పద్ధతులు అమలు చేయడానికి రమ్స్‌ఫెల్డ్, రక్షణ గూఢచర్య శాఖ సహాయ కార్యదర్శి స్టీఫెన్ కాంబోన్‌లు ఇరువురూ 2003లోనే ఆమోదం తెలిపారన్న విషయం గత మేలో బైటపడింది. అమెరికా సైన్యం కొద్ది మంది కమిషన్డ్, నాన్-కమిషన్డ్ అధికార్లను మాత్రమే సస్పెండ్ చేసింది. మిగతా అంతా సవ్యంగానే ఉందట! అమెరికన్ ప్రజాస్వామ్యమా, జోహార్ !

రమ్స్‌ఫెల్డ్ రాజీనామా చేయాలనే డిమాండ్ పెద్ద ఎత్తున ముందుకు వచ్చింది. అతన్ని చిత్రహింసలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ ఒప్పందాన్నీ, జెనీవా ఒప్పందాన్నీ ఉల్లంఘించినందుకు గాను యుద్ధ నేరాలను విచారించే ట్రిబ్యునల్‌లో తప్పక విచారించాలి. ఇరాకీ ప్రజలు సామ్రాజ్యవాదులను తప్పక శిక్షిస్తారు. మానవజాతి సిగ్గుతో తలదించుకునే రీతిలో అమెరికా సైన్యాలు పాల్పడ్డ ఘోరమైన అత్యాచారాల దృశ్యాలను కళ్లారా చూసిన ప్రపంచ ప్రజానీకం, ముఖ్యంగా ఇరాకీ ప్రజలు మరింత కసితో అమెరికాతో పోరాడి దాన్నీ, దాని తొత్తు దేశాల సైన్యాలను పిచ్చి కుక్కల్ని తరిమేసినట్టు తరిమేస్తారు. ఆ రోజు ఎంతో దూరం లేదు. ✶

# విలియం హింటన్ (1919-2004)

# ఒక విప్లవానికి సాక్షిగా నిల్చిన ప్రజా రచయిత

మే 15, 2004 ఉదయం అమెరికాలోని చికాగో నగరంలో విలియం హింటన్ కనుమూసాడు. విలియం హింటన్ అనగానే ఎవరికైనా చైనాలోని షాన్సీ రాష్ట్రంలోని లాంగ్‌బో గ్రామం గుర్తుకొస్తుంది. చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ఆ గ్రామంలో జరిగిన విప్లవకర భూసంస్కరణల గురించి వివరంగా వర్ణిస్తూ ఆయన రాసిన పుస్తకం 'ఫాన్‌షెన్' గుర్తొస్తుంది. ప్రపంచ పీడిత ప్రజలు చిరకాలం గుర్తుంచుకునే అమెరికన్లు ఎడ్గార్ స్నో, ఏగ్నెస్ స్మెడ్లీ, నార్మన్ బెతూన్‌ల సరసన ఇప్పుడు విలియం హింటన్ చేరాడు. వీళ్లంతా ప్రపంచంలో నాలుగో వంతు జనాభా జీవితాల్ని మార్చి వేసిన చైనా విప్లవపు ప్రాముఖ్యతను చాలా ముందుగానే గుర్తించడమే కాకుండా, ఎన్నో ప్రయాసల కోర్చి ఆ విప్లవంలో హృదయపూర్వకంగా పాల్గొన్నారు. ఆ విప్లవం ముందుకు సాగుతుండగా ఆ క్రమాన్నంతా అద్భుతంగా రికార్డు చేసారు.



1919లో జన్మించిన హింటన్ తన పదిహేడవ ఏటనే బతుకు దెరువు కోసం సుదూర తూర్పు దేశాలకు వలస వెళ్లాడు. గిన్నెలు తోముతూ బతుకు వెళ్లదీస్తున్న క్రమంలో జపాన్‌లో ఒక ఇంగ్లీషు వార్తా పత్రికలో రిపోర్టర్‌గా ఆరు నెలల పాటు ఉద్యోగం దొరికింది. ఆయన జపాన్ నుండి దక్షిణ కొరియా మీదుగా చైనాకూ, అటు నుండి సోవియట్ యూనియన్, పోలాండ్, జర్మనీల మీదుగా తిరిగి అమెరికా చేరాడు. అక్కడ ఆయన ఒక సరుకుల నౌకలో నావికుడిగా పని చేశాడు.

1942లో ఆయన ఎడ్గార్ స్నో రాసిన "చైనాపై అరుణతార" అనే పుస్తకాన్ని చదివాడు. అది ఆయన జీవితాన్నే మార్చేసింది. ఆయన మాటల్లోనే అది ఆయన ప్రాపంచిక దృక్పథాన్ని శాంతివాదం నుండి మార్క్సిజం వైపు మళ్లించింది. ప్రపంచంలో చాలా మంది చైనాను చాంగ్ కైషేక్ కొమింటాంగ్‌తోనే గుర్తిస్తుండే రోజుల్లో ఎడ్గార్ చేసిన అద్భుతమైన కృషి వల్లనే ప్రపంచానికి ఎర్ర చైనా గురించి తెల్సింది. స్నో ఏనాన్ చేరుకొని చైనా భవిష్యత్ అంతా కమ్యూనిస్టుల సూత్రబద్ధమైన, సమరశీలమైన పోరాటంలోనే ఇమిడి ఉందని గుర్తించి అక్కడ కనిపెట్టిన ఉత్సాహకరమైన అంశాలన్నీ తన రచనల ద్వారా ప్రపంచానికి వెల్లడించాడు. 1945లో విలియం హింటన్ అమెరికా యుద్ధ సమాచార కార్యాలయ ఉద్యోగిగా చైనా చేరుకున్నాడు. మావోనూ, చౌ ఎన్‌లైనీ చాలా సార్లు కలుసుకున్నాడు. 1947లో ఆయన ఐక్య రాజ్య సమితి సహాయ పునరావాస మండలిలో సభ్యుడిగా తిరిగి చైనాకు వెళ్లాడు. ఆ పని పూర్తయిన తర్వాత కూడా ఆయన అక్కడే ఉండిపోయాడు.

షాంగ్సీకి దగ్గర్లోని ఉత్తర విశ్వవిద్యాలయంలో కొద్ది కాలం బోధించిన తర్వాత 1948లో హింటన్ భూసంస్కరణల బృందంలో చేరి లాంగ్‌బో గ్రామానికి వెళ్లాడు. అక్కడ ఆయన ఎనిమిది నెలలు ఉన్నాడు. ఆయన అక్కడ అమలైన భూసంస్కరణల గురించి వివరణాత్మకంగా రాసుకున్న నోట్స్ వెయ్యి పేజీలు దాటింది. ప్రతి విషయాన్నీ సూక్ష్మంగా పరిశీలించి రాసుకున్న ఆ నోట్స్‌ను అమెరికా కస్టమ్స్ శాఖ జప్తు చేసుకొని ఆంతరంగిక భద్రతపై సెనేట్ కమిటీకి (దీన్ని "ఈస్ట్‌ల్యాండ్ కమిటీ" అని అంటారు) అప్పజెప్పింది. అమెరికన్ గూఢచర్య సంస్థ ఎఫ్‌బీఐ ఆయనను తీవ్రమైన వేధింపులకు గురి చేసింది. ఆయన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకుంది. ఆయనకు బోధనా వృత్తిలో గానీ మరెందులో గానీ ఉద్యోగం ఇవ్వకుండా నిషేధాన్ని విధించింది. ట్రక్ మెకానిక్‌గా పని చేద్దామనుకుంటే ఆ పని కూడా చేయనియ్యలేదు. దానితో ఆయన తన తల్లి నుండి వారసత్వంగా దొరికిన భూమిలో వ్యవసాయం మొదలు పెట్టాడు. దాదాపు 15 ఏళ్ల పాటు రైతుగా వ్యవసాయం చేస్తూనే మరోవైపు సాంస్కృతిక విప్లవపు విజయాలను గూర్చి వ్యాఖ్యానాలు కొన సాగించాడు. అదే సమయంలో ఈస్ట్‌ల్యాండ్ కమిటీతో సుదీర్ఘ చట్టపరమైన పోరాటం చేసి తన నోట్స్‌ను తిరిగి సంపాదించుకున్నాడు.

నోట్స్ చేతికి రాగానే, ఆయన భాగస్వామిగానూ, పరిశీలకుడిగానూ పాల్గొన్న లాంగ్‌బో గ్రామ భూసంస్కరణల ఉద్యమంపై సమగ్రమైన పుస్తకాన్ని రాయడానికి పూనుకున్నాడు. ఆ విధంగా 1966లో ఫాన్‌షెన్ పుస్తకం పూర్తయింది. పెద్ద పెద్ద ప్రచురణకర్తలు చాలా మంది దాన్ని ప్రచురించ నిరాకరించిన తర్వాత *మంత్లీ రివ్యూ ప్రెస్* దాన్ని ప్రచురించింది. ఆ పుస్తకం బ్రహ్మాండంగా విజయవంతమైంది. లక్షల కాపీలు అమ్ముడుపోయాయి. దాదాపు పది భాషల్లోకి దాన్ని అనువదించారు. (తెలుగులో ఇది *విముక్తి* అనే పేరుతో వెలువడింది.) డేవిడ్ హేర్ అనే నాటకకర్త ఫాన్‌షెన్‌ను నాటకంగా మల్చి మొట్టమొదట లండన్‌లో ప్రదర్శించాడు. ఆ తర్వాత ఆ నాటకాన్ని ప్రపంచంలో చాలా చోట్ల ప్రదర్శించారు. చౌ ఎన్‌లై చొరవతో దాన్ని చైనీస్ భాషలోకి కూడా అనువదించారు. 1971లో చౌ ఎన్‌లై మరోసారి చైనాలో పర్యటించాల్సిందిగా హింటన్‌కు ఆహ్వానం పంపాడు.

ఫాన్‌షెన్‌లో హింటన్ భూసంస్కరణల వెనుక సాగే వర్గ పోరాటాన్నే కాకుండా, అందులో పాల్గొనే మనుష్యుల గురించీ, వాళ్ల బలాన్నీ, బలహీనతల్నీ కూడా గొప్పగా చిత్రించాడు. ఇదే ఆ పుస్తకం ప్రత్యేకత కూడా. భూసంస్కరణ అనేది పై నుండి నిర్దేశించినదే తప్ప అమలు పర్చినది కాదని కూడా ఈ పుస్తకం వెల్లడిస్తుంది. పోరాట క్రమంలో రైతులు తమంతట తాముగానే సజీవమైన మేధోపరమైన కార్యకర్తలను

***(తరువాయి 32వ పేజీలో........)***

# ప్రజాయుద్ధంలో అసువులు బాసిన కామ్రేడ్స్ రాను, ప్రేమ్‌లాల్‌లకు విప్లవ జోహార్లు !

విముక్తి ప్రాంత నిర్మాణ లక్ష్యంతో పురోగమిస్తున్న దండకారణ్యా విప్లవోద్యమం ఇటీవల ఇద్దరు యువ వీరయోధులను కోల్పోయింది. జూలై చివరి వారంలో కామ్రేడ్ రాను ప్రమాదవశాత్తు తుపాకీ పేలి అమరుడు కాగా, కామ్రేడ్ ప్రేంలాల్ పోలీసుల నుండి తుపాకీ గుంజుకొని వస్తున్న క్రమంలో పోలీసు కాల్పుల్లో వీరోచితంగా ప్రాణాలిచ్చాడు. ఈ ఇద్దరు యువ కామ్రేడ్లకు 'దండకారణ్యా స్పెషల్ జోనల్ కమిటీ' వినమ్రంగా జోహార్లర్పిస్తుంది. వీరిద్దరి జీవిత విశేషాలను సంక్షిప్తంగా ఈ కింద ఇస్తున్నాం.

## మొక్కవోని పట్టుదలకు మారు పేరు కామ్రేడ్ రాను


కామ్రేడ్ రాను

కామ్రేడ్ రాను దంతెవాడ జిల్లా, బీజాపూర్ తాలూకా, గుండెమాడ్ గ్రామంలో పుట్టాడు. ఆయన అసలు పేరు గుడ్డు ఏమ్లు. పేద కుటుంబంలో పుట్టిన రాను చిన్నతనం నుండే వ్యవసాయాన్ని వృత్తిగా చేపట్టాడు. ఇంద్రావతి నది ఒడ్డున ఉండే ఈ గ్రామంలో విప్లవ కార్యకలాపాలు 1999లో మొదలయ్యాయి. ఈ ప్రాంతంలో ఇంద్రావతి దళం కార్యకలాపాలు మొదలవగానే కామ్రేడ్ గుడ్డు గ్రామ సంఘంలో సభ్యుడయ్యాడు. ఈ ప్రాంతంలో భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో, ఫారెస్టు అధికార్ల అరాచకాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నాడు. కరువు రోజుల్లో భూస్వాముల ఇళ్లపై దాడులు జరపాలని పార్టీ పిలుపునివ్వగా ఆయన ప్రజలకు నాయకత్వం వహించి కరువు దాడుల్లో ధైర్యంగా పాల్గొన్నాడు. ఆ క్రమంలోనే ఆయన విప్లవంలో పూర్తి కాలం చేరిపోయి దేశ విముక్తికి పాటు పడాలనే నిర్ణయానికి వచ్చాడు. తన నిర్ణయాన్ని ఆయన స్థానిక పార్టీ బాధ్యులకు తెలుపగా పార్టీ ఆయన ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. అప్పటికి కామ్రేడ్ గుడ్డు వివాహితుడు. 2001 చివర్లో ఆయన తన భార్యనూ, ఇద్దరు చిన్నారి పిల్లలనూ వదిలేసి విప్లవం విజయం కోసం తన జీవితాన్ని అంకితం చేస్తూ దళంలో చేరాడు. రాను అనే పేరుతో ఆయన ప్రజల మధ్య పని ప్రారంభించాడు. సహజంగా కష్టాలకు వెరవని, ఓపికతో పని చేసే వినమ్ర స్వభావం గల కామ్రేడ్ రాను గెరిల్లా జీవితంలో ఎదురయ్యే కష్టాలను అవలీలగా అధిగమించాడు. ఆయన గుణగణాలనూ, విప్లవం పట్లా, ప్రజల పట్లా ఆయన నిబద్ధతను గమనించిన స్థానిక ఏరియా పార్టీ కమిటీ ఆయనను టెక్నికల్ పనుల్ని నిర్వహించే టీంలోకి సభ్యుడిగా ఎంపిక చేసింది. ఆ టీంలో చేరిన తర్వాత ఆయన తనను తాను అక్షరాలా "కార్మికుడిగా" మల్చుకొని కార్మికవర్గ క్రమశిక్షణను అలవర్చుకున్నాడు. ఆయన దళంలో రిక్రూటైన కొద్ది రోజులకే ఆయన బాగా ప్రేమించే చిన్నారి బాబు జబ్బుతో చనిపోయాడన్న వార్త వినాల్సి వచ్చినా తన బాధను ధైర్యంగా అధిగమించాడు.

టెక్నికల్ బాధ్యతల్లో ఉండగానే అక్కడి కమిటీ ఆయనకు పార్టీ సభ్యత్వాన్ని ఇచ్చింది. చదువు సంధ్యలు లేకున్నా, తను పని చేసే పనిముట్లతో ఏనాడూ పరిచయం లేకున్నా ఆయన పట్టుదలగా కృషి చేసి అనేక పనులు నేర్చుకున్నాడు. విప్లవం కోసం ఆయన తుపాకినే కాదు, సుత్తినీ, పట్టుకారునూ, వెర్నియర్ కాలిపర్సునూ, ఇంకా ఎన్నెన్నో పనిముట్లను ఉపయోగించడం నేర్చుకొని ఆయుధాలను మరమ్మత్తు చేస్తూ పోరాడే గెరిల్లాలకు చేదోడువాదోడుగా నిల్చాడు. పార్టీ పలు సందర్భాల్లో శత్రు బలగాలకు వ్యతిరేకంగా ఎత్తుగడల కౌంటర్ అఫెన్సివ్ దాడులకు పిలుపునివ్వగా ఆయన తన సుత్తినీ, కాలిపర్సునూ పక్కన బెట్టి తుపాకీ అందుకొని యుద్ధంలో దూకాడు. శత్రువుతో ధైర్యంగా పోరాడాడు. కామ్రేడ్ రాను తోటి సభ్యుల్లో, ప్రజల్లో బాగా అభిమానం సంపాదించాడు. కష్టపడే తత్వం, వినయం, పట్టుదల, సాహసం ఆయన ప్రత్యేకతలు. విప్లవంలో పూర్తికాలం కార్యకర్తగా చేరిన తర్వాత తరచుగా ఇంటికి వెళ్లి భార్యాపిల్లలను కలవడానికి అవకాశాలు దొరకకున్నా, ఆయన బోల్షివిక్ పట్టుదలతో విప్లవం కోసం పాటు పడ్డాడు. జూలై చివరి వారంలో అమరుల వారంలోనే ఆయన కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లగా రాయి దొర్లిపడిపోవడంతో ఆయన భుజానికున్న లోడ్ చేసిన తుపాకీ కింద పడి తూటా పేలడం, అది ఆయన ఛాతీలోంచి దూసుకుపోవడంతో కా. రాను అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఫిలిప్పైన్స్ కమ్యూనిస్టు పార్టీ నేత కామ్రేడ్ జోస్ మారియో సిసోన్ చెప్పినట్లు *".....మరణించిన పద్ధతికాదు, యుద్ధాల నుండి తీసిన సారం ఒక మనిషిని యోధుణ్ణి చేస్తుంది. అనారోగ్యంతో మరణించే యోధుడున్నాడు, అనుకోని ప్రమాదంలో మరణించే యోధుడున్నాడు, శత్రువు చేతిలో చిత్రహింసలకు గురయ్యి అసువులు బాసే యోధుడూ వున్నాడు. ఎలా మరణించాడన్నది కాదు, ఎవరి కోసం మరణించాడన్నదే అమరత్వాన్ని నిర్ణయిస్తుంది."* కామ్రేడ్ రానుకు తోటి సభ్యులూ, ప్రజలూ కలిసి విప్లవ సాంప్రదాయాలతో అంత్యక్రియలు జరిపారు. పొంగి వస్తున్న కన్నీటిని తుడ్చుకొని ఆయన ఆశయ సాధనకు పాటు పడతామని శపథం చేశారు. ✶

# చెక్కుచెదరని ధీరత్వానికి మారుపేరు కామ్రేడ్ ప్రేమ్‌లాల్ మడావి

సెప్టెంబర్ 27న జగ్దల్‌పూర్-రాయపూర్ నేషనల్ హైవేపై ఉన్న ఫర్సగాం సంతలో గస్తీ కోసం వచ్చిన పోలీసులపై పీజీఏ యాక్షన్ టీం ఒకటి దాడి చేసి ఒక ఎస్‌ఎల్‌ఆర్ తుపాకీని గుంజుకొంది. ఆ టీంకు నాయకత్వం వహిస్తున్న ప్రేమ్‌లాల్ మడావీ గుంజుకున్న తుపాకీతో పరుగెత్తి వస్తుండగా శత్రువు వెనుక నుండి జరిపిన కాల్పుల్లో అక్కడికక్కడే మరణించాడు. ప్రేమ్‌లాల్ మడావీ కాంకేర్ జిల్లా, కేస్కల్ తాలూకా మండనార్ గ్రామస్తుడు. ఆయనకు భార్యా, ఇద్దరు పిల్లలున్నారు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన కామ్రేడ్ ప్రేమ్‌లాల్ చాలా ఏళ్లుగా విప్లవ కార్యకలాపాల్లో పార్ట్ టైం కార్యకర్తగా పని చేస్తున్నాడు. ఆయన కుటుంబం అంతా కూడా విప్లవానికి సానుభూతిగా ఉంటుంది. ఆయన తమ్ముడు పార్టీలో పూర్తి కాలం కార్యకర్తగా పని చేస్తున్నాడు.

గ్రామ సంఘంలో చురుకైన సభ్యుడైన ప్రేమ్ పార్టీ అప్పగించిన ప్రతి పనినీ వెనుకాముందాడకుండా పూర్తి చేసేవాడు. ఏరియాలో ప్రజలు చేసే ప్రతి పోరాటంలోనూ ఆయన పాత్ర ఉండేది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలలో ఆయనకు మంచి పేరు ఉండేది. పార్టీ, ప్రజా సంఘాలు నిర్వహించే సభలలో ఆయన వక్తగా ఉపన్యాసం చేసేవాడు. ఆయన స్వయంగా మంచి కళాకారుడు కూడా. పీజీఏ ఏర్పాటు తర్వాత దండకారణ్యంలో ఉధృతమైన ప్రజా మిలిషియా కార్యకలాపాలకు ప్రేమ్ లాంటి కార్యకర్తలే జీవనాడిగా ఉంటున్నారు. ఆ ప్రాంతంలో మిలిషియా శత్రు బలగాలపై నిర్వహించిన అనేక మిలిటరీ చర్యలలో ప్రేమ్ చురుగ్గా పాల్గొన్నాడు. 2003 మార్చ్‌లో ఆమబేడ సంతలో పోలీసులపై దాడి చేసి ఒక పోలీసును హతమార్చి వాడి ఎస్‌ఎల్‌ఆర్ గుంజుకొచ్చిన టీంలో కూడా కామ్రేడ్ ప్రేమ్ సభ్యుడిగా పాల్గొన్నాడు. సెప్టెంబర్ 27న కూడా ఆయన పోలీసును తీవ్రంగా గాయపర్చి తుపాకీ స్వాధీనం చేసుకోవడంలో గొప్ప చొరవ చూపించాడు. ఆయన చేసిన సాహసం, చూపిన చొరవా నేటి దండకారణ్య యువతరానికంతా, ప్రజా గెరిల్లాలందరికీ ఆదర్శం. ఆయన త్యాగాన్ని నేడు సీపీఐ (ఎం-ఎల్) [పీపుల్స్‌వార్], ఎంసీసీఐ పార్టీల విలీనం తర్వాత ఏర్పడిన సమైక్య పీఎల్‌జీఏ (ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం) సదా గానం చేస్తుంది. కామ్రేడ్ ప్రేమ్ చేసిన రక్తతర్పణకు తప్పక బదులు తీర్చుకుంటుంది. ✶

(......... 30వ పేజీ తరువాయి)

తయారు చేసుకున్నారనీ, వాళ్లే ఆ తర్వాత కేడర్లుగా ఆ ఉద్యమానికి నాయకత్వం వహించారనీ ఈ పుస్తకం వివరిస్తుంది. ఈ పోరాటం నాటకీయమైన ప్రక్రియల గుండా, తక్కువ హింసతో కొనసాగి శతాబ్దాలుగా సాగుతూ వచ్చిన భూస్వామ్య, దుష్ట పెత్తందారీ ఆధిపత్యాన్ని పూర్తిగా విధ్వంసం చేయడాన్ని హింటన్ ఇందులో గొప్పగా వర్ణించాడు.

*ఫాన్‌షెన్* తర్వాత హింటన్ *ఐరన్ ఆక్స్‌న్, షెన్‌ఫాన్* అనే పుస్తకాల్ని కూడా రాశాడు. ఇవన్నీ చైనా విప్లవ విజయాల్ని గురించి తెలిపేవే. ఆయన పలు సార్లు చైనాను పర్యటించి వ్యవసాయ శిక్షణా వృత్తిలో పాల్గొన్నాడు. ఆయన లాంగ్‌బో గ్రామాన్ని పలు మార్లు సందర్శించి తన స్వంత డబ్బు ఖర్చు చేసి కొత్త వ్యవసాయ టెక్నిక్‌లను ప్రవేశపెట్టాడు. ఆ గ్రామాన్ని ఆయన తన రెండో స్వగ్రామంగా చెప్పుకునే వాడు. అందుకే లాంగ్‌బో గ్రామ ప్రజలు 2002లో తమ మేయర్‌ను అమెరికాలోని బోస్టన్ నగరంలో ఆసుపత్రిలో గుండె జబ్బుతో బాధపడుతూ చికిత్స పొందుతున్న 80 ఏళ్ల వృద్ధ హింటన్‌ను చూడడానికి ప్రత్యేకంగా పంపించారు. ఆయన పట్ల గౌరవాన్ని వ్యక్తీకరిస్తూ లాంగ్‌బోలో ప్రచురించిన "విలియం హింటన్ : చైనా ప్రజల పాత నేస్తం" అనే అందమైన పుస్తకం కాపీని ఆయనకు అందజేశారు.

డెంగ్ సియావో పింగ్ నాయకత్వంలో మలుపు తీసుకున్న పెట్టుబడిదారీ సామాజిక సంబంధాల పట్ల హింటన్ అసమ్మతిని ప్రకటించాడు. చైనా కమ్యూనిస్టు పార్టీ తీసుకున్న పెట్టుబడిదారీ పంథాను ఆయన తిరస్కరించాడు. ఆయన తన చివరి రోజుల్లో ఈ పంథాను విమర్శిస్తూ "చైనా : ఒక పూర్తి కాని పోరాటం" అనే పుస్తకాన్ని రాశాడు. దీన్ని భారతదేశంలో ప్రచురించారు. ప్రస్తుతం చైనాలో అధికారంలో ఉన్న రివిజనిస్టు ప్రభువులూ, అమెరికా సామ్రాజ్యవాదులూ పిడివాద పద్ధతిలో సాంస్కృతిక విప్లవాన్ని ఏకపక్షంగా నిరాకరిస్తున్న ధోరణిని ఆయన పదే పదే తోసిపుచ్చాడు. రైతులకూ, సాధారణ ప్రజలకూ ఉండే విప్లవకర పరివర్తనా శక్తిపట్ల ఆయన నమ్మకం మొక్కవోనిది. అది ఆయన తన స్వంత అనుభవం ద్వారా గ్రహించిన దానిపై ఆధారపడి ఏర్పర్చుకున్నది.

1996లో ఆయన భారతదేశాన్ని సందర్శించాడు. ఇక్కడి విప్లవ సంఘాల వాళ్లతో ఆయన పలు విషయాలపై ముచ్చటించాడు. భారతదేశంలో విప్లవం భవిష్యత్తు పట్ల ఆయన ఎనలేని ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు. సూటిగా, ఆప్యాయంగా వ్యవహరించే రైతూ, విప్లవకారుడూ అయిన విలియం హింటన్ అంతర్జాతీయ కార్మికవర్గ తత్వానికి మంచి ఉదాహరణగా జీవించాడు. ఆయన జీవితం మార్క్సిస్టు విప్లవాచరణకు నమూనాగా నిలుస్తుంది. ఆయనకు నేర్చుకోవడంలోనూ, బోధించడంలోనూ సాంస్కృతిక తారతమ్యాలు గానీ, తరాల అంతరాలు గానీ ఏవీ అడ్డంకులు కాలేదు. ప్రజా రచయితా, మార్క్సిస్టు మేధావీ విలియం హింటన్‌కు విప్లవ జోహార్లు అర్పిద్దాం. ఆయన లాగా జీవిద్దాం. ✶

**డిసెంబర్ 2 నుండి 8వ తేదీ వరకు**

**పీఎల్‌జీఏ (ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం)**

**స్థాపనా వారాన్ని జరుపుకుందాం !**

# ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం అనుసరిస్తున్న ఫాసిస్టు అణచివేత విధానాలు

బీజేపీ ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే నక్సలైట్లను కఠినంగా అణచివేయాలని వాదిస్తూ వచ్చింది. ఇక అధికారం చేతికి రావడంతో అది రోజురోజుకూ అణచివేత విధానాలను ముమ్మరంగా అమలు చేస్తున్నది. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అది బస్తర్ ప్రజలపై అమలు చేసిన నిర్బంధకాండ భయంకర రూపం తీసుకుంది. ఇక విప్లవోద్యమంపైన్నే కాకుండా సామాన్య ప్రజలపై కూడా బీజేపీ ప్రభుత్వ పోలీసులు దౌర్జన్యాలకూ, హత్యలకూ పాల్పడుతున్నారు. లాకప్ హత్యలు మామూలైపోయాయి. అయితే ఏ ప్రాంతంలోనైనా సరే బీజేపీ ప్రభుత్వ పోలీసు హింసాకాండకు బలవుతున్న వాళ్లందరూ ఆదివాసులూ, దళితులూ, తదితర పీడిత సెక్షన్ల వాళ్లేనన్నది గమనార్హం.

గతంలో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండగా పోటా చట్టాన్ని అమలు పర్చాలని డిమాండ్ చేసిన బీజేపీ ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక కొత్త చట్టాలకు రూపకల్పన చేస్తున్నది. కేంద్రంలో మేలో కాంగ్రెస్ నాయకత్వంలో యూపీఏ ప్రభుత్వం ఏర్పడడం, అది పోటాను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటన చేయడంతో రమన్ సింగ్ ప్రభుత్వం "ఛత్తీస్‌గఢ్ ప్రత్యేక రక్షణ బిల్లు 2004" పేరుతో ఒక నల్లచట్టాన్ని ముందుకు తెస్తున్నది. త్వరలో దీనికి తుది రూపం ఇవ్వబోతున్నది. ఈ చట్టం ద్వారా అది పోలీసు బలగాలకు మరింత విచ్చలవిడి అధికారాలిచ్చి విప్లవోద్యమం పట్ల సానుభూతి కలిగి ఉన్న సాధారణ ప్రజలను కూడా విడవకుండా నిర్బంధానికి గురి చేస్తుంది.

బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు మొత్తం అవిభాజిత బస్తర్ ప్రాంతంలో ముగ్గురు సామాన్య రైతులను పోలీసు, సీఆర్‌పీ బలగాలు హత్య చేశాయి. అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి కొద్దిగా ముందు జరిగిన ఘటనను కూడా కలుపుకుంటే ఇటీవలి కాలంలో మొత్తం ఐదుగురు సామాన్య రైతులు పోలీసుల హత్యాకాండకు బలయ్యారు. నవంబర్ 16, 2003న కాంకేర్ జిల్లా (ఉత్తర బస్తర్) జీరంతరాయ్ గ్రామంలో బుధ్‌రాం, సుఖ్‌రాం అనే రైతుల్ని పొలంలో పని చేసుకుంటుండగా పట్టుకొని కాల్చి చంపి నక్సలైట్లుగా ప్రకటించారు. ఆ తర్వాత ఏప్రిల్ 2, 2004న దంతెవాడ జిల్లా (మాడ్ డివిజన్) భైరంగఢ్ తాలూకా ధర్మ గ్రామంలో బుధ్రి అనే మహిళనూ, చైతు అనే రైతునూ చంపేశారు. బుధ్రిపై ముందుగా సామూహిక అత్యాచారం జరిపి ఆ తర్వాత తుపాకీతో కాల్చి చంపి ఎన్‌కౌంటర్‌లో మహిళా నక్సలైటుగా ప్రకటించారు. బుధ్రి అంత్యక్రియల్లో పాల్గొని నది నుండి వస్తున్న చైతును పట్టుకొని విపరీతంగా కొట్టి చంపేశారు. ఏప్రిల్ 20న దంతెవాడ జిల్లా (దక్షిణ బస్తర్ డివిజన్) కొత్తచెరువు గ్రామవాసి హడ్మ మడ్కాం అనే యాభై ఏళ్ల సామాన్య రైతును విప్పపూవు ఏరుకుంటుండగా పట్టుకొని బీఎస్‌ఎఫ్, స్థానిక పోలీసులు కల్సి కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కథనల్లారు. ఉద్యమ ప్రాంతాల్లో సామాన్య ప్రజలను చంపి ఎన్‌కౌంటర్ కథలు అల్లుతుండగా బైటి ప్రాంతాలలో సామాన్య ప్రజలను లాకప్‌లలో చంపేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారు.

నక్సలైటు ఉద్యమాన్ని అణచివేయడానికి పెద్ద సంఖ్యలో బలగాలను పెంచడంతో పాటు, అత్యాధునిక ఆయుధాలు సమకూరుస్తున్నారు. దంతెవాడ, జగ్దల్‌పూర్, కాంకేర్ జిల్లాలతో పాటు పోలీసు జిల్లాలైన బీజాపూర్, నారాయణపూర్‌లకు పెద్ద సంఖ్యలో వాహనాలను సమకూర్చారు. పోలీసు స్టేషన్లను పటిష్టం చేయడానికి ప్రాధాన్యతనిచ్చి వాటి సంఖ్యను కూడా పెంచుతున్నారు. విప్లవోద్యమానికి వ్యతిరేకంగా పూర్తి స్థాయి యుద్ధానికి తగిన విధంగా సన్నాహాలను పూర్తి చేస్తున్నారు. అట్లాగే ప్రత్యేక సమస్య గ్రాంటు కింద 186 కోట్ల రూపాయలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఇందులోంచి పోలీసు బలగాల కోసం ఆధునిక ఆయుధాలు, బులెట్‌ప్రూఫ్ జాకెట్లు, మందుపాతరలను కనిపెట్టే వాహనాలకు ఖర్చు చేస్తామని ఇంటలిజెన్స్ ఏడీజీ ఓ.పీ. రాఠోర్ తెలిపాడు. ప్రభుత్వం నక్సలైటు ప్రభావిత ప్రాంతంలో ఒక ప్రత్యేక పోలీసు బెటాలియన్ స్థాపన కోసం బడ్జెట్‌లో 8 కోట్ల రూపాయలు కేటాయించింది. గత సంవత్సర కాలంలో బస్తర్‌లో పోలీసులకు 10 భారీ, 25 మధ్య తరహా వాహనాలతో పాటు 331 మోటార్‌సైకిళ్లను సమకూర్చారు. తన జగ్దల్‌పూర్ పర్యటన సందర్భంగా ఛత్తీస్‌గఢ్ గవర్నర్ బస్తర్‌కు 3 సీఆర్‌పీఎఫ్ బెటాలియన్లు శాశ్వతంగా కేటాయించామని చెప్పాడు. ఒకవైపు సైనిక ఏర్పాట్లు చేసుకుంటూనే మరో వైపు ప్రభుత్వం పెద్ద ఎత్తున రోడ్లు నిర్మించే పథకాల్ని ముందుకు తెస్తున్నది. అయితే ఉద్యమ అణచివేత పేరుతో కాకుండా ప్రజల అభివృద్ధి పేరుతో ఈ రోడ్ల నిర్మాణానికి పూనుకుంటున్నారు. ప్రభుత్వం తాను అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్టు, నక్సలైట్లు మాత్రం అభివృద్ధికి అడ్డంకిగా ఉన్నట్టు పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేసుకుంటున్నది. అబూజ్‌మాడ్ ప్రాంతంలో ఆక్రమణ శైలిలో అభివృద్ధి కార్యక్రమాల్ని అమలు చేస్తామనీ, కోట్ల కొద్ది రూపాయల్ని కేటాయిస్తామని చెబుతున్నారు.

బస్తర్‌లో మిజోరం తరహాలో ఆర్మీ ట్రెయినింగ్ స్కూలును నిర్మించాలని సంకల్పిస్తున్నట్టు కూడా ప్రభుత్వం చెబుతున్నది. బీజాపూర్‌లో గానీ, నారాయణపూర్‌లో గానీ ఏర్పాటు చేస్తామని చెబుతున్న ఈ స్కూల్‌లో పోలీసు బలగాలకు జంగిల్ వార్‌ఫేర్‌లో ఉన్నత శ్రేణి శిక్షణ ఇస్తామని చెబుతున్నారు. మరోవైపు ఆంధ్ర గ్రేహౌండ్స్ ద్వారా శిక్షణ పొందుతున్న స్పెషల్ టాస్క్‌ఫోర్స్ దళాల్ని కూడా ఉద్యమ అణచివేతలో ఉపయోగిస్తున్నారు. ఆంధ్రలో పేరుమోసిన ఎస్‌ఐబీ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్) తరహాలో ఛత్తీస్‌గఢ్ రమన్ సింగ్ ప్రభుత్వం కూడా ఒక ఇంటలిజెన్స్ సంస్థను ఏర్పాటు చేసింది. సైన్య అధికార్లు కూడా బస్తర్ పర్యటన చేస్తూ ఉద్యమ అణచివేత కోసం వ్యూహరచనలో సలహాలిస్తున్నారు.

ఒకవైపు ఈ ఏర్పాట్లన్నీ చేసుకుంటూనే మరోవైపు రమన్ సింగ్ ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరపడానికి సిద్ధమేనని అప్పుడప్పుడు గాలికబుర్లు చెబుతున్నది. నిర్దిష్ట ప్రతిపాదనలు లేకుండా, పార్టీ వైపు నుండి నిర్దిష్టంగా సూచించిన ప్రతిపాదనలకు ఎలాంటి జవాబు లేకుండా చర్చల గురించి మాట్లాడడాన్ని బట్టి రమన్‌సింగ్ ప్రభుత్వానికి చర్చల పట్ల ఎలాంటి చిత్తశుద్ధీ లేదని అర్థం చేసుకోవచ్చు. నిజానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి ఉద్యమ అణచివేత పైనే దృష్టి ఉంది తప్ప దీని సామాజిక, ఆర్థిక మూలాల్లోకి వెళ్లే ఉద్దేశ్యం లేదు. అయితే అణచివేత ప్రతిఘటనకే దారి తీస్తుందన్నది చరిత్రలో ఎన్నో మార్లు రుజువైన సత్యం. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం విప్లవోద్యమంపై తలపెడుతున్న మరో భారీ నిర్బంధ దాడిని ప్రజలూ, ప్రజా విముక్తి గెరిల్లా సైనికులూ సమైక్యంగా ప్రతిఘటించి ప్రజాయుద్ధాన్ని మరో మెట్టు పురోగమింపజేస్తారని ఆశిద్దాం. ★

# సీఆర్‌పీ బలగాల అత్యాచారాలను ఖండిస్తూ మాడ్ ప్రజల నిరసన ర్యాలీ

2003 మార్చ్‌లో బస్తర్ ప్రాంతంలో దిగిన సీఆర్‌పీ బలగాల అత్యాచారాలకు రోజురోజుకూ హద్దే లేకుండా పోతున్నది. ఉత్తర బస్తర్, మాడ్, దక్షిణ బస్తర్, పశ్చిమ బస్తర్ గ్రామాలలో సీఆర్‌పీ బలగాలు అమలు జరుపుతున్న హింసా, దౌర్జన్యాలకు సంబంధించి అనేక ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. మరెన్నో ఘటనలు వెలుగులోకి రాకుండానే రూపుమాసి పోతున్నాయి. జూన్ 17న మాడ్ డివిజన్, డౌల ఏరియాలోని మథోనార్ గ్రామంలో సీఆర్‌పీ బలగాలు జరిపిన దౌర్జన్యకాండ, దానికి జవాబుగా ప్రజలు సాగించిన పోరాటం గురించిన వివరాలు ఇలా ఉన్నాయి.

జూన్ 17న సీఆర్‌పీ, స్థానిక పోలీసు బలగాలు సంయుక్తంగా మథోనార్ గ్రామంలోకి ప్రవేశించి ఇద్దరు సంఘ సభ్యులను అరెస్టు చేశారు. వారి వద్ద కొన్ని మందులు దొరికాయి. నేటి పోలీసు రాజ్యంలో పేలుడు పదార్థాలే కాదు, ప్రాణాల్ని రక్షించే మందులు కలిగి ఉండడం కూడా నేరమైపోయింది ! ఇవి నక్సలైట్లవని పోలీసుల వాదన. ఇవి మావేనని ఆ గ్రామ ప్రజలు నొక్కి చెబుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిందని 57 ఏళ్లుగా చెబుతున్నప్పటికీ నేటికీ బస్తర్ ప్రజలు మందులు దొరక్క చిన్న చిన్న రోగాలతో ప్రాణాలు విడవడం ఈ ప్రభుత్వం ఒప్పుకున్నా ఒప్పుకోకపోయినా ఒక కఠోర వాస్తవం. అందుకే ఇక్కడ సంఘటిత పడుతున్న విప్లవోద్యమం అనేక ఏళ్లుగా సాగిస్తున్న కృషి ఫలితంగా కొన్ని గ్రామాల్లో ప్రజలు తమంత తాముగానే ప్రజా ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేసుకొని, మందులు సేకరించుకొని వైద్య చికిత్స పొందుతున్నారు. పార్టీ, విప్లవ ప్రజా సంఘాలు ప్రతి గ్రామంలోనూ కొందరు యువతీయువకులకు అత్యంత ప్రాథమిక శిక్షణ కూడా ఇప్పిస్తున్నాయి. పోలీసులు పట్టుకున్నామని చెబుతున్న ఈ మందులు ఆ గ్రామ ప్రజలు తమ కోసం తాము సేకరించుకొని పెట్టుకున్న మందులే. కానీ పోలీసు మెదడుకు ఇవన్నీ పట్టవు కనుక ఆ యువకులను పట్టుకొని విపరీతంగా కొట్టడం ప్రారంభించారు. పోలీసు బలగాలను కలవరపర్చిన మరో అంశం ఏమంటే ఆ గ్రామంలో 25 ఫీట్ల ఎత్తుతో నిర్మించిన అమరవీరుల స్థూపం ఉంది. ఎవరిని చంపడానికైతే తాము పగలనకా, రేయనకా అడవుల్లో తిరుగుతున్నామో, వాళ్ల ప్రతిరూపాలు ఈ విధంగా గ్రామాల మధ్య వెలవడం, వాళ్లకు ప్రజల హృదయాల్లో చెక్కుచెదరని స్థానం లభించడం పోలీసులు జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే ఆ స్థూపాన్ని కూడా కూలగొట్టాలనే దురుద్దేశ్యంతో వాళ్లలో ఒక బ్యాచ్ దానిపైకి పోయింది. కానీ ప్రజలు ఇదంతా చూస్తూ ఊరుకోవడానికి సిద్ధంగా లేరు. ప్రతిఘటించకుండా తమ వాళ్లను విడిపించుకోవడం గానీ, తమ అమరుల స్థూపాన్ని రక్షించుకోవడం గానీ సాధ్యం కాదని భావించిన గ్రామ ప్రజలంతా – స్త్రీలూ, పురుషులూ, పిల్లలూ, పెద్దలూ అనే తేడా లేకుండా పోలీసులతో తలపడ్డారు. కర్ర, చీపురు ఏది దొరికితే అదే అందుకొని ప్రజలు ప్రతిఘటనకు దిగారు. దాదాపు 10 నిమిషాల పాటు ఈ సంఘర్షణ కొనసాగింది. ఇందులో దాదాపు 20 మంది ప్రజలు, ముఖ్యంగా మహిళలు గాయపడ్డారు. అయినా ప్రజలు తమ గాయాలను లెక్క చేయకుండా ఆధునిక ఆయుధాలు కలిగిన పోలీసు, అర్ధ సైనిక బలగాలతో బాహాబాహీ తలపడ్డారు. ఈ ఘర్షణలో ముగ్గురు మహిళలు చాలా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘర్షణ ద్వారా ప్రజలు అమరుల స్థూపాన్ని కూలగొట్టాలన్న పోలీసుల పథకాన్ని వమ్ము చేశారు.



సీఆర్‌పీఎఫ్ బలగాలు వెనక్కి పోవాలని నినదిస్తున్న మాడ్‌వాసులు

## ఛోటాడోంగర్ పోలీసు స్టేషన్ ఘెరావ్

మథోనార్‌లో జరిగిన ఘర్షణ గురించి కొద్ది గంటల్లోనే చుట్టుపక్కల 35 గ్రామాలకు వార్త అందింది. మరుసటి రోజు, జూన్ 18న దాదాపు 2,500 మంది స్త్రీపురుషులు జమై, గొడ్డళ్లు, కొడవళ్లు, విల్లుబాణాలు చేపట్టి ఛోటాడోంగర్ పోలీసు స్టేషన్‌కు తరలి వెళ్లారు. స్టేషన్‌ను నలువైపులా చుట్టుముట్టి అరెస్టయిన వాళ్లను విడిచి పెట్టాలనీ, మహిళలతో దురుసుగా వ్యవహరించిన పోలీసుల్ని శిక్షించాలనీ, గాయపడ్డ మహిళలకు వైద్యం చేయించాలనీ డిమాండ్ చేశారు. ప్రజల క్రోధావేశాలను గమనించిన పోలీసులు దిగివచ్చి అరెస్టయిన వాళ్లను కోర్టులో హాజరుపర్చడానికీ, గాయపడ్డ మహిళలను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించడానికీ ఒప్పుకొని మహిళలపై జరిపిన దౌర్జన్యకాండకు క్షమాపణ చెప్పుకున్నారు.

## నారాయణపూర్ ర్యాలీ

ఈ ఘటన తర్వాత మొత్తం నారాయణపూర్ ప్రాంతమంతా సీఆర్‌పీ బలగాల అత్యాచారాల పట్ల తీవ్ర నిరసన పెల్లుబికింది. అన్ని సెక్షన్ల

ఛత్తీస్‌గఢ్‌లో బస్తర్ విలీనానికి వ్యతిరేకంగా ...

ప్రత్యేక బస్తర్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండుకు మద్దతుగా ...

**నవంబర్ 1న ‘బస్తర్ బంద్’ను విజయవంతం చేయండి !**

ప్రజలూ, బూర్జువా పార్టీల వాళ్లూ కూడా ఈ ఘటనను ఖండించారు. వివిధ సెక్షన్ల ప్రజలంతా "బస్తర్ మహిళా సంఘర్ష్ సమితి" అనే బ్యానర్ కింద ఐక్య కార్యాచరణ కమిటీని ఏర్పాటు చేసుకొని నారాయణపూర్‌లో ర్యాలీ నిర్వహించడానికి సిద్ధమయ్యారు. జూన్ 23 నాడు జరిగిన ఈ ర్యాలీలో దాదాపు 15,000 మంది ప్రజలు పాల్గొన్నారు. ఇందులో మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. మొత్తం చుట్టుపక్కల 100 గ్రామాల ప్రజలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు నారాయణపూర్‌కు దగ్గర్లోని గడ్‌బెంగాల్ గ్రామంలో మొదలైన ఈ ర్యాలీ నారాయణపూర్ వీధుల గుండా సాగి పీఓ ఆఫీసు చేరుకుంది. "సీఆర్‌పీ బలగాలను వెనక్కి పంపాలి", "అత్యాచారాలకు పాల్పడ్డ వారిని శిక్షించాలి" అని ప్రజలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అయితే ఈ ర్యాలీని విఫలం చేయడానికి పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. కుతుల్, సోన్‌పూర్ రోడ్ల నుండి వస్తున్న వేలాది ప్రజలను పోలీసులు భయపెట్టి, బెదిరించి వెనక్కి పంపించారు. "బస్తర్ మహిళా సంఘర్ష్ సమితి" ఈ సందర్భంగా పీఓకూ, గవర్నర్‌కూ అందించిన డిమాండ్ల పత్రంలో ఐదు డిమాండ్లు ముఖ్యమైనవి.

1) మహిళలపై సీఆర్‌పీ జవాన్లు జరిపిన దౌర్జన్యకాండకు క్షమాపణలు చెప్పుకోవాలి.
2) గాయపడ్డ మహిళలకు పూర్తి వైద్య చికిత్స చేయించాలి.
3) సీఆర్‌పీ బలగాలను బస్తర్ నుండి వెనక్కి పంపాలి.
4) అరెస్టయిన ఇద్దరు సంఘ కార్యకర్తలను బేషరతుగా విడుదల చేయాలి.
5) ప్రజలు నిర్మించుకుంటున్న స్తూపాలను కూలగొట్టడాన్ని నిలిపి వేయాలి.

సీఆర్‌పీ, పోలీసు బలగాల అత్యాచారాలనూ, దౌర్జన్యకాండనూ ఎదిరిస్తూ వేల సంఖ్యలో ప్రజలు కదలడం పాలకులను బాగా కలవరపెట్టింది. టీవీ ఛానెళ్లలోనూ, వార్తా పత్రికలలోనూ ఈ అత్యాచారాల గురించి ప్రచారం జరగడంతో బైటి ప్రజలకు కూడా బస్తర్‌లో ఏం జరుగుతుందో అర్థం చేసుకోవడానికి ఉపయోగపడింది. అదే సమయంలో ఈ ఘటనాక్రమంతో ప్రజలకు తమ పోరాటశక్తిపై మరింత నమ్మకం ఏర్పడింది. ✶

*(......... 43వ పేజీ తరువాయి)*

ఎన్నికలకు ముందు, ఏప్రిల్ 3 నాడు గస్తీపై వచ్చిన వంద మంది పోలీసులు డోంఢ్రిబేడలో ఒక రైతుని చిత్రహింసలకు గురి చేసి నారాయణ్‌పూర్‌కు తీసుకెళ్లి వదిలేశారు. ఎన్నికలకు మూడు రోజుల ముందు బయలు దేరిన పోలీసులు పీజీఏ దాడుల భయానికి ప్రజలను బలవంతంగా తమతో పాటు నడిపించారు. ప్రజలు నిరాకరించిన చోట వాళ్లను కొట్టారు. గార్పకు వచ్చిన పోలీసులు మస్పూర్ గ్రామస్తులను మానవ కవచాలుగా వాడుకున్నారు. ఆ తర్వాత ఓరాది గ్రామ రైతులను హింసించి గార్ప తీసుకెళ్లారు. చిత్రం గ్రామంలో ఓట్లు వేయమని అన్నందుకు నలుగురు రైతులను తీవ్రంగా కొట్టారు. ఆ తర్వాత గ్రామ మహిళలు పోలీసులను ఎదిరించడంతో వాళ్లను వదిలిపెట్టారు.

### *ప్రతిఘటన*

- ఏప్రిల్ 18న గార్పకు సమీపంలో సీఆర్‌పీ, స్థానిక పోలీసు బలగాలు పీజీఏ ఆంబుష్‌లో చిక్కుకున్నాయి. ఇందులో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. అయితే ఈ దురదృష్టవశాత్తు ఈ ఆంబుష్‌లో పోలీసులు బలవంతంగా తీసుకొస్తున్న రైతులు కూడా చిక్కుకోవడంతో ముగ్గురు గ్రామస్తులు గాయపడ్డారు. వీరిలో ఆ తర్వాత బోర దుర్వా అనే రైతు ప్రాణాలు విడిచారు. స్థానిక పార్టీ ఈ సంఘటన పట్ల విచారాన్ని తెలిపింది. మృత రైతు కుటుంబానికి సంతాపాన్ని తెలిపింది.
- తిరిగి ఏప్రిల్ 19న మిలిషియా బ్యాచ్‌లో గార్పలో మకాం చేసిన శత్రు బలగాలపై కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు. శత్రువు గందరగోళ పడి విపరీతంగా కాల్పులు జరిపాడు.

### *ఎన్నికలు జరిగిన తీరు*

పరాల్‌కోట ఏరియాలో గత డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గానీ, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో గానీ ప్రజలు పూర్తిగానే బహిష్కరించారని చెప్పొచ్చు. పోయినసారి పోలీసుల హింసలకు భయపడి ప్రజలు కొందరు ఓట్లేశారు గానీ ఈసారి మాత్రం కొట్టినా, బెదిరించినా ప్రజలు ఓట్లేయలేదు. ఒక్క చిత్రం గ్రామంలో మాత్రం పోలీసులు ప్రజలను బాగా హింసించి 10 ఓట్లు వేయించుకోగలిగారు. ఒక్క చిత్రం మినహా మరెక్కడా అసలు పోలింగ్ జరగనే లేదు. గార్ప గ్రామానికి చెందిన కొందరు ఉద్యమ వ్యతిరేకులు నారాయణ్‌పూర్ పారిపోగా వాళ్లతో అక్కడనే ఓట్లు వేయించుకొని నాటకమాడారు. ఇక ఈ ప్రాంతం ఎన్నికలు జరిగినాయని అనిపించుకోవడానికీ, ప్రజాస్వామ్యం వర్ధిల్లింది అని చూపెట్టుకోవడం కోసం పోలీసు బలగాలను పెద్ద ఎత్తున పంపించారు.

## డౌల ఏరియాలో ...

ఎన్నికల బహిష్కరణ ప్రచారం పెద్ద ఎత్తున సాగించారు. ప్రజా సంఘాలూ, పార్టీ యూనిట్లూ అన్నీ కూడా చురుగ్గా కదిలి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశాయి. ఏరియాలో మొత్తం 9 చోట్ల పెద్ద బహిరంగ సభలు ఏర్పాటు చేశారు. ఈ సభలన్నిటిలో కలిపి మొత్తం 1,100 మంది ప్రజలు పాల్గొన్నారు. అట్లాగే వయనార్, డండవన్, వెడమకోట్, కడియనార్ – నాలుగు సంతలలో కూడా ఎన్నికల బహిష్కరణ మీటింగులు ఏర్పాటు చేయగా దాదాపు 3,000 మంది ప్రజలు పాల్గొన్నారు. ప్రజా సంఘాల కార్యకర్తల కోసం రాజకీయ తరగతులు ఏర్పాటు చేసి వాళ్లకు ఎన్నికలపై పార్టీ అవగాహనను గురించి వివరించారు. అట్లాగే ఈ సందర్భంగా శత్రు బలగాలు అమలు చేసే నిర్బంధాన్ని ఎదిరించేందుకు గానూ ప్రజా మిలిషియాకు మిలిటరీ ట్రెయినింగ్ కూడా ఇచ్చారు.

### *నిర్బంధం*

మాత్ల నుండి ఒకరిని, ఇన్నర్ నుండి ఇద్దరిని, మాదోడ నుండి ఒకరిని, మఢోనార్ నుండి ఇద్దరు సంఘ కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అయితే ఈ గ్రామాలలోని మహిళలు కేఏఎంఎస్ నాయకత్వంలో పోలీసుల్ని ఎదిరించి తమ వాళ్లను విడిపించుకున్నారు. అట్లాగే మాత్ల గ్రామం నుండి ఇద్దరు చిన్న పిల్లల్ని కూడా అరెస్టు చేశారు. వాళ్లను తీవ్రంగా హింసించి ఆ తర్వాత వదిలేశారు.

### *ప్రతిఘటన*

ఈ ప్రాంతంలో పోలీసు నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రజలు, ముఖ్యంగా మహిళలు పెద్ద ఎత్తున ప్రతిఘటనకు పూనుకున్నారు. నాలుగు గ్రామాలలో పోలీసులు సంఘ సభ్యులను అరెస్టు చేయగా వందలాది మంది మహిళలు కదిలి పోలీసులను ఎదిరించి తమ వాళ్లను విడిపించుకున్నారు. అట్లాగే ప్రజా మిలిషియా దళాలు, స్థానిక గెరిల్లా దళాలు అనేక చోట్ల కాల్పులు జరిపి పోలీసులను చికాకు పర్చాయి. ✶

# ఆగస్టు 15న నల్ల దినం పాటించిన దండకారణ్య ప్రజలు

ఆగస్టు 15, 1947 బూటకపు స్వాతంత్ర్యాన్ని బట్టబయలు చేస్తూ దండకారణ్యంలో గ్రామగ్రామాన పార్టీ, ప్రజా సంఘాలు విస్తృతంగా ప్రచారం చేశాయి. స్వాతంత్ర్యం వచ్చి 57 ఏళ్లు అయ్యిందని పాలకులు ఎంతగా ప్రచారం చేసినప్పటికీ ప్రజలకు ఈ స్వాతంత్ర్యం ఎలాంటిదో రోజురోజుకూ మరింతగా స్పష్టమవుతున్నది. ఒకవైపు భారత పాలకవర్గాలు సామ్రాజ్యవాదుల ఆదేశాలకు తలొగ్గి దేశ ప్రయోజనాలను తాకట్టు పెట్టి, దేశ సార్వభౌమత్వాన్ని మంటగలుపుతూ, ప్రజలపై దోపిడీ పీడనలను అధికం చేస్తూ మరోవైపు ఇది స్వాతంత్ర్యమని చెప్పడం వట్టి మోసకారితనమే తప్ప మరేమీ కాదు. నేటికీ ప్రజలు ఆకలి చావులకూ, పౌష్టికాహార లేమికీ, రోగాలకూ, కరువు కాటకాలకూ, నిరుద్యోగానికీ, అధిక ధరలకూ, పెరుగుతున్న అవినీతికీ బలవుతుండగా పిడికెడు మంది దోపిడీదార్లు కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. పేదలకూ, ధనికులకూ అంతరం నానాటికీ బాగా పెరిగిపోతున్నది. ఈ పరిస్థితులన్నీ ఇది నిజమైన స్వాతంత్ర్యం కాదనే ప్రజలకు స్పష్టపరుస్తున్నాయి. గత పాతికేళ్లుగా విప్లవోద్యమంలో సంఘటితపడుతున్న దండకారణ్య ప్రజలు మొదటి నుండీ ఆగస్టు 15ను నిరసన దినంగా పాటిస్తూ వస్తున్నారు. ప్రజల రాజకీయ చైతన్యం పెరిగిన కొద్దీ ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రజల సంఖ్య పెరుగుతున్నది. మరోవైపు ప్రభుత్వం దిన పత్రికల్లో దీన్ని వక్రీకరిస్తూ ఆగస్టు 15ను బహిష్కరించడమంటే దేశద్రోహమని ఆరోపిస్తూ ప్రచారం చేస్తున్నది. కానీ దేశ ప్రజల ప్రయోజనాలను విదేశీ సామ్రాజ్యవాదులకూ, వాళ్ల ద్రవ్య సంస్థలకూ తాకట్టు పెడుతున్న ప్రభుత్వాలే నిజానికి దేశద్రోహానికి పాల్పడుతున్నాయి. గతంలో ఎన్డీయే ఉన్నప్పుడు గానీ, ఇప్పుడు కాంగ్రెస్ నాయకత్వంలోని యూపీఏ అధికారంలోకి వచ్చిన తర్వాత గానీ దేశంలో అమలు జరుగుతున్నవి ఈ దేశద్రోహకర విధానాలేనన్నది తేటతెల్లం. కాబట్టి నిజమైన స్వాతంత్ర్యాన్ని సంపాదించుకోవాలంటే దేశ ప్రజల అభ్యున్నతికీ, స్వావలంబనకూ అడ్డంకిగా ఉన్న భూస్వామ్య విధానాన్నీ, సామ్రాజ్యవాదాన్నీ, దళారీ నిరంకుశ పెట్టుబడినీ కూకటి వేళ్లతో పెకిలించి వేసి ప్రజల ప్రజాస్వామిక అధికారాన్ని స్థాపించుకోవాలి. ఆ లక్ష్యంతోనే మన దండకారణ్యంలోనూ, దేశంలోని మరి కొన్ని ప్రాంతాలలోనూ మన పార్టీ, మన సోదర పార్టీయైన ఎంసీసీఐ నాయకత్వంలో విప్లవోద్యమం కొనసాగుతున్నది. ఈ విప్లవం ద్వారానే నూటికి 80 మందిగా ఉన్న పీడిత తాడిత ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యం లభిస్తుంది. నిరసన దినం సందర్భంగా జరిగిన సభలలో ముఖ్యంగా ఇవే విషయాలపై ప్రజలకు సందేశాన్నిచ్చారు.

## మాడ్ డివిజన్‌లో...

కుతుల్ గ్రామంలో నల్ల దినం సందర్భంగా జరిగిన సభలో 250 మంది ప్రజలు పాల్గొన్నారు. వీరిలో విద్యార్థులు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. ముందుగా గ్రామంలో ఊరేగింపు నిర్వహించి దోపిడీ ప్రభుత్వానికీ, సామ్రాజ్యవాదానికీ వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆ తర్వాత జరిగిన సభలో ప్రజా సంఘాల కార్యకర్తలు ప్రసంగించారు. ఆగస్టు 15 నాడు తెల్ల ప్రభువుల చేతిలో నుండి నల్ల ప్రభువుల చేతిలోకి అధికార మార్పిడి మాత్రమే జరిగిందనీ, నిజమైన స్వాతంత్ర్యం రాలేదనీ వక్తలు ప్రజలకు వివరించారు. స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతున్న ఈ 57 ఏళ్లలో ప్రజల మౌలిక సమస్యలేవీ పరిష్కారం కాలేదని వాళ్లు వివరించారు. ప్రజలు కరువు, నిరుద్యోగం, అనారోగ్యం వంటి తమ మౌలిక సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుంటే ప్రభుత్వాలు నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నాయనీ, అలాంటప్పుడు ఇదెలాంటి స్వాంతంత్ర్యమవుతుందో ఆలోచించాలని వక్తలు ప్రజలను కోరారు. నేడు దండకారణ్యంలో గ్రామగ్రామాన నిర్మాణమవుతున్న జనతన సర్కార్ సంస్థలే ప్రజలకు నిజమైన స్వాతంత్ర్యాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ గ్యారంటీ చేస్తాయనీ, వాటిని పటిష్టం చేసుకొంటూ విస్తరించడం ద్వారానే దేశ వ్యాప్తంగా ప్రజా ప్రభుత్వ నిర్మాణం దిశగా పురోగమించగలమని వక్తలు వివరించారు.

కోహ్కామెట్ట ఏరియాలో ముర్‌నార్, వెచ్చ, గుడ్రపార గ్రామాల ప్రజలు ఒకచోట సమావేశమై నిరసన దినాన్ని పాటించారు. ఈ గ్రామాలలో చదువుకుంటున్న విద్యార్థినీవిద్యార్థులు కూడా సభలో పాల్గొన్నారు. దాదాపు 250 మంది ప్రజలు బూటకపు స్వాతంత్ర్యానికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ఊరేగింపు జరిపారు. ఆ తర్వాత ప్రజలు నల్ల జెండానెగురవేశారు. డీఏకేఎంఎస్ సభ్యులు బూటకపు స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకిస్తూ పాటలు పాడారు. ఆ తర్వాత డీఏకేఎంఎస్ సభ్యులు బూటకపు స్వాతంత్ర్యం గురించీ, ఆగస్టు 15 విద్రోహం గురించీ మాట్లాడారు. విప్లవ నినాదాలతో, పాటలతో సభ ఉత్సాహంగా ముగిసింది.

కోహ్కామెట్ట ఏరియాలోని ఇర్కుబట్టి గ్రామంలో కూడా ప్రజలు బూటకపు స్వాతంత్ర్యానికి నిరసనగా నల్ల దినాన్ని పాటించారు. ఈ సభలో "యే ఆజాదీ ఝూఠీ హై, దేశ్ కీ జనత భూఖీ హై" అని ప్రజలు నినాదాలు చేశారు. ఆ తర్వాత నల్ల జెండానెగురవేశారు. గ్రామ సంఘ అధ్యక్షుడు బూటకపు స్వాతంత్ర్యాన్ని గురించి ప్రజలకు వివరించాడు. ఆయన తన ప్రసంగంలో నిజమైన స్వాతంత్ర్యం కోసం పోరాడి అమరులైన భగత్సింగ్, సుఖ్‌దేవ్, రాజగురు, సుభాష్ చంద్రబోస్, ఆజాద్ చంద్రశేఖర్, గుండాధుర్, బాబురావు సెడ్మెక్ తదితర విప్లవకారులకు జోహార్లు చెప్పాడు. ఆ అమరుల ఆశయాలకు గాంధీ, నెహ్రూ వంటి దళారీ నాయకులు తూట్లు పొడిచారని ఆయన విమర్శించాడు. ఆ తర్వాత కోహ్కామెట్ట దళ కమాండర్ కా. కౌసల్య, మహిళా దళ కమాండర్ కా. నీలబాయి ప్రసంగించారు. ఈ సభలో దాదాపు 250 మంది ప్రజలు పాల్గొన్నారు. విప్లవ గీతాలాపనతో సభ ముగిసింది.

## పశ్చిమ బస్తర్ డివిజన్‌లో...

భైరంగఢ్ ఏరియాలో మొత్తం 12 గ్రామాలలో బూటకపు స్వాతంత్ర్యాన్ని నిరసిస్తూ సభలు జరిగాయి. ఒక్కో గ్రామంలో దాదాపు 350-400 మంది దాకా ప్రజలు సభలలో పాల్గొన్నారు. ఈ సభలలో ఉపన్యసించిన వక్తలు మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని చెబుతున్నప్పటికీ మెజారిటీ ప్రజలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. గతంలో కాంగ్రెస్ ఉన్నా, ఇప్పుడు బీజేపీ అధికారంలోకి వచ్చినా ఈ రాష్ట్ర ప్రజల బతుకుల్లో మౌలిక మార్పేమీ రాలేదనీ, రాదనీ వాళ్లు వివరించారు. మన బతుకులు మారాలంటే విప్లవోద్యమంలో సంఘటితమై గ్రామగ్రామాన ప్రజా రాజ్యాధికార సంస్థల్ని నిర్మించుకోవాలని వక్తలు ప్రజలకు పిలుపునిచ్చారు.

# విప్లవవీరుడు భగత్సింగ్ వర్ధంతి సభలు

గడ్చిరోలి డివిజన్ భామ్రాగఢ్ ఏరియాలో గోపనార్, దోబూర్ గ్రామాలలో ప్రజలు మార్చ్ 23న విప్లవ వీరుడు భగత్సింగ్ వర్ధంతి సభలు జరుపుకున్నారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన భగత్సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లను బ్రిటిష్ పాలకులు మార్చ్ 23, 1931న ఉరితీశారు.

దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలనీ, ఆ స్వాతంత్ర్యం పిడికెడు మంది దోపిడీదార్ల చేతుల్లోకి వెళ్లకుండా దేశంలోని కష్టజీవులైన రైతుకూలీలకు చెందాలనీ కలలు గని, అందుకు విప్లవం తప్ప మరో మార్గం లేదని చాటి చెప్పిన విప్లవ కారులు భగత్సింగ్, రాజగురు, సుఖ్దేవ్లు. నేడు దండకారణ్యంలో పీపుల్స్వార్ పార్టీ నాయకత్వంలో సాగుతున్న విప్లవోద్యమం ఆ అమరులందరి ఆశయాల సాధనలోనే పురోగమిస్తున్నది. అందుకే మార్చ్ 23న దండకారణ్య ప్రజలు భగత్సింగ్నూ, ఆయన సహచరులనూ తల్చుకొని సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఆయన ప్రారంభించిన పోరాటాన్ని పరిపూర్తి చేయడం కోసం పునరంకితమవుతున్నారు. సభ ప్రారంభానికి ముందు "భగత్సింగ్ అమర్ రహే", "సామ్రాజ్యవాదం నశించాలి", "పోటా చట్టాన్ని రద్దు చేయాలి" అంటూ నినాదాలు చేస్తూ ప్రజలు ఊరేగింపు తీశారు. ఆ తర్వాత జరిగిన సభలో ప్రసంగించిన వక్తలు భగత్సింగ్ను ఉరితీయడంలో గాంధీ, నెహ్రూలు బ్రిటిష్వాళ్లతో కుమ్మక్కయ్యారని వివరించారు. వాళ్ల వారసులే నేడు అధికారంలో కొనసాగుతూ మార్చ్ 23న వాళ్లు కూడా భగత్సింగ్ వర్ధంతిని జరుపుకుంటున్నారని గేలి చేశారు. అట్లాగే ఎన్డీఏ ప్రభుత్వం పోటా చట్టాన్ని తీసుకొచ్చి ప్రజలపై ఉక్కుపాదాన్ని మోపిందనీ, అనేక మంది అమాయకులను ఈ నల్ల చట్టం కింద నిర్బంధిస్తూ వాళ్లను చెప్పనలవి కాని ఇక్కట్ల పాలు చేస్తున్నదని వక్తలు వివరించారు. ఒకవైపు కాంగ్రెస్ పోటాను వ్యతిరేకిస్తుండగా, మహారాష్ట్రలో అధికారంలో ఉన్న కాంగ్రెస్-ఎన్సీపీ కూటమి ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయడమనేది దాని ద్వంద్వ నీతికి నిదర్శనమని వక్తలు విమర్శించారు. అంతర్జాతీయంగా జార్జ్ బుష్ మొదలు పెట్టిన "ఉగ్రవాద వ్యతిరేక యుద్ధం"లో చేరిన ఎన్డీయే ప్రభుత్వం వాడి అడుగుజాడల్లో నడుస్తూ పోటా చట్టాన్ని రూపొందించిందని కూడా వక్తలు ప్రజలకు వివరించారు. సభ ఆఖరున ప్రజలు జార్జ్ బుష్, వాజ్పేయిల దిష్టిబొమ్మలను తగులబెట్టారు. దానితో సభ ముగిసింది.

## అంతర్జాతీయ కార్మిక దినం మేడే సందర్భంగా సభలు

గడ్చిరోలి జిల్లా, ఏటపల్లి తాలూకా, గట్ట ఏరియాలో ఒక చోట జరిగిన సభలో మూడు గ్రామాల నుండి 140 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. సభలో పాల్గొన్న ప్రజలకు వక్తలు అంతర్జాతీయ కార్మిక దినం ప్రాముఖ్యతను గురించీ, దాని చరిత్రను గురించీ వివరించారు. 1886 మేలో అమెరికాలో కార్మికులు జరిపిన చారిత్రాత్మక పోరాటాల గురించీ, వాళ్ల న్యాయమైన డిమాండ్ల గురించీ వివరంగా చెప్పారు. నేడు ప్రభుత్వాలు మేడేను ప్రభుత్వ పండుగగా దిగజార్చి దాని విప్లవ సారాంశాన్ని మరుగుపరుస్తున్నారని వక్తలు చెప్పారు. విప్లవంలో కార్మికవర్గపు పాత్రను గురించీ, కార్మిక-కర్షక మైత్రిని గురించీ కూడా వక్తలు వివరించారు. గడ్చిరోలి జిల్లాలో కూడా వెదురు, తదితర పనుల్లో ఆదివాసీ కూలీలను పెట్టుబడిదార్లు ఏ విధంగా దోచుకుంటున్నారో వివరించారు. కార్మిక-కర్షక సమైక్యత విప్లవంలో కీలకమైందన్న విషయాన్ని వివరించారు.

ఇదే జిల్లాలోని అహిరి ప్రాంతంలో కురుంబపల్లి గ్రామంలో కూడా మే1న 40 మంది ప్రజలు సమావేశమై అంతర్జాతీయ కార్మిక దినాన్ని జరుపుకున్నారు. రాపెల్లి గ్రామంలో జరిగిన సభలో 30 మంది ప్రజలు పాల్గొన్నారు. మొదట ఎర్రజెండా ఎగురవేసిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా కార్మికవర్గం జరిపిన వీరోచిత పోరాటాలనూ, వారు చేసిన త్యాగాలనూ గుర్తు చేసుకుంటూ కార్మిక హక్కుల కోసం పోరాడి అమరులైన కామ్రేడ్లకు జోహార్లు తెలుపుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ దేశంలో ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను తూర్పారబట్టారు. కార్మిక దినోత్సవం సందర్భంగా సామ్రాజ్యవాదానికీ, దళారీ పెట్టుబడిదారీ విధానానికీ వ్యతిరేకంగా ప్రజలు నినాదాలు చేసారు. సమసమాజ స్థాపనకై, నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానికై పోరాడుదామని శపథం చేశారు.

## ఏప్రిల్ 22న పార్టీ పుట్టినరోజు జరుపుకున్న ప్రజలు

పెరిమిలి ఏరియాలో తాడిగాం రేంజ్లో ఒక చోట ఏప్రిల్ 22న పార్టీ పుట్టిన రోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా మొత్తం 250 మంది వరకు స్త్రీపురుషులు పాల్గొన్నారు. మొదట పార్టీ జెండానెగురవేసి అమరవీరులకు జోహార్లర్పించారు. ఆ తర్వాత సభకు అధ్యక్షత వహించిన కామ్రేడ్ రఘు మాట్లాడుతూ మన పార్టీ మితవాద అవకాశవాదానికీ, రివిజనిజానికీ వ్యతిరేకంగా రాజీ లేని పోరాటం చేసి ఆవిర్భవించిందనీ, మన పార్టీ పుట్టిన నాటి నుండీ పాలకవర్గాలు ఫాసిస్టు నిర్బంధాన్ని ప్రయోగిస్తూ అణచివేయాలని ప్రయత్నిస్తున్నాయనీ అన్నాడు. అయినప్పటికీ అది రోజురోజుకూ మరింత బలం పుంజుకుంటూ నేడు దేశవ్యాప్త పార్టీగా ఆవిర్భవించిందని చెప్పాడు. ఆ తర్వాత కా. సుధీర్, కా. కర్ప దాదలు కూడా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

## ఉత్తర బస్తర్లో మార్చ్ 8న అంతర్జాతీయ శ్రామిక మహిళా దినం

మార్చ్ 8కి ముందు నుండే కేఏఎంఎస్, డీఏకేఎంఎస్ సభ్యులు గ్రామగ్రామానికీ వెళ్లి అంతర్జాతీయ మహిళా దినం ప్రాముఖ్యతను గురించి ప్రచారం చేశారు. కరపత్రాలు, పోస్టర్లు, వాల్ రైటింగ్తో ఏరియా వ్యాప్తంగా 8 మార్చ్ గురించి బాగా ప్రచారం చేశారు. బార్దా ఎల్జీఎస్ ప్రాంతంలో ముల్లె, బార్దా గ్రామాలలో జరిగిన మహిళా దినం సభలలో దాదాపు 1500 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. వీరిలో స్త్రీలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఈ సభలను కేఏఎంఎస్ రేంజ్ కమిటీ నిర్వహించింది. అంతాగఢ్ రేంజ్లో మార్చ్ 8 సందర్భంగా దాదాపు 14 గ్రామాల నుండి వచ్చిన 500 మంది మహిళలు సమావేశమై తమ సమస్యలను గురించి చర్చించారు. కిస్కోడ్తో రేంజ్లో అంతర్జాతీయ మహిళా దినం సభ కేఏఎంఎస్ రేంజ్ కమిటీ అధ్యక్షురాలి అధ్యక్షతన జరిగింది. ఆమె జెండా ఎగురవేయగా, ప్రజలు మహిళా విముక్తి కోసం పోరాడుతూ అమరులైన స్త్రీపురుషులందరికీ శ్రద్ధాంజలి ఘటిస్తూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఆ తర్వాత వక్తలు సభలో ప్రసంగించారు. మెచానార్ గ్రామంలో జరిగిన మరో సభలో 700 మంది పురుషులు, 300 మంది స్త్రీలు పాల్గొన్నారు. ఈ సభలో రెండు ఎల్జీఎస్లు, ఏరియా సీఎన్ఎం, స్థానిక సీఎన్ఎం బృందాలు పాల్గొన్నాయి. ఈ బృందాలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను బాగా ఉత్సాహపర్చాయి. ఈ సందర్భంగా ఒక సెమినార్ కూడా జరిగింది. ఈ సెమినార్లో పాల్గొన్న మహిళలు పితృస్వామ్య రూపాల గురించి చర్చించారు. ఇందులో మహిళలకు ఆస్తిలో భాగస్వామ్యం ఉండాలనీ, బలవంతపు వివాహాలూ చిన్న వయస్సులో చేసే వివాహాలూ ఉండొద్దనీ, ఆడపిల్లల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా ముందే కల్లు తాగి పెళ్లి ఒప్పందాలు చేసే పద్ధతి ఉండొద్దనీ, ఉత్పత్తికి సంబంధించిన పనుల్లో మహిళలకు సమాన భాగస్వామ్యం ఉండాలనీ, వివక్ష ఉండొద్దనీ మహిళలు అభిప్రాయపడ్డారు. సెమినార్ చివరన, మహిళలంతా చొచ్చుకొస్తున్న సామ్రాజ్యవాద సంస్కృతికీ, అది ప్రవేశపెడుతున్న వస్తువ్యామోహ సంస్కృతికీ వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ★

# 14వ లోక్‌సభ ఎన్నికల సందర్భంగా అమలైన ప్రభుత్వ ఫాసిస్టు నిర్బంధం – వీరోచిత ప్రజా ప్రతిఘటన

*(గత సంచికలో 14వ లోక్‌సభ ఎన్నికల బహిష్కరణ, ఆ సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన పోలీసు నిర్బంధానికి సంబంధించి పూర్తి రిపోర్టులు ప్రచురించలేకపోయాం. ఈ సంచికలో మరిన్ని వివరాలతో రిపోర్టుల్ని వేస్తున్నాం. – సంపాదకులు)*

లోక్‌సభ ఎన్నికల సందర్భంగా దోపిడీ ప్రభుత్వం తీవ్రమైన నిర్బంధాన్ని అమలు చేసినప్పటికీ ప్రజలు పెద్ద సంఖ్యలో కదిలి బూటకపు ఎన్నికలను బహిష్కరించారు. ఎన్నికల పార్టీల నాయకులు పోరాట ప్రాంతాలలో అడుగు పెట్టడానికి సాహసించలేదు. వాళ్ల ప్రచారం కేవలం పోలీసు స్టేషన్లు ఉన్న గ్రామాల వరకూ, మెయిన్ రోడ్లపై ఉన్న గ్రామాల వరకూ పరిమితమైంది. చాలా గ్రామాలలో పోలింగ్ బూత్‌లకు అధికార్లు రానే లేదు. అయినప్పటికీ చాలా కేంద్రాలలో పోలింగ్ జరిగినట్టుగా తప్పుడు రిపోర్టులు చేశారు. ఈ ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం అమలు చేసిన నిర్బంధాన్నీ, అందుకు జవాబుగా ప్రజలూ, ప్రజా గెరిల్లా సైనికులూ జరిపిన చర్యలకు సంబంధించిన రిపోర్టుల్ని డివిజన్ల వారీగా కింద ఇస్తున్నాం.

## దక్షిణ బస్తర్ డివిజన్

### జెగురుగొండ ఏరియాలో ...

ఎన్నికల బహిష్కరణకు సంబంధించి డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ కార్యకర్తలకు రాజకీయ తరగతి నిర్వహించారు. ఆ తర్వాత డీఏకేఎంఎస్ బ్యాచీలు 13, కేఏఎంఎస్ బ్యాచీలు 9 కదలి వెళ్లి మొత్తం 63 గ్రామాలలో ప్రచారం చేశాయి. ఈ ప్రచారంలో స్థానిక సీఎన్ఎం యూనిట్లు కూడా పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మూడు చోట్ల పెద్ద బహిరంగ సభలు నిర్వహించారు. వీటిలో 35 గ్రామాల నుండి దాదాపు 3,000 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు. ఈ ఏరియాలో మొత్తం 40 బ్యానర్లు, 80 పోస్టర్లు, 2000 కరపత్రాలు ప్రచారంలో ఉపయోగించారు. అంతే కాకుండా చాలా గ్రామాలలో గోడలపై నినాదాలు రాశారు. డాంబర్ రోడ్ల పైన కూడా ఎన్నికల బహిష్కరణ నినాదాలు రాశారు. ఈ విధంగా ఎన్నికల బహిష్కరణ ప్రచారం పెద్ద ఎత్తున సాగగా అసలు ఎన్నికల ప్రచారం చేసేందుకు ఏ ఒక్క నాయకుడు కూడా ఏరియాలో అడుగు పెట్టలేదు.

*నిర్బంధం*

పోలీసు, అర్ధ సైనిక బలగాలు మార్చి చివరి నుండే నిర్బంధాన్ని తీవ్రతరం చేశాయి. జెగురుగొండ, చింతల్‌నార్‌లలో తిష్ట వేసిన రెండు కంపెనీల బీఎస్ఎఫ్ రాత్రి పూట దళాల కోసం ఆంబుష్‌లు కూర్చోవడం, పగటి పూట గ్రామాలపై దాడులు జరిపి ప్రజలపై దౌర్జన్యాలకు పాల్పడడం కొనసాగించింది. చింతల్‌నార్ పోలీసులు ఏఎస్ఐ సింగర్ నాయకత్వంలో కొత్తగూడెం, మొర్రుం గ్రామాలపై దాడి చేశారు. అయితే ప్రజలెవ్వరూ పట్టుబడలేదు. ఏప్రిల్ ప్రారంభం నుండి బాసగూడెం పోలీసులు లింగగిరి, ధర్మారం, డోలిగూడెం, కోర్సగూడెం, సార్కిన్‌గూడ, అవుటుం, తదితర గ్రామాలలో దాడులు చేశారు. ఏప్రిల్ 20 వరకు ఈ గ్రామాలలో పోలీసులు ఆరేడు సార్లు కూంబింగ్ నిర్వహించారు. చిన్న తర్రెం గ్రామానికొచ్చిన పోలీసులు 25 కోళ్లను ఎత్తుకెళ్లారు. ఒక రైతును విపరీతంగా కొట్టారు.

ఏప్రిల్ 13 నాడు పుల్లంపాడ్ గ్రామంపై బడిన చింతల్‌నార్ పోలీసులు ఒక మహిళపై అత్యాచార యత్నం చేశారు. అయితే ఆ మహిళ వాళ్ల పట్టు విడిపించుకొని పారిపోయింది. ఈ గ్రామంలో మొత్తం 26 కోళ్లు, 2 మేకలు ఎత్తుకెళ్లారు. ఏప్రిల్ 2 నాడు కూడా ఈ గ్రామంపై దాడి చేశారు. చింతల్‌నార్ పోలీసులు తాడిమెట్ట గ్రామం పక్కనున్న అడవిలో నాలుగు సార్లు దళాల కోసం ఆంబుష్ కూర్చున్నారు. ఈ పోలీసులు తమకు గుడిసెలు వేయించుకోవడం కోసం రావుగూడెం, లచ్చిగూడెం, కిష్టారం, కొత్తగూడెం గ్రామాల ప్రజల్ని బెదిరించి తీసుకెళ్లి వెట్టి చాకిరీ చేయించుకున్నారు. బాసగూడెం పోలీసులు రాజుపెంట, కొత్తగూడెం గ్రామాలలో ఇద్దరు రైతుల్ని తీవ్రంగా కొట్టారు. కోర్సగూడెంలో ఒకరిని, పెగిడిపల్లిలో ఇద్దరిని కొట్టి దారి చూపించుమని తీసుకెళ్లి వదిలారు. ధర్మపురం గ్రామంలో సంఘ కమిటీ వాళ్లు వచ్చి సరెండర్ కాకపోతే ఇండ్లు కాలబెడ్తామని బెదిరించారు.

*ప్రజా ప్రతిఘటన*

- ఏప్రిల్‌లో బాసగూడెం నుండి చిన్నతర్రెం వచ్చిన పోలీసు, బీఎస్ఎఫ్ బలగాలపై పీజీఏ పునాది బలగపు టీం మైన్ పేల్చి చికాకు పర్చింది.
- ఏప్రిల్ 20 ఎన్నికల రోజున చింతల్‌నార్ నుండి వోటింగ్ మిషన్లతో పెద్ద బోడికెల్ వైపు బయలుదేరిన బ్యాచీపై తుమ్మిరిగూడెం వద్ద మిలిషియా టీం క్లేమోర్‌తో దాడి చేసింది. దాంతో పోలీసులు ఫైరింగ్ చేస్తూ వెనుదిరిగిపోయారు.
- ఈ శబ్దాలు విని సపోర్టుగా వస్తున్న చింతల్‌నార్ పోలీసులపై మరో మిలిషియా టీం గ్రెనేడ్‌తో దాడి చేసింది. దాంతో పోలీసులు ఖంగు తిని స్టేషన్‌కు పరుగులు తీశారు.
- ఏప్రిల్ 20 నాడే జెగురుగొండ నుండి పెంట గ్రామానికొచ్చి తిరిగిపోతున్న పంజాబ్ కమాండో బలగాలపై పీజీఏ దళం వెనుక నుండి దాడి చేయడంతో ఫైర్ చేసుకుంటూ పారిపోయారు. గాభరాలో నీళ్ల డబ్బాలు, టిఫిన్ డబ్బాలు అన్నీ వదిలేసుకొని పరుగెత్తారు. ప్రజలు ఇదంతా ప్రత్యక్షంగా చూసి పోలీసులు వదిలేసిన సామాన్లన్నిటినీ జప్తు చేసుకున్నారు.
- ఏప్రిల్ 22న ఎన్నికల తంతును ముగించుకొని వెనక్కి వెళ్తున్న రెండు కంపెనీల బీఎస్ఎఫ్ జవాన్లపై పీజీఏ గెరిల్లాలు జరిపిన అపార్చునిటీ ఆంబుష్‌లో ఒక బీఎస్ఎఫ్ జవాను చావగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. జెగురుగొండ నుండి దంతెవాడ వెళ్లే రోడ్డుపై జరిగిన ఈ ఘటనతో శత్రువు బెంబేలెత్తాడు.

*ఎన్నికల బహిష్కరణ*

ఎన్నికల రోజున పోలీసులు పోలింగ్ బూతులున్న ఆరు రోడ్డు మీది గ్రామాలకు వచ్చి అర గంటలోపే తిరిగిపోయారు. ప్రజలెవరూ అసలు ఓట్లే వేయలేదు. మొత్తం ఓట్లు పోలీసులే వేసుకున్నారు. అయితే పోలీసు స్టేషన్లున్న జెగురుగొండ, చింతల్‌నార్ గ్రామాలతో పాటు ముఖరం గ్రామంలో మాత్రం కొంత మంది ప్రజలు ఓట్లేశారు. మిగతావన్నీ పోలీసులే వేసుకున్నారు.

## కిష్టారం ఏరియాలో ...

ఫిబ్రవరి నుండే వివిధ సాయుధ నిర్మాణాలూ, పార్టీ యూనిట్లూ ఎన్నికల బహిష్కరణ ప్రచార క్యాంపెయిన్‌ను ప్రారంభించాయి. ఏప్రిల్ నెలలో ఏరియా వ్యాప్తంగా ప్రచార క్యాంపెయిన్ చేశారు. డివికెఎంఎస్, కెఏఎంఎస్‌లకు చెందిన మొత్తం 29 బ్యాచీలు ఈ ప్రచార క్యాంపెయిన్‌లో పాల్గొన్నాయి. ఇందులో సీఎన్ఎం టీములు కూడా పాల్గొన్నాయి. సీఎన్ఎం మొత్తం 8 చోట్ల బహిరంగ సభల్ని నిర్వహించి బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని ప్రజలను కోరింది. ఒకచోట సంతలో ప్రదర్శన ఇచ్చారు. మొత్తం 90 గ్రామాలలో ప్రచారం సాగింది. దాదాపు 500 కరపత్రాలనూ, 50 పోస్టర్లనూ ఈ ప్రచారంలో వినియోగించారు. ఇక ఈ ఏరియాలో ఓట్లలో నిలబడే దోపిడీవర్గ పార్టీలు పత్తా లేకుండా పోయాయి. ప్రచారానికి ఎవ్వరూ రాలేదు.

### *నిర్బంధం*

కిష్టారం ఏరియాలోని 3 పోలీస్ స్టేషన్లకు మద్దతుగా మూడు కంపెనీల సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ బలగాల్ని కేటాయించారు. వీళ్ళ గ్రామాలపై బడి ప్రజలపై దాడులు కొనసాగించారు. మార్చ్ 9న సుక్మ ఏఎస్‌పీ, కుంట ఎస్‌డీఓపీల నాయకత్వంలో సీఆర్‌పీ బలగాలు గొల్లపల్లి, కిష్టారంల మీదుగా నడిచి వెళ్లి టెట్టెమడుగు, పాలోడి గ్రామాలపై దాడి చేశాయి. ఇందులో మారాయిగూడెం, గొల్లపల్లి, కిష్టారం ఠానేదార్లతో సహా మొత్తం 105 మంది పోలీసులు పాల్గొన్నారు. టెట్టెమడుగు గ్రామంలో వీళ్ల మూడు ఇళ్లలో చొరబడి మొత్తం 10,700 రూపాయల నగదు, ఒక భర్మార్, వెండి, బంగారం, కోళ్లు, ఎండు మాంసం, గొడ్డళ్లు, విల్లుబాణాలు, ప్రజా ప్రభుత్వం మంజూరు చేసిన భూముల పట్టాలు ఎత్తుకెళ్లారు. కొందరు పోలీసులైతే ఇండ్లల్లో ఉన్న అన్నం, జావ, కల్లు కూడా వదిలిపెట్టలేదు. గంటకు పైగా సాగించిన ఈ భీభత్సకాండ తర్వాత పోలీసులు ఒక రైతును వెంట తీసుకెళ్లి తీవ్రంగా కొట్టి ఆ తర్వాత వదిలేశారు. పోతూ పోతూ పాలోడి గ్రామంలో ఒక రైతు ఇంట్లో చొరబడి సైకిల్ ఎత్తుకెళ్లారు. మార్చ్‌లో తన పనిపై ఆంధ్రకు వెళ్లి తిరిగి వస్తున్న సింగన్‌మడుగు గ్రామస్తుడైన మడ్కం మాసాలు అనే రైతును కిష్టారం పోలీసులు దారిలో అరెస్టు చేసి అక్రమ కేసు పెట్టి జైలుకు పంపించారు. ఇతనితో ఇప్పుడు సుక్మ పోలీసులు వంట చేయించుకుంటున్నారు. ఏప్రిల్ 7న అమ్మపెంట గ్రామంపై పోలీసులు దాడి చేయగా ప్రజలెవరూ దొరకకపోవడంతో తిరిగి వెళ్తూ వేదపాడ్‌లో ముగ్గురిని, మంగెల్‌గూడెంలో ఒకరిని అరెస్టు చేసి తీసుకెళ్లారు. కిష్టారం పోలీసుస్టేషన్‌లో వీళ్లను హింసించి ముగ్గురిని వదిలేసి ఒకరిని జైలుకు పంపారు. తీగెల్ గ్రామంలో దాడి చేసి మాజీ దళ సభ్యుడైన దినేష్‌ను అరెస్టు చేసి జైలుకు పంపారు. ఒక సంఘ నాయకుడిని వెంటబడి తరిమి ఆయన సైకిల్ ఎత్తుకెళ్లారు.

గొల్లపల్లి పోలీసులు వెంజల్‌వాయి గ్రామంపై నాలుగు సార్లు దాడి చేశారు. మొత్తం ఐదుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో ఒక సంఘ నాయకుణ్ని బాగా కొట్టి బలవంతంగా గ్రామాలు, గుట్టలు, వాగులు తిప్పించారు. ఆ తర్వాత ఈ ఐదుగురిని జైలుకు పంపారు. వెంజల్‌వాయిలో డీఏకేఎంఎస్ నాయకుడు ధర్మాలు ఇంటిపై దాడి చేసి ఆయన ఇంటిని తగులబెట్టారు. ఇంట్లో నిత్యావసర వస్తువులతో పాటు 2 వేల రూపాయల నగదు, ఇప్పపూలు, నగలు, బట్టలు, కోళ్లు, చింతపండు, నూనె, పందులు దొరికిన కాడికి ఎత్తుకెళ్లారు. మొసలిమడుగుకు చెందిన ఒక రైతునూ, వెంజల్‌కు చెందిన మరో రైతునూ ఇప్పపూలు ఏరుతుండగా అరెస్టు చేసి గొల్లపల్లి స్టేషన్లో మూడు రోజులు నిర్బంధించి ఆ తర్వాత వదిలేశారు. వెంజల్‌వాయిలో ఉన్న మోటు అమరుల స్తూపాన్ని కొంత భాగం కూలగొట్టారు. రాయిగూడెం గ్రామంపై ఏప్రిల్ 7న దాడి చేసిన పోలీసులు పెళ్లి ఉత్సవంలో పాల్గొంటున్న గ్రామస్తులను బంధించి అందులో ఎనిమిది మంది యువకులను వేరు చేసి పట్టుకెళ్లారు. రెండు రోజుల అనంతరం ఏడుగురిని వదిలేయగా, ఒక సంఘ నాయకుణ్ని మరి కొన్ని రోజులు గొల్లపల్లి ఠానాలో ఉంచుకొని హింసించి ఆ తర్వాత జైలుపాలు చేశారు. బట్టిగూడెం గ్రామంపై దాడి చేసి ముగ్గురు రైతులను అరెస్టు చేసి ఇద్దరిని జైలుపాలు చేసి ఒకరిని వదిలేశారు.

మారాయిగూడెం పోలీసులు గంగిలేరు గ్రామంపై దాడి జరిపి ఐదుగురిని అరెస్టు చేసి తీసుకెళ్లారు. వీరిని తీవ్రంగా హింసించాక నలుగురిని వదిలేసి ఒకరిని జైల్లో నిర్బంధించారు.

నిమ్మల్‌గూడెంకు చెందిన ఇద్దరు డీఏకేఎంఎస్ నాయకులనూ, బూటాల్ (కరిగుండం) గ్రామానికి చెందిన డీఏకేఎంఎస్ రేంజ్ కమిటీ నాయకుడొకరినీ ఆంధ్ర పోలీసులు అరెస్టు చేసి కరెంట్ షాక్‌లతో తీవ్రంగా హింసించి జైలుకు పంపారు. ఏప్రిల్ 15 తారీఖున అమ్మపెంట గ్రామానికి వస్తున్న పోలీసులు రోడ్డుపై రైతులను చూసి విచ్చలవిడిగా కాల్పులు జరిపారు.

ఇంకా కాసారం, బూటాల్, దొరమంగుం, పూసుగూడెం, గంగరాజు, సింగారం, చంద్రుగూడెం గ్రామాలపై కూడా పోలీసులు దాడులు చేశారు. కానీ ప్రజలెవరూ దొరకలేదు. ఎన్నికల రోజైన ఏప్రిల్ 20న సింగారం వచ్చిన పోలీసులు వంజల్‌వాయి, సింగారం గ్రామాలలో ఇప్పపూలు ఏరుతున్న రైతులను (వీరిలో మహిళలే ఎక్కువ ఉన్నారు) చుట్టుముట్టి పట్టుకొని బెదిరించి పోలింగ్ బూత్‌కు తీసుకెళ్లి బలవంతంగా ఓట్లేయించారు. సింగారంలో కూడా ఇండ్లల్లో చొరబడి బియ్యం, కోళ్లు పట్టుకొని తిన్నారు. చంద్రుగూడెంకు వచ్చిన పోలీసులు గ్రామస్తులను బెదిరించి పట్టుకెళ్లి ఓట్లేయించారు.

ఇలా కిష్టారం ఏరియాలో మార్చ్ 2004 నుండి ప్రారంభమైన పోలీసు నిర్బంధ క్యాంపెయిన్ ఏప్రిల్ చివరి దాకా కొనసాగింది. మొత్తం 18 గ్రామాలపై దాడి చేశారు. వీటిలో కొన్ని గ్రామాలపై రెండు నుండి నాలుగు సార్లు కూడా దాడి చేశారు. మొత్తం 33 మందిని అరెస్టు చేయగా వీరిలో 16 మందిని జైలుకు పంపారు.

### *ప్రతిఘటన*

పోలీసు దాడుల్ని తిప్పికొట్టడానికి గాను ముందే గ్రామాలలో ప్రజలు సెంట్రీ పెట్టుకోవడం, పోలీసులు వస్తున్నారనగానే గ్రామాల్ని ఖాళీ చేసి అడవిలోకి వెళ్లడం వంటి పద్ధతుల్ని అనుసరించారు.

- మార్చ్ నెలలో టెట్టెమడుగు, పాలోడి గ్రామాలపై దాడి చేసి వెళ్తున్న పోలీసులపై వెనుక నుండి కొంత మంది మిలిషియా సభ్యులు చికాకు చర్య జరిపారు. ఈ దాడికి జడుసుకున్న 105 మంది పోలీసులు ఎక్కడివాళ్లక్కడే నేలకరుచుకుపోయి పది నిమిషాల దాకా మొత్తుకున్నారు. ఆ తర్వాత లేచి వేగంగా వెళ్లిపోయారు.
- ఏప్రిల్ 10న బూటాల్‌కు వెళ్తున్న పోలీసులపై మిలిషియా దళం పందుల కోసం ఉపయోగించే బాంబు పేల్చడంతో పోలీసులు వందల కొద్ది తూటాలు కాల్చి వెళ్లిపోయారు.
- ఏప్రిల్ 18న గొల్లపల్లి నుండి గ్రామాలపై దాడులకు వెళ్తున్న బీఎస్ఎఫ్ పోలీసులపై పీజీఏ సైనికులు దాడి చేయడంతో ఇరు పక్షాల మధ్య చాలా సేపు కాల్పులు జరిగాయి. దీనితో పోలీసుల దూకుడుకు ఓ మేరకు కళ్లెం పడింది.
- ఏప్రిల్ 20న ఎన్నికల రోజు ప్రజలను బలవంతంగా ఓట్లేయించడం కోసం చంద్రుగూడెం గ్రామానికి వచ్చి వెళ్తున్న బీఎస్ఎఫ్ పోలీసు పార్టీపై పీజీఏ సైనికులు దాడి జరిపారు. 10 నిమిషాల పాటు ఎదురుకాల్పులు జరిగాయి. ఎవరికీ నష్టాలు జరగలేదు.

## కొత్తచెరువు గ్రామంలో బూటకపు ఎన్‌కౌంటర్

*ఏప్రిల్ 20న బీఎస్ఎఫ్ జవాన్లు కొత్తచెరువు గ్రామానికి బయలుదేరారు. గ్రామం బైటే విప్పపూలు ఏరుకుంటున్న మడ్కాం హడ్మ అనే రైతును దగ్గర నుండి కాల్చి చంపడంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. దాదాపు 55 ఏళ్ల వయసున్న ఈ సామాన్య రైతుకు చెవులు సరిగా వినపడవు. దాంతో ఆయన పోలీసులు సమీపంలోకి వచ్చే దాకా వాళ్లను గమనించలేకపోయాడు. పోలీసులు దీన్ని ఎన్‌కౌంటర్ అని చూపించడం కోసం అడవిలోకి తూటాలు కాల్చి, నాలుగు మోర్టార్ షెల్స్ కూడా వేసి కట్టుకథను ప్రచారం చేశారు. అక్కడికి కొంత దూరంలో ప్రజా మిలిషియా పోలీసుల కోసం పాతిపెట్టిన ఒక క్లేమోర్‌మైన్‌తో ఈ రైతుకు సంబంధం ఉందని ప్రచారం చేశారు. కానీ స్థానిక ప్రజలందరికీ ఇది కట్టుకథ అన్న విషయం తెలుసు. పోలీసులు హడ్మ శవాన్ని మోటార్‌సైకిల్‌పై వేసుకొని పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి బైట పడవేశారు. ఆ తర్వాత గ్రామ ప్రజలు, ముఖ్యంగా మహిళలు తానాకు వెళ్లి హడ్మ శవాన్ని తెచ్చుకున్నారు. అప్పటికి శవం బాగా కుళ్లిపోయింది. పోలీసులు ఇలాంటి హేయమైన చర్యల ద్వారా ప్రజా ఉద్యమాన్ని అణచిపెట్టగలమని భ్రమ పడుతున్నారు, కానీ బంతిని బలంగా నేలకేసి కొడితే అంతే బలంగా పైకి లేచినట్టుగానే నిర్బంధం ప్రతిఘటనకే దారితీస్తుంది. ఇది తథ్యం.* ✱

*పోలింగ్ జరిగిన తీరు*

ఈ ఏరియాలో మొత్తం 100 గ్రామాలున్నాయి. ఎన్నికల రోజు గొల్లపల్లి పోలీసులు పోలింగ్ బూతులున్న రెండు గ్రామాలకు (సింగారం, చంద్రుగూడెం) వోటింగ్ మిషన్లతో వచ్చారు. ప్రజలను పట్టుకొని బెదిరించి కొన్ని ఓట్లు వేయించారు. ఈ విధంగా సింగారంలో 39 ఓట్లు, చంద్రుగూడెంలో 12 ఓట్లు పడ్డాయి. ఆ తర్వాత కిష్టారం పోలీసులు మూడు బ్యాచీలుగా పోలీసు స్టేషన్‌కు కొద్ది దూరంలో అడవిలోకి వెళ్లి కూర్చొని తామే ఓట్లు వేసుకొని వెళ్లారు. కుంట పోలీసులు ఆంధ్ర గ్రామమైన మల్లపెంట నుండి దుర్మ వైపు వచ్చే దారిలో అడవిలో కూర్చొని తామే ఓట్లు వేసుకొని వెళ్లారు. మారాయిగూడెం పోలీసుల భయానికి పక్కన గల మూడు, నాలుగు గ్రామాల ప్రజలు కొందరు ఓట్లేశారు. పోలీసు స్టేషన్ ఉన్న కిష్టారం, గొల్లపల్లి గ్రామాలలో ప్రజలు ఓట్లేశారు. ఈ విధంగా మొత్తం ఏరియాలో 88 గ్రామాలు పోలింగ్‌ను బహిష్కరించగా 12 గ్రామాలు మాత్రమే పోలింగ్‌లో కొద్ది మేరకు పాల్గొన్నాయి.

### కుంట ఏరియాలో ...

ఈ ఏరియాలో బహిష్కరణ ప్రచార కార్యక్రమం మార్చ్ చివరి నుండి ప్రారంభమైంది. ఇందులో డీఏకేఎంఎస్‌కు చెందిన 12, కేఏఎంఎస్‌కు చెందిన 12 ప్రచార దళాలు పాల్గొన్నాయి. ఏరియాలో సీఎన్ఎం బృందాలు కూడా బహిష్కరణ ప్రచారంలో విస్తృతంగా పాల్గొన్నాయి. వివిధ చోట్ల పెద్ద బహిరంగ సభలు జరిపాయి. ప్రజలు ఎన్నికలను బహిష్కరిద్దాం అంటూ నినాదాలు చేస్తూ కాగడాల ప్రదర్శన జరిపారు. గత ఎనిమిదేళ్ల ఎన్డీయే పాలనలో తమకొరిగిందేమీ లేదని నిరసిస్తూ వాజ్‌పేయీ, అద్వానీల దిష్టిబొమ్మల్ని కూడా ప్రజలు తగులబెట్టారు. ప్రజా సంఘాల కార్యకర్తలందరూ ఈ ప్రచార కార్యక్రమంలో క్రియాశీలంగా పాల్గొన్నారు. అయితే బూర్జువా పార్టీల ప్రచారం ఈ ఏరియాలో ఎక్కడా కనిపించలేదు. కేవలం సీపీఐ వాళ్లు మాత్రం కుంట, దోర్నపాల్ పట్టణాల వరకు వచ్చి ప్రచారం చేశారు గానీ గ్రామాలలోకి రావడానికి సాహసించలేదు.

ఇక పోలీసు నిర్బంధం, పారా మిలిటరీ బలగాల ముమ్మర గస్తీ, కూంబింగ్‌లు ఈ ఏరియాలో కూడా కొనసాగాయి. మొత్తం 120 మంది ప్రజలను అరెస్టు చేసి తీవ్రంగా హింసించి 8 మందిని జైలుకు పంపి మిగతా వాళ్లను వదిలిపెట్టారు. ఇదే సందర్భంగా కొత్తచెరువులో బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడి మడ్కం హడ్మను దారుణంగా హత్య చేశారు. మరో గ్రామంలో ఒక మహిళతో అసభ్యంగా ప్రవర్తించారు.

*ఈ ఏరియాలో ప్రజా ప్రతిఘటన కూడా పోలీసు నిర్బంధానికి ధీటుగానే జరిగింది.*

- ఏప్రిల్ 14న వింజరం సమీపంలో పీజీఏ గెరిల్లాలు పోలీసు వాహనాన్ని మందుపాతరతో పేల్చివేయగా ఇద్దరు సీఏఎఫ్ పోలీసులు కుక్కచావు చావగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సందర్భంగా మిగతా వాహనాల్లోని పోలీసులకూ, గెరిల్లాలకూ మధ్య తీవ్రంగా ఎదురుకాల్పులు జరిగాయి. గెరిల్లాల వైపు ఎలాంటి నష్టాలు జరగలేదు.
- ఏటగట్ట దగ్గర ముగ్గురు గెరిల్లాల టీం పోలీసులపై ఆంబుష్ చేసింది. కానీ ఎవరికీ నష్టాలు జరగలేదు.
- గగన్‌పల్లి గ్రామం వద్ద మిలిషియా టీం పోలీసులను చికాకుపర్చే ఉద్దేశ్యంతో ఒక పేలుడు జరిపింది.
- గోర్థ గ్రామం వద్ద రోడ్డుపైనా, స్కూలు దగ్గరా మిలిషియా టీంలు క్లెమోర్లు పేల్చి పోలీసుల్ని చికాకు పర్చారు.

*ఎన్నికల బహిష్కరణ*

ఏరియాలో మొత్తం 20 పోలింగ్ బూత్‌లు ఉండగా కేవలం 8 బూత్‌లకు మాత్రమే పోలీసులు వచ్చి ఓట్లు వేసుకున్నారు. మిగతా 12 బూత్‌లకు అసలు ఎవరూ రానే లేదు. పోలింగ్ జరుగనే లేదు.

### పామేడ్ ఏరియాలో...

ఎన్నికల బహిష్కరణ అంశంపై డీఏకేఎంఎస్, కేఏఎంఎస్‌లలో క్రియాశీలంగా పని చేసే 110 మంది కార్యకర్తలకు పార్టీ ఒక రోజు క్లాసు నిర్వహించింది. ఆ తర్వాత వీళ్లలో డీఏకేఎంఎస్ నుండి 12, కేఏఎంఎస్ నుండి 11 ప్రచార దళాల్ని నిర్మించి గ్రామాలలో ప్రచారానికి పంపించారు. ఈ ప్రచారంలో సీఎన్ఎం బృందాలు కూడా పాల్గొన్నాయి. ఏరియాలో మొత్తం 9 చోట్ల పెద్ద బహిరంగ సభలు నిర్వహించారు. మొత్తం 90 గ్రామాలలో ఎన్నికల బహిష్కరణ ప్రచారం జరిగింది. ఇందులో 200 పోస్టర్లు, 40 బ్యానర్లు ఉపయోగించారు. అనేక చోట్ల గోడలపై నినాదాలు కూడా రాశారు. బూర్జువా పార్టీల ప్రచారం మాత్రం ఏరియాలో ఎక్కడా జరగలేదు. ఏ పార్టీ వాళ్లు కూడా ఏరియాలో అడుగుపెట్టలేదు.

*నిర్బంధం*

మార్చ్ నెల నుండే పోలీసులూ, అర్ధ సైనిక బలగాలూ నిర్బంధకాండను

### గ్రామీణ మహిళల ప్రతిఘటన

*కొత్తచెరువు గ్రామంలో పోలీసులు మడ్కాం హడ్మను బూటకపు ఎన్‌కౌంటర్లో హతమార్చి శవాన్ని ఎర్రబోర్ తానాకు తీసుకెళ్లగా ఆ గ్రామ మహిళలు ఎర్రబోర్‌కు వెళ్లి పోలీసులతో పోరాడి తమ గ్రామస్థుడి శవాన్ని తీసుకొచ్చుకున్నారు. అదే విధంగా రేగడి, మొసలు గ్రామ మహిళలు బెజ్జి పోలీసులతో పోరాడి అరెస్టు చేసిన తమ గ్రామస్తులను విడిపించుకున్నారు. మహిళల ఈ పోరాటం ఏరియాలో ప్రజలందరికీ ఆదర్శంగా నిల్చింది.* ✱

## కుంట ఏరియాలో ఇద్దరు పోలీసుల్ని అరెస్టు చేసి విడుదల చేసిన పీజీఏ సైనికులు

*దంతెవాడ జిల్లా, సుక్మ, పట్నంపార నివాసి వెట్టి రాజు దంతెవాడ ఆదివాసీ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఇతడు మార్చ్ 18న పోలంపల్లి గ్రామంలో తన అత్తగారింటికి రాగా ప్రజలూ, పీజీఏ బేస్ బలగమైన మిలిషియా కల్సి అరెస్టు చేశారు. అయితే ఇతడిపై ప్రజా వ్యతిరేక చర్యలలో పాల్గొన్న ఆరోపణలు ఏవీ లేవు కనుక పీజీఏ గెరిల్లాలు విప్లవ లక్ష్యాన్ని గురించీ, ప్రజాయుద్ధం గురించీ రాజకీయాలు వివరించి కొద్ది రోజుల పాటు తమతో ఉంచుకొని ఆ తర్వాత 26వ తేదీన వదిలేశారు.*

*ఇదే విధంగా మే 19న బెజ్జి పోలీసు స్టేషన్‌లో పని చేసే సీఏఎఫ్ జవాను ఇసిదోర్ ఖాల్కోను బస్సులో వెళ్తుండగా మిలిషియా అరెస్టు చేసి స్థానిక దళానికి అప్పగించింది. ఇతన్ని కూడా రెండు, మూడు రోజుల పాటు గెరిల్లాలు తమ కస్టడీలో ఉంచుకొని విప్లవ రాజకీయాలు, పార్టీ లక్ష్యం వివరించి క్షేమంగా వదిలేశారు. ఈ ఘటనలు సాధారణ పోలీసుల్లో విప్లవకారుల పట్ల ఉన్న అపోహల్ని పోగొట్టడంలో, వాళ్లు విప్లవ లక్ష్యాలను గురించి అర్థం చేసుకోవడంలో ఏదో మేరకు ఉపయోగపడుతున్నాయి. ఈ సందర్భంగా గెరిల్లాలు సాధారణ పోలీసుల పట్ల తమ వైఖరిని స్పష్టంగా వివరిస్తూ, సాధారణ పోలీసులు కూడా పేద ప్రజల పిల్లలే అన్న విషయాన్ని నొక్కి చెబుతూ పేదలకు వ్యతిరేకంగా తుపాకుల్ని ఎక్కు పెట్టవద్దని విజ్ఞప్తి చేస్తూ వదిలేస్తున్నారు.* ✶

ప్రారంభించారు. బాసగూడెం పోలీసులు మార్చ్ 22న పోలెంపల్లి గ్రామంపై దాడి జరపగా, తర్వాత రెండు రోజులకు ఊసూరు పోలీసులు పూజారికాంకేర్ గ్రామంపైనా, పామేడ్ పోలీసులు కౌర్‌గట్టపైనా దాడి చేశారు. అదే రోజున, అంటే మార్చ్ 24న బాసగూడెం పోలీసులు గంగన్‌పల్లి గ్రామంపై దాడి చేశారు. గ్రామస్తులను కొట్టడం, దారులు చూపించమంటూ వేధించడం చేసారు. మార్చ్ 28న ఊసూర్ పోలీసులు పూజారికాంకేర్ చేరుకొని చుట్టుపక్కల గల ఐదు గ్రామాల నుండి 10 మందిని అరెస్టు చేసి రాత్రంతా తమతో పాటు స్కూళ్లో పడుకోబెట్టుకున్నారు. మరుసటి రోజు పూజారికాంకేర్ గ్రామానికి చెందిన ఒక మహిళను అరెస్టు చేసి విపరీతంగా హింసించారు. దళానికి సహకరించిందనే ఆరోపణపై ఈ మహిళను జైలుకు పంపారు. బుస్సాపురం గ్రామంలో ఐదుగురిని కొట్టి వారి నుండి రెండు వేలు రూపాయల లంచం వసూలు చేసి ఆ తర్వాత వదిలేశారు.

మొద్దిగూడ, జారపల్లి, గామపాడ్, రాపం, జోడిపల్లి, ఏంపురం, కచాల్, కౌర్‌గట్ట గ్రామాలపై పామేడ్ పోలీసులు దాడులు చేశారు. ధర్మారంలో 12 మందిని అరెస్టు చేశారు. గల్లం, పుట్టెపాడ్, ఇత్తగూడెం, నడుంపల్లి గ్రామాలపై ఊసూర్ పోలీసులు 3, 4 సార్లు దాడులు చేశారు. ఇత్తగూడెంలో సంఘ నాయకుల ఇండ్లపై దాడులు చేశారు. నడుంపల్లి నుండి 14 మందిని పట్టుకొని వెళ్లి కొట్టి ఇద్దరిని జైలుపాలు చేశారు. గల్గాం గ్రామంలో కూడా ఏడుగురిని అరెస్టు చేశారు. మొత్తం ఏరియాలో ఈ నిర్బంధకాండలో పోలీసులు 44 మందిని అరెస్టు చేసి వారిలో నలుగురిని జైలుకు పంపారు. ఏప్రిల్ 28న కూడా కొండపల్లిలో ఇద్దరిని కొట్టారు. కాగా, ఎన్నికల సందర్భంగా ఊసూర్ ఏరియా గ్రామాలలో కొద్ది మంది పెత్తందార్లు, నడింపల్లి గ్రామ భూస్వామి పోలీసులకు సహకరించి సంఘ సభ్యులను అరెస్టు చేయించారు. వీళ్లను ఆ తర్వాత సంఘాల నాయకత్వంలో ప్రజలు శిక్షించారు. ఎన్నికల నిర్వహణకు గాను ఈ ఏరియాలోని ఊసూర్, పామేడ్, బాసగూడెం పోలీసు స్టేషన్లకు అదనంగా ఒక్కో కంపెనీ బీఎస్ఎఫ్‌ను కేటాయించారు. బీఎస్ఎఫ్ జవాన్లు ప్రజలను విపరీతంగా హింసించారు.

### *ప్రజా ప్రతిఘటన*

- పూజారికాంకేర్‌లో స్కూలు వద్ద పడుకున్న బీఎస్ఎఫ్ జవాన్లపై మిలిషియా దళం క్లెమోర్‌తో దాడి చేసింది. పోలీసులు రాత్రంతా కాల్పులు జరుపుతూ గడిపారు.
- బాసగూడెం నుండి కొండపల్లి గ్రామానికొచ్చిన బీఎస్ఎఫ్, స్థానిక పోలీసులపై స్కూలు వద్ద ఉన్న బోరింగులో అమర్చిన బాంబును గెరిల్లాలు పేల్చివేయగా శత్రువు బెంబేలెత్తి తెల్లవార్లూ కాల్పులు జరిపాడు.
- ఇదే బ్యాచ్ మరుసటి రోజు బాసగూడెం తిరిగిపోతున్న క్రమంలో గుండం గ్రామం వద్ద ప్రజా మిలిషియా టీం క్లెమోర్ మైన్స్‌తో అంబుష్ చేయగా ఒక హవల్దారు అక్కడికక్కడే చావగా మరో ఇద్దరు బీఎస్ఎఫ్ జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు.
- చనిపోయిన హవల్దారు శవాన్నీ, గాయపడ్డ జవాన్లనూ తీసుకెళ్తున్న పోలీసులను పీజీఏ గెరిల్లాలు మళ్లీ వెంబడించారు. దీంతో పోలీసులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని ప్రజలను పక్కన పెట్టుకొని బాసగూడెం చేరుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక పోలీసులకూ, బీఎస్ఎఫ్ వాళ్లకూ మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ జరిగింది. తాము సహాయంగా రమ్మని ఎంత మొత్తుకున్నా స్థానిక పోలీసు అధికార్లు నిర్లక్ష్యం చేసి ఎవరినీ పంపలేదని బీఎస్ఎఫ్ వాళ్లు మండిపడ్డారు.
- పామేడ్ పోలీసులకు ఎడ్లబండిలో వస్తున్న సప్లైలను పీజీఏ బేస్ ఫోర్స్ అడ్డుకోవడంతో పోలీసులు తోక ముడిచారు.
- తోంగూడెం-పామేడ్‌ల మధ్య నడిచి వస్తున్న పోలీసులపై మిలిషియా కాల్పులు జరిపింది. ఇరువైపులా కాల్పులు జరిగాయి. ఎవరికీ నష్టాలు లేవు.
- ఏప్రిల్ 13న ఊసూర్ నుండి పూజారికాంకేర్‌కు వస్తున్న బీఎస్ఎఫ్ జవాన్ల బృందంపై పీజీఏ యోధులు గుంజార్ గ్రామం వద్ద అంబుష్ చేయగా ఇద్దరు అధికార్లతో పాటు మొత్తం ఐదుగురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు.

### *ఎన్నికలు జరిగిన తీరు*

ఏరియాలో మొత్తం 15 పోలింగ్ బూత్‌లు ఉండగా కేవలం పోలీసు స్టేషన్లున్న ఊసూర్, పామేడ్‌లలోనే పోలింగ్ జరిపారు. పోలీసుల భయం వల్ల వీటికి చుట్టుపక్కల గల కొన్ని గ్రామాల వాళ్లు మాత్రం ఓట్లేశారు. మిగతా గ్రామాలన్నీ ఓట్లను పూర్తిగా బహిష్కరించారు. మెజారిటీ గ్రామాలలో అసలు పోలింగ్ సిబ్బందే రాలేదు.

## పశ్చిమ బస్తర్ డివిజన్

సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, పంజాబ్ కమాండో, ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్ బలగాలకు చెందిన వేలాది బలగాల నిర్బంధాన్ని ఎదురిస్తూ పశ్చిమ బస్తర్ డివిజన్‌లో ప్రజలు ఎన్నికల్ని బహిష్కరించారు. ఈ డివిజన్ ఆర్గనైజేషన్ పరిధిలో మొత్తం 300 గ్రామాలుండగా ఇందులో కేవలం 32 గ్రామాలు మాత్రమే, అంటే కేవలం 10.6% గ్రామాలే పోలింగ్‌లో పాల్గొన్నాయి. ఈ గ్రామాలన్నీ రోడ్లపైన ఉన్నవీ, పోలీసు స్టేషన్లు ఉన్నవీ. మొత్తం ఏరియాలో 80 శాతం ప్రజలు బూటకపు ఎన్నికల ప్రక్రియను పూర్తిగా బహిష్కరించారు.

### ప్రజా ప్రతిఘటన

- భోపాలపట్నం నుండి మద్దేడ్ వచ్చే మెయిన్‌రోడ్డుపైన ఉస్కలేడ్ వద్ద ముగ్గురు సభ్యుల పీజీఏ టీం ఆంబుష్ చేసింది. ఏప్రిల్ 19వ తేదీ మధ్యాహ్నం మోటార్ సైకిళ్లపై వస్తున్న పోలీసులపై జరిపిన ఈ ఆంబుష్‌లో నలుగురు పోలీసులు గాయపడ్డారు.
- ఏప్రిల్ 17న ఫర్సగడ్ పోలీసు స్టేషన్ నుండి సాగుమెట్టకు వెళ్లే రోడ్డుపై సాలెపల్లి గ్రామం వద్ద పంజాబ్ కమాండో బలగాలపై పీజీఏ యోధులు ఆంబుష్ చేశారు. అయితే ఈ ఆంబుష్‌లో ఎవరికీ ఏ నష్టాలూ జరగలేదు. పంజాబ్ కమాండోలపై బస్తర్‌లో జరిగిన తొలి దాడి ఇది. ఆ తర్వాత వాళ్ల కమాండెంట్ పత్రికల వాళ్లతో మాట్లాడుతూ "గతంలో పంజాబ్‌లో పగలు మాది, రాత్రి వాళ్లది (జాతీయ పోరాటవాదులది)గా ఉండేది. ఇప్పుడు ఇక్కడ మాత్రం రాత్రీ, పగలూ రెండూ వీళ్లవి (నక్సలైట్లవి) గానే ఉన్నాయ"ంటూ వాపోయాడు. ఇలాంటి వ్యాఖ్యానాలు ఘోరంగా దిగజారిన వాళ్ల మనోస్థైర్యానికి అద్దం పడతాయి.
- ఏప్రిల్ 19 రాత్రి ఒకవైపు పంజాబ్ కమాండోలు సాగుమెట్ట గ్రామంలో కుక్క మొరిగినా, ఆకు రాలినా ఉలిక్కిపడుతూ క్షణమొక యుగంగా గడుపుతుండగా పీజీఏ గెరిల్లాలు మరోసారి దాడికి దిగి ఒక గ్రెనేడ్ వేసి కొన్ని తూటాలు కాల్చారు. ఇక ఆ రాత్రంతా నిద్ర పోకుండా పిరికి కమాండోలు కాల్పులు జరుపుతూ, మోర్టార్ షెల్స్ వేస్తూ గడిపారు.
- ఏప్రిల్ 19నే జగ్దల్‌పూర్ నుండి బీజాపూర్ వెళ్లే మెయిన్‌రోడ్డుపై మాట్వాడ, జాంగ్ల గ్రామాల నడుమ వంతెన కింద పీజీఏ గెరిల్లాలు మందుపాతర అమర్చారు. అయితే గత కొన్ని రోజులుగా బస్తర్ అంతటా జరుగుతున్న దాడులను దృష్టిలో పెట్టుకొని పోలీసుల కాన్వాయ్ వంతెనకు కొంత దూరంలోనే ఆగిపోయి కొందరు పోలీసుల్ని వంతెనను క్లియర్ చేసుకోవడం కోసం పంపించగా గెరిల్లాలు మైన్ పేల్చారు. ఆ తర్వాత వెంటనే కాల్పులు కూడా ప్రారంభించారు. ఇందులో ఒక కమాండెంట్‌తో సహా ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. గెరిల్లాలు ఎలాంటి నష్టం లేకుండా రిట్రీటయ్యారు.
- మిర్తుల్ ఎల్జీఎస్ పరిధిలో పుల్లుం గ్రామంలో పోలింగ్ కేంద్రానికి రక్షణగా వచ్చిన పోలీసులు స్కూలు భవనంలో మకాం చేయగా గెరిల్లాలు దాడి జరిపారు. ఇరు పక్షాల మధ్య కాల్పులు జరిపినప్పటికీ ఎవరికీ ఏమీ కాలేదు. మరుసటి రోజు పోలీసులు బయలుదేరేటప్పుడు ప్రజలు వాళ్ల సామాన్లు మోయడానికి నిరాకరించగా పోలీసులు తమంతట తామే మోసుకోవల్సి వచ్చింది.

## గడ్చిరోలి డివిజన్

ఎన్నికల బందోబస్తు కోసం వచ్చిన పోలీసు బ్యాచీపై పీజీఏ సైనికులు గడ్చిరోలి జిల్లా టిప్రాగడ్ ప్రాంతంలో దరాచీ గ్రామంలో చికాకు చర్య జరిపారు. అయితే ఈ దాడిలో ఎవరూ గాయపడలేదు. పోలీసులు మాత్రం వెలుతురునిచ్చే బాంబుల్ని కాలుస్తూ రాత్రంతా తూటాలు కాలుస్తూ గడిపారు.

## ఉత్తర బస్తర్ డివిజన్

### కిస్‌కొడ్డో ఏరియాలో...

బూటకపు లోక్‌సభ ఎన్నికల్ని బహిష్కరించాలంటూ ఉత్తర బస్తర్ డివిజన్ కిస్‌కొడ్డో ఏరియాలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలతో పాటు అనేక చోట్ల గోడలపై బహిష్కరణ నినాదాలు రాశారు. పలు గ్రామాల ప్రజలను సమీకరించి ఎన్నికల బహిష్కరణ సభలను కూడా అనేక చోట్ల నిర్వహించారు. హుచాడి అనే గ్రామంలో జరిగిన సభకు 3 గ్రామాల నుండి 40 మంది మహిళలు, 60 మంది పురుషులు హాజరయ్యారు. కిస్‌కొడ్డో గ్రామంలో జరిగిన సభలో 10 గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. సభకు వచ్చిన ప్రజలు ముందుగా ఊరేగింపు జరిపి బూటకపు ఎన్నికలను బహిష్కరించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సభలో మొత్తం 260 మంది ప్రజలు పాల్గొన్నారు.

కుదురుపార గ్రామంలో జరిగిన సభలో 6 గ్రామాల నుండి 120 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. కిలెనార్ అనే గ్రామంలో కూడా ఆరు గ్రామాల నుండి 120 మంది స్త్రీపురుషులు హాజరయ్యారు. పీప్ర అనే గ్రామంలో జరిగిన ఊరేగింపులో 60 మంది పురుషులు, 40 మంది స్త్రీలు పాల్గొన్నారు. ఏరియాలోని దాదాపు అన్ని పెద్ద గ్రామాలలోనూ, సంతలలోనూ ఊరేగింపులు తీసి ఎన్నికల బహిష్కరణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.

*ప్రజా ప్రతిఘటన – బహిష్కరణ*

పోలింగ్ బూత్‌లున్న గ్రామాలలో పోలీసులు వచ్చి పోలింగ్ రోజున ప్రజలను కొట్టి, బెదిరించి బలవంతంగా ఓట్లు వేయించారు. గవాడి అనే గ్రామంలో పోలీసులు చిన్న పిల్లలను కూడా బలవంత పెట్టి ఓట్లు వేయించారు. అయినప్పటికీ గవాడిలో కేవలం 6 ఓట్లు, అర్రా అనే గ్రామంలో కేవలం 5 ఓట్లు, కిస్‌కొడ్డో గ్రామంలో 10 ఓట్లు పడ్డాయి. అర్రా గ్రామానికి పోలింగ్ సందర్భంగా వచ్చిన పోలీసులు ప్రజల ఇండ్లలో జొరబడి కోళ్లనూ, మేకల్నీ ఎత్తుకెళ్లి తిన్నారు. చుట్టుపక్కల గ్రామాల వాళ్లెవరూ ఓట్లు వేయడానికి రాలేదు.

ఈ ఏరియాలో మొత్తం ఐదు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లను ప్రజలూ, ప్రజా మిలిషియా జప్తు చేసుకున్నారు. అట్లాగే రెండు చోట్ల మిలిషియా పోలీసులపై కాల్పులు జరిపింది. మరో రెండు చోట్ల స్థానిక గెరిల్లా దళాలు పోలీసులపై కాల్పులు జరిపాయి.

### బార్దా ఎల్‌జీఎస్ పరిధిలో...

ఎన్నికల బహిష్కరణ కోసం ఈ ఏరియాలో డీఏకేఎంఎస్ నుండి 4, కేఏఎంఎస్ నుండి 2 ప్రచార దళాలు గ్రామాలకు వెళ్లి ప్రచారాన్ని నిర్వహించాయి. మొత్తం 300 పోస్టర్లు, 500 కరపత్రాలు ఈ ప్రచారానికి వినియోగించారు. దాదాపు 30 గ్రామాలలో గోడలపై ఎన్నికల బహిష్కరణ నినాదాలు రాశారు. పరాల్ అనే గ్రామంలో ఈ సందర్భంగా నిర్వహించిన ఒక సభలో చుట్టుపక్కల గ్రామాల నుండి 200 మంది పురుషులు, 180 మంది స్త్రీలు పాల్గొన్నారు. తుర్కీ అనే గ్రామంలో జరిగిన సభలో 75 మంది స్త్రీలు, 110 మంది పురుషులు పాల్గొన్నారు. కోన్‌గుడ్ గ్రామంలో జరిగిన సభలో 50 మంది మహిళలు, 150 మంది పురుషులు పాల్గొన్నారు. ఆమ్‌గాంలో జరిగిన సభలో వంద మంది మహిళలు, 200 మంది పురుషులు పాల్గొన్నారు. ఈ సభలను ఉరుందబేడ రేంజ్ డీఏకేఎంఎస్, కేఏఎంఎస్ కమిటీలు నిర్వహించాయి. చింగ్‌నార్ గ్రామంలో కూడా డీఏకేఎంఎస్ నాయకత్వంలో ప్రజలు ఒక ఊరేగింపు జరిపారు. ఈ ర్యాలీలో దాదాపు 500 మంది స్త్రీపురుషులు పాల్గొన్నారు. ఈ విస్తృత ప్రచారం ఫలితంగా మొత్తం బార్దా ఎల్‌జీఎస్ పరిధిలో 12 గ్రామాల ప్రజలు ఎన్నికల్ని పూర్తిగా బహిష్కరించారు.

*ప్రజా ప్రతిఘటన*

- ఏప్రిల్ 18వ తేదీ రాత్రి ధనోర నుండి వచ్చి హాట్‌చపాయి గ్రామ స్కూళ్లో మకాం చేసిన పోలీసులపై మిలిషియా దళం

భర్మార్లతో దాడి చేసింది. పోలీసులను గందరగోళ పర్చడానికి టపాకాయల్ని కూడా పేల్చింది. అయితే పోలీసులు ఎలాంటి ఫైరింగ్ చేయకుండా లోపలే ఉండిపోయారు. ఉదయం ఐదు గంటలకే లేచి ధనోరా వెళ్లిపోయారు.

## మాడ్ డివిజన్

### కోహ్కామెట్ట ఏరియాలో ...

ఈ ఏరియాలో ప్రజా సంఘాల, మిలిషియా నిర్మాణాల యూనిట్లన్నీ ఎన్నికల బహిష్కరణలో చురుగ్గా పాల్గొన్నాయి. ఈ ఏరియాలో ఎన్నికల బహిష్కరణ 99% విజయవంతం అయ్యింది. ప్రభుత్వం దొంగ ఓటింగ్ చేయించి బైటికి ఎంత శాతాన్ని చూపినప్పటికీ వాస్తవానికి ఈ ప్రాంతంలో 99% ప్రజలు ఎన్నికల్ని పూర్తిగా బహిష్కరించారు.

*నిర్బంధం*

సోన్‌పూర్, మరహపదర్, కుంద్ల, కోహ్కామెట్ట గ్రామాల్లో 20 మందిని స్త్రీలూ, పురుషులనే తేడా లేకుండా తీవ్రంగా కొట్టారు. ఇవే గ్రామాలకు చెందిన 27 మంది ప్రజలను (ఇందులో 10 మంది చిన్న పిల్లలు) మానవ కవచాలుగా వెంట పట్టుకెళ్లారు. వీరిలో సగం మందిని వదిలేయగా మరో సగం మందిని చాలా రోజుల దాకా వదిలిపెట్టలేదు. సోన్‌పూర్ గ్రామంలో ఉన్న రెండు దుకాణాల్లోంచి పోలీసులు సామాన్లు ఎత్తుకెళ్లారు. కోహ్కామెట్టలో 2, సోన్‌పూర్‌లో 30, కుంద్లలో 2, కీహ్కాడ్‌లో 1 – మొత్తం 35 ఇండ్లను పోలీసులు ధ్వంసం చేశారు. దర్వాజల్ని విరగ్గొట్టడం, సామాన్లు బైట పడవెయ్యడం వంటి దుశ్చర్యలకు పాల్పడ్డారు. సోన్‌పూర్ గ్రామంలో అన్ని ఇండ్లలోకి జొరబడి సామాన్లు చిందరవందర చేసి పాడు చేశారు. కోహ్కామెట్ట ఆశ్రమ పాఠశాల దర్వాజను విరగ్గొట్టారు. విద్యార్థుల పెట్టెలనూ, బట్టలనూ బైట పారేశారు. మల, మూత్రాలను లోపలే విసర్జించి పాఠశాలను పశువుల కొట్టంకన్నా హీనంగా మార్చారు. ఈ అన్ని గ్రామాలలో కోళ్లు తినడం, గుడ్లు తినడం వంటి సంఘటనలకు లెక్కే లేదు. మరహపదర్ గ్రామంలో ఒక రైతుపై కాల్పులు జరిపారు. నేల్‌నార్ గ్రామంపై దాడి జరిపి అక్కడి భూంకాల్ అమరుల స్తూపాన్ని ధ్వంసం చేసి ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. నారాయణపూర్ పట్టణంలో 'దైనిక్ భాస్కర్' పత్రిక విలేఖరిగా పని చేస్తున్న శీతల్ ప్రకాశ్‌పై సీఆర్‌పి జవాన్లు దాడి చేశారు. నారాయణపూర్‌లో సీఆర్‌పి బలగాలు ప్రజలపై జరుపుతున్న అత్యాచారాలను గురించి ఏప్రిల్ 12, 13 తేదీలలో పత్రికలో రాసినందుకు ఆయనపై పగబట్టారు. నారాయణ్‌పూర్‌లో ఉంటూ వారం వారం సంతలకు తిరిగే చిన్న వ్యాపారస్తులను చాలా మందిని తీవ్రంగా కొట్టారు.

*ప్రతిఘటన*

ఈ ఏరియాలో దళాలూ, ప్రజా మిలిషియా కల్సి మొత్తం ఏడు చోట్ల పోలీసులపై ఆంబుష్‌లు చేశారు. ఆరు సార్లు పోలీసుల మకాంలపై కాల్పులు జరిపారు. ఈ మొత్తం ఘటనల్లో మొత్తం 13 మంది పోలీసులు గాయపడ్డారు. రాత్రి పూట పోలీసులను నిద్ర పోనివ్వకుండా మిలిషియా వంతుల వారీగా వెళ్లి కాల్పులు జరపడంతో పోలీసులు తీవ్ర గందరగోళానికి గురయ్యారు. ఆఖరుకు మల, మూత్ర విసర్జనలకు కూడా బైటికి వెళ్లకుండా స్కూలు భవనాలను పాడు చేసి తమ పిరికితనాన్ని చాటుకున్నారు. బైట అడుగు పెడితే ఎటు నుండి తూటా పేలుతుందో, ఎక్కడ బూబీ ట్రాప్ ప్రాణాలు తీస్తుందో తెలియని అనిశ్చిత పరిస్థితిలో పోలీసులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ దాడులన్నిటిలో పోలీసులు వేలాది తూటాల్నీ, వందకు పైగా మోర్టార్ షెల్స్‌నూ ప్రయోగించారు.

### ఇంద్రావతి ఏరియాలో...

*నిర్బంధం*

బడేపల్లి అనే గ్రామంలో డీఏకేఎంఎస్ రేంజ్ కమిటీ సభ్యుని ఇంటిపై రాత్రి 3 గంటల సమయంలో దాడి చేసి, ఊరి నుండి ఇద్దరు మహిళలనూ, ఆరుగురు యువకులనూ అరెస్టు చేశారు. అరెస్టు చేసిన మహిళలపై సామూహిక అత్యాచారం జరిపారు. ఇందులో ఒక మహిళ పారిపోగా మరో మహిళ బుద్రిని కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కథనల్లారు. ఛోటేపల్లి గ్రామంలో ముగ్గురు రైతుల్ని – చైతు కోపాల్, మంగుడు, బుధ్‌రాంలను అరెస్టు చేశారు. వీరిలో పోలీసుల హింసలను తట్టుకోలేక చైతు ప్రాణాలు విడిచాడు. శవాన్ని పోలీసులే దగ్గరుండి ఖననం చేయించారు. మిగతా ఇద్దరిని జైళ్లలో నిర్బంధించారు. ఇప్పటికీ వీళ్లు విడుదల కాలేదు.

*ప్రతిఘటన*

- జాట్లూర్, ఆదేర్ ప్రాంతాలలో ఎన్నికలకు ముందూ, తర్వాతా మూడు చోట్ల పోలీసులపై పీజీఏ బలగాలు దాడి చేశారు. అయితే ఈ ఘటనల్లో ఇరుపక్షాల్లో ఎవరికీ నష్టం జరగలేదు.
- ఏప్రిల్ 3వ తేదీన ఇంద్రావతి ఏరియాలో ధర్మ గ్రామంలో స్కూళ్లో బస చేసిన పోలీసులపై పీజీఏ సైనికులు కాల్పులు జరిపారు.
- ఏప్రిల్ 4న మధ్యాహ్నం అదే బ్యాచీ బయలుదేరి వెళ్తుండగా తోవలో తాడుం గ్రామం వద్ద మరో దళం ఆంబుష్ చేసింది. ఇందులో కూడా ఎవరూ గాయపడలేదు.

*ఎన్నికల బహిష్కరణ*

ఇంద్రావతి ఏరియాలో మొత్తం 14 పోలింగ్ కేంద్రాలుండగా కేవలం బైల్, తాకిలోడ్, పొల్లెవాయ, కుడిమేర్ అనే నాలుగు గ్రామాల్లోనే మొత్తం అన్ని పోలింగ్ కేంద్రాల పోలింగ్‌ను పూర్తి చేశారు. మెజారిటీ గ్రామాల ప్రజలు ఓట్లు వేయలేదు. కుడిమేర్, తాకిలోడ్, పొల్లెవాయలో జరిగిన పోలింగ్ అంతా బోగస్ పోలింగే. పోలీసులూ, పోలింగ్ అధికార్లూ కలిసి వేసిన దొంగ ఓట్లే అన్నీ. ప్రజలు ఒక్కరు కూడా ఓటు వేయలేదు. అసలు పోలీసు నిర్బంధానికి జడిసి పోలింగ్ కేంద్రాలున్న గ్రామాల ప్రజలు ముందే గ్రామాల్ని ఖాళీ చేసి అడవిలో మకాం చేసారు.

### పరాల్‌కోట ఏరియాలో ...

ఏరియా వ్యాప్తంగా పెద్ద ఎత్తున పోస్టర్లు అంటించి, కరపత్రాలు పంచి ఎన్నికల బహిష్కరణ ప్రచారం నిర్వహించారు. ప్రజా సంఘాలన్నీ ఇందులో చురుగ్గా పాల్గొన్నాయి. కుతుల్ గ్రామంలో జరిగిన ఎన్నికల బహిష్కరణ సభలో 500 మంది ప్రజలు హాజరయ్యారు.

పరాల్‌కోట్ ఏరియాలో శత్రువు తీవ్ర స్థాయిలో నిర్బంధాన్ని కొనసాగించాడు. ఎన్నికలు మొదలవడానికి ముందే, మార్చ్ 25 నాడు వంద మంది పోలీసులు తోకే గ్రామంలో ప్రజల సమిష్టి వ్యవసాయ క్షేత్రంపై దాడి చేసి అక్కడున్న ఒక ఇంటిని కాల్చివేశారు. ముగ్గురు రైతులను అరెస్టు చేశారు. వీరిని తీవ్రంగా హింసించి ఒక రోజు తర్వాత విడుదల చేశారు. అదే రోజున మరో రైతును అరెస్టు చేసి అతని నుండి ఐదు వేల రూపాయల లంచం తీసుకొని వదిలేశారు. 40 మంది పోలీసులు 12 ఇండ్లున్న ఇర్పనార్ గ్రామంపై దాడి చేసి అక్కడ ఏడు సంవత్సరాల పసి పిల్లల నుండి వృద్ధుల వరకూ అందరినీ హింసించారు. రైతుల నుండి గొడ్డళ్లు, కత్తులు, విల్లంబులు, రెండు భర్మార్ తుపాకులు జప్తు చేసుకున్నారు. కద్దేర్, బేరవాడ గ్రామాలపై దాడి చేసి రైతుల పనిముట్లన్నిటినీ జప్తు చేసుకునన్నారు. ఒక రైతును తీవ్రంగా హింసించారు.

*(తరువాయి 35వ పేజీలో........)*

*(......... చివరి పేజీ తరువాయి)*

ఒరగబెట్టిన బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్-ఎన్‌సీపీ రెండూ కూడా ఈ నేరంలో భాగస్వాములే. కాబట్టి ప్రస్తుతం ఓట్లు రాబట్టడం కోసం ఎవరేం మాట్లాడినా వీళ్లు రైతుల ప్రయోజనాల్ని నట్టేట ముంచే వాళ్లేనన్న విషయాన్ని గ్రహించాలి.

ఎన్నికలు దగ్గర పడగానే అధికార కూటమి రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీపై నిషేధాన్ని ఎత్తివేస్తున్నట్టు ఆదరాబాదరాగా ప్రకటించింది. అట్లాగే మూతపడి ఉన్న చెక్కర మిల్లుల్ని తెరిపిస్తామనీ, ప్రైవేటు రంగంలో వెనుకబడిన కులాల వాళ్లకూ, దళితులకూ రిజర్వేషన్‌ను అమలు చేస్తామనీ, కరువు పీడిత ప్రాంతాలలో యుద్ధ ప్రాతిపదికపై సహాయ-పునరావాస కార్యక్రమాల్ని అమలు చేస్తామనీ ప్రకటించింది. ఇవి రాష్ట్రంలోని యువజనుల్ని మాయలో పడవేయడానికేనన్నది స్పష్టం. శిందే ప్రభుత్వం సామాన్య తరగతికి చెందిన ఒక లక్షా యాభై వేల ఉద్యోగాల్ని భర్తీ చేస్తానంది. గమనించాల్సిన విషయం ఏమిటంటే ఉద్యోగాల నియామకంపై అసలు నిషేధాన్ని విధించింది కూడా సరిగ్గా ఇదే ప్రభుత్వం. ప్రస్తుతం రాష్ట్రంలో ఉపాధి కార్యాలయాల్లో పేర్లు నమోదు చేసుకున్న చదువుకున్న నిరుద్యోగుల సంఖ్య 45 లక్షలు ఉంది. అనేక మంది నిరుద్యోగులు కూడా బతుకుపై ఆశలు కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం వీళ్లను అబద్ధపు వాగ్దానాలతో మోసగించి ఓట్లు రాబట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న నూతన ఆర్థిక విధానాల కారణంగానే దేశంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తున్నది. ఈ విధానాల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించగా, బీజేపీ సమర్థవంతంగా కొనసాగించింది. అలాంటప్పుడు ఈ పరిస్థితికి ఇవి రెండూ సమానంగా దోషులే. కాబట్టి యువజనులు ఈ రెండింటి ముసుగుల్ని చించేసి ఎన్నికలను బహిష్కరించాలని మేం కోరుతున్నాం.

చాలా ఏళ్లుగా మహారాష్ట్రలో ప్రత్యేక విదర్భ రాష్ట్ర ఏర్పాటు కోసం విదర్భ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. దాదాపు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలూ విదర్భ రాష్ట్ర ఏర్పాటును వ్యతిరేకిస్తున్నాయి. అయితే ఎన్నికలు దగ్గర పడగానే విదర్భవాసుల పట్ల అంతులేని ప్రేమను ఒలకబోస్తూ తాము విదర్భ రాష్ట్ర ఏర్పాటుకు వ్యతిరేకం కామని అన్ని పార్టీలూ ప్రకటిస్తున్నాయి. ఇప్పటికీ తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు విషయంపై ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వకుండా, ఆ డిమాండ్ గురించి మాట్లాడితేనే యూపీఏలో భాగస్వామిగా ఉన్న తెలంగాణా రాష్ట్ర సమితిని మాటిమాటికీ పోతే పొమ్మనే బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు విదర్భ విషయంలో కూడా తెలంగాణా ఏర్పాటు పట్ల అనుసరిస్తున్న వైఖరినే అవలంబిస్తామని చెప్పడం ప్రజల్ని మోసం చేయడానికే తప్ప మరేమీ కాదు. ఇక సేన-భాజపా కూటమి కూడా ఓట్ల కోసమే విదర్భ ఏర్పాటు గురించి మాట్లాడుతున్నది తప్ప ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు పట్ల నిజాయితీతో కాదు. కాబట్టి ఓట్ల కోసమే విదర్భ రాష్ట్ర ఏర్పాటు గురించి కల్లబొల్లి మాటలు మాట్లాడుతున్న అవకాశవాద పార్టీలన్నిటికీ విదర్భవాసులు తప్పక బుద్ధి చెబుతారు.

గత ఐదేళ్ల పాలనలో మహారాష్ట్ర ప్రభుత్వంలో వెలికి వచ్చిన కుంభకోణాలకు లెక్కేలేదు. దేశంలోనే సంచలనం సృష్టించిన స్టాంపు పేపర్ల కుంభకోణంలో అధికార పక్షంతో సహా విపక్షాలకు చెందిన నాయకులకు కూడా పాత్ర ఉంది. ఉప ముఖ్యమంత్రి ఛగన్ భుజబల్ తన ఈ కుంభకోణం మూలంగా తన పదవినే కోల్పోవల్సి వచ్చింది. 5,000 కోట్ల రూపాయల బియ్యం కుంభకోణంలో కూడా చాలా మంది నాయకులకు పాత్ర ఉంది. ఇక బీజేపీ ఒకవైపు నేరచరిత్ర గలవాళ్లు పదవిలో కొనసాగరాదని వల్లిస్తూనే చాలా మంది నేరచరితులకు సీట్లు ఇవ్వడం దాని ద్వంద్వ నీతికి నిదర్శనం. అధికార, విపక్ష పార్టీలన్నీ నేరచరితులకు సీట్లు ఇస్తూనే ఉన్నాయి.

గత మేలో కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ఓటమికి కారణాల్ని సమీక్షిస్తూ సంఘ్ ముఠా ఇకపై బీజేపీ ఉగ్ర హిందుత్వ విధానాల వైపు మళ్లాలని నిర్దేశించింది. అందులో భాగంగానే సంఘ్ ముఠాలోని సంస్థలన్నీ పథకం ప్రకారమే ఫాసిస్టు విధానాలను అమలు చేస్తున్నాయి. వీహెచ్‌పీ నాయకుడు ప్రవీణ్ తొగడియా మహారాష్ట్రలో త్రిశూలాలు పంచిపెడ్తూ 'గుజరాతీకరణ' చేయాలని ప్రయత్నిస్తున్నాడు. శతాబ్దాల కిందటి ముస్లింల దర్గాలనూ, మసీదులనూ కూల్చివేయాలని సంఘ్ ముఠా శక్తులు ప్రకటనలు చేస్తూ ప్రజలలో ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్నాయి. ఒకవైపు అభివృద్ధి మంత్రాన్ని జపిస్తూనే మరోవైపు ప్రజలలో మత విద్వేషాల్ని రెచ్చగొట్టి మధ్యయుగాల వైపు మళ్లిస్తున్నాయి. గతంలో అనేక సార్లు ముంబయ్‌లోనూ, ఇతర అనేక పట్టణాల్లోనూ మత కల్లోలాల్ని సృష్టించి వేలాది మంది ముస్లింలను ఊచకోత కోసిన చరిత్ర సేన-భాజపా తదితర సంఘ్ సంస్థలకుంది. ప్రజల దృష్టిని మౌలిక సమస్యల నుండి మళ్లించడానికి పథకం ప్రకారమే మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారు. అయితే కాంగ్రెస్ లౌకికవాదినని చెప్పుకుంటూనే మరోవైపు సంఘ్ ముఠా శక్తులతో బుజ్జగించే ధోరణిలో వ్యవహరిస్తూ ఆచరణలో హిందూ ఫాసిస్టులకు సహకారాన్నే అందిస్తున్నది. రివిజనిస్టు పార్టీలతో సహా మిగతా పార్టీలన్నీ కూడా పైకి ఏం చెబుతున్నా సంఘ్ ముఠా శక్తులతో దృఢమైన పోరాటానికి మాత్రం సిద్ధంగా లేవు. కాబట్టి ఈ బూటకపు రాజకీయ పార్టీలకు ప్రజలు తగిన బుద్ది చెప్పి పెచ్చరిల్లుతున్న హిందూ ఫాసిజానికి వ్యతిరేకంగా విశాల ప్రాతిపదికపై సమైక్యం కావాల్సిన అవసరం ఉంది.

మహారాష్ట్రలో దళితుల ఓట్లు రాబట్టుకోకుండా సీట్లు గెలవడం కష్టమని భావించిన అధికార, విపక్ష కూటములు రకరకాల ఎత్తులు వేస్తున్నాయి. కాంగ్రెస్ దళితుడైన శిందేను ముఖ్యమంత్రిగా చేసి దళితులను తన వైపు గెల్చుకోవడానికి ప్రయత్నిస్తుండగా, శివసేన "శివశక్తి - భీంశక్తి" అంటూ ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నది. జ్యోతిబా పూలే, అంబేడ్కర్‌ల నాటి నుండి దళిత చైతన్యం బాగా అభివృద్ధి చెందిన మహారాష్ట్రలో నేడు దళిత పార్టీలన్నీ ఘోరమైన అవకాశవాదంలో, అంతర్గత కుమ్ములాటల్లో నిండా మునిగిపోయాయి. ఎన్నికల్లో అధికారాన్ని సంపాదించడం ద్వారా దళితుల అభ్యున్నతి జరుగుతుందన్న వాదనకు కాలం చెల్లినప్పటికీ ఇంకా ఆర్‌పీఐ, బీఎస్‌పీ, లోక్ జనశక్తి లాంటి పార్టీలు దళితులను ఇదే వాదనతో మభ్యపెడుతున్నాయి. మాయావతి ముఖ్యమంత్రిగా రాజ్యమేలిన ఉత్తరప్రదేశ్‌లో దళితులకేం ఒరగబెట్టిందో అందరికీ తెల్సిందే. దళితులు ఇలాంటి అవకాశవాద పార్టీలను దరిచేరనివ్వకుండా నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగం కావాలి. భూస్వామ్య విధానాన్ని సమూలంగా కూలదోసే ప్రజాస్వామిక విప్లవంలోనే దళిత సమస్యకు పరిష్కారం ఉందన్న వాస్తవాన్ని గుర్తించాలి.

మహారాష్ట్రలో ఆగ్నేయ మూలన ఉన్న గడ్చిరోలి, గోందియా, చంద్రపూర్ జిల్లాలలో మన పార్టీ నాయకత్వంలో విప్లవోద్యమం కొనసాగుతున్నది. ప్రధానంగా ఆదివాసీ ప్రాంతాలలో కేంద్రీకృతమై ఉన్న ఈ ఉద్యమం దేశంలో భూస్వామ్య, సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ వ్యవస్థను వేళ్లతో సహా పెకిలించి వేసి కార్మిక-కర్షక ఐక్యతా పునాదిపై పీడిత ప్రజల సంయుక్త రాజ్యాధికారాన్ని స్థాపించే దిశగా పురోగమిస్తున్నది. మహారాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాంతాలలో తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించి విప్లవోద్యమాన్ని అణచివేయడానికి ప్రయత్నిస్తున్నది. గతంలో అధికారంలో

ఉన్న సేన-భాజపా గానీ, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్-ఎన్‌సీపీ కూటమి గానీ ఇక్కడి ఆదివాసీ ప్రజలపై టాడా, పోటా లాంటి నల్లచట్టాల్ని ప్రయోగించి క్రూరమైన నిర్బంధాన్నే ప్రయోగించాయి. బూటకపు ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, చిత్రహింసలు, జైలు నిర్బంధాలు, గాంబందీ పేరిట విప్లవకారులపైకి ప్రజల్ని రెచ్చగొట్టే ప్రయత్నాలు వంటి ఎన్నో రూపాల్లో ప్రభుత్వాలు నిర్బంధాన్ని కొనసాగిస్తున్నాయి. ప్రభుత్వం సీ-60 బలగాల పేరిట ఏర్పాటు చేసిన కమాండో బలగాలు ప్రజలపై అమానుష నిర్బంధాన్నీ, హత్యాకాండలనూ కొనసాగిస్తున్నాయి. తీవ్రమైన పోలీసు నిర్బంధం నడుమనే ప్రజా ఉద్యమం పురోగమిస్తున్నది. గ్రామగ్రామాన విప్లవ రాజ్యాధికార సంస్థల ఏర్పాటుకు కృషి జరుగుతున్నది. దండకారణ్యాన్ని విముక్తి ప్రాంతంగా మల్చాలన్న పార్టీ లక్ష్యంలో భాగంగా గడ్చిరోలిలో విప్లవోద్యమం అనేక అడ్డంకుల్ని అధిగమించి ముందడుగు వేస్తున్నది. ప్రజలు తమ అభివృద్ధిని తమ చేతుల్లోకి తీసుకొంటూ ప్రభుత్వపు బూటకపు అభివృద్ధి కార్యక్రమాల్ని వ్యతిరేకిస్తున్నారు. ప్రస్తుత అప్రజాస్వామిక వ్యవస్థలో జరిగే ఎన్నికల్ని బూటకమైనవిగా పరిగణిస్తూ వాటిని బహిష్కరిస్తూ వస్తున్నారు. ఇదే నేడు మహారాష్ట్రలోని పీడిత ప్రజలంతా అనుసరించాల్సిన మార్గం. ఎన్నికల ద్వారా మన బతుకులు మారవు. ఎవరు గెల్చినా ప్రజలపై సాగుతున్న దోపిడీ పీడనలు అంతం కావు. ఎన్నికల పార్టీలన్నీ దోపిడీ వర్గాల పార్టీలే. అందుకే ఈ వ్యవస్థను సమూలంగా మార్చే నూతన ప్రజాస్వామిక విప్లవంలో భాగస్వాములవుతూ బూటకపు ఎన్నికల్ని బహిష్కరించాలి. దోపిడీపీడనలకూ, అసమానతలకూ, కుల-జాతి-లింగ-వర్ణ వివక్షకూ, ఆకలిచావులకూ, అవమానాలకూ, నిరుద్యోగానికీ, ఇంకా ఎలాంటి సామాజిక రుగ్మతలకూ తావులేని సమసమాజాన్ని స్థాపించుకోవడానికి విప్లవమొక్కటే మార్గం. ★

# ఉత్తర బస్తర్‌లో పీజీఏ ఆంబుష్

## కాంకేర్ జిల్లా ఎస్పీ సహా ఆరుగురు పోలీసులకు గాయాలు

సెప్టెంబర్ **6**న సీఆర్‌పీ, సీఏఎఫ్, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బలగాలకు చెందిన వందలాది బలగాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలు ప్రారంభించాయి. ఉత్తర బస్తర్‌లో సాగుతున్న విప్లవోద్యమాన్ని, ముఖ్యంగా కోయిలీబేడ ప్రాంత ఉద్యమాన్ని అణచివేయడానికి పోలీసులు ఒక పెద్ద క్యాంపెయిన్ ప్రారంభించారు. అయితే ఈ ప్రాంత ప్రజలు పోలీసులకు సహాయంచేయడానికి నిరాకరించారు. భారీ వర్షాలలో ఈ ప్రాంతంలోకి ప్రవేశించాలంటే ఉప్పొంగుతున్న నదులను పడవల్లో దాటాల్సిందే. కానీ ప్రజలు పోలీసు బలగాలను నది దాటించడానికి ససేమిరా నిరాకరించారు. దానితో పోలీసులు చేసేది లేక తమకు తామే నిర్లక్ష్యంగా మేండ్కీ నది దాటుతుండగా ప్రమాదవశాత్తు ఒక పడవ మునిగిపోయింది. ఈ ప్రమాదంలో ఒక పోలీసు జవాను నీళ్లల్లో మునిగి చావగా మిగతా ఐదుగురు పోలీసులు ఈదుకుంటూ వెళ్లి ప్రాణాల్ని కాపాడుకున్నారు. అయితే ఈ సందర్భంగా పోలీసులు మొత్తం ఆరు తుపాకుల్ని నదిలో పోగొట్టుకున్నారు.

ఈలోగా పంకంజూర్ నుండి బయలుదేరిన పోలీసులు నది దాటి వచ్చి పెద్ద నిర్బంధ క్యాంపెయిన్‌ను ప్రారంభించనున్నారనే వార్త ఈవలి వైపున్న పీజీఏ గెరిల్లాలకు చేరింది. దానితో వాళ్లు నది ఒడ్డుకు చేరుకునే సరికి అవతలి ఒడ్డున క్యాంపు వేసిన పోలీసులు నదిలో కొట్టుకుపోయిన తమ జవాను శవాన్నీ, గల్లంతయిన తుపాకుల్నీ వెదుకుతూ ఉన్నారు. పోలీసుల్ని గమనించిన గెరిల్లాలు వాళ్లను చికాకుపర్చడానికి కొన్ని రౌండ్లు కాల్పులు జరిపారు. పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరిపారు. ఆ తర్వాత గెరిల్లాలు వెనుదిరిగారు.

మరుసటి రోజు పోలీసులు అబద్ధపు ప్రకటనలు చేసి పత్రికల్లోనూ, రేడియోలోనూ పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేయించారు. పోలీసులకూ, నక్సలైట్లకూ మధ్య జరిగిన కాల్పుల్లో ఐదుగురు నక్సలైట్లు చనిపోయారనీ, ఒక పోలీసు జవాను నక్సలైట్లు జరిపిన కాల్పుల వల్లే నదిలో పడి చనిపోయాడనీ చెప్పారు. దీన్ని ఖండిస్తూ ఉత్తర బస్తర్ డివిజనల్ కమిటీ కార్యదర్శి కామ్రేడ్ సుజాత ఒక ప్రకటన చేశారు. అసలు ఆ ఘటనలో నక్సలైట్లెవరూ చనిపోలేదనీ, పోలీసుల పడవ మునిగి ఒక పోలీసు జవాను చావడానికి కారణం తమ గెరిల్లాలు జరిపిన కాల్పులు కాదనీ, అసలు పడవపై తమ గెరిల్లాలు కాల్పులు జరపనే లేదని ఆమె వివరించారు. పోలీసులు పీజీఏ బలగాల చేతిలో ఎదురైన ఓటమిని కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మరోవైపు, ప్రజల నుండి పూర్తి సమాచారం తెలుసుకున్న పీజీఏ గెరిల్లాలు మళ్లీ పోలీసు బలగాలు దాడికి వస్తే ప్రతిఘటించడానికి సిద్ధమయ్యారు. సెప్టెంబర్ **6**న మళ్లీ తుపాకులను వెదకడానికి బయలుదేరిన పోలీసులు డోంగ్రీ గ్రామం దగ్గర అడవిలో పీజీఏ ఆంబుష్‌లో ఇరుక్కున్నారు. ఈ ఆంబుష్‌లో కాంకేర్ జిల్లా ఎస్పీ పీఎస్ ఠాకూర్, సీఆర్‌పీఎఫ్ సహాయ కమాండెంట్‌తో పాటు మరో నలుగురు పోలీసులు గాయపడ్డారు. వీరిలో ఇద్దరు తీవ్రంగా గాయపడగా మిగతావాళ్లు స్వల్పంగా గాయపడ్డారు.

ఆ ఆంబుష్ తర్వాత ప్రభుత్వం లాంగ్‌కుమేర్‌ను తాత్కాలిక ఎస్పీగా నియమించింది. వీడి నాయకత్వంలో పోలీసులు పర్తాపూర్‌లో క్యాంపు వేసి నదిలో తుపాకుల్ని వెదకడానికి ప్రయత్నించగా ప్రజా మిలిషియా పలు మార్లు దాడి చేసి పోలీసు బలగాల్ని చికాకు పర్చింది. పోలీసులు దాటడానికి ఉపయోగించే పడవను కూడా మిలిషియా మాయం చేసింది. దీంతో పోలీసుల మనోస్థైర్యం బాగా దెబ్బ తింది. వాళ్ల ప్రయాసలన్నీ విఫలమయ్యాయి.

ఇక ఒకవైపు పోలీసులను చికాకు పరుస్తూనే మరోవైపు పోలీసుల తుపాకుల్ని చేజిక్కించుకోవడం కోసం పీజీఏ బలగాలు ప్రజల సహకారంతో నదిలో వెదకగా ఐదు తుపాకులు దొరికాయి. ఇందులో ఒక ఎల్‌ఎంజీ, ఒక ఏకే-**47**, మూడు ఎస్సెల్లార్లు ఉన్నాయి. ఈ విధంగా ప్రజలను హతమార్చడానికి పోలీసులు ఉపయోగించే ఆధునిక ఆయుధాలు ప్రజా సైనిక బలగాల చేతికి వచ్చాయి. ఈ మొత్తం ఘటనాక్రమంలో పోలీసుల దాడి క్యాంపెయిన్ పథకం బెడిసికొట్టగా, ఒక పోలీసు నదిలో మునిగి చావడం, ఎస్పీతో సహా ఆరుగురు ఆంబుష్‌లో గాయపడడం, ఆరు తుపాకుల్ని నదిలో పోగొట్టుకోవడం, అవి తిరిగి పీజీఏ చేతిలోకి చేరడం, పోలీసులు చేసిన దుష్ప్రచారం అంతా బూటకమని రుజువు కావడం – ఇవన్నీ శత్రువుకు ఎంత గాభరా పుట్టించాయో, ఈ ప్రాంత ప్రజలకూ, పార్టీ శ్రేణులకూ అంతగా ఉత్సాహాన్నిచ్చాయి. ★

# మహారాష్ట్ర విధానసభ ఎన్నికలను బహిష్కరించండి ! ఓట్ల కోసం వచ్చే దోపిడీ నేతలను తరిమి కొట్టండి !!

అక్టోబర్ 13న మహారాష్ట్ర విధానసభకు ఎన్నికలు జరుగబోతున్నాయి. గత ఐదేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్-ఎన్‌సీపీ కూటమి మొన్నటి లోకసభ ఎన్నికల్లో లభించిన స్వల్ప ఆధిక్యతతో మురిసిపోతూ ఎలాగైనా తిరిగి అధికారాన్ని దక్కించుకోవాలని తాపత్రయపడుతోంది. మరోవైపు కరడుగట్టిన హిందూ ఫాసిస్టు పార్టీలైన శివసేన-బీజేపీలు గత ఐదేళ్ల ప్రభుత్వ వైఫల్యాలనే బ్రహ్మాస్త్రాలుగా ప్రయోగిస్తూ అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం దూకుడుగా పోటీ పడుతున్నాయి. మిగతా పార్టీల్లో కొన్ని ఈ రెండింటిలో ఏదో ఒక కూటమితో చేతులు కలిపి కొన్ని సీట్లైనా దక్కించుకోవాలని చూస్తుండగా మరి కొన్ని మాత్రం విడిగా పోటీ చేసి కొన్ని సీట్లు సంపాదించి ఫలితాలు వెలువడ్డ తర్వాత బలబలాల మధ్య ఏర్పడే సమతుల్యాన్ని ప్రభావితం చేయగల స్థితికి చేరుకోవాలని చూస్తున్నాయి. యూపీఏలో భాగస్వామిగా ఉన్న లోక్ జనశక్తి మహారాష్ట్ర ఎన్నికల్లో విడిగానే పోటీ చేస్తుండడం విశేషం కాగా, బీఎస్‌పీ, ఆర్‌పీఐ, జస్టిస్ పార్టీ వగైరా పార్టీలు విడిగానే పోటీ చేస్తున్నాయి. 288 సీట్లున్న మహారాష్ట్ర విధానసభకు జరుగనున్న ఈ ఎన్నికలలో ఈ పార్టీలూ, కూటములన్నీ పరస్పరం అనేక ఆరోపణలు చేస్తూ రంగంలో దిగగా మరోవైపు సామాన్య ప్రజలు మాత్రం ఏ పార్టీ వచ్చినా మాకేమీ ఒరిగేది లేదని ఉదాసీనతను ప్రదర్శిస్తున్నారు.

ఒకవైపు ఎన్నికలకు రంగం సిద్ధమవుతుండగా రాష్ట్రంలో, ముఖ్యంగా మేల్ఘాట్ ప్రాంతంలో వెలుగులోకి వచ్చిన పౌష్టికాహార లేమి సమస్య, ప్రధానంగా విదర్భ ప్రాంతంలో పెరిగిన రైతుల ఆత్మహత్య సమస్య అధికార పక్షాన్ని కుదిపి వేస్తుండగా, మరోవైపు ఇవే సమస్యలు తమను అధికార పీఠానికి చేరువగా తెస్తాయని సేన-భాజపా కూటమి ఆనందిస్తున్నది. రెండు పక్షాలూ ఈ రెండు సమస్యలపై పరస్పర విమర్శలు చేసుకుంటూ ప్రజలను లోబర్చుకోవడానికి బాగా ప్రయత్నిస్తున్నాయి. ఆంధ్ర ఎన్నికల్లో గెలుపొందిన తర్వాత కాంగ్రెస్ రైతులకు ఉచిత విద్యుత్తు ఇవ్వడాన్ని దృష్టిలో ఉంచుకొని, ఇక్కడ కూడా కాంగ్రెస్ ప్రజలను ఈ వాగ్దానంతో బుట్టలో పడవేసుకోగలదేమోనని భయపడి శివసేన ముందే ఉచిత విద్యుత్తును ఎన్నికల వాగ్దానంగా ప్రకటించి అందరినీ ఆశ్చర్యపర్చింది. లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం తర్వాత సంఘ్ ముఠా ఉగ్ర హిందుత్వ విధానాల వైపు మళ్లాలని తీసుకున్న నిర్ణయం మేరకు మహారాష్ట్రలో కూడా సేన-భాజపా కూటమి హిందూ ఫాసిస్టు విధానాలను హింసాత్మకంగా అమలు పరుస్తూనే మరోవైపు అభివృద్ధి అంశాన్ని కూడా విడవకుండా వల్లిస్తున్నది. ఇక కాంగ్రెస్ కూటమి తాను ముస్లింలకూ, దళితులకూ ఆత్మబంధువునని చెప్పుకుంటూ వాళ్ల వోట్‌బ్యాంక్‌ను కొల్లగొట్టడానికి పడరాని పాట్లు పడుతున్నది.

మహారాష్ట్రలో ప్రభుత్వ లెక్కల ప్రకారం గత సంవత్సర కాలంలో 9,000 మంది పిల్లలు పౌష్టికాహార లేమి వల్ల ప్రాణాలు విడిచారు. గత జూలైలో అమరావతి జిల్లాలోని మేల్ఘాట్ ప్రాంతంలో 72 మంది పసి పిల్లలు పౌష్టికాహారం లోపించి చనిపోయిన వార్తలు వెలువడడంతో ఈ అంశం ప్రధానంగా చర్చకు వచ్చింది. ఈ జిల్లాలోని ధారణీ, చిఖల్‌దరా తాలూకాల ప్రాంతాన్ని మేల్ఘాట్‌గా వ్యవహరిస్తారు. ఒకవైపు దేశంలో ప్రభుత్వ గిడ్డంగుల్లో ఆహారధాన్యాలు ముగిగిపోతూ ఎలుకల పాలవుతుండగా మరోవైపు దట్టమైన అడవులను కలిగిన ఉన్న ఈ ప్రాంతంలో నివసించే కోర్కూ ఆదివాసులు తినడానికి ఒక పూట అన్నమైనా దొరకని దుస్థితినెదుర్కొంటున్నారు. అమరావతితో పాటు, చంద్రపూర్, నాగపూర్, భండారా, యవత్‌మాల్, గడ్చిరోలి జిల్లాల ప్రజలు, ముఖ్యంగా ఆదివాసులు కరువుకాటకాల మూలంగా ఆకలిచావులకూ, తీవ్రమైన పౌష్టికాహార లేమికీ గురవుతున్నారు. ఈ జిల్లాలన్నీ విదర్భ ప్రాంతం కిందికి వస్తాయి. సకల సంపదలకు నిలయమైన విదర్భ ప్రాంతంలో ఘోర దారిద్ర్యం, అనారోగ్యం, ఆకలి, కరువు కరాళ నృత్యం చేస్తున్నాయి. ఈ ప్రాంతాలలో నిక్షిప్తమై ఉన్న విలువైన వన, ఖనిజ సంపదల నుండి వేల కోట్ల రూపాయల రాయల్టీ లభిస్తున్నప్పటికీ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఖర్చు పెట్టింది నామమాత్రమే.

ప్రస్తుతం విదర్భ ప్రాంతంలో ప్రతి రోజూ ఏదో ఓ మూల నుండి రైతుల ఆత్మహత్యల వార్తలు వినవస్తున్నాయి. ఈ సంవత్సరం ప్రారంభం నుండి ఆగస్టు వరకు విదర్భలో 225 రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పత్రికలు రాశాయి. వీళ్లలో ఎక్కువ మంది పత్తి పండించే రైతులే. టెర్మినేటర్, వెర్మినేటర్ విత్తనాల్ని అమ్మే పేరుమోసిన మన్సాంటో కంపెనీ విడుదల చేసిన 'బినౌలా' అనే రకం విత్తనం రైతుల పాలిటి శాపంగా పరిణమించింది. నకిలీ విత్తనాలు, కల్తీ కీటనాశక మందులు, చక్రవడ్డీ అప్పులు, విద్యుత్తు సరఫరాలో కోత, విద్యుత్ రేట్లలో పెంపుదల, నీటిపారుదల సౌకర్యాల లేమి, పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, నిరంకుశ బ్యాంకు అధికార్ల జులుం – ఈ కారణాలన్నిటితో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మహారాష్ట్రలో మొత్తం సాగుభూమిలో 15 శాతానికి మాత్రమే నీటిపారుదల సౌకర్యం ఉంది. దేశం సగటు 32.9 శాతంగా ఉంది. అయితే విదర్భ ప్రాంతంలో నీటి పారుదల పరిస్థితి మరీ అధ్వాన్నంగా ఉంది. ఒకవైపు ఈ తీవ్రమైన ఇబ్బందుల కారణంగా రైతులు హతాశులై ఆత్మహత్యలకు పాల్పడుతుండగా రాష్ట్ర వ్యవసాయ మంత్రి గోవిందరావ్ అదిక్ చేసిన వ్యాఖ్యానం పుండు మీద కారం జల్లినట్టుగా ఉంది –"రైతులు ఆత్మహత్యలకు పాల్పడడానికి కారణం వారిలో కొందరికి తాగుడు అలవాటు ఉండడం. కొందరు మోసగాళ్లు కూడా ఉన్నారు. వాళ్లు నష్టపరిహారం పొందొచ్చన్న దురాశతో ప్రాణాలు తీసుకుంటున్నారు." ఈ సమస్య పట్ల ప్రభుత్వపు సంవేదనారహితమైన స్పందనకు ఈ వ్యాఖ్యానం అద్దం పడుతుంది. మరోవైపు సమస్య తీవ్రతను గుర్తించి రైతులను బుట్టలో పడవేసుకోవడానికి అధికార, విపక్ష పార్టీలు ఒకరిని మించి ఒకరు పోటీ పడుతున్నారు. అనేక వాగ్దానాలు చేస్తూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారు. రైతుల అప్పు మాఫీ, ఉచిత విద్యుత్తు, వరి పండించే రైతులకు 20 కోట్ల రూపాయల సహాయం, చనిపోయిన రైతులకు ఒక లక్ష రూపాయల నష్టపరిహారం వంటి వాగ్దానాలు అధికార కూటమి చేస్తుండగా, విపక్ష పార్టీలు కూడా ఇంతకు మించిన వాగ్దానాలే చేస్తున్నాయి. నిజానికి రైతులు ఈ దుస్థితికి చేరుకోవడానికి కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాలే. రైతుల బతుకుల్ని తాకట్టు పెట్టి డబ్ల్యూటీవో ఒప్పందంపై సంతకం చేసిన ప్రభుత్వం ఇప్పుడు రైతుల ఇక్కట్ల పట్ల మొసలి కన్నీరు కారుస్తున్నది. ఈ రైతు వ్యతిరేక విధానాలపై అధికార పక్షానికీ, విపక్షాలకూ పూర్తిగా అంగీకారం ఉంది. ఇంత కాలం కేంద్రంలో అధికారం

*(తరువాయి 44వ పేజీలో........)*